Saeed's

# షైన్ ఇండియా

తెలుగు మాసపత్రిక




సంపుటి -7 సంచిక-10 మార్చి - 2021 పేజీలు : 92 వెల : 30/-

FREE BOOKLET






15వ ఆర్థిక సంఘం నివేదిక




'సయీద్ పబ్లికేషన్'కు ISO 9001:2015 సర్టిఫికెట్




Certificate

SHINE INDIA - SAEED PUBLICATION

ISO 9001:2015

"Printing and Publishing Current Affairs."



కేంద్ర బడ్జెట్ 2021-22

అన్ని పోటీ పరీక్షల కొరకు ప్రత్యేకంగా రూపొందించబడిన మ్యాగజైన్


మార్కెట్‌లో అందుబాటులోకి రానున్న పూర్తి అప్‌డేటెడ్ సయీద్ సిరీస్ పుస్తకాలు
భారతదేశ చరిత్ర
2021 New Revised Edition
ఆధునిక భారతదేశ చరిత్ర
2021 New Revised Edition
ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సంస్కృతి
తెలంగాణ సామాజిక సాంస్కృతిక చరిత్ర
తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు ప్రత్యేక పుస్తకాలు
Sub-Inspector of Police, Police Constable, Group-IV
REASONING
రీజనింగ్
(Study Material Book)
మార్చి చివరివారంలో విడుదల
Sub-Inspector of Police, Police Constable, RRB
Arithmetic
అర్థమెటిక్
మార్చి చివరివారంలో విడుదల
Sub-Inspector of Police, Police Constable, Group-IV
REASONING
రీజనింగ్
TM & EM
Practice Work Book
మార్కెట్లో విడుదల
జనరల్ స్టడీస్
VOLUME-I
జనరల్ స్టడీస్
VOLUME-II
మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి
ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు ప్రత్యేక పుస్తకాలు
ఇండియన్ పాలిటీ
విడుదల
ఆంధ్రప్రదేశ ప్రభుత్వ పథకాలు
మార్చి మొదటివారంలో విడుదల
జనరల్ స్టడీస్
VOLUME-I
జనరల్ స్టడీస్
VOLUME-II
త్వరలో విడుదల
SAEED PUBLICATIONS
Himayath Nagar, Hyderabad
8142502155

Saeed's

# షైన్ ఇండియా



తెలుగు మాసపత్రిక

సంపుటి - 7 సంచిక - 10 మార్చి - 2021 పేజీలు : 92 వెల : 30



చీఫ్ ఎడిటర్ :
సయ్యద్ రాజా (సయీద్)

మేనేజింగ్ డైరెక్టర్(ఫైనాన్స్) : షేక్ ఫారుక్ అహ్మద్
మేనేజింగ్ డైరెక్టర్(అడ్మిన్) : మహమ్మద్ ఫయాజ్ అలీ

సయీద్ పబ్లికేషన్స్ (OPERATIONS HEAD) : విజయ ప్రసాద్

అసోసియేట్ ఎడిటర్స్
షేక్ రియాజ్, అజయ్ బాబు, మునీర్ బాషా,
పోలిశెట్టి రాజశేఖర్

సబ్ ఎడిటర్స్
జగన్ మిట్టపెల్లి | షేక్ మసూద్
ఆర్. రాజశేఖర్ | ఇస్లావత్ రమేష్
పార్థసారధి రెడ్డి | షేక్ నదీమ్, ఎం.ఎ అక్బర్
షేక్ మౌలాలి | లాలం సురేష్ నాయుడు
జిలాని పఠాన్ | ప్రదీప్, కవిత
భూక్యా లోకేశ్వరరావు | కొరుపోలు శివకుమార్

డిటిపి ఆపరేటర్స్
పి. అజయ్ కుమార్ | సరిత | పి. రాజశ్రీ
ఉమా మహేశ్వరరావు | రామ్మూర్తి | అబ్దుల్ రహమాన్

టెక్నికల్ టీమ్
తాజుద్దీన్, ఫిరదౌస్, హనీఫ్
రమణ, చరణ్, కిశోర్, మాలతి, మహాలక్ష్మి

కవర్‌పేజ్ డిజైన్స్ : శివ దేవరశెట్టి
మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ : బి. సురేందర్‌రెడ్డి



సయీద్ పబ్లికేషన్స్
(షైన్ ఇండియా ట్రెండ్‌సెట్టర్స్ ప్రై. లిమిటెడ్)
ఫ్లాట్ నెం. 101, ఇం.నెం. 3-6-565,డి.యం.ఎస్టేట్స్, స్ట్రీట్ నెం.8,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500029
ఫోన్ : 8142502155, 040-27652786
E-mail : shineindiamonthlymonthly@gmail.com
/ shineindiamonthly


## విషయ సూచిక


1. కవర్ పేజి స్టోరీలు
   - కేంద్ర బడ్జెట్ 2021-22 .... 7
   - 15వ ఆర్థికసంఘం నివేదిక .... 23
   - వ్యవసాయ చట్టాల వ్యతిరేక ఉద్యమంలో వివాదాలు .... 28
   - మయన్మార్‌లో మరోసారి సైనిక పాలన .... 29
   - ఉత్తరాఖండ్‌లోని ధౌలీగంగ నదిలో ఆకస్మిక వరదలు .... 30
   - 51వ డబ్ల్యూఈఎఫ్ వార్షిక సదస్సు - 2021 .... 31
   - విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకు ఆమోదం .... 32
2. అంతర్జాతీయ అంశాలు .... 33
3. భారత్ మరియు ప్రపంచం .... 36
4. జాతీయ అంశాలు .... 38
5. పాలిటీ & గవర్నెన్స్ .... 58
6. పర్యావరణం & జీవవైవిధ్యం .... 59
7. తెలంగాణ .... 60
8. ఆంధ్రప్రదేశ్ .... 63
9. ఇతర రాష్ట్రాల సమాచారం .... 66
10. ఆర్థిక అంశాలు .... 67
11. కమిటీలు - నివేదికలు .... 70
12. సైన్స్ & టెక్నాలజీ .... 73
13. వార్తల్లో వ్యక్తులు .... 76
14. అవార్డులు .... 80
15. క్రీడాంశాలు .... 81
16. ప్రదేశాలు .... 83
17. దినోత్సవాలు .... 84
18. కరెంట్ అఫైర్స్ ప్రాక్టీస్ బిట్స్ .... 85
19. ప్రత్యేక బుక్‌లెట్ ...... 39-54



https://ourstudycircle.in/upscpdf/

## ఎడిటోరియల్

పోటీపరీక్షల పబ్లికేషన్స్ రంగంలో ఉద్యోగార్థుల మన్ననలు పొందిన 'సయీద్ పబ్లికేషన్స్' తన విజయ ప్రస్థానంలో మరో మైలురాయిని అధిగమించింది. పోటీపరీక్షల పుస్తకాల రూపకల్పనలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన సేవలను అందిస్తున్నందుకుగాను 'సయీద్ పబ్లికేషన్స్'కు ప్రతిష్ఠాత్మక 'ISO 9001:2015' సర్టిఫికెట్ లభించింది. దీనిని అంతర్జాతీయంగా పేరెన్నికగన్న 'Unique Assessment Systems' అందించింది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో రావలసిన నూతన నోటిఫికేషన్లు పలు కారణాలవల్ల ఆలస్యమవుతున్నాయి. అయితే అతిత్వరలోనే ఇరురాష్ట్రాలలో కూడా ఎస్.ఐ, కానిస్టేబుల్స్ మరియు గ్రూప్-2, 4 నోటిఫికేషన్స్ రాబోతున్నాయి. కాబట్టి ఉద్యోగార్థులు సమయాన్ని వృధా చేయకుండా ప్రిపరేషన్ చేయగలరు. నోటిఫికేషన్ వచ్చాక ప్రిపరేషన్ చేద్దాం అనుకుంటే పోస్ట్ చేజార్చుకున్నవారు అవుతారు అందుకే సమయాన్ని వృధా చేసుకోకుండా ముందు నుండే ప్రిపరేషన్ చేయడం ఉత్తమం. లాంగ్‌టర్మ్ నుండి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు పోటీలో ఉండాలంటే, పాయింట్ టు పాయింట్ సబ్జెక్ట్ అనాలసిస్ చేసే మన షైన్ ఇండియా అకాడమిలో కోచింగ్ తీసుకోవడం ఉత్తమం ఎందుకంటే మిగతా అభ్యర్థుల కంటే పోటీలో ముందుంటాం గమ్యాన్ని చేరుకోవడానికి మరింత సులువు అవుతుంది.

షైన్ ఇండియా అకాడమి ఆన్‌లైన్ క్లాసెస్ ఎంతో మంది "ఉద్యోగులు, గృహిణులు, పార్ట్‌టైమ్ ఉద్యోగస్థులు మరియు "హైదరాబాద్ వచ్చి కోచింగ్ తీసుకోలేని వారికి" ఎంతగానో తోడ్పడుతున్నాయి. వీరందరికి షైన్ ఇండియా అకాడమి యాప్ ద్వారా సేవలు అందిస్తున్నందుకు ఎంతగానో సంతోషిస్తున్నాం. అలాగే షైన్ ఇండియా యాప్‌లో వీడియోస్ కొంచెం నెమ్మదిగా అప్‌లోడ్ చేయడం జరుగుతున్నందున ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించగలరు.

మా సయీద్ పబ్లికేషన్స్ దూర ప్రాంతపు మరియు మారుమూల ప్రాంతాలలో ఉంటున్న గ్రామీణ అభ్యర్థులకు చేరువయ్యే విధంగా మా అకాడమి బుక్స్‌తో పాటు మీకు నచ్చిన మెటీరియల్స్‌ని కూడా మీ ఇంటివద్దకే ఫ్రీ హోమ్ డెలివరీ చేస్తున్నాం. ఎటువంటి లాభాపేక్ష చూడకుండా కేవలం ఉద్యోగార్థుల కోసం మాత్రమే చేస్తున్న పని ఇది. మీరు ఈ నెం. 8142502155 కి సంప్రదించి బుక్స్‌ని ఫ్రీగా హోమ్ డెలివరీ పొందవచ్చు.

మన సయీద్ పబ్లికేషన్స్ నుండి ఉద్యోగార్థుల కోసం వరుసగా పుస్తకాలు రాబోతున్నాయి. మీ అందరి మన్ననలతో మంచి పుస్తకాలు అందించడానికి మేమెంతో శ్రమిస్తున్నాం. ఇటీవల విడుదలైన ఇయర్‌బుక్-2021 ని ఆదరించినట్లుగానే ఎస్.ఐ, కానిస్టేబుల్స్ ఉద్యోగాల కోసమే ప్రత్యేకంగా రూపొందించిన "జనరల్ స్టడీస్ Volume-1, 2 ని కూడ ఆదరించగలరు. ఏ.పీ. ప్రభుత్వ పథకాలు, బడ్జెట్, ఆర్థికసర్వే, ఎ.పీ. ఎగ్జామ్స్ కోసం ప్రత్యేకమైన "కాంబో బుక్స్" రాబోతున్నాయి కావున తప్పక కొని చదవగలరు.

షైన్ ఇండియా డిగ్రీ కాలేజ్ నందు పరిమిత సంఖ్యలో గల అడ్మిషన్స్ కోసం సంప్రదించగలరు. మీ పిల్లల భవిష్యత్తును అత్యాద్భుతంగా తీర్చిదిద్దడం కోసం మీతో పాటు మేము పాలు పంచుకోబోతున్నాం. చిన్న వయసులోనే గమ్యాల్ని చేరుకోవడానికి పిల్లలకు వెనుదన్నుగా నిలుస్తున్న ఏకైక సంస్థ. మీ పిల్లలను ఇందులో జాయిన్ చేసి విజేతలుగా నిలపండి.

'టన్ను సిద్ధాంతం కన్నా.. గ్రాము పని గొప్పది'

మీ సయీద్ ...




https://ourstudycircle.in/upscpdf/




# Readers' Response




షైన్ ఇండియా టీమ్‌కు ధన్యవాదాలు. నేను ప్రతినెలా తప్పకుండా షైన్ ఇండియా మ్యాగజైన్ చదువుతాను. మీరు జనవరిలో సయీద్ సిరీస్ నుంచి విడుదల చేసిన జనరల్ స్టడీస్ వాల్యూమ్-1, 2 పుస్తకాలు చాలా ఉపయోగపడే విధంగా ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో అనేక పుస్తకాలు లభిస్తున్నాయి. కానీ మీరు అభ్యర్థికి ఎంతవరకు కావాలో అంతవరకు పూర్తి సిలబస్ కవర్ అయ్యేలా ఈ పుస్తకాలను విడుదల చేయడం చాలా సంతోషకరం. ఈ పుస్తకాలు తెలంగాణలో జరుగబోయే ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు చాలా ఉపయోగపడతాయి. ఇలాంటి పుస్తకాలు మీ పబ్లికేషన్ నుండి మరిన్ని పుస్తకాలు విడుదల చేయాలని కోరుకుంటున్నాము.

**- ఆర్.సురేష్ ఖమ్మం జిల్లా (ఈ-మెయిల్)**

సయీద్ సార్ గారికి నమస్కారం. మార్కెట్‌లో ఉన్న చాలా పుస్తకాల కన్నా మీ పుస్తకాలు చాలా ప్రత్యేకం. మీరు ప్రతినెల ప్రచురించే షైన్ ఇండియా కరెంట్ అఫైర్స్ మ్యాగజైన్ చాలా బాగుంది. మీరు గత నెలలో అందించి నటువంటి ఫ్రీ బుక్‌లెట్‌లోని అంశాలు జరుగబోయే ప్రతి పరీక్షలో బిట్స్ రూపంలో వస్తుంటాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని అన్ని వ్యాధులను ఒకే దగ్గర సమగ్రంగా అందించినందుకు చాలా సంతోషిస్తున్నాము. ఈ బుక్‌లెట్ చదవడం ద్వారా ప్రతీ అభ్యర్థికి పరీక్షలలో వచ్చే ప్రశ్నలకు సమాధానాలను చాలా సులభంగా రాయవచ్చు. ఇంతటి సమాచారాన్ని నిరుద్యోగ అభ్యర్థుల ముంగిటకు తీసుకొస్తున్నందుకు ధన్యవాదాలు.

**- కె.శివారెడ్డి, కడప జిల్లా (ఈ-మెయిల్)**

ప్రస్తుత పోటీ పరీక్షలలో కరెంట్ అఫైర్స్ నుండి అధిక ప్రశ్నలు వస్తున్నాయి. అటువంటి కరెంట్ అఫైర్స్‌ను వ్యక్తిగతంగా సేకరించి, చదవడం చాలా కష్టంతో కూడిన పని. కానీ మీరు అందించే మాసపత్రిక ద్వారా చాలా సులభతరం అయింది. అదేవిధంగా మీరు గత నెలలో ఇచ్చినటువంటి పద్మ పురస్కారాలు 2021, మానవాభివృద్ధి నివేదిక-2020, అమల్లోకి బ్రెగ్జిట్ ఒప్పందం ఆర్టికల్స్ గురించి వివరించిన తీరు అద్భుతం.

**- ఆదెపు శ్రీరామ్, గ్రా॥ తుంగూర్ , (ఈ-మెయిల్)**

కాంపిటేటివ్ ఎగ్జామ్స్ అనగానే కరెంట్ అఫైర్స్ కోసం మొదటగా అందరు చెప్పే మ్యాగజైన్ షైన్ ఇండియా. నేను కరెంట్ అఫైర్స్ కోసం షైన్ ఇండియా మ్యాగజైన్ ఎంచుకొని చదువుతున్నాను. కేంద్ర, రాష్ట్ర మరియు స్థానికంగా జరిగే అన్ని విషయాలను విపులంగా వివరిస్తున్నారు. నేను రాసిన పోటీ పరీక్షల్లో చాలా వరకు బిట్స్ మీ మ్యాగజైన్ నుండే వచ్చాయి. ప్రతి అంశంపైన చివర కొన్ని ముఖ్యమైన ప్రశ్నలను తయారు చేసి ముద్రించడం వల్ల పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ప్రశ్నను ఎన్ని రకాలుగా అడుగుతారు? అనే విషయం స్పష్టంగా అర్థమవుతుంది. జరగబోయే ఉపాధ్యాయ నియామకాల కోసం బుక్స్ మరియు మెథడాలజీలకు సంబంధించిన ఆడియో టేపులను తయారు చేయగలరు.

**- బొల్లం విష్ణు, గ్రా॥ జగన్నాథపురం జి॥ సూర్యపేట, తెలంగాణ**

షైన్ ఇండియా టీమ్‌కి ధన్యవాదాలు. షైన్ ఇండియా మాసపత్రికలో ప్రతి ఒక్క అంశాన్ని ఫోటోతో సహా వివరిస్తున్న తీరు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. గత సంచికలలో ప్రచురించిన ఆర్టికల్స్ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా గత నెల సంచికలో 'భారత్ ఆవిష్కరణల సూచీ-2020, ఘనంగా 72వ గణతంత్ర వేడుకలు' వంటి ఆర్టికల్స్ క్లుప్తంగా వివరించి ఇచ్చినందుకు కృతజ్ఞతలు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కొనసాగుతూ షైన్ ఇండియా ఎంతో మందికి మార్గదర్శిగా నిలవాలని కోరుకుంటున్నాను.

**- నందిని, కృష్ణా జిల్లా, (ఈ-మెయిల్)**

మీ యొక్క అభిప్రాయాలు, సలహాలు, సూచనలను ఈ మెయిల్ / ఉత్తరాల ద్వారా తెలియజేయగలరు. 'షైన్ ఇండియా' మ్యాగజైన్‌ను మరింత అద్భుతంగా తీర్చిదిద్దేందుకు మీ వంతు సహకారం అందించగలరు.

**- చీఫ్ ఎడిటర్**




**'షైన్ ఇండియా' తెలుగు మాసపత్రిక సంవత్సర చందా కావలసినవారు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా రూ. 950లను Saeed Publication పేరు మీద డి.డి. గానీ, ఎం.ఒ గానీ చెల్లించి మీ వివరాలను క్రింది అడ్రస్‌కు పంపగలరు.**

**SHINE INDIA MONTHLY MAGAZINE**
C/o Saeed Publication
Flat No.101, H.No.3-6-565, D.M. Estates, Street No.8,
Himayathnagar, Hyderabad - 500029
Ph : 8142502155, 040 - 27652786
E-mail : shineindiamonthlymonthly@gmail.com




https://ourstudycircle.in/upscpdf/

# సయీద్ పబ్లికేషన్స్, షైన్ ఇండియా డిగ్రీ కాలేజీలకు

# ప్రతిష్టాత్మక ISO 9001:2015 సర్టిఫికెట్






పోటీపరీక్షలకు అత్యున్నత శిక్షణ సంస్థ అయిన 'షైన్ ఇండియా అకాడమీ' డైరెక్టర్ సయీద్ సార్ సారథ్యంలోని సయీద్ పబ్లికేషన్స్, షైన్ ఇండియా డిగ్రీకాలేజీలకు ప్రతిష్టాత్మక 'ISO 9001:2015' సర్టిఫికెట్ లభించింది. దీనిని అంతర్జాతీయంగా పేరెన్నికగన్న 'Unique Assessment Systems అందించింది.

పోటీపరీక్షలకు సంబంధించి అత్యంత సమగ్రమైన సమాచారంతో పుస్తకాలను రూపొందించి విద్యార్థులు నియామక పరీక్షలలో విజేతలుగా నిలువడంలో ఎంతో సయీద్ పబ్లికేషన్స్ ఎంతో ఉపయోగపడుతోంది. అంతేకాకుండా నంబర్‌వన్ తెలుగు కరెంట్ అఫైర్స్ మ్యాగజైన్ 'షైన్ ఇండియా'ను ప్రచురిస్తోంది. ఈ అంశాలలో అత్యంత నాణ్యత, ప్రామాణికతను పాటిస్తున్నందుకుగాను 'సయీద్ పబ్లికేషన్స్' ఐఎస్ఓ సర్టిఫికెట్ లభించింది.

అలాగే విద్యార్థులకు డిగ్రీస్థాయిలోనే అత్యున్నతస్థాయిలో సివిల్స్ శిక్షణ అందిస్తున్న 'షైన్ ఇండియా డిగ్రీ కాలేజ్' కూడా ఐఎస్ఓ సర్టిఫికెట్ సాధించింది.

సయీద్ పబ్లికేషన్స్, షైన్ ఇండియా డిగ్రీ కాలేజ్‌లు ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్స్ సాధించడం పట్ల సంస్థ ఛైర్మన్ సయీద్ సార్ ఎంతో ఆనందం వ్యక్తంచేశారు. ISO(International Organization for Standardization) అనేది ఉత్పత్తులు, సేవలు, మరియు వ్యవస్థల యొక్క నాణ్యత, సామర్థ్యాన్ని నిర్ధారించే స్వతంత్ర, ప్రభుత్వేతర అంతర్జాతీయ సంస్థ.


# SHINE INDIA
## DEGREE COLLEGE & IAS ACADEMY



**3 Years Integrated Programme**

**Degree + Civils & Groups Coaching**





**మా ప్రత్యేకతలు**

- సబ్జెక్ట్‌పై పట్టు ఉన్న అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ
- సెమినార్లు, గ్రూప్ డిస్కషన్లు, ఫీల్డ్ ట్రిప్‌లు
- ప్రతీవారం వీకెండ్ టెస్ట్‌లు, వాటిపై చర్చ
- విశాలమైన ఏ.సి తరగతి గదులు
- విస్తృతమైన పుస్తకశ్రేణితో కూడిన లైబ్రరీ
- అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్





ORR Service Road, Abdullahpurmet, Peddamberpet Mandal, Rangareddy District-501505

Contact Ph No : 9618783904, 9121976352.




https://ourstudycircle.in/upscpdf/



# కేంద్ర బడ్జెట్ 2021-22

'ఆత్మనిర్భర్' పేరుతో 2021-22 ఆర్థిక సంవత్సరానికి రూ.34,83,236 కోట్లతో బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2021 ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో తొలిసారిగా డిజిటల్ పద్ధతిలో ప్రవేశపెట్టారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఆమె బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం వరసగా ఇది మూడోసారి.

**బడ్జెట్ స్వరూపం(అంకెలు రూ. కోట్లలో)**

| | | |
|---|---|---|
| మొత్తం బడ్జెట్ | - | 34,83,236 |
| రెవెన్యూ వసూళ్లు | - | 17,88,424 |
| మూలధన వసూళ్లు | - | 16,94,812 |
| మొత్తం వసూళ్లు | - | 34,83,236 |
| రెవెన్యూ లోటు | - | 11,40,576 |
| ద్రవ్య లోటు | - | 15,06,812 |

**2021-22 కేంద్ర బడ్జెట్ ముఖ్యాంశాలు**

- 2020-21 ద్రవ్యలోటు 9.5 శాతం. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 6.8 శాతంగా లెక్కింపు
- స్వచ్ఛ భారత్- స్వాస్థ్య భారత్ కార్యక్రమానికి రూ.1.90 లక్షల కోట్లు
- మౌలిక సదుపాయాలపై మూలధన వ్యయం రూ.5.54 లక్షల కోట్లు
- మార్కెట్ రుణ సమీకరణల లక్ష్యం రూ.12.05 లక్షల కోట్లు.
- రక్షణ రంగానికి రూ.4,78,196 కోట్లు
- పట్టణ ప్రాంతాల కోసం ఐదేళ్లలో రూ.2.87 లక్షల కోట్లతో జల్ జీవన్ మిషన్
- రూ.75,000 కోట్లతో 'అభివృద్ధి ఆర్థిక సంస్థ'
- ఆరోగ్య రంగానికి 137% కేటాయింపులు పెంపు
- కరోనా వ్యాక్సిన్‌కు రూ.35,000 కోట్లు
- మెగా ఇన్వెస్ట్‌మెంట్ టెక్స్‌టైల్ పార్కులు (మిత్ర) పథకం కింద వచ్చే మూడేళ్లలో ఏడు టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు
- దేశంలో పరిశోధనలు, ఆవిష్కరణలకు 2021 బడ్జెట్ పెద్దపీట వేసింది. జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాల్లో రాబోయే ఐదేళ్లకు గాను 50,000 కోట్ల రూపాయలను కేటాయించారు
- పాలన, ప్రభుత్వ విధివిధానాలకు సంబంధించిన విషయాలు, దేశంలోని ప్రధాన భాషల్లో అందుబాటులో ఉంచేందుకు నేషనల్ లాంగ్వేజ్ ట్రాన్స్‌లేషన్ మిషన్ (ఎన్‌టీఎల్ఎం) ఏర్పాటు
- మరో కోటి మందికి ఉజ్వల పథకం కింద ఉచితంగా వంట గ్యాస్
- పీఎస్‌యూల భూముల అమ్మకానికి ప్రత్యేక సంస్థ
- ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ) నిర్దేశిత స్థాయిలో మూలధన నిబంధనలను పాటించేందుకు వీలుగా రూ. 20,000 కోట్లు అదనపు మూలధనం సమకూర్చేలా బడ్జెట్‌లో ప్రతిపాదనలు
- ప్రభుత్వ రంగ బ్యాంకుల మొండి బకాయిల నిర్వహణకు బ్యాడ్ బ్యాంక్ పథకం.
- కాలం చెల్లిన వాహనాలను స్వచ్ఛందంగా తుక్కు కింద వదిలించుకునేందుకు ప్రత్యేక పాలసీ
- బీమా రంగంలో ప్రస్తుతం 49 శాతంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 74%కి పెంపు
- పబ్లిక్ ఇష్యూకు రానున్న ఎల్ఐసీ
- బీపీసీఎల్, ఐడీబీఐ మరో రెండు పీఎస్‌యూ బ్యాంకులు, ఓ బీమా కంపెనీ ప్రైవేటీకరణ
- ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.1.75



https://ourstudycircle.in/upscpdf/

## కేంద్ర బడ్జెట్ సమగ్ర స్వరూపం (రూ.కోట్లలో)

| | 2019-2020 వాస్తవ కేటాయింపులు | 2020-2021 బడ్జెట్ అంచనాలు | 2020-2021 సవరించిన అంచనాలు | 2021-2022 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| 1. రెవెన్యూ వసూళ్లు(2+3) | 16,84,059 | 20,20,926 | 15,55,153 | 17,88,424 |
| 2. పన్ను ఆదాయం | 13,56,902 | 16,35,909 | 13,44,501 | 15,45,396 |
| 3. పన్నేతర ఆదాయం | 3,27,157 | 3,85,017 | 2,10,652 | 2,43,028 |
| 4. మూలధన వసూళ్లు (5+6+7) | 10,02,271 | 10,21,304 | 18,95,152 | 16,94,812 |
| 5. రుణాల రికవరీ | 18,316 | 14,967 | 14,497 | 13,000 |
| 6. ఇతర వసూళ్లు | 50,304 | 2,10,000 | 32,000 | 1,75,000 |
| 7. అప్పులు, ఇతరత్రా వసూళ్లు | 9,33,651 | 7,96,337 | 18,48,655 | 15,06,812 |
| 8. మొత్తం వసూళ్లు (1+4) | 26,86,330 | 30,42,230 | 34,50,305 | 34,83,236 |
| 9. మొత్తం వ్యయం (10+13) | 26,86,330 | 30,42,230 | 34,50,305 | 34,83,236 |
| 10. రెవెన్యూ ఖాతా | 23,50,604 | 26,30,145 | 30,11,142 | 29,29,000 |
| 11. వడ్డీ చెల్లింపులు | 6,12,070 | 7,08,203 | 6,92,900 | 8,09,701 |
| 12. మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంట్లు | 1,85,641 | 2,06,500 | 2,30,376 | 2,19,112 |
| 13. మూలధన ఖాతా | 3,35,726 | 4,12,085 | 4,39,163 | 5,54,236 |
| 14. రెవెన్యూ లోటు (10-1) | 6,66,545 | 6,09,219 | 14,55,989 | 11,40,576 |
| 15. నికర రెవెన్యూలోటు (14-12) | 4,80,904 | 4,02,719 | 12,25,613 | 9,21,464 |
| 16. ద్రవ్య లోటు {9-(1+5+6)} | 9,33,651 | 7,96,337 | 18,48,655 | 15,06,812 |
| 17. ప్రాథమిక లోటు (16-11) | 3,21,581 | 88,134 | 11,55,755 | 6,97,111 |

లక్షల కోట్లు సమీకరించాలని లక్ష్యం.

- దెవలప్‌మెంట్ ఫైనాన్సియల్ ఇన్‌స్టిట్యూషన్ ఏర్పాటు. వచ్చే మూడేండ్లలో 5 లక్షల కోట్ల రుణాల లక్ష్యం.
- అంకుర సంస్థలకు పన్ను విరామం
- 400 పైగా కస్టమ్స్ సుంకం మినహాయింపులపై సమీక్ష
- రాష్ట్రాలకు ఇచ్చే పన్ను వాటాలో 30% తగ్గుదల
- పీఎఫ్‌లో ఏడాదికి రూ.2.5 లక్షలు దాటితే వడ్డీపై పన్ను
- ఆదాయపన్ను చెల్లింపు శ్లాబుల్లో ఎలాంటి మార్పుల్లేవ్
- అందుబాటు ధరలో ఇల్లు కొన్నవారికి పన్ను మినహాయింపు మరో ఏడాది పెంపు
- 6.48 కోట్లకు చేరిన ఐ.టి. చెల్లింపుదారులు
- 75 ఏళ్ల దాటిన సీనియర్ సిటిజన్లు ఇన్‌కంట్యాక్స్ రిటర్న్ సమర్పించాల్సిన పనిలేదు. బ్యాంకులే టీడీఎస్ మినహాయిస్తాయి.
- లీటర్ పెట్రోల్‌పై రూ.2.5, లీటర్ డీజిల్‌పై రూ.4 చొప్పున అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్(ఏఐడీసీ) విధింపు
- మొబైల్ ఫోన్లు, బ్యాటరీ చార్జర్ల విడిభాగాలపై 2.5 శాతం దిగుమతి సుంకం విధింపు
- మూడేండ్లలో ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు
- 8,500 కిలోమీటర్ల జాతీయ రహదారుల అభివృద్ధి. పశ్చిమ బెంగాల్‌లో 25వేల కోట్లతో రహదారుల నిర్మాణం.
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో 16.5 లక్షల కోట్ల వ్యవసాయ రుణాలు అందించాలని లక్ష్యం

### ద్రవ్యలోటు

2021-22 ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ ఆదాయ-వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం- ద్రవ్యలోటు అంచనాలను 9.5 శాతానికి (స్థూల దేశీయోత్పత్తి- జీడీపీలో) సవరిస్తున్నట్లు బడ్జెట్ పేర్కొంది. 2020-21 బడ్జెట్ ప్రకారం 3.5 శాతం వద్ద (రూ.7.96 లక్షల కోట్లు) కట్టడి చేయాలన్నది లక్ష్యం. అయితే ఆదాయాలు పడిపోవడం, జీడీపీ క్షీణత వంటి అంశాల నేపథ్యంలో డిసెంబర్ నాటికే ఈ మొత్తం రూ.11,58,469 కోట్లకు (వార్షిక బడ్జెట్ అంచనాల్లో 145.5 శాతానికి అప్) పెరిగింది.

ఇక రానున్న ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును జీడీపీలో 6.8 శాతానికి కట్టడి చేయాలన్నది బడ్జెట్ లక్ష్యమని వివరించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి ద్రవ్యలోటును 4.5 శాతానికి కట్టడి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళతామని ఆర్థికమంత్రి భరోసాను ఇచ్చారు. 2019-20లో ద్రవ్యలోటు 4.6 శాతంగా ఉంది. 15వ ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల ప్రకారం 2021-22 నాటికి ద్రవ్యలోటు 6 శాతానికి తగ్గాలి.

### 2021-22లో రూ.12.05 లక్షల కోట్ల అప్పులు

వచ్చే ఆర్థిక సంవత్సరం (2021-22)లో రూ.12.05 లక్షల కోట్లు అప్పుల చేయనున్నామని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. బడ్జెట్‌లో ఆర్థికలోటును జీడీపీలో 6.8 శాతంగా అంచనా వేస్తున్న నేపథ్యంలో దానిని పూడ్చుకొనేందుకు మార్కెట్ల నుంచి అప్పు చేయక తప్పని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2020-21)లో మరో రూ.80వేల కోట్లు అప్పు చేయనున్నామని తెలిపారు. ఈ ఏడాది కొవిడ్



https://ourstudycircle.in/upscpdf/

కారణంగా ఆర్థికలోటు జీడీపీలో 9.5 శాతానికి చేరగలదని అంచనా వేస్తున్నట్టు పేర్కొన్నారు. దీంతో ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం చేసిన మొత్తం అప్పులు రూ.14 లక్షల కోట్లకు చేరనున్నాయి. మంత్రి బడ్జెట్ ప్రసంగం చేస్తూ.. తమ ప్రభుత్వం ఆర్థిక స్థిరత్వం దిశగా సాగుతున్నదని 2025-26నాటికి ఆర్థిక లోటును జీడీపీలో 4.5 శాతానికి తగ్గించాలని భావిస్తున్నామని తెలిపారు. ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం ప్రభు త్వం 2020-21లో ఆర్థికలోటును మూడు శాతానికే పరిమితం చేయాలి. కానీ కరోనా మహమ్మారి కారణంగా తాము లక్ష్యాన్ని సాధించలేకపోయామని మంత్రి వివరించారు. రాష్ట్రాలు సైతం జీడీపీలో 4 శాతం వరకు రుణాలు చేసే అవకాశం ఏర్పడుతుందని, అయితే 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు 2023-24 నాటికి రాష్ట్రాలు ఆర్థిక లోటును మూడుశాతానికి తగ్గించుకోవాల్సి ఉంటుందని మంత్రి స్పష్టంచేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం(2021-22)లో పాత రుణాల చెల్లింపుల కోసం రూ.2.80 లక్షల కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఆర్థిక లోటును పూడ్చుకొనేందుకు సెక్యూరిటీలు, ట్రెజరీ బిల్లుల ద్వారా మార్కెట్ నుంచి నిధులను పోగుచేయనున్నామని తెలిపారు. ఫలితంగా నికర రుణాలు రూ.9.24 లక్షల కోట్లకు తగ్గుతాయని పేర్కొన్నారు. కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు నిధుల సమీకరణ కోసం ప్రభుత్వం గత ఏడాది మేలో రుణ పరిమితిని 54 శాతం లేదా రూ.4.2 లక్షల కోట్లు పెంచింది. దీనికితోడు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2020-21)లో మరో రూ. 80వేల కోట్లు అవసరమవుతాయని మంత్రి తెలిపారు.

## 2021-22 బడ్జెట్‌కు ఎనిమిది ప్రాధాన్య రంగాల గుర్తింపు

దేశమే ముందు(నేషన్ ఫస్ట్) అనే సంకల్పంలో భాగంగా 2021-22 బడ్జెట్‌కు ఎనిమిది ప్రాధాన్య రంగాలను గుర్తించినట్లు మంత్రి నిర్మల తెలిపారు. ఆ ఎనిమిది రంగాలు ఇవే....

1) రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం
2) బలమైన మౌలిక సదుపాయాల కల్పన
3) స్వస్థ భారత్(ఆరోగ్య భారత్)
4) సుపరిపాలన
5) యువతకు ఉపాధి అవకాశాలు
6) అందరికీ విద్య
7) సమ్మిళిత వృద్ధి
8) మహిళా సాధికారత

## వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.1,48,301 కోట్లు



2021-22 సంవత్సరానికి గాను బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయం, అనుబంధ రంగాలకు ఆచితూచి కేటాయింపులు చేసింది. గతేడాది సవరించిన అంచనాల ప్రకారం వీటికి కేటాయింపులు రూ.1,45,355 కోట్లు ఉంటే ఈసారి రూ.1,48,301 కోట్లకు

## దేశాభివృద్ధికి మూల స్తంభాలుగా కీలకమైన ఆరు రంగాలు

దేశాభివృద్ధికి కీలకమైన ఆరు రంగాలు మూల స్తంభాలుగా 2021-22 బడ్జెట్‌ను రూపొందించామని ఆర్థిక మంత్రి నిర్మల తెలిపారు. ఆ ఆరు రంగాలు ఇవే..

1) ఆరోగ్యం-యోగక్షేమాలు(స్వస్థ భారత్)
2) పెట్టుబడులు- మౌలిక సదుపాయాలు
3) సమగ్ర సమ్మిళిత పురోగతి(సమ్మిళిత వృద్ధి)
4) మానవ వనరుల అభివృద్ధి
5) సృజనాత్మకత- పరిశోధన-అభివృద్ధి
6) కనీస ప్రభుత్వం- గరిష్ట పాలన

**1) స్వస్థ భారత్ :** కరోనా కారణంగా దేశంలో ఆరోగ్య వ్యవస్థ ఎన్నడూ లేనంత ఒత్తిడిని ఎదుర్కొన్నది. దీంతో కేంద్రం ఆరోగ్యరంగానికి రూ.2,23,843 కోట్లు కేటాయించింది. ఇది గత బడ్జెట్‌తో పోలిస్తే 137 శాతం అధికం. కేవలం కరోనా వ్యాక్సిన్ కోసమే రూ.35 వేల కోట్లు కేటాయించారు. ఏటా 50వేల శిశు మరణాలను అరికట్టేందుకు న్యూమోకోకల్ వ్యాక్సిన్‌ను పంపిణీ చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మల చెప్పారు.

**2) భౌతిక, ఆర్థిక మూలధనం :** ఈ అంశం కింద ఆత్మనిర్భర్ భారత్‌తోపాటు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలున్నాయి. టెక్స్‌టైల్స్ వంటి ఉత్పత్తి రంగానికి ఊతానికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి ఐదేళ్లపాటు రమారమి రూ.1.97 లక్షల కోట్లు కేటాయించనుంది. రోడ్డు రవాణా, జాతీయ రహదారులకు రూ.1.18 లక్షల కోట్లు, విద్యుత్ పంపిణీ రంగానికి రూ.3.05 లక్షల కోట్లు కేటాయించారు.

**3) దేశ సమగ్రాభివృద్ధి :** ఈ అంశంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, రైతు సంక్షేమం, గ్రామీణ భారతం, వలస కార్మికులు, కార్మిక రంగాన్ని చేర్చారు. రైతులకు విరివిగా రుణాలు లభించే విధంగా వ్యవసాయ రుణ లక్ష్యాన్ని రూ.16.5 లక్షల కోట్లకు పెంచుతున్నట్టు ఆర్థికమంత్రి ప్రకటించారు. అలాగే గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధికి కేటాయింపులను రూ.30వేల కోట్ల నుంచి రూ.40వేల కోట్లకు పెంచుతున్నట్టు తెలిపారు.

**4) మానవ వనరుల మూలధనం పెంపు :** మానవ వనరుల విభాగంలో చదువు, నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నదని మంత్రి సీతారామన్ చెప్పారు. 15వేల స్కూళ్లను గుణాత్మకంగా బలోపేతం చేయనున్నారు. కొత్తగా 100 సైనిక్ పాఠశాలలను నెలకొల్పనున్నారు. ఏకలవ్య మోడల్ పాఠశాలలను నెలకొల్పుతున్నామని వెల్లడించారు.

**5) ఆవిష్కరణలు, పరిశోధన-అభివృద్ధి :** జాతి ప్రయోజనాలకు అనుగుణంగా పరిశోధన-అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఇందులో భాగంగా రూ.1500 కోట్లతో డిజిటల్ పేమెంట్స్‌ను ప్రాచుర్యంలోకి తేవడంతోపాటు జాతీయ భాషానువాద మిషన్ (ఎన్టీఎల్ఎం) విధానాన్ని తీసుకొస్తామని తెలిపారు. బ్రెజిల్‌తోపాటు భారత ఉపగ్రహాలను మోసుకెళ్లే న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ చేపట్టిన పీఎస్ఎల్వీ-సీఎస్51 ప్రయోగానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇన్నోవేషన్ కోసం స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఎన్ఆర్ఆఫ్ ద్వారా పరిశోధన రంగాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు.

**6)కనిష్ఠ పాలన గరిష్ఠ పర్యవేక్షణ :** సత్వర న్యాయం అందించేందుకు ట్రిబ్యునల్స్‌లో సంస్కరణలు తెచ్చేందుకు పలు చర్యలు తీసుకోనున్నామని మంత్రి సీతారామన్ తెలిపారు. ట్రిబ్యునళ్ల పనితీరును హేతుబద్ధం చేసేందుకు పలు చర్యలు తీసుకోనున్నామని చెప్పారు.



https://ourstudycircle.in/upscpdf/

పెంచింది. ఉపాధి హామీ పథకానికి 2020-21 సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ. 1,11,500 కోట్లు కేటాయించగా ఈసారి రూ. 73,000 కోట్లు కేటాయించారు. వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయడం, రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యంగా వ్యవసాయ రంగంలో సంస్కరణలు కొనసాగుతాయని మంత్రి నిర్మల తెలిపారు. ఈ మేరకు 2021-22 బడ్జెట్ వ్యవసాయ రంగానికి తగిన కేటాయింపులు జరిపినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ రుణాల లక్ష్యంలో ఈ సంవత్సరం 10 శాతం పెంపును ప్రతిపాదిస్తున్నట్లు ఆర్థిక మంత్రి వెల్లడించారు. ఈ పెంపుతో రైతులకు రూ. 16.5 లక్షల కోట్ల వ్యవసాయ రుణాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2020-21)లో అది రూ.15 లక్షల కోట్లుగా ఉంది. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖకు గత ఏడాది కంటే 5.6 శాతం ఎక్కువ నిధులు లభించగా ఇందులో సగం మొత్తాన్ని ప్రధానమంత్రి కిసాన్ కార్యక్రమానికి ఖర్చు చేయనున్నారు. వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖకు 2021-22 సంవత్సరానికి గాను మొత్తం రూ. 1,31,531 కోట్లు కేటాయింపులు జరిగాయి. వ్యవసాయ మౌలిక సదుపాయాలు, సాగునీటి పథకాలకు గత ఏడాది కంటే స్వల్పంగా ఎక్కువ నిధులు అందుబాటులోకి వచ్చాయి. 2020-21 సంవత్సరానికి గాను సవరించిన అంచనాలు రూ. 1,24,519 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. తాజా కేటాయింపుల్లో రూ. 1,23,017.57 కోట్లు వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఉపయోగించుకుంటుంది. మిగిలిన రూ. 8,513 కోట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ కోసం వినియోగిస్తారు. ప్రధానమంత్రి-కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమానికి రూ. 65,000 కోట్లు ఖర్చు చేస్తారు. పంట కోతల అనంతరం అవసరమయ్యే మౌలిక వసతులను సృష్టించేందుకు 'వ్యవసాయ మౌలిక వసతులు, అభివృద్ధి సెస్ (అగ్రికల్చరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్ -ఏఐడీసీ)'ను విధించనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో స్పష్టంచేశారు. ఈ సెస్ బంగారం, వెండిలపై 2.5% వరకూ ఉంటే.. మద్యంపై 100% వరకూ ఉంది. ఈ నిధులను మౌలిక సదుపాయాలను అభివృద్ధికి ఖర్చు చేస్తామని మంత్రి తెలిపారు. దీంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల వృద్ధికి ఇచ్చే నిధులను గత ఏడాది (రూ. 30వేల కోట్లు) కంటే రూ. పదివేల కోట్లు ఎక్కువ నిధులు కేటాయించారు.

**ఆపరేషన్ గ్రీన్ స్కీమ్ విస్తరణ :** వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పత్తుల విలువ, ఎగుమతులను పెంచేందుకు ప్రస్తుతం అమలు చేస్తున్న ఆపరేషన్ గ్రీన్ స్కీమ్‌ను మరింత విస్తరిస్తున్నట్లు ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పథకం కేవలం టమాటాలు, బంగాళదుంప, ఉల్లిపాయలకు మాత్రమే వర్తిస్తూండగా.. మరో 22 ఉత్పత్తుల (త్వరగా నశించిపోయేవి)ను చేర్చనున్నారు.

**ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి :** మత్స్య రంగానికి ప్రోత్సాహమివ్వడానికి ఆధునిక ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల అభివృద్ధికి గణనీయంగా కేటాయింపులు పెంచనున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. తొలుత విశాఖపట్నం, చెన్నై, కోచి, పారదీప్, పశ్చిమ బెంగాల్‌లోని పెటువాఘాట్‌లోని ఫిషింగ్ హార్బర్లను ఆర్థిక కార్యకలాపాలకు హబ్‌లుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. నదులు, జలమార్గాల వెంబడి అంతర్గత ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలను అభివృద్ధి చేస్తామన్నారు. సముద్ర నాచు సాగు వల్ల తీర ప్రాంతాల్లోని ప్రజల జీవితాలు మారిపోతాయని తెలిపారు. దీనివల్ల భారీగా ఉపాధి, అదనపు ఆదాయం లభిస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో తమిళనాడులో బహుళ ప్రయోజన సీవీడ్ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

**బడ్జెట్‌లో ప్రాధాన్యతను బట్టి ఆయారంగాలకు కేటాయింపులు ఈ విధంగా ఉన్నాయి.**

- వ్యవసాయం, అనుబంధ రంగాలు - రూ. 1,48,301 కోట్లు
- గ్రామీణాభివృద్ధి - రూ. 1,31,519 కోట్లు
- విద్యా రంగం - రూ. 93,224 కోట్లు
- మధ్యాహ్న భోజన పథకం - రూ. 11,500 కోట్లు
- గిరిజన సంక్షేమం - రూ. 7,524 కోట్లు
- నైపుణ్యాభివృద్ధి - రూ. 3000 కోట్లు
- సమగ్ర శిక్షణ అభియాన్ - రూ. 31,050.16కోట్లు
- ఆరోగ్య రంగం - రూ. 2,23,846 కోట్లు
- ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ - రూ. 71,268.77 కోట్లు
- కోవిడ్ వ్యాక్సిన్ కోసం - రూ. 35,000 కోట్లు
- సాంఘిక న్యాయం, సాధికారత శాఖ - రూ. 11,689 కోట్లు
- రక్షణ రంగం - రూ. 4,78,000 కోట్లు
- పౌర విమానయాన శాఖ - రూ. 3,224 కోట్లు
- ప్రభుత్వ రంగ బ్యాంకులు - రూ. 20,000 కోట్లు
- సింగరేణి కాలరీస్ - రూ. 2,500 కోట్లు
- జనగణన - రూ. 3,726 కోట్లు
- సముద్ర అధ్యయన మిషన్ - రూ. 4,000 కోట్లు
- భారత్ నెట్ - రూ. 7000 కోట్లు
- మౌలిక వసతుల ప్రాజెక్టులు - రూ. 5,54000 కోట్లు
- రోడ్లు, ఉపరితల రవాణా శాఖ - రూ. 1,18,101 కోట్లు
- రైల్వే శాఖ - రూ. 1,10,055 కోట్లు
- శాస్త్ర, సాంకేతిక శాఖ - రూ. 14,793.66 కోట్లు
- అంతరిక్ష విభాగం - రూ. 13,949 కోట్లు
- పీఎం కిసాన్ పథకం - రూ. 65,000 కోట్లు
- ఉపాధి హామీ(ఎంజీఎన్ఆర్ఈజీపీ) - రూ. 73,000 కోట్లు
- స్వచ్ఛ భారత్ రెండో దశ - రూ. 12,294 కోట్లు
- జల్ జీవన్ మిషన్ - రూ. 50,011 కోట్లు
- దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామ్ జ్యోతి యోజన - రూ. 3,600 కోట్లు
- ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) - రూ. 15,000 కోట్లు
- ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) - రూ. 19,500 కోట్లు
- ఆత్మ నిర్భర్ స్వాస్థ్య యోజన - రూ. 64,180 కోట్లు
- పొరుగు దేశాలకు సాయం - రూ. 7,100 కోట్లు

**ముఖ్యాంశాలు :**

- వ్యవసాయ రంగానికి.. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరించిన బడ్జెట్ అంచనాలు రూ. 1,24,519 కోట్లుగా ఉన్నాయి.
- 2021-22లో వ్యవసాయ శాఖకు చేసిన కేటాయింపుల్లో వ్యవసాయం, రైతుల సంక్షేమ విభాగానికి రూ. 1,23,017.57 కోట్లు కేటాయించారు. వ్యవసాయ పరిశోధన, విద్యకు రూ. 8,513.62 కోట్లు ప్రత్యేకించారు.


https://ourstudycircle.in/upscpdf/

- 2021-22కు సంబంధించి సవరించిన అంచనాల (రూ. 1,03,162.30 కోట్లు)తో పోలిస్తే 10 కేంద్ర పథకాలకు ఈ దఫా స్వల్పంగా నిధులు పెంచి రూ. 1,05,018.81 కోట్లు ప్రతిపాదించారు.
- కీలకమైన పథకాల్లో పీఎం-కిసాన్‌కు రూ. 65వేల కోట్లు దక్కాయి. దీని కింద.. నమోదైన రైతుకు మూడు వాయిదాల్లో రూ. 6వేలను చెల్లిస్తారు.
- పీఎం-ఆశా పథకానికి 2020-21కి సంబంధించిన సవరించిన అంచనాలు రూ. 996 కోట్లుగా ఉండగా తాజాగా ఈ పద్దు కింద రూ. 1500 కోట్లు కేటాయించారు.
- 10వేల వ్యవసాయ ఉత్పత్తి సంస్థల ఏర్పాటు, ప్రోత్సాహానికి కేటాయింపులను రూ. 250 కోట్ల నుంచి రూ. 700 కోట్లకు, వ్యవసాయ మౌలికవసతుల నిధిని రూ. 208 కోట్ల నుంచి రూ. 900 కోట్లకు పెంచారు.
- 18 కేంద్ర ప్రాయోజిత పథకాలకూ కేటాయింపులు జరిపారు. పీఎంకేఎస్‌వైకు 2020-21 సవరించిన అంచనాల్లో రూ. 2,563 కోట్ల నుంచి రూ. 4వేల కోట్లకు పెంచారు.
- వ్యవసాయ మౌలిక వసతుల నిధిని.. మార్కెటింగ్ కమిటీల్లో మౌలిక వసతులు పెంచడానికీ అందుబాటులో ఉంచారు.
- గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధిని రూ. 30వేల కోట్ల నుంచి రూ. 40వేల కోట్లకు పెంచారు. సూక్ష్మ సాగు నిధికి సంబంధించిన కార్పస్‌ను ప్రస్తుతమున్న రూ. 5వేల కోట్ల నుంచి రెట్టింపు చేశారు.
- వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తులకు విలువ జోడింపు, వాటి ఎగుమతులకు అవకాశాన్ని పెంచేందుకు 'ఆపరేషన్ గ్రీన్ స్కీమ్'ను 22 ఉత్పత్తులకు విస్తరించారు. ప్రస్తుతం అది టమోటాలు, ఉల్లిపాయలు, బంగాళా దుంపలకు వర్తిస్తోంది.
- ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చరల్ మార్కెట్ (ఈనామ్)లో 1.68 కోట్ల మంది రైతులు నమోదయ్యారు. ఈ వేదిక ద్వారా రూ. 1.14 లక్షల కోట్ల విలువైన సరకు వాణిజ్యం జరిగింది. మరో వెయ్యి మండీలను ఈనామ్‌తో అనుసంధానిస్తామని మంత్రి తెలిపారు.
- ఇక అనుబంధ మంత్రిత్వశాఖ విషయానికొస్తే మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖకు కేటాయింపులను రూ. 3,918.31 కోట్ల నుంచి రూ. 4,820.82 కోట్లకు పెంచారు.
- ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వశాఖ కేటాయింపులు రూ. 1247.42 కోట్ల నుంచి రూ. 1308.66 కోట్లకు పెరిగాయి.

**వ్యవసాయ, అనుబంధ రంగాలు, రైతు సంక్షేమం మరియు గ్రామీణ భారతదేశం కోసం 9 చర్యలు:**

- వ్యవసాయమే ఆధారంగా నివసిస్తున్న రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి తెలిపారు. రైతులకు ఉత్పాదక వ్యయంతో పోలిస్తే కనీసం 1.5 రెట్లు ప్రతిఫలం లభించేలా చూడటానికి గత ఆరేళ్లలో కనీస మద్దతు ధర వ్యవస్థలో భారీ మార్పులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఆహార ధాన్యాల సేకరణ గణనీయంగా పెరిగిందని, రైతులకు చెల్లింపుల్లోనూ వృద్ధి నమోదైందన్నారు.
- వ్యవసాయోత్పత్తుల సేకరణ కూడా స్థిర వేగంతో పెరుగుతూ వస్తోంది. దీంతో మన రైతులకు చెల్లింపులు కూడా గణనీయంగా పెరిగాయి. గోధుమల సేకరణ విషయమే తీసుకుంటే 2013-2014లో ఈ రైతులకు చెల్లించిన మొత్తం రూ. 33,874 కోట్లు. 2019-2020 వచ్చేసరికి ఇది రూ. 62,802 కోట్లకు చేరింది.
- 2020-2021లో ఇది మరింత మెరుగుపడి రైతులకు చెల్లించిన మొత్తం రూ. 75,060 కోట్లకు చేరుకుంది. 2019-20లో 35.57 లక్షలతో పోలిస్తే 2020-21లో లబ్ధి పొందిన గోధుమల రైతుల సంఖ్య 43.36 లక్షలకు పెరిగింది.
- వరి పంట విషయానికి వస్తే .. ఈ పంట వేసిన రైతులకు 2013-14లో చెల్లించిన మొత్తం రూ. 63,928 కోట్లుగా ఉంది. 2019-2020లో ఇది దాదాపు రూ. 1,41,930 కోట్లకు పెరిగింది.
- 2020-2021లో ఇది మరింతగా పెరిగి రూ. 172,752 కోట్లకు చేరింది. రైతుల ప్రయోజనం 2019-20లో 1.24 కోట్ల నుండి 2020-21లో 1.54 కోట్లకు పెరిగింది.
- అదే పంథాలో, పప్పు ధాన్యాల విషయానికి వస్తే.. 2013-2014లో చెల్లించిన మొత్తం రూ. 236 కోట్ల నుంచి 2019-20 నాటికి రూ. 8,285 కోట్లకు చేరింది. ఇప్పుడు, తాజాగా 2020-2021లో ఇది రూ. 10,530 కోట్లుగా నిలిచింది.
- 2013-14తో పోలిస్తే ఇది దాదాపు 40 రెట్లు ఎక్కువ. పత్తి రైతులకు చెల్లింపులు 2013-14లో రూ. 90 కోట్లుగా ఉండగా ఇది ప్రస్తుతం (2021 జనవరి 27 నాటికి) గణనీయంగా పెరిగి రూ. 25,974 కోట్లకు చేరుకుంది.
- ఈ సంవత్సరం ఆరంభంలో ప్రధానమంత్రి స్వామిత్వా పథకాన్ని ప్రారంభించారు. దీని కింద గ్రామాల్లోని ఆస్తి యజమానులకు రికార్డు హక్కులివ్వనున్నారు. ఇప్పటి వరకు దాదాపు 1,241 గ్రామాల్లో సుమారు 1.80 లక్షల మంది ఆస్తి యజమానులకు కార్డులు అందించారు.
- 2021- 2022 ఆర్థిక సంవత్సర మధ్యకాలంలో దీనిని అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలను కవర్ చేయడానికి వీలుగా విస్తరించాలని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. మన రైతులకు తగిన రుణ సదుపాయాన్ని అందుబాటులో ఉంచేందుకు గాను , ప్రభుత్వం వ్యవసాయ రుణ లక్ష్యాన్ని 2022 ఆర్థిక సంవత్సరానికి రూ. 16.5 లక్షల కోట్లుగా నిర్ధారించింది.
- దీనికి తోడు కేంద్రం గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధికి కేటాయింపులను రూ. 30,000 కోట్ల నుంచి రూ. 40,000 కోట్లకు పెంచింది.
- నాబార్డ్ కింద రూ. 5 వేల కోట్ల కార్పస్‌తో ఏర్పాటు చేసిన మైక్రో ఇరిగేషన్ ఫండ్‌ను రెట్టింపు చేయాలని నిర్ణయించారు. వ్యవసాయం, అనుబంధ ఉత్పత్తులు మరియు వాటి ఎగుమతుల్లో విలువ పెరుగుదలను పెంచేలా ఒక కీలక ప్రకటన చేయడమైంది.
- ప్రస్తుతం టమోటాలు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలకు వర్తింప చేస్తున్న 'ఆపరేషన్ గ్రీన్ స్కీమ్' పరిధిని మరో 22 త్వరగా పాడైపోయే స్వభావం కలిగిన ఉత్పత్తులకూ వర్తింపజేసేలా విస్తరించబడనుంది.
- ఈ-నామ్‌లో సుమారు 1.68 కోట్ల మంది రైతులు నమోదు అయ్యారు, రూ. 1.14 లక్షల కోట్ల మేర వాణిజ్యం జరుగనుంది. వ్యవసాయ మార్కెట్లోకి ఈ-నామ్ తెచ్చిన పారదర్శకత మరియు పోటీతత్వాన్ని దృష్టిలో ఉంచుకుని.. మరో 1,000 మండిలు ఈ-నామ్‌తో అనుసంధానం చేస్తాం. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధులు ఏపీఎంసీలకు వారి మౌలిక సదుపాయాల కల్పన నిమిత్తం అందుబాటులో ఉంచబడతాయి.



https://ourstudycircle.in/upscpdf/

## ఆరోగ్య రంగానికి 2.23 లక్షల కోట్లు



కరోనా సంక్షోభం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2021-22 బడ్జెట్‌లో ఆరోగ్యం, సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిచ్చింది. ఆత్మనిర్భర్ భారత్ సాకారానికి కీలకమైన ఆరు మూల స్తంభాల్లో ఆరోగ్య రంగం కూడా ఒకటని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో రూ. 2,23,846 కోట్లు కేటాయించింది. 2020-21 (రూ. 94,452 కోట్లు) కంటే ఇది 137 శాతం అధికం. కొవిడ్ -19 వ్యాక్సిన్ కోసం రూ. 35,000 కోట్లు కేటాయించారు. కేటాయింపుల్లో ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖకు రూ. 71,268 కోట్లు దక్కనున్నాయి. గత బడ్జెట్‌లో ఈ శాఖకు తొలుత రూ. 65,011 కోట్లు కేటాయించినా, తర్వాత కొవిడ్ కారణంగా రూ. 78,866 కోట్లకు పెంచారు. ప్రస్తుతం ఐదు రాష్ట్రాలకే పరిమితమైన న్యూమోకోకల్ టీకా పంపిణీని దేశమంతటా విస్తరించనున్నారు. న్యూమోనియా, సెప్టికామియా, మెదడువాపు వంటి ప్రాణాంతక ఇన్‌ఫెక్షన్ల నివారణకు ఈ టీకా ఉపయోగపడుతుంది. కేంద్ర ప్రభుత్వం తాజా నిర్ణయం దేశంలో ఏటా 50 వేల మంది చిన్నారుల మరణాలను తప్పించేందుకు దోహదపడుతుందని అంచనా. మరోవైపు- తాజా బడ్జెట్‌లో ఆయుష్‌కు రూ. 2,970.30 కోట్లు, ఆరోగ్య పరిశోధనల విభాగానికి రూ. 2,663 కోట్లు కేటాయించారు.

### ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ స్వాస్థ్య భారత్ యోజన

2021-22 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ స్వాస్థ్య భారత్ యోజన' పేరిట కొత్తగా పథకాన్ని ప్రకటించింది. దీని ద్వారా ప్రస్తుతమున్న, భవిష్యత్‌లో సంభవించే వ్యాధులు, మహమ్మారులను ఎదుర్కొనేందుకు ప్రాథమిక, ద్వితీయ, ప్రాంతీయ వైద్య వ్యవస్థలు, జాతీయ సంస్థలను బలోపేతం చేయనున్నారు. ఈ పథకం కోసం వచ్చే ఆరు సంవత్సరాలకు రూ. 64,180 కోట్లు కేటాయించారు. 'జాతీయ ఆరోగ్య మిషన్'కు అదనంగా ఈ పథకం అమలు కానుంది.

**ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ స్వాస్థ్య భారత్ యోజన లక్ష్యాలు :**

- ఆరోగ్య శ్రేయస్సు కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఏర్పాటు
- గ్రామీణ ప్రాంతాల్లో 17,788, పట్టణ ప్రాంతాల్లో 11,024 ఆరోగ్య, సంరక్షణ కేంద్రాల ఏర్పాటు
- కొత్తగా నాలుగు ప్రాంతాల్లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఫర్ వైరాలజీ
- ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్ని ఎదుర్కోవడానికి 15 హెల్త్ ఎమర్జెన్సీ సెంటర్లు, రెండు మొబైల్ ఆస్పత్రులు
- దేశవ్యాప్తంగా ప్రతీ జిల్లాలో ప్రజారోగ్య ల్యాబ్స్, 11 రాష్ట్రాల్లో బ్లాక్ స్థాయిలో 3,382 ప్రజారోగ్య కేంద్రాల ఏర్పాటు
- నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ), దానికి అనుబంధంగా పనిచేసే అయిదు శాఖల్ని మరింత పటిష్టపరచడం
- ప్రస్తుతం ఉన్న 33 ప్రజారోగ్య కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటుగా కొత్తగా 17 కేంద్రాల ఏర్పాటు
- ప్రపంచ ఆరోగ్య సంస్థ దక్షిణాసియా ప్రాంతం కోసం ప్రాంతీయ పరిశోధనా కేంద్రం ఏర్పాటు
- తొమ్మిది బయో సేఫ్టీ లెవల్ ల్యాబొరేటరీల ఏర్పాటు

## గ్రామీణాభివృద్ధి, ఫ్లాగ్‌షిప్ పథకాలకు అధిక ప్రాధాన్యత



కరోనా మహమ్మారి దెబ్బకు తీవ్రంగా కుదేలైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోంది. తాజా బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి, ఫ్లాగ్‌షిప్ పథకాలకు అధిక ప్రాధాన్యతనిచ్చింది. ముఖ్యంగా తాగు నీరు, స్వచ్ఛ భారత్, ఇళ్ల నిర్మాణానికి అధిక నిధులు వెచ్చించారు.

**గ్రామీణాభివృద్ధికి పథకాలకు కేటాయింపులు :**

- 2021-22 కేటాయింపు: రూ. 1,31,519 కోట్లు (9.5% పెంపు)
- 2020-21 కేటాయింపు: రూ. 1,20,148 కోట్లు (సవరించిన అంచనా: రూ. 1,97,377 కోట్లు)

**జాతీయ ఉపాధి హామీ పథకం కేటాయింపులు :**

- 2021-22 కేటాయింపు: రూ. 73,000 కోట్లు (19% పెంపు)
- 2020-21 కేటాయింపు: రూ. 61,500 కోట్లు (సవరించిన అంచనా: రూ. 1,11,500 కోట్లు)
- 2019-20లో సగటు రోజు కూలీ రూ. 182 ఉండగా, దీన్ని 2020-21 ఏప్రిల్ 1 నుంచి 10 శాతం పెంపుతో రూ. 200కు చేర్చారు.
- మొత్తం 708 జిల్లాలు, 7,092 బ్లాక్‌లు, 2,68,561 గ్రామ పంచాయితీల్లో ఈ పథకం అమలవుతోంది.
- 2021 జనవరి 29 నాటికి ఈ పథకం కింద 14.82 కోట్ల జాబ్ కార్డులు జారీ కాగా, ఇందులో చురుకైన జాబ్ కార్డుల సంఖ్య 9.25 కోట్లు. 28.72 కోట్ల మంది కార్మికులు జాబితాలో ఉండగా, 14.4 కోట్ల మంది కార్మికులు చురుగ్గా ఉపాధి పొందుతున్నారు.
- దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామ్ జ్యోతి యోజనకు రూ. 3,600 కోట్లు కేటాయించారు.
- 2020-21 కేటాయింపు - రూ. 4,500 కోట్లు (సవరించిన అంచనా: రూ. 2,000 కోట్లు)
- ఈ పథకానికి నిధులు 2020-21 సవరించిన అంచనా ప్రకారం చూస్తే 125 శాతం పెరిగాయి.
- ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) : రూ. 15,000 కోట్లు (30% తగ్గింపు) (9.5% పెంపు) కేటాయించారు. 2000 సంవత్సరంలో పీఎంజీఎస్‌వై పథకం ఆరంభం నుంచి 2021 జనవరి 20 నాటికి 1,70,034 గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించారు. మొత్తం 7,47,990 కిలోమీటర్ల పొడవైన పక్కా రోడ్లకు ఆమోదం లభించగా, 6,43,999 కిలోమీటర్ల రోడ్లను నిర్మించారు. ప్రస్తుత ప్రాజెక్టులను రాష్ట్రాల భాగస్వామ్యంతో పూర్తి చేయాలంటే 2025 నాటికి ఏటా రూ. 19,000 కోట్లు అవసరం అవుతాయి.

**స్వచ్ఛ భారత్(గ్రామీణం) రెండో దశ :**

- రూ. 12,294 కోట్లు కేటాయించారు.
- 2019 నాటికి 10 కోట్లకు పైగా మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది. రెండో దశ స్వచ్ఛ భారత్‌ను 2020 ఫిబ్రవరి 19న ప్రారంభించారు. 2024-25 వరకు ఇది కొనసాగుతుంది. ఇందుకు రూ. 1.4 లక్షల కోట్లను కేటాయించనున్నారు.
- ఇందులో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం,



https://ourstudycircle.in/upscpdf/

వ్యర్థాల నిర్వహణ, మురికి నీటి నిర్వహణ, నిర్మాణ రంగం, కూల్చివేతల సమయంలో వాయు కాలుష్యాన్ని తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటారు. అదే విధంగా 10 లక్షలకు పైగా జనాభా ఉన్న 42 పట్టణాల్లో వాయుకాలుష్యాన్ని తగ్గించడం కోసం రూ. 2,217 కోట్లు కేటాయించారు.

**ప్రధానమంత్రి ఆవాస్ యోజన్( పీఎంఏవై) కేటాయింపులు :**

- 2021-22 కేటాయింపులు: రూ. 19,500 కోట్లు
- 2019 నాటికి గ్రామాల్లో కోటి పక్కా ఇళ్ల నిర్మాణం జరిగింది. 2022 నాటికి మరో 1.95 లక్షల ఇళ్లు నిర్మించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది.

**జల్ జీవన్ మిషన్ కేటాయింపులు :**

- 2021-22 కేటాయింపులు: 50,011 కోట్లు (335 శాతం పెంపు)
- 2020-21 కేటాయింపులు: రూ. 11,500 కోట్లు
- స్వచ్ఛమైన తాగునీటిని అందరికీ అందించేందుకు 2019-20లో జల్ జీవన్ మిషన్‌ను ప్రకటించారు. 2024 నాటికి గ్రామీణ కుటుంబాలన్నింటికీ (హర్ ఘర్ జల్) తాగునీటిని (హ్యాండ్ పంపులు, కుళాయిలు ఇతరత్రా మార్గాల్లో) అందించాలని నిర్ణయించారు. ఇందుకోసం మొత్తం రూ. 3.6 లక్షల కోట్లను వెచ్చించనున్నారు.

**భారత్ నెట్ కేటాయింపులు :**

- 2021-22 కేటాయింపు: రూ. 7,000 కోట్లు (17 శాతం పెంపు)
- భారత్ నెట్ కింద 2021 జనవరి 15 నాటికి మొత్తం 1.63 లక్షల గ్రామ పంచాయతీలకు 4.87 లక్షల కిలోమీటర్ల పొడవైన ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశారు.

## విద్యా రంగానికి రూ.93,224.31 కోట్లు



కొత్త జాతీయ విద్యా విధానంలో వివరించిన విద్యా సంస్కరణల మేరకు మానవ వనరుల (పాఠశాల, ఉన్నత విద్యా రంగం) రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. మానవ వనరుల విభాగంలో మూలధనం పెంచడంలో భాగంగా చదువు, నైపుణ్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని వెల్లడించారు. ఆరు ప్రాధామ్యాల ఆధారంగా రూపొందించిన 2021-2022 బడ్జెట్‌లో మానవ వనరులు, నైపుణ్యాభివృద్ధి ఒకటని తెలిపారు. పాఠశాల విద్యకు రూ. 54,873.66 కోట్లు, ఉన్నత విద్యకు రూ. 38,350.65 కోట్లు.. మొత్తంగా విద్యా రంగానికి రూ. 93,224.31 కోట్లు కేటాయించినట్లు స్పష్టం చేశారు. విద్యా రంగానికి గతేడాది మొత్తం కేటాయింపులు రూ. 99,311.52 కోట్లు (గతేడాది రూ. 86,089 కోట్లు). ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ.. దేశంలోని తొమ్మిది నగరాల్లో హయ్యర్ ఎడ్యుకేషన్ క్లస్టర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇది విద్యా సంస్థల మధ్య సమన్వయం, స్వయం ప్రతిపత్తి, సమష్టి వృద్ధికి దోహద పడుతుందన్నారు. మూడు దశాబ్దాల తర్వాత తొలిసారిగా కొత్త జాతీయ విద్యా విధానం.. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్, హైబ్రిడ్ మోడళ్లలో అవసరాలకు, పరిస్థితులకు అనుగుణంగా మార్పులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. దీనిని అమలు చేయడానికి క్రెడిట్ బదిలీ విధానంతో పాటు, అకడమిక్ బ్యాంక్ ఏర్పాటవుతుందని, ఇందుకు ఉన్నత విద్య క్లస్టర్ తోడ్పాటు అందించి అభ్యాస వాతావరణాన్ని మెరుగు పరచనుందని వివరించారు.

**పాఠశాల విద్య :**

- కొత్త జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)లో ప్రతిపాదించిన సంస్కరణల ప్రకారం దేశ వ్యాప్తంగా 15,000 నమూనా పాఠశాలలు ఏర్పాటు.
- స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ-ప్రైవేట్ క్రీడాకారులు, ప్రైవేట్ పాఠశాలలు, రాష్ట్రాల భాగస్వామ్యంతో దేశ వ్యాప్తంగా 100 కొత్త సైనిక్ పాఠశాలలు ఏర్పాటు.
- సైనిక్ పాఠశాలలను రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సైనిక్ స్కూల్స్ సొసైటీ స్థాపించి, నిర్వహిస్తోంది. దేశంలో ప్రస్తుతం 30కి పైగా సైనిక్ పాఠశాలలు ఉన్నాయి.

**ఉన్నత విద్య**

- స్టాండర్డ్ (ప్రామాణిక) - సెట్టింగ్ (అమరిక), అక్రెడిటేషన్ (గుర్తింపు), రెగ్యులేషన్ (నియంత్రణ), ఫండింగ్ (నిధులు) కోసం నాలుగు వేర్వేరు విభాగాల ఏర్పాటుతో అంబ్రెల్లా స్ట్రక్చర్‌లో భారతదేశ ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటు కోసం చట్టం రూపకల్పన
- లద్దాఖ్‌లోని లేహ్‌లో సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు.

**ఎస్సీ, ఎస్టీల సంక్షేమం :**

- గిరిజన సంక్షేమ గురుకుల విద్య కోసం దేశంలో 750 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు.
- ఈ తరహా స్కూలు నిర్మాణానికి గతంలో రూ. 20 కోట్లు ఇస్తుండగా ఈ బడ్జెట్‌లో రూ. 38 కోట్లు కేటాయింపు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఒక్కో స్కూలు నిర్మాణానికి రూ. 48 కోట్లు కేటాయింపు.

## మౌలిక వసతుల రంగానికి రూ. 5.54 లక్షల కోట్లు

మౌలిక వసతుల రంగంలో పెట్టుబడుల కల్పన కోసం 2021-22 బడ్జెట్‌లో ఏకంగా రూ. 5.54 లక్షల కోట్లను ఆర్థికమంత్రి కేటాయించారు. ఇందులో ప్రధానంగా రూ. 1.18 లక్షల కోట్లు రోడ్స్ అండ్ హైవే రంగానికి, రూ. 1.08 కోట్లు రైల్వే రంగానికి కేటాయించారు. ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ ఏర్పడేందుకు, ఉపాధి కల్పనకు ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపారు. ఇందుకు అదనంగా అవసరమైన నిధులను పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా సాధిస్తామన్నారు.

**ముఖ్యాంశాలు :**

- తమిళనాడులో 3,500 కి.మీ మేర జాతీయ రహదారుల కోసం రూ. 1.03 లక్షల కోట్లు
- కేరళలో 1,100 కి.మీ. జాతీయ రహదారుల కోసం రూ. 65,000 కోట్లు
- పశ్చిమ బెంగాల్‌లో 675 కి.మీ. జాతీయ రహదారుల కోసం రూ. 25,000 కోట్లు
- అస్సాంలో మూడేళ్లలో 1,300 కి.మీ. జాతీయ రహదారుల నిర్మాణానికి రూ. 34,000 కోట్లు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 19,000 కోట్లతో జరుగుతున్న జాతీయ రహదారుల పనులకు ఇది అదనం.
- కొత్తగా నిర్మాణం చేపట్టే 4, 6 వరుసల రహదారుల్లో అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలు

**ప్రధాన కారిడార్లు/ఎక్స్ ప్రెస్ వేలు:**

- ఢిల్లీ - ముంబై ఎక్స్‌ప్రెస్ వే- మిగిలిన 260 కిలోమీటర్ల పనిని 31.3.2021 లోపల అప్పగించడం జరుగుతుంది.



https://ourstudycircle.in/upscpdf/

- బెంగళూరు - చెన్నై ఎక్స్‌ప్రెస్ వే-278 కిలోమీటర్ల పనిని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించడం జరుగుతుంది. 2021-22లో నిర్మాణం మొదలవుతుంది.
- కాన్పూర్ - లక్నో ఎక్స్‌ప్రెస్ వే- జాతీయ రహదారి 27కు ప్రత్యామ్నాయ మార్గాన్ని సమకూర్చే 63 కిలోమీటర్ల ఎక్స్‌ప్రెస్ వే పనులు 2021-22 ఆర్థిక సంవత్సరంలో మొదలవుతాయి.
- ఢిల్లీ - డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్ - 210 కిలో మీటర్ల పనులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదలు పెట్టడం జరుగుతుంది. 2021-22హాసంవత్సరంలో నిర్మాణం మొదలవుతుంది.
- 464 కిలోమీటర్ల రాయపూర్-విశాఖపట్నం మార్గం ఛత్తీస్‌గఢ్, ఒడిశా మరియు ఉత్తర ఆంధ్రప్రదేశ్ ద్వారా వెళుతుంది. నిర్మాణ పనులు 2021-22 సంవత్సరంలో మొదలవుతాయి.
- 277 చెన్నై-సేలం కారిడార్ ఎక్స్‌ప్రెస్ వే పనులకు ఈ ఏడాది టెండర్లు పిలిచి 2021-22 ఆర్థిక సంవత్సరంలో పనులు మొదలు పెట్టడం జరుగుతుంది.
- అమృత్‌సర్-జామ్ నగర్ నిర్మాణం2021-22లో మొదలవుతుంది.
- ఢిల్లీ - కాట్రా నిర్మాణం 2021-22లో మొదలవుతుంది.


**విద్యుత్ మౌలిక సదుపాయాలు:**

- గత ఆరేళ్లలో విద్యుత్ సరఫరా లైన్ల సామర్థ్యాన్ని పెంచి 2.8 కోట్ల కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగింది.
- పంపిణీ కంపెనీల మధ్య పోటీ పెరిగి వినియోగదారులకు మెరుగైన సేవలు లభిస్తాయి
- గత ఐదేళ్లలో మెరుగైన కొత్త విద్యుత్ పంపిణీ విధానం కోసం రూ.3,05,984 కోట్లు ఖర్చు.

**ఓడరేవులు, నౌకానిర్మాణం, జలమార్గాలు:**

- ప్రధాన పోర్టులకు సంబంధించి రూ.2000 కోట్ల విలువైన 7 ప్రాజెక్టులు ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంలో నిర్వహణ.
- భారతీయ షిప్పింగ్ కంపెనీలకు గ్లోబల్ టెండర్ల ద్వారా రూ.1624 కోట్ల సబ్సిడీ
- అదనంగా లక్షన్నర ఉద్యోగాలకు అవకాశం.

### రక్షణ రంగానికి రూ.4,78,195 కోట్లు



గత ఏడాది (రూ.4.71 లక్షల కోట్లు)తో పోల్చుకుంటే రక్షణ రంగం బడ్జెట్ స్వల్పంగా 1.4 శాతం పెరుగుదలతో, రూ.4.78 లక్షల కోట్లకే పరిమితమైంది. ఇది స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 1.63 శాతం. అయితే మూలధన వ్యయంలో భారీ పెరుగుదల చోటు చేసుకోవడంతో పాటు, భారత్-పాకిస్తాన్, భారత్-చైనా సరిహద్దులను రక్షిస్తున్న సాయుధ బలగాలకు కూడా ఎక్కువ కేటాయింపులే లభించాయి. గతేడాది రూ.4.71 లక్షల కోట్లను కేటాయించగా.. ఈసారి రూ.4.78 లక్షల కోట్లను ప్రతిపాదించారు. ఇందులో పెన్షన్ల చెల్లింపులు (దాదాపు రూ.1.15 లక్షల కోట్లు) కూడా ఉన్నాయి. అంటే సైనిక దళాల కోసం రూ.3.62 లక్షల కోట్లు కేటాయించినట్లు తేలింది. ఇందులోనూ రూ.1.35 లక్షల కోట్లను మూలధన వ్యయంగా చూపించారు. ఈ వ్యయంతో కొత్త ఆయుధాలు, యుద్ధ విమానాలు, సైనికులకు సంబంధించిన సామగ్రిని కొనుగోలు చేయనున్నారు. గతేడాది మూలధన వ్యయం రూ.1.13 లక్షల కోట్లు కాగా.. ఈ సారి దాదాపు 19 శాతం కేటాయింపులు పెరిగాయి. మరోవైపు సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్‌లకు (బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఐటీబీపీ) రూ.1,03,802.52 కోట్లను కేటాయించారు. గతేడాదితో పోల్చితే దాదాపు 7.1 శాతం కేటాయింపులు పెరిగాయి. ఇంకోవైపు ప్రధానమంత్రి, ఇతర ప్రముఖులకు భద్రత కల్పించే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ)నకు రూ.429.05 కోట్లను కేటాయించారు. గతేడాది రూ.592.55 కోట్లను కేటాయించిన ప్రభుత్వం.. తర్వాత రూ.429.05 కోట్లకు సవరించింది. గతేడాదితో పోల్చితే తాజాగా రూ.2.78 కోట్లను అదనంగా కేటాయించింది. చైనాతో గొడవ నేపథ్యంలో భారత సైన్యం గత కొన్ని నెలల్లో పలు దేశాల నుంచి ఆయుధాలు, మందుగుండు కొనుగోలు చేసింది. ఆర్మీకి మూలధన వ్యయం కింద రూ.36,481 కోట్లు, నౌకా దళానికి రూ.33,253 కోట్లు, వైమానిక దళానికి రూ.53,214 కోట్లు (ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయం కింద ఖర్చు చేసిన దానికంటే రూ.1,841 కోట్లు తక్కువ) కేటాయించారు. గత ఏడాది ఆర్మీకి రూ.33,213 కోట్లు, నౌకాదళానికి రూ.37,542 కోట్లు కేటాయించారు. వైమానిక దళ గత ఏడాది మూలధన వ్యయం రూ.43,281.91 కోట్లు కాగా సవరించిన అంచనా రూ.55,055 కోట్లుగా నమోదయ్యింది.

### కేంద్ర హోంశాఖకు రూ.1,66,547 కోట్లు

కేంద్ర హోంశాఖకు 2021-22 బడ్జెట్‌లో రూ.1,66,547 కోట్లు కేటాయిస్తున్నట్లు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2020-21)తో పోల్చితే ఇది 11.48 శాతం అధికం. ఇందులో మెజారిటీ నిధులు కేంద్ర సాయుధ బలగాల నిర్వహణకు, జనగణనకు సంబంధించిన కార్యకలాపాలకు వినియోగించనున్నారు. కొత్తగా ఏర్పాటైన కేంద్ర పాలిత ప్రాంతాలు జమ్మూకశ్మీర్‌కు రూ. 30,757 కోట్లు, లడాఖ్‌కు రూ. 5,958 కోట్లు కేటాయించారు. కేంద్ర బలగాలకు రూ. 1,03,802 కోట్లు, జనాభా లెక్కల నిర్వహణకు రూ. 3,768 కోట్లు కేటాయించారు. సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్, ప్రాజెక్టులకు రూ. 1,641 కోట్లు, విపత్తు నిర్వహణకు రూ. 481 కోట్లు కేటాయించారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో హోం శాఖకు రూ.1,49,387 కోట్లు కేటాయించగా ప్రస్తుతం ఆ మొత్తాన్ని రూ.1,66,547 కోట్లకు పెంచారు.

### 112 జిల్లాల్లో మిషన్ పోషణ్ 2.0 కార్యక్రమం

2021-22 బడ్జెట్‌లో 'మిషన్ పోషణ్ 2.0' పేరిట కొత్త పోషకాహార పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పోషకాహార పథకం, పోషణ్ అభియాన్‌ను కలిపి 'మిషన్ పోషణ్ 2.0'గా అమలుచేయనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇన్నాళ్లూ అమల్లో ఉన్న సప్లిమెంటరీ న్యూట్రిషియన్ ప్రోగ్రామ్, పోషణ్ అభియాన్ కార్యక్రమాల్ని కలిపేసి మిషన్ పోషణ్ 2.0 కార్యక్రమాన్ని మొదలు పెట్టనున్నారు. దీని కింద 112 జిల్లాల్లో పోషకాహారాన్ని మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

### శాస్త్ర, సాంకేతిక శాఖకు రూ.14,793.66 కోట్లు

శాస్త్ర, సాంకేతిక శాఖకు కేంద్ర ప్రభుత్వం 2021-22 బడ్జెట్‌లో రూ.14,793.66 కోట్లు కేటాయించింది. 2020-21 బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే ఇది 20% అధికం కావడం విశేషం. అలాగే ఎర్త్ సైన్సెస్ శాఖకు ప్రత్యేకంగా రూ.1,897.13 కోట్లు కేటాయించారు. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ పరిధిలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టీ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ (డీబీటీ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్



https://ourstudycircle.in/upscpdf/

రీసెర్చ్ (డీఎస్ఐఆర్) ఉన్నాయి. దేశంలో కరోనా వైరస్ వ్యాప్తిని కట్టడి చేయడంలో ఈ విభాగాలన్నీ కీలకంగా పనిచేశాయి. 2021-22 బడ్జెట్‌లో డీఎస్‌టీకి రూ.6,067.39 కోట్లు, డీబీటీకి రూ.3,502.37 కోట్లు, డీఎస్ఐఆర్‌కు రూ.5,224.27 కోట్లు కేటాయించారు. 2020-21 బడ్జెట్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖకు రూ.14,473.66 కోట్లు కేటాయించగా, తర్వాత దాన్ని రూ.11,551.86 కోట్లుగా సవరించారు. ఇండియాలో 'డీప్ ఓషన్ మిషన్'ను ప్రారంభిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. ఇందుకోసం ఐదేళ్లలో రూ.4,000 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. సముద్రాలపై అధ్యయనం, సర్వే, సముద్రాల్లోని జీవవైవిధ్యాన్ని పరిరక్షించడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశమని వెల్లడించారు.


**డీప్ ఓషన్ మిషన్ :** దేశంలో 'డీప్ ఓషన్ మిషన్'ను ప్రారంభిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. ఇందుకోసం ఐదేళ్లలో రూ.4,000 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. సముద్రాలపై అధ్యయనం, సర్వే, సముద్రాల్లోని జీవవైవిధ్యాన్ని పరిరక్షించడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశం.

**అంతరిక్ష విభాగం :** అంతరిక్ష విభాగానికి కేంద్రం రూ.13,949 కోట్లు కేటాయించింది. ఇది గతేడాది రూ.8,228 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.4,449 కోట్లు ఎక్కువ కేటాయించడం గమనార్హం. ఈ మొత్తంలో రూ.700 కోట్లను కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ రంగ సంస్థ 'న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్'కు కేటాయించారు. గగన్‌యాన్ ప్రాజెక్టు ద్వారా నలుగురు మానవులను అంతరిక్షంలోకి పంపడానికి రష్యాలోని జెనరిక్ స్పేస్ ఫ్లయిట్ ఆస్పెక్ట్‌లో శిక్షణ ఇస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. డిసెంబర్ 2021లో మానవరహిత అంతరిక్ష నౌకను పరీక్షిస్తామని వెల్లడించారు.

### సామాజిక న్యాయం, సాధికారతకు రూ.11,689 కోట్లు

సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు 2021-22 బడ్జెట్‌లో మొత్తం రూ.11,689 కోట్ల కేటాయింపులు జరిపారు. గత ఆర్థిక సంవత్సరం(2020-21)తో పోలిస్తే ఈసారి 28.35 శాతం నిధులు పెరిగాయి. వెనుకబడిన తరగతుల వారికి 2020-21 బడ్జెట్‌లో రూ.8,207.56 కోట్లు కేటాయించగా, 2021-22 బడ్జెట్‌లో రూ.10,517.62 కోట్లు కేటాయించారు. గత దానితో పోలిస్తే ఇది 28 శాతం ఎక్కువ. దివ్యాంగుల సాధికారికత కోసం 2020-21లో రూ.900 కోట్లు కేటాయించగా, ఈసారి 1,171.77 కోట్లు కేటాయించారు.

### ఎంఎస్ఎంఈలకు రూ.15,700 కోట్లు



సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల కోసం 2021-22 బడ్జెట్‌లో రూ.15,700 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ కేటాయింపులతో పోల్చితే ఈసారి రెట్టింపు కావడం గమనార్హం. ఇటీవలి ఆర్థిక సర్వే ప్రకారం దేశవ్యాప్తంగా 6 కోట్ల ఎంఎస్ఎంఈలున్నాయి. ఇవి 11 కోట్ల మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. అంతేగాక భారత జీడీపీలో 30 శాతం వాటా ఎంఎస్ఎంఈలదే. ఈ నేపథ్యంలో ఓ ప్రత్యేక విధివిధానాన్ని బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తావించారు. రుణాల సెటిల్మెంట్‌కు ఎన్‌సీఎల్‌టీ విధివిధానాలను బలోపేతం చేస్తామన్నారు. కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ-కోర్టుల వ్యవస్థను అమలు చేస్తామని తెలిపారు. కరోనా వైరస్ దెబ్బకు అత్యధికంగా ప్రభావితమైన రంగాల్లో ఎంఎస్ఎంఈలు కూడా ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎంఎస్ఎంఈలకు కస్టమ్స్ సుంకాల భారాన్ని తగ్గించారు. సెమీస్, ఫ్లాట్, నాన్-అల్లాయ్, అల్లాయ్‌లకు సంబంధించిన లాంగ్ ప్రొడక్ట్స్, స్టెయిన్‌లెస్ స్టీల్స్‌పై సుంకాలను 7.5 శాతానికి తగ్గించుతున్నట్లుహా నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. దుస్తులు, తోలు, హస్తకళల ఉత్పత్తుల ఎగుమతిదారులకు ప్రోత్సాహాన్ని అందించారు. పలు రకాల లెదర్స్ దిగుమతులపై మినహాయింపులను ఉపసంహరించారు. దేశీయంగానే నాణ్యమైన ఉత్పత్తులు తయారవుతున్నందున ఈ సుంకాల మినహాయింపులను తీసేస్తున్నామన్నారు. మరోవైపు స్టీల్ స్క్రూలు, ప్లాస్టిక్ బిల్డర్ వేర్స్‌పై సుంకాన్ని 10 శాతం నుంచి 15 శాతానికి పెంచారు.

### రూ.6 లక్షల కోట్లకు చేరిన ఆహారం, ఎరువుల సబ్సిడీలు

ఆహారం, ఇంధనం, ఎరువులపై కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు సుమారు రూ.6 లక్షల కోట్లకు చేరాయి. 2020-21 బడ్జెట్ అంచనాల్లో రూ.2,27,793.89 కోట్లుగా ఉన్న సబ్సిడీ.. సవరించిన అంచనాల ప్రకారం రూ.5,95,620.23 కోట్లకు పెరిగింది. గతేడాది(2020) ఫిబ్రవరిలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన అనంతరం.. కోవిడ్, లాక్‌డౌన్ వల్ల తలెత్తిన పరిస్థితులతో అంచనాలు తలకిందులయ్యాయి. 80 కోట్ల మంది పేదలకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందించడంతో పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టడం వల్ల సబ్సిడీ బిల్లు అమాంతం పెరిగిపోయింది. అయితే, 2021-22 ఆర్థిక సంవత్సరానికి గానూ సబ్సిడీ బిల్లును రూ.3,36,439.03 కోట్లుగా అంచనా వేయడం జరిగింది.

ఇక ఆహార ధాన్యాలపై సబ్సిడీ రూ.1,15,569.68 కోట్ల నుంచి రూ.4,22,618.14 కోట్లకు పెరిగింది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి దీన్ని రూ.2,42,836 కోట్లుగా అంచనా వేశారు. ఎరువులపై సబ్సిడీ రూ.71,309 కోట్ల నుంచి రూ.1,33,947.3 కోట్లకు చేరగా.. 2021-22లో రూ.79,529.68 కోట్లుగా అంచనా వేశారు. పెట్రోలియం ఉత్పత్తులు(ఎల్పీజీ, కిరోసిన్) మీద సబ్సిడీని రూ.40,915.21 కోట్లుగా అంచనా వేయగా.. సవరించిన అంచనాల ప్రకారం అది రూ.39,054.79 కోట్లయ్యింది. 2021-22లో పెట్రోలియం సబ్సిడీ కింద రూ.14,073.35 కోట్లు కేటాయించారు.

### అసంఘటిత కార్మికుల గుర్తింపునకు 'పోర్టల్'

అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత కల్పన గురించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రస్తావించారు. అసంఘటిత కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేకంగా ఓ పోర్టల్‌ను తీసుకురానున్నట్లు తెలిపారు. త్వరలో అందుబాటులోకి రానున్న ఈ పోర్టల్‌లో పేర్లను నమోదు చేసుకున్న కార్మికులకు వైద్యం, బీమా, నైపుణ్యాల శిక్షణ వంటి సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. తొలిసారిగా ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) సౌకర్యాలను కూడా వర్తింపజేస్తామన్నారు. కార్మికులందరికీ కనీస వేతనాన్ని చెల్లించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రిటర్నులు దాఖలు చేసే సమయంలో గుత్తేదారులపై పడుతున్న భారాన్ని తగ్గించేందుకు సింగిల్ రిజిస్ట్రేషన్, సింగిల్ లైసెన్స్ ఫెసిలిటీ వంటి విధానాల్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

### స్వచ్ఛంద వాహన స్క్రాపింగ్ విధానం

కాలం చెల్లిన వాహనాలను తొలగించేందుకు 'స్వచ్ఛంద వాహన స్క్రాపింగ్ విధానాన్ని' ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీని కింద వ్యక్తిగత వాహనాలు 20 ఏండ్లు, వాణిజ్య వాహనాలు 15 ఏండ్లు పూర్తయ్యాక



https://ourstudycircle.in/upscpdf/

ఆటోమేటెడ్ కేంద్రాల్లో ఫిట్‌నెస్ పరీక్ష చేయించాలి. ఇతర వివరాలను త్వరలో ప్రకటిస్తామన్నారు. దేశంలోని కోటి వాహనాలు ఈ పథకం పరిధిలోకి వస్తాయి.

### మౌలిక ప్రాజెక్టులకు 'మానిటైజేషన్'



ప్రస్తుత మౌలిక సదుపాయాల అసెట్స్‌ను విక్రయించడం లేదా లీజుకివ్వడం వంటి మార్గాల ద్వారా సమీకరించే నిధులను (మానిటైజేషన్) కొత్త ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు వెచ్చించే విధంగా కేంద్రం బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేసింది. అసెట్ మానిటైజేషన్ ప్రక్రియ పురోగతి గురించి ఇన్వెస్టర్లకు పూర్తి సమాచారం ఉండేలా డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా దేశీ, అంతర్జాతీయ సంస్థాగత ఇన్వెస్టర్లకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ (పీజీసీఐఎల్) చెరో ఇన్విట్‌ను (ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్) నిర్వహిస్తాయని మంత్రి తెలిపారు. దాదాపు రూ. 5,000 కోట్ల విలువ చేసే అయిదు రహదారులను ఎన్‌హెచ్ఏఐ ఇన్విట్‌కు, రూ. 7,000 కోట్లు విలువ చేసే ట్రాన్స్‌మిషన్ అసెట్స్‌ను పీజీసీఐఎల్ ఇన్విట్‌కు ప్రభుత్వం బదలాయించనుంది. 2019లో 6,835 ప్రాజెక్టులతో ప్రకటించిన నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్ (ఎన్ఐపీ) పరిధిని ప్రస్తుతం 7,400 ప్రాజెక్టులకు పెంచామని మంత్రి తెలిపారు. 2020-25 మధ్య కాలంలో వీటికి దాదాపు రూ. 111 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమని అంచనా. అసెట్స్ మానిటైజేషన్, కేంద్ర.. రాష్ట్రాల బడ్జెట్‌లో పెట్టుబడి వ్యయాలను పెంచడం తదితర మార్గాల ద్వారా ఇన్‌ఫ్రాకు మరింత ఊతమిస్తామని పేర్కొన్నారు. ఇన్‌ఫ్రా రంగ ఆర్థిక అవసరాల కోసం రూ. 20,000 కోట్లతో డెవలప్‌మెంట్ ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్ (డీఎఫ్ఐ) ఏర్పాటు చేయనున్నట్లు సీతారామన్ వివరించారు. వచ్చే మూడేళ్లలో డీఎఫ్ఐ రుణాల పోర్ట్‌ఫోలియో సుమారు రూ. 5 లక్షల కోట్లకు చేరగలదని ఆశిస్తున్నట్లు ఆమె తెలిపారు.

**రీట్స్‌లోకి ఎఫ్‌పీఐలు :** దేశీయంగా ఇన్‌ఫ్రా, రియల్ ఎస్టేట్ రంగాలకు నిధుల లభ్యతను మరింతగా పెంచే దిశగా కూడా కేంద్రం చర్యలు ప్రతిపాదించింది. రీట్స్ (రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్), ఇన్విట్స్‌కు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) రుణాల రూపంలో నిధులు సమకూర్చేందుకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది. నిర్దిష్ట చట్టాల్లో ఇందుకు సంబంధించిన సవరణలను చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. డివిడెండ్ ఆదాయంపై పన్నులకు సంబంధించి తక్కువ రేటును కూడా వర్తింపచేసేలా ప్రతిపాదనలు ఉన్నట్లు వివరించారు.

### విద్యుత్ పంపిణీ విభాగంలో రూ.3.05 లక్షల కోట్లతో సంస్కరణలు

కేంద్ర ప్రభుత్వం వినియోగదారుడు తన కిష్టమైన కంపెనీ నుంచి విద్యుత్‌ను కొనుగోలుచేసే అవకాశం కల్పించనుంది. వినియోగదారులకు 24 గంటలూ విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా వచ్చే ఐదేండ్లలో విద్యుత్ పంపిణీ విభాగంలో రూ. 3.05 లక్షల కోట్లతో సంస్కరణలు చేపట్టనుంది. ఈ పథకం ద్వారా డిస్కంలకు మౌలిక సదుపాయాల సృష్టికి, 'ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటరింగ్', ఫీడర్ల విభజన, యంత్రాల ఉన్నతీకరణకు సహకారం లభిస్తుందని ఆర్థిక మంత్రి తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో హరిత ఇంధన వనరుల నుంచి హైడ్రోజన్ ఉత్పత్తికి 'జాతీయ హైడ్రోజన్ ఇంధన మిషన్'ను ప్రారంభించనున్నామని మంత్రి ప్రకటించారు.

### ప్రభుత్వరంగ బ్యాంకులకు మరో రూ.20,000 కోట్లు

నియంత్రణ సంస్థల నిబంధనలు చేరుకునేందుకు వీలుగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోకి (పీఎస్‌బీలు) 2021-22లో మరో రూ. 20,000 కోట్ల నిధుల్ని చొప్పించనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ (2020-21) మూలధన పునర్వ్యవస్థీకరణ కోసం ప్రభుత్వం రూ. 20,000 కోట్ల కేటాయింపులు చేసిందని తెలిపారు. ఆర్థిక వ్యవస్థకు బలమైన ప్రేరణ కోసం 2019-20లో ప్రభుత్వం బ్యాంకులకు రూ. 70,000 కోట్ల మూలధన సాయం చేసిన సంగతి తెలిసిందే. 2020 సెప్టెంబరులో పీఎస్‌బీలకు రూ. 20,000 కోట్ల మూలధన సాయం చేసేందుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఇందులో రూ. 5,500 కోట్లు పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌కు గత నవంబరులో అందజేసింది. 2017-18లో పీఎస్‌బీలకు ప్రభుత్వం రూ. 90,000 కోట్ల మూలధన సాయం చేసింది. 2018-19లో ఏకంగా రూ. 1.06 లక్షల కోట్ల మూలధన సాయం ప్రకటించింది. బ్యాంకు ఖాతాదారులు చేసిన డిపాజిట్లపై గతంలో ఉన్న బీమాను రూ. 1 లక్ష నుంచి రూ. 5 లక్షలకు పెంచడాన్ని ప్రభుత్వం గత ఏడాదే(2020) ఆమోదించిన సంగతిని ఆర్థిక మంత్రి గుర్తు చేశారు.

**బ్యాడ్ బ్యాంక్ పథకం :** నిరర్థక ఆస్తుల భారంతో కుదేలైన దేశీయ బ్యాంకులకు ఊరట కలిగించేలా ఈ బడ్జెట్‌లో బ్యాడ్ బ్యాంక్ పథకాన్ని ప్రకటించారు.

### పన్ను ప్రతిపాదనలు



పెట్టుబడులను ప్రోత్సహించేలా, దేశంలో ఉపాధి పెంచేలా పారదర్శకమైన, సమర్థమైన పన్ను వ్యవస్థ తీర్చిదిద్దటం లక్ష్యం పెట్టుకుంది., అదే సమయంలో పన్ను చెల్లింపుదారుల మీద భారం కూడా కనీస స్థాయిలో ఉండాలని భావిస్తోంది.

#### 1. ప్రత్యక్ష పన్నులు

- కార్పొరేట్ పన్నును ప్రపంచంలోనే అతి తక్కువ ఉండేలా తగ్గించబడింది.
- రిబేట్లు ఇవ్వటం ద్వారా చిన్న పన్ను చెల్లింపుదారుల మీద భారం తగ్గించబడింది.
- పన్ను రిటర్న్‌ల దాఖలు దాదాపు రెట్టింపైంది. 2014 లో 3.31 కోట్లు ఉండగా 2020 నాటికి 6.48 కోట్లు అయింది.

### వ్యక్తిగత ఆదాయపన్ను రేట్లలో యథాతథ స్థితి

2021-22 బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయపన్ను (ప్రత్యక్ష పన్ను) రేట్లతో పాటు, సర్‌ఛార్జి, సెస్సుల్లో ఎలాంటి మార్పులు ప్రతిపాదించలేదు. అధిక ఆదాయ వర్గాలపై విధించే సర్‌ఛార్జిలోనూ సవరణలు చేయలేదు. రూ. 2,50,000 లక్షల వరకు ఉన్న బేసిక్ ఎగ్జెంప్షన్ అలానే కొనసాగనుంది. రూ. 2,50,000కు పైన పన్ను వర్తించే ఆదాయం రూ. 5,00,000 వరకు ఉన్నా కానీ (మినహాయింపులు పోను) పన్ను చెల్లించాల్సిన బాధ్యత లేదు. సెక్షన్ 87ఏ కింద రూ. 12,500 రాయితీని పొందొచ్చు. దీంతో పలు సెక్షన్ల కింద పన్ను మినహాయింపులను క్లెయిమ్ చేసుకున్న అనంతరం నికర ఆదాయం రూ. 5లక్షల వరకు ఉంటే పన్ను బాధ్యత లేదు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో అమల్లో ఉన్న రేట్ల ప్రకారమే ఆదాయపన్ను చెల్లింపులు చేయాల్సి ఉంటుంది.

- **అధిక ఆదాయ వర్గాల భవిష్యనిధి వాటాలపై పన్ను :** తాజా బడ్జెట్‌లో అధిక ఆదాయ వర్గాల భవిష్యనిధి వాటాలపై స్వల్ప పన్నును ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగి తరపున



https://ourstudycircle.in/upscpdf/

చందా రూ.2.5లక్షలు మించితే, వడ్డీ ఆదాయంపై 1 శాతం పన్ను. 2021 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది.

- **75 ఏళ్లు దాటిన వారికి ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు నుంచి మినహాయింపు :** పింఛను, వడ్డీల ద్వారా ఆదాయం ఆర్జిస్తూ, 75 ఏళ్ల వయసు దాటిన వారు ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయనవసరం లేదని ప్రతిపాదించారు. వారికి పింఛను, వడ్డీ చెల్లించే బ్యాంకులు అవసరమైన మేరకు పన్ను (ట్యాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్-టీడీఎస్) వసూలు చేస్తాయి. పెన్షన్ అందుకుంటున్న బ్యాంకులోనే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఆదాయం కూడా వస్తుండాలి. వచ్చే ఆర్థిక సంవత్సరం(2021 -22) నుంచి ఈ నిబంధన అమల్లోకి రానుంది. 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా.. 75 ఏళ్లు నిండిన వృద్ధులపై నిబంధనల అమలు భారాన్ని దించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్థిక మంత్రి వివరించారు. రిటర్నుల దాఖలులో మినహాయింపునిచ్చినా కానీ, పన్ను బాధ్యత మాత్రం కొనసాగుతుంది. అంటే ఆదాయంపై నిబంధనల మేరకు పన్నును సంబంధిత బ్యాంకు మినహాయించి ఆదాయపన్ను శాఖకు జమ చేస్తుంది. పెన్షన్, డిపాజిట్లపై వడ్డీ ఆదాయం ఒకే బ్యాంకు నుంచి ఉంటేనే ఈ వెసులుబాటు. ఒకవేళ ఒక బ్యాంకులో పెన్షన్ ఆదాయం వస్తూ, మరో బ్యాంకులో ఎఫ్‌డీలపై వడ్డీ ఆదాయం ఉంటే రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. పెన్షన్, ఎఫ్‌డీలపై వడ్డీకాకుండా ఇతర రూపాల్లో ఆదాయం ఉన్నా కానీ రిటర్నుల దాఖలు తప్పనిసరి.
- **డివిడెండ్ ఆదాయం :** వ్యక్తుల చేతుల్లోకి వచ్చే డివిడెండ్ ఆదాయానికి ఎప్పటిలాగానే పన్ను విధిస్తారు. స్థిరాస్తి ఇన్‌ఫ్రా ట్రస్టులు లేదా ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులకు చెల్లించే డివిడెండ్‌కు ఇకపై టీడీఎస్ ఉండదు. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారుల డివిడెండ్ ఆదాయంపై పన్ను రేట్లను హేతుబద్ధంగా పరిశీలించే అవకాశం ఉంది. అంతేకాకుండా.. విదేశీ కంపెనీలు ఆర్జించే డివిడెండ్‌పై చెల్లించాల్సిన పన్ను తక్కువగా ఉంటే.. కనీస ప్రత్యామ్నాయ పన్ను (మ్యాట్) చెల్లించక్కర్లేదు.
- **టీడీఎస్ చేసినప్పుడు :** గత రెండేళ్లలో రూ.50 వేలకు మించి మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్)/వసూలు (టీసీఎస్) చేసిన సందర్భాల్లో తప్పనిసరిగా రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ రిటర్నులు దాఖలు చేయకపోతే.. వారి నుంచి టీడీఎస్‌కు రెట్టింపు మొత్తాన్ని గానీ, లేదా 5శాతం ఇందులో ఏది ఎక్కువైతే అది వసూలు చేస్తారు. ఈ నిబంధన ఉద్యోగులు, ప్రవాస భారతీయులు, లాటరీ చెల్లింపులు తదితర వాటిలో.. పూర్తి పన్ను మూలం వద్ద తగ్గించిన సందర్భాల్లో వర్తించదు.
- **ఎల్‌టీసీ మినహాయింపు :** ఉద్యోగులకు ఇచ్చే ఎల్‌టీసీ మొత్తంపై ఖర్చులతో నిమిత్తం లేకుండా కొన్ని నిబంధనలకు లోబడి మినహాయింపు వర్తిస్తుంది.
- **ఎన్నారై ఆదాయం :** ప్రవాస భారతీయులు స్వదేశానికి వచ్చినప్పుడు, వాళ్లకు లభించే పదవీ విరమణ మొత్తాలపై విధించబోయే పన్నులను అంతర్జాతీయ రేట్లకు అనుగుణంగా సరళీకరిస్తారు.
- **వివాదాల పరిష్కారం కోసం సెటిల్‌మెంట్ కమిషన్ :** ప్రస్తుతం పన్ను చెల్లింపుదారుడికీ, ఆదాయపు పన్ను శాఖకూ మధ్య ఉన్న వివాదాల పరిష్కారానికి సెటిల్‌మెంట్ కమిషన్‌ను ఆశ్రయించవచ్చు. ఈ సెటిల్‌మెంట్ కమిషన్‌ను రద్దు చేస్తూ.. పన్ను వివాద పరిష్కార కమిటీని ప్రతిపాదించారు. రూ.50లక్షల లోపు ఆదాయం ఉండి, అందులో వివాదాస్పద ఆదాయం రూ.10లక్షల లోపు ఉన్న సందర్భాల్లో ఈ కమిటీని సంప్రదించి, పరిష్కరించుకోవచ్చు. ఇది 2021 ఫిబ్రవరి 1 నుంచే అమల్లోకి వచ్చింది. ఇకపై ఆదాయపు పన్ను శాఖ ఇ-ఫైలింగ్ వెబ్‌సైట్‌లో రిటర్నులు ముందే నింపి ఉంటాయి.
- **పన్ను చెల్లించని ఆదాయం మూడేళ్ల వరకే పరిశీలన :** పన్ను చెల్లించని ఆదాయాన్ని తిరిగి పరిశీలించేందుకు ప్రస్తుత నిబంధనల ప్రకారం మదింపు సంవత్సరం ముగిసిన తర్వాత ఆరేళ్ల వరకు నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. సెక్షన్ 149 ప్రకారం ఈ నోటీసులు ఇస్తారు. ఈ ఆరేళ్ల కాల పరిమితిని మూడేళ్లకు తగ్గించాలని ప్రతిపాదించారు. అయినప్పటికీ.. తీవ్రమైన, మోసపూరిత కేసుల విషయంలో పదేళ్ల వరకు తిరిగి తనిఖీ చేసే వీలుంది. నమోదు చేయని ఆదాయం రూ.50 లక్షలకు మించి ఉన్నప్పుడే ఈ నిబంధన వర్తిస్తుంది. తిరిగి తనిఖీ చేసే విధానం ఇకపై కొన్ని నిర్దిష్ట నివేదికల ఆధారంగా జరుగుతుంది.
- **పీఎఫ్‌లో ఏడాదికి రూ.2.5 లక్షలు దాటితే వడ్డీపై పన్ను మినహాయింపు :**

అధిక వేతనం ఉన్న ఉద్యోగులు భవిష్య నిధి (పీఎఫ్) ఖాతాల్లో జమ చేసే మొత్తంపై ఆర్జించే వడ్డీకి బడ్జెట్‌లో కొత్త నిబంధనలను ప్రతిపాదించారు. దీని ప్రకారం.. ఇకపై రూ.2,50,000 వరకు జమ చేసే మొత్తంపై వచ్చే వడ్డీకే పన్ను మినహాయింపు లభిస్తుంది. ఆపై జమ చేసే మొత్తానికి లభించే వడ్డీకి వర్తించే శ్లాబుల ప్రకారం పన్ను విధిస్తారు. ఇది ఏప్రిల్ 1, 2021 నుంచి చేసే జమలకే వర్తించనుంది. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీనికి బలమైన కారణమే ఉంది. అధిక నికర విలువ గల వ్యక్తుల (హెచ్‌ఎన్ఐల)కు చెందిన 1.23 లక్షల ఈపీఎఫ్ ఖాతాల్లో 2018-19 ఆర్థిక సంవత్సరానికి పోగుబడిన మొత్తం రూ.62,500 కోట్లు. ఇందులో ఒక ఖాతాలోనే రూ.103 కోట్లు ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. సాధారణ ఉద్యోగులకు మేలు చేకూర్చేందుకు చందాతోపాటు వడ్డీకి కూడా మినహాయింపు ఇస్తుంటే, అది హెచ్‌ఎన్ఐల రూపంలో పక్కదారి పడుతోందని ప్రభుత్వం గుర్తించింది. అందుకే రూ.2.5 లక్షల మొత్తం వరకు చెల్లించే చందాపై వడ్డీకి మినహాయింపు ఇచ్చి, మిగతా వడ్డీపై సదరు చందాదారు వార్షికాదాయం ఆధారంగా వర్తించే శ్లాబు ప్రకారం పన్ను విధించాలని ఆర్థిక శాఖ ప్రతిపాదించింది. 2018-19లో మొత్తం 4.5 కోట్ల మంది ఈపీఎఫ్ఓ చందాదారులు ఉండగా, ఇందులో 1.23 లక్షల మంది హెచ్‌ఎన్ఐలు. వీరు ప్రతి నెలా పెద్ద మొత్తంలో ఈపీఎఫ్ చందా చెల్లిస్తుండటంతో అధిక మొత్తంలో వడ్డీ వీరికే అందుతోంది. ఒక హెచ్‌ఎన్ఐ ఖాతాలో రూ.103 కోట్లు, మరో రెండు ఖాతాల్లో రూ.86 కోట్లు పోగైంది. తొలి 20 హెచ్‌ఎన్ఐ ఖాతాల్లోనే రూ.825 కోట్లు జమైంది. తొలి 100 హెచ్‌ఎన్ఐ ఖాతాల్లో మొత్తం రూ.2,000 కోట్లు ఉన్నట్లు అంచనా. హెచ్‌ఎన్ఐల సగటు ఖాతా మొత్తం రూ.5.92 కోట్లు ఉంది. దీనిపై ఏడాదికి రూ.50.3 లక్షల చొప్పున పన్నురహిత వడ్డీ ఇప్పటివరకు లభిస్తోంది. ఏప్రిల్ 1 నుంచి కొత్తగా జమయ్యే మొత్తాలకు మాత్రమే నూతన ప్రతిపాదన వర్తిస్తుంది.

అధిక వేతనాలు తీసుకుంటున్న ఉన్నతోద్యోగుల ఆదాయంపై పన్ను మినహాయింపును హేతుబద్ధీకరణ చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. ఈపీఎఫ్ చట్టం ప్రకారం నిర్బంధ చందా కింద వేతనం (మూలవేతనం, డీఏ)లో 12 శాతం ఉద్యోగి తన వాటాగా ఈపీఎఫ్‌లో జమ చేయాలి. అంతే మొత్తం యాజమాన్యం తన వాటా కింద చెల్లిస్తుంది. నిర్బంధ చందాకు అదనంగా భవిష్య అవసరాల కోసం స్వచ్ఛంద చందా (వాలంటరీ ప్రావిడెంట్ ఫండ్-వీపీఎఫ్) కింద ఉద్యోగి మూల వేతనానికి మించకుండా జమ చేసుకోవచ్చు.



https://ourstudycircle.in/upscpdf/

వీపీఎఫ్ కింద చెల్లించే మొత్తానికి నిర్బంధ చందాకు లభించే మాదిరే వడ్డీ, పన్నురాయితీ లభిస్తాయి. మిగతా పెట్టుబడుల కన్నా ఇక్కడ వడ్డీ ఎక్కువగా రావడం, వచ్చిన వడ్డీపై పన్ను రాయితీ ఉండటంతో కొందరు ఉద్యోగులు నిబంధనల మేరకు తమ వేతనంలో కొంత మొత్తాన్ని వీపీఎఫ్ కింద జమ చేస్తున్నారు. హెచ్చు వేతనం పొందుతున్న వారిలోనూ చాలా మంది ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆదాయపన్ను పరిధి రూ. 2.5 లక్షలుగా ఉండటంతో, భవిష్యనిధి చందాను తాజాగా ఆ మేరకు పరిమితం చేసినట్లుందని కార్మిక వర్గాలు పేర్కొంటున్నాయి.

- **అందుబాటు గృహరుణాలపై పన్ను మినహాయింపు :** అందుబాటు ధరల ఇళ్లను రుణంపై కొనుగోలు చేసుకునే వారికి 2021-22 బడ్జెట్‌లో ఊరట లభించింది. రూ. 45లక్షల లోపు అందుబాటు గృహాలపై తీసుకున్న ఇంటి రుణానికి సెక్షన్ 80ఈఈఏ కింద రూ. 1,50,000 వరకు చెల్లించే వడ్డీపై ప్రత్యేక ప్రోత్సాహకాన్ని మార్చి 31, 2022 వరకు పొడిగించారు. అంటే 2022 ఏడాది మార్చి వరకు ఇళ్ల కొనుగోలుపైనా ఈ ప్రయోజనాన్ని పొందొచ్చు. వాస్తవానికి ఇంటి రుణంపై వడ్డీ చెల్లింపులు రూ. 2లక్షల వరకు పన్ను మినహాయింపు గతంలో ఉండగా, దీనికి అదనంగా మరో రూ. 1.5లక్షలపైనా పన్ను మినహాయింపును సెక్షన్ 80ఈఈఏ కింద 2019 బడ్జెట్‌లో ప్రకటించారు. మొదటిసారి ఇంటి కొనుగోలు చేసుకునే వారు, అది కూడా రూ. 45లక్షల బడ్జెట్ మించని ఇళ్ల కొనుగోలుదారులకే ఈ ప్రయోజనం వర్తిస్తుంది. అంటే మొత్తం మీద ఇంటి రుణంపై ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా రూ. 3.5 లక్షల వడ్డీ చెల్లింపులపై పన్ను భారం లేకుండా చూసుకోవచ్చు. ఇది కాకుండా ఇంటి రుణం అసలుకు చేసే జమలు రూ. 1.5 లక్షలను సెక్షన్ 80సీ కింద చూపించుకునే అవకాశం కూడా ఉంది.

**ఇంటిపై పన్ను ప్రయోజనాలు :**

- **సెక్షన్ 80సీ –** ఇంటి రుణంలో అసలుకు (ప్రిన్సిపల్) చేసే చెల్లింపులు రూ. 1.5 లక్షల మొత్తాన్ని సెక్షన్ 80సీ కింద చూపించుకుని పన్ను మినహాయింపు పొందొచ్చు. కాకపోతే ఇంటిని స్వాధీనం చేసుకున్న నాటి నుంచి ఐదేళ్లలోపు విక్రయించకుండా ఉంటేనే ఈ మినహాయింపులకు అర్హులు. ఒకవేళ విక్రయిస్తే తిరిగి పన్ను చెల్లించాల్సి వస్తుంది.
- **సెక్షన్ 24బీ –** ఇంటి రుణంపై వడ్డీ చెల్లింపులు రూ. 2లక్షల మొత్తంపై ఒక ఆర్థిక సంవత్సరంలో పన్ను మినహాయింపును కోరొచ్చు. కాకపోతే నూతన ఇల్లు కొనుగోలు/నిర్మాణం అన్నది రుణం తీసుకున్న ఆర్థిక సంవత్సరం నుంచి ఐదేళ్లలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది.
- **సెక్షన్ 80ఈఈ –** ఈ సెక్షన్ కింద రూ.50,000 వడ్డీ చెల్లింపులపై అదనపు పన్ను మినహాయింపునకు అవకాశం ఉంది. కాకపోతే రుణం రూ. 35 లక్షలకు మించకూడదు. ప్రాపర్టీ విలువ రూ. 50లక్షలు మించకూడదు.
- **సెక్షన్ 80ఈఈఏ –** రూ. 45 లక్షలకు మించని, మొదటిసారి ఇల్లు కొనుగోలుపై సెక్షన్ 80ఈఈఏ కింద అదనంగా (24బీకి అదనంగా) మరో రూ. 1.5 లక్షల వడ్డీ చెల్లింపులపైనా పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. కాకపోతే ఈ సెక్షన్ కింద క్లెయిమ్ చేసుకునే వారు సెక్షన్80ఈఈ కింద క్లెయిమ్ చేసుకునేందుకు అవకాశం ఉండదు.
- **సెక్షన్80సీ –** ఈ సెక్షన్ కింద స్టాంప్ డ్యూటీ చెల్లింపులు రూ. 1.5లక్షల మొత్తంపై పన్ను మినహాయింపు పొందొచ్చు. చెల్లింపులు చేసిన ఆర్థిక సంవత్సరానికే క్లెయిమ్ చేసుకునే అర్హత ఉంటుంది.

**ఆర్థిక సంవత్సరం 2021-22 (మదింపు సంవత్సరం 2022-23)కు సంబంధించి వర్తించే శ్లాబులు...**

**(వివిధ సెక్షన్ల కింద మినహాయింపులను వాడుకున్నప్పుడు)**

| ఆదాయం | 60ఏళ్ల లోపు వారికి | 60-80 ఏళ్ల వారికి | 80ఏళ్లు వయసున్న వారికి |
|---|---|---|---|
| రూ. 2,50,000 వరకు | పన్ను లేదు | పన్నులేదు | పన్ను లేదు |
| రూ. 2,50,001-రూ. 3,00,000 | 5% | పన్నులేదు | పన్నులేదు |
| రూ. 3,00,001-రూ. 5,00,000 | 5% | 5% | పన్నులేదు |
| రూ. 5,00,001-రూ. 10,00,000 | 20% | 20% | 20% |
| రూ. 10లక్షల పైన | 30% | 30% | 30% |

**ఆర్థిక సంవత్సరం 2021-22 (మదింపు సంవత్సరం 2022-23)కు సంబంధించి ఎలాంటి మినహాయింపులు వాడుకోని వారికి వర్తించే శ్లాబులు**

| ఆదాయం | వర్తించే శ్లాబులు |
|---|---|
| రూ. 2,50,000 వరకు | పన్నులేదు |
| రూ. 2,50,001-రూ. 5,00,000 వరకు | 5% |
| రూ. 5,00,001-రూ. 7,50,000 వరకు | 10% |
| రూ. 7,50,001-రూ. 10,00,000 వరకు | 15% |
| రూ. 10,00,001-రూ. 12,50,000 వరకు | 20% |
| రూ. 12,50,001-రూ. 15,00,000 వరకు | 25% |
| రూ. 15,00,001 ఆపైన | 30% |

## 2. పరోక్ష పన్నులు:

**వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి.): ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలు:**

- రిటర్నులు లేనపుడు ఎస్.ఎం.ఎస్. ద్వారా దాఖలు
- చిన్న పన్ను చెల్లింపుదార్లకు త్రైమాసిక, నెలసరి చెల్లింపు విధానం
- ఎలక్ట్రానిక్ ఇన్వాయిస్ వ్యవస్థ
- క్రమబద్ధీకరించిన ఇన్ పుట్ పన్ను ప్రకటన
- సవరణకు వీలున్న ముందస్తు జి.ఎస్.టి. రిటర్న్ల వివరాలు
- రిటర్న్ దాఖలులో అస్థిరత తొలగింపు
- వస్తుసేవలపన్ను వ్యవస్థ పరిధిని విస్తరించడం
- పన్ను ఎగవేతదార్ల గుర్తింపుకోసం విశ్లేషణాత్మక పద్ధతులు, కృత్రిమ మేధో పరిజ్ఞాన ప్రక్రియల వినియోగం

**కస్టమ్స్ సుంకం హేతుబద్ధీకరణ:**

- **జంట లక్ష్యాలు:** స్వదేశీ తయారీని ప్రోత్సహించి, ప్రపంచ స్థాయి విలువల వ్యవస్థలో భారత్ స్థానం సంపాదించేలా, మెరుగైన ఎగుమతులు సాధించేలా కృషి.
- కాలదోషం పట్టిన 80 మినహాయింపులను ఇప్పటికే తొలగించారు.
- సవరించిన, వక్రీకరణకు అవకాశం లేని కస్టమ్స్ సుంకం వ్యవస్థను 2021, అక్టోబరు 1 నుంచి అమలుచేసేందుకు చర్యలు. 400కు పైగా పాత మినహాయింపులను సమీక్షించడం ద్వారా ఈ కొత్త సుంకం వ్యవస్థకు రూపకల్పన
- కస్టమ్స్ సుంకంలో కొత్త మినహాయింపులకు మార్చి 31వరకూ చెల్లుబాటయ్యే అవకాశం. జారీ తేదీ నుంచి రెండేళ్ల అమలు.



https://ourstudycircle.in/upscpdf/

- **ఎలక్ట్రానిక్ పరిశ్రమ, మొబైల్ ఫోన్ పరిశ్రమ:** మొబైల్ చార్జర్ల విడిభాగాలు, మొబైళ్ల విడిభాగాలపై కొన్ని మినహాయింపులను ఉపసంహరించారు. కొన్ని మొబైల్ విడిభాగాలపై ఇది వరకు సున్నా రేటున్న సుంకాన్ని 2.5 శాతం వరకు హెచ్చించారు.
- **ఇనుము, ఉక్కు:** మిశ్రమ లోహాలు, మిశ్రమేతర లోహాలు, స్టెయిన్ లెస్ స్టీల్ వంటి వాటితో తయారైన ఉత్పత్తులపై కస్టమ్స్ సుంకాన్ని ఏకరూపంగా 7.5 శాతం వరకూ పెంచారు. ఉక్కు రద్దీపై సుంకాన్ని మినహాయించారు. 2022 మార్చి నెలాఖరు వరకూ వర్తించేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. కొన్ని ఉక్కు ఉత్పాదనలపై యాంటీ డంపింగ్ సుంకాన్నీ (ఎ.డి.డి.ని), కౌంటర్ వీలింగ్ సుంకాన్ని (సి.వి.డి.ని) రద్దు చేశారు. రాగి రద్దీపై సుంకాన్ని 5 శాతం నుంచి 2.5శాతానికి తగ్గించారు.
- **టెక్స్‌టైల్స్:** కాప్రోలాక్టమ్, నైలాన్ చిప్స్, నైలాన్ ఫైబర్, నూలు వంటి వాటిపై మౌలిక కస్టమ్స్ సుంకాన్ని (బి.సి.డి.ని) 5 శాతానికి తగ్గించారు.
- **రసాయనాలు:** రసాయనాలపై స్వదేశీ విలువల జోడింపును ప్రోత్సహించేందుకు, అస్థిరతను తొలగించేందుకు రసాయనాలపై క్రమాంకణ కస్టమ్స్ సుంకం రేట్ల అమలు. నాప్తాపై సుంకం 2.5శాతానికి తగ్గింపు.
- **బంగారం, వెండి:** బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకాన్ని హేతబద్ధం చేయనున్నారు.
- **పునరుత్పత్తి విద్యుత్తు:** సోలార్ సెల్స్, సోలార్ ప్యానెళ్ల దశలవారీ తయారీ ప్రణాళికను నోటిపై చేయడం. స్వదేశీ తయారీకి ప్రోత్సాహం కోసం సోలార్ ఇన్వర్టర్లపై సుంకం 5 శాతం నుంచి 20 శాతానికి హెచ్చింపు. సోలార్ లాంతర్లపై సుంకం 5 శాతం నుంచి 15 శాతానికి హెచ్చింపు.
- **క్యాపిటల్ పరికర సామగ్రి:** టన్నెల్ బోరింగ్ యంత్రంపై ఇక 7.5 శాతం కస్టమ్స్ సుంకం, యంత్రం విడిభాగాలపై డ్యూటీ 2.5 శాతం. కొన్ని ఆటోమొబైల్ విడిభాగాలపై సుంకం 15 శాతం సాధారణ రేటు స్థాయికి పెంపు.
- **సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల(ఎం.ఎస్.ఎం.ఇ.) ఉత్పాదనలు:** స్టీల్ స్క్రూలు, ప్లాస్టిక్ బిల్డర్ వేర్ పరికరాలపై సుంకం 15 శాతానికి హెచ్చింపు. రొయ్యల ఫీడ్‌పై ఇదివరకు 5శాతం ఉన్న కస్టమ్స్ సుంకం 15 శాతానికి హెచ్చింపు. దుస్తులు, తోళ్లు, చేతిపని వస్తువులు వంటి వాటి ఎగుమతిదార్లకు ప్రోత్సహకాలు అందించేందుకు వీలుగా, సుంకంలేని వస్తువుల దిగుమతికి మినహాయింపు వ్యవస్థను హేతుబద్ధం చేశారు. స్వదేశీ జెమ్స్ ప్రాసెసింగ్ ప్రక్రియను ప్రోత్సహించేందుకు సింథటిక్స్ జెమ్ స్టోన్స్‌పై కస్టమ్స్ సుంకం హెచ్చింపు.
- **వ్యవసాయ ఉత్పాదనలు:** నూలుపై కస్టమ్స్ సుంకం సున్నా స్థాయి నుంచి పది శాతానికి హెచ్చింపు. ముడి పట్టు, పట్టు దారంపై సుంకం 10 నుంచి 15 శాతానికి హెచ్చింపు.

## ఇతర అంశాలు

### పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ.1.75 లక్షల కోట్లు

ప్రభుత్వ రంగ కంపెనీలు, ఫైనాన్షియల్ రంగ సంస్థలలో వాటాల విక్రయం ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరం (2021-22)లో రూ. 1.75 లక్షల కోట్లను సమకూర్చుకోవాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించారు. గత బడ్జెట్‌లో ప్రతిపాదించిన పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్) లక్ష్యం రూ. 2.10 లక్షల కోట్లతో పోలిస్తే తాజా ప్రతిపాదనలు రూ. 35,000 కోట్లు తక్కువకావడం గమనార్హం. అయితే కేంద్ర ప్రభుత్వ సంస్థల(సీపీఎస్ఈలు) వాటా విక్రయంపై కోవిడ్-19 ప్రతికూల ప్రభావం చూపడంతో ఈ ఏడాది డిజిన్వెస్ట్‌మెంట్ అంచనాలను తాజాగా రూ.32,000 కోట్లమేర తగ్గించింది. కాగా.. 2020-21 ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకూ సీపీఎస్ఈలలో వాటాల విక్రయం, షేర్ల బైబ్యాక్ ద్వారా రూ.19,499 కోట్లు మాత్రమే సమీకరించింది. వచ్చే ఏడాది లక్ష్యంగా పెట్టుకున్న రూ.1.75 లక్షల కోట్లలో రూ. లక్ష కోట్లను ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఫైనాన్షియల్ కంపెనీలలో వాటాల విక్రయం ద్వారా సమకూర్చుకోవాలని ఆర్థిక శాఖ భావిస్తోంది. ఈ బాటలో సీపీఎస్ఈల డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా మరో రూ. 75,000 కోట్లను సమీకరించేందుకు ప్రతిపాదించింది. ఈసారి డిజిన్వెస్ట్‌మెంట్ వ్యూహంలో భాగంగా నాలుగు రంగాలను ఎంపిక చేసినట్లు ఆర్థిక మంత్రి సీతారామన్ పేర్కొన్నారు. అణు ఇంధనం(ఆటమిక్ ఎనర్జీ), అంతరిక్షం, రక్షణ, రవాణా, టెలికమ్యూనికేషన్స్, విద్యుత్, పెట్రోలియం, బొగ్గు, ఇతర మినరల్స్, బ్యాంకింగ్, బీమా, ఫైనాన్షియల్ సర్వీసెస్‌లను ప్రస్తావించారు. తాజా ప్రతిపాదనల ప్రకారం వ్యూహాత్మక రంగాలలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్రను నామమాత్రం చేయనున్నారు. ఈ రంగాలలో మిగిలిన సీపీఎస్ఈలను ప్రయివేటైజ్ చేయడం లేదా విలీనం లేదా అనుబంధ సంస్థలుగా మార్చడం వంటి అంశాలకు తెరతీయనున్నారు. ఇలాకాకుంటే వీటిని మూసివేస్తారు. బీపీసీఎల్, ఎయిర్ ఇండియా, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఐడీబీఐ బ్యాంకు, బీఈఎంఎల్, పవన్ హన్స్, నీలాచల్ ఇస్పాత్ నిగమ్..తదితర ప్రభుత్వ రంగ సంస్థలో వాటా విక్రయాలను వచ్చే ఆర్థిక సంవత్సరం(2021-22)లో చేపడతారు.ఐడీబీఐ బ్యాంక్ సహా మరో రెండు పీఎస్‌యూ బ్యాంకులు, ఒక సాధారణ బీమా కంపెనీని ప్రైవేటైజ్ చేసేందుకు ప్రతిపాదించినట్లు ఆర్థిక మంత్రి తెలియజేశారు.

- **ఆస్తుల విక్రయానికి ప్రత్యేక కంపెనీ:** వినియోగంలోలేని ఆస్తులు ఆత్మనిర్భర్ భారత్‌కు సహకరించవని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. కీలకంకాని ఆస్తుల జాబితాలో ప్రభుత్వ శాఖలు, పీఎస్‌యూల వద్ద గల మిగులు భూములు అధికంగా ఉన్నట్లు వెల్లడించారు. వీటి ప్రత్యక్ష విక్రయం లేదా ఇతర విధానాలలో మానిటైజేషన్‌కు వీలుగా ఒక ప్రత్యేక కంపెనీ(ఎస్‌పీవీ)ను ఏర్పాటుకు ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు.
- **2021-22లో ఎల్ఐసీ లిస్టింగ్ :** వచ్చే ఏడాది(2021-22)లో ప్రభుత్వ రంగ దిగ్గజం ఎల్ఐసీ పబ్లిక్ ఇష్యూని చేపట్టనున్నట్లు సీతారామన్ పేర్కొన్నారు. ఈ బాటలో ప్రభుత్వం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకు అవసరమైన చట్ట సవరణలను ప్రవేశపెడుతున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో తాజాగా ఆర్థిక మంత్రి తెలియజేశారు. జీవిత బీమా బ్లూచిప్ కంపెనీ ఎల్ఐసీలో ప్రభుత్వానికి ప్రస్తుతం 100 శాతం వాటా ఉంది. ఎల్ఐసీ స్టాక్ మార్కెట్లో లిస్టయితే రూ. 8-10 లక్షల మార్కెట్ విలువను సాధించగలదని విశ్లేషకుల అంచనా. తద్వారా దేశీయంగా అత్యంత విలువైన కంపెనీగా నిలిచే వీలున్నట్లు నిపుణులు భావిస్తున్నారు.
- **ఎయిర్ ఇండియా విక్రయం :** ఎయిర్ ఇండియాలో పెట్టుబడుల విక్రయాన్ని 2021-22లో పూర్తి చేయనున్నట్లు ఆర్థిక మంత్రి వెల్లడించారు. దీని కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సంస్థ (ఎస్‌పీవీ), ఎయిర్ ఇండియా అస్సెట్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు రూ.2,268 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.



https://ourstudycircle.in/upscpdf/

### బీమా రంగంలో 74 శాతానికి ఎఫ్‌డీఐల పరిమితి పెంపు



బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) 74 శాతానికి పెంచే ప్రతిపాదనను బడ్జెట్‌లో భాగంగా ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. భారతదేశంలో బీమా ఉత్పత్తుల విస్తరణ ప్రపంచ దేశాలతో పోలిస్తే తక్కువగా ఉండడంతో మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షించే ఉద్దేశ్యంతో కేంద్రం ఈ ప్రతిపాదన తీసుకొచ్చింది. ఇందుకోసం చట్టసవరణ చేస్తారు. తద్వారా విదేశీ సంస్థలు, వ్యక్తులు భారత్‌లోని బీమా కంపెనీల యాజమాన్యాన్ని చేపట్టేందుకు మార్గం ఏర్పడనున్నది. ఎఫ్‌డీఐ పెంపు అనంతరం కూడా బీమా కంపెనీల బోర్డుల్లో మెజారిటీ డైరెక్టర్లు, యాజమాన్యంలో కీలకమైన వ్యక్తులు అందరూ భారతీయులే ఉండాలన్న 'కంపెనీ నిర్మాణాన్ని' ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తావించారు. బీమా చట్టం 1938ను సవరించడం ద్వారా బీమా కంపెనీల్లో ఎఫ్‌డీఐ పరిమితిని ప్రస్తుత 49% నుంచి 74%కి పెంచాలని ప్రతిపాదిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. బీమా రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని చివరిగా 2015లో అప్పటి వరకు ఉన్న 26 శాతం నుంచి 49 శాతానికి పెంచడం జరిగింది. మన దేశంలో జీవిత బీమా ఉత్పత్తుల వ్యాప్తి జీడీపీలో 3.6 శాతంగా ఉండగా, ప్రపంచ సగటు 7.13 శాతంతో పోలిస్తే తక్కువలో ఉండడం గమనార్హం. అదే సాధారణ బీమా విషయంలో ప్రపంచ సగటు 2.88 శాతం అయితే, భారతదేశంలో మాత్రం వ్యాప్తి 0.94 శాతంగానే ఉంది.

- ప్రస్తుతం ప్రైవేటు రంగంలో 23 జీవిత బీమా కంపెనీలు, 28 సాధారణ బీమా/ ఆరోగ్య బీమా కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ప్రభుత్వ రంగంలో ఎల్ఐసీ ఒక్కటే జీవిత బీమా సంస్థ. ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీలు 4 ఉన్నాయి.

## 2021-22 బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు కేటాయింపులు

### ఆంధ్రప్రదేశ్

2021-22 బడ్జెట్‌లో కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు పెద్దగా కేటాయింపులు చేయలేదు. విభజించి ఏడున్నరేళ్లవుతున్నా.. 2014-15 నాటికి ఇవ్వాల్సిన రెవెన్యూ లోటు భర్తీ ఇప్పటికీ లేదు. విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి మంజూరుచేసిన కేంద్రీయ విశ్వవిద్యాలయం అనంతపురంలోని జేఎన్‌టీయూలో ఒక భవనంలో నడుస్తోంది. దానికి 2020-21 బడ్జెట్‌లో రూ. 60.35 కోట్లు కేటాయించిన కేంద్రం.. సవరించిన అంచనాల్లో మాత్రం రూ. 4.80 కోట్లే చూపించింది. ఈ బడ్జెట్‌లో మళ్లీ రూ. 60.35 కోట్లు ప్రతిపాదించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గిరిజన వర్సిటీలకు కలిపి 2020-21 బడ్జెట్‌లో రూ. 53.80 కోట్లు కేటాయించిన కేంద్రం.. సవరించిన అంచనాల్లో దాన్ని రూ. 4కోట్లకే పరిమితం చేసింది. ఈ బడ్జెట్‌లో మళ్లీ రూ. 53.80 కోట్లు ప్రతిపాదించింది. వెనకబడిన జిల్లాల అభివృద్ధికి నిధుల కేటాయింపు గురించీ ఈ బడ్జెట్‌లో స్పష్టత లేదు. విశాఖపట్నం -చెన్నై, చెన్నై-బెంగళూరు పారిశ్రామిక నడవాల్లో పనులు వేగం పుంజుకునే దిశగా ఎలాంటి చర్యలనూ, నిధులనూ ప్రకటించలేదు. రాష్ట్రానికి అంతర్జాతీయ విమాన సర్వీసులను పెంచే దిశగా చర్యలూ లేవు. రాష్ట్రంలో ఎంతగానో ఎదురుచూస్తున్న బల్క్‌డ్రగ్ పార్క్, ఇతర పరిశ్రమల గురించిన ప్రస్తావన లేదు. ఒక్క కేంద్ర ప్రభుత్వ సంస్థనుగానీ, విద్యాసంస్థనుగానీ రాష్ట్రానికి ప్రకటించలేదు.

### ఏపీకి రూ. 15,858 కోట్ల విదేశీరుణం

రాష్ట్రంలోని 10 ప్రాజెక్టులకు విదేశీ ఆర్థిక సంస్థల నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ. 15,858 కోట్ల రుణాన్ని కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఇందులో రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య వ్యవస్థ బలోపేతానికి ఇంటర్నేషనల్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ నుంచి రూ. 9,772.15 కోట్ల రుణం అందనుంది.

### పోలవరం ప్రాజెక్టుకు మూడేళ్లలో రూ.5,484 కోట్లు

పోలవరం ప్రాజెక్టుకు మూడేళ్లలో రూ. 5,484.29 కోట్లు ఇచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2018-19లో రూ. 1,400 కోట్లు, 2019-20లో రూ. 1,850 కోట్లు, 2020-21లో రూ. 2,234.29 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొంది.

- పోలవరాన్ని కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినప్పటికీ నాబార్డు నుంచి చాలినంత రుణం అందడం లేదు. కేంద్ర బడ్జెట్‌లోనూ కేటాయింపులు చూపడం లేదు. తాజాగానూ నిరాశే ఎదురైంది. 2014లో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక కేంద్రం ఇంతవరకు రూ. 10,741 కోట్లు మాత్రమే ఇచ్చింది. 2017-18 ధరల ప్రకారం ఈ ప్రాజెక్టుకు రూ. 55,656.87 కోట్లు ఖర్చవుతుందని కేంద్ర జలసంఘం తేల్చింది. మరోవైపు ఏడాదికి 2వేల కోట్లకు మించి కేంద్ర ప్రభుత్వం నిధులివ్వడం లేదు.
- 2017-18 ధరల ప్రకారం నీటిపారుదల విభాగానికి రావాల్సిన నిధులు: రూ. 51,005.96 కోట్లు.
- జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించకముందు ఖర్చు - రూ. 4,730.71 కోట్లు. రావాల్సిన నిధులు - రూ. 46,365.25 కోట్లు.
- జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక కేంద్రం ఇచ్చిన నిధులు - రూ. 10,741.46 కోట్లు, ఇంకా అవసరమైన నిధులు - రూ. 35623.79 కోట్లు
- రాష్ట్రం ఖర్చు చేసి ఇంకా కేంద్రం నుంచి రావాల్సినవి - రూ. 1,652.02 కోట్లు.
- 2019-20 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం ఇచ్చింది - రూ. 1,850 కోట్లు.
- 2020-21 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం ఇచ్చింది - 2234.22 కోట్లు.

### 5,982 ఉప ఆరోగ్య కేంద్రాల స్థాయి పెంపు

కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్న దాని ప్రకారం 2021-22 ఆర్థిక సంవత్సరానికి అదనంగా 5,982 ఉప ఆరోగ్య కేంద్రాలను హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలుగా మార్చే అవకాశాలున్నాయి. బడ్జెట్ ద్వారా తొలివిడత కింద రూ. 154 కోట్ల వరకు రాష్ట్రానికి అందే అవకాశం ఉంది. ప్రతి కేంద్రంలో బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులు రోగులకు సేవలు అందిస్తారు. 14 రకాల పరీక్షలు, 64 రకాల మందులు అనారోగ్యాలతో బాధపడే వారికి అందుబాటులోకి వస్తాయి. ప్రతి నెలకు ఒక్కో ఉప ఆరోగ్య కేంద్రానికి వేతనాల చెల్లింపులకు రూ. 40,000, ఇతర ఖర్చుల కోసం రూ. 15,000 వరకు కేంద్రం ఇస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 4,050 ఉప ఆరోగ్య కేంద్రాల స్థాయి (హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలు) పెంపు వివిధ దశల్లో ఉంది. ఎంపికచేసిన బీఎస్సీ నర్సింగ్ వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారిని (బీపీ, మధుమేహం, రక్తహీనత, ఇతర) సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తారు. దీనికి సంబంధించిన సర్వే రాష్ట్రంలో కొనసాగుతోంది. మరోవైపు రాష్ట్రంలో 7 బోధనాసుపత్రులు, ఏడు సీహెచ్‌సీల్లో ట్రామాకేర్ సెంటర్లు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్రం ప్రకటించిన 'క్రిటికల్ కేర్ హాస్పిటల్స్ బ్లాక్స్'కు నిధులు వచ్చినట్లయితే.. అదనంగా వైద్యులు, మౌలిక సదుపాయాలు, చికిత్స అందించేందుకు అవసరమైన ఆధునిక పరికరాలు అందుబాటులోకి వస్తాయి.



https://ourstudycircle.in/upscpdf/

## రాష్ట్రంలో మూడుఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టులు

రాష్ట్రంలో మూడు ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టుల నిర్మాణ పనులు వచ్చే ఆర్థిక సంవత్సరం(2021-22) నుంచి మొదలుకానున్నాయి. గతంలోనే ఇవి మంజూరుకాగా, డీపీఆర్‌లు సిద్ధం చేసి పంపారు. వీటి పనులు వచ్చే ఆర్థిక సంవత్సరం(2021-22)లో ఆరంభించనున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర పరిధిలో దాదాపు 278 కి.మీ. మేర ఎక్స్‌ప్రెస్‌వేల పనులు మొదలుకానున్నాయి.

- విశాఖపట్నం నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ వరకు 464 కి.మీల ఆరు వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే. ఈ రహదారి మన రాష్ట్రంలో 100 కి.మీ ఉంటుంది. విశాఖ జిల్లాలోని సబ్బవరం వద్ద మొదలై విజయనగరం జిల్లా కొత్తవలస, విజయనగరం, సాలూరు సమీపం నుంచి ఒడిశా సరిహద్దుకు వెళ్తుంది.
- 275 కి.మీల మేర చేపట్టనున్న బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ వే మన రాష్ట్రంలో 95 కి.మీ. మేర ఉంటుంది. ఈ రహదారి చిత్తూరు జిల్లా పరిధిలో వి.కోట, బైరెడ్డిపల్లి, పలమనేరు, బంగారుపాళ్యం, యాదమర్రి, చిత్తూరు, గుడిపాల మండలాల మీదుగా వెళ్తుంది.
- చిత్తూరు నుంచి చెన్నై సమీపంలోని తచ్చూరు వరకు 123 కి.మీ. మేర ఆరు వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ పనులు కూడా వచ్చే ఏడాది మొదలు కానున్నాయి. ఇది మన రాష్ట్ర పరిధిలో 83 కి.మీ ఉంటుంది. చిత్తూరు నుంచి జీడీ నెల్లూరు, ఎస్ఆర్ పురం, నగరి, నింద్ర, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల మీదుగా వెళ్తుంది.

## విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి రూ.595 కోట్లు

కేంద్ర ఉక్కు శాఖ తాజా బడ్జెట్‌లో విశాఖపట్నంలోని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌కు (విశాఖ ఉక్కు కర్మాగారానికి) రూ.595 కోట్లు కేటాయించింది. గత ఏడాది(2020-21) బడ్జెట్‌లో కేటాయించిన రూ.1385 కోట్లతో పోలిస్తే ఈసారి రూ.790 కోట్లు తగ్గించారు. గత బడ్జెట్‌లో రూ. 1,385 కోట్లు కేటాయించిన ప్రభుత్వం సవరించిన అంచనాల నాటికి రూ.534 కోట్లకు తగ్గించింది. అంటే గత బడ్జెట్‌లోనే దాదాపు రూ.851 కోట్లు కోతపెట్టింది. ఈసారి బడ్జెట్‌ను కేవలం రూ.595 కోట్లకు పరిమితం చేసింది.

## తెలంగాణ

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2021-22 వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రానికి సంబంధించిన ఒక్క ప్రతిపాదన కూడా కనిపించలేదు. మొత్తంమీద కేంద్ర బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి నిరాశను మిగిల్చింది. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చే పన్నుల వాటా మళ్లీ తగ్గడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నివేదించిన అంశాలకు నిధుల తోడ్పాటు లభించలేదు. 15వ ఆర్థిక సంఘం కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని వివిధ అంశాల ప్రాతిపదికగా ప్రశంసించినా మిషన్ భగీరథకు మినహా ఇతర అంశాలకు ఆర్థిక సాయం ప్రతిపాదించలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే పన్నుల వాటా పెరగకపోగా తగ్గడం రాష్ట్ర ఖజానాకు భారాన్ని పెంచనుంది.

## సింగరేణి కాలరీస్‌కు రూ. 2500 కోట్లు

సింగరేణి బొగ్గు గనులకు కేంద్ర ప్రభుత్వం 2021-22 బడ్జెట్‌లో రూ.2,500 కోట్లు కేటాయించింది. గత ఏడాది(2020-21) బడ్జెట్ కేటాయింపుల కంటే ఇది రూ.200 కోట్లు అధికం. ఈ మొత్తాన్ని పూర్తిగా మూలధనం కోసమే ఉపయోగిస్తారని కేంద్ర బొగ్గుశాఖ పేర్కొంది.

## తెలంగాణలోని వివిధ సంస్థలకు బడ్జెట్‌లో కేటాయింపులు వివరాలు

- ఐఐటీ హైదరాబాద్‌కు ఈఏపీ కాంపోనెంట్ కింద రూ. 150 కోట్లు.
- దేశవ్యాప్తంగా ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ హిందీకి రూ.30 కోట్లు కేటాయించారు. ఇందులో హైదరాబాద్ కేంద్రమూ ఉంది.
- హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా సీడాక్‌లకు కలిపి రూ.200 కోట్లు
- హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా ఉన్న సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి రూ.80 కోట్లు.
- నేషనల్ ఫిషరీస్ బోర్డుకు రూ.23.84 కోట్లు.
- హైదరాబాద్, గోవా విముక్తి పోరాటంలో పాల్గొన్న స్వాతంత్ర సమరయోధులు, అండమాన్ రాజకీయ ఖైదీలకు పింఛను కోసం రూ.775.31 కోట్లు.
- హైదరాబాద్ పోలీస్ అకాడమీ సహా దేశంలోని వివిధ పోలీసు శిక్షణ కేంద్రాలకు రూ.300.72 కోట్లు.
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్‌కు రూ.124 కోట్లు.
- డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ డయాగ్నస్టిక్స్ కేంద్రం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అనిమల్ బయోటెక్నాలజీతో పాటు దేశంలోని పలు స్వయంప్రతిపత్తి సంస్థలకు రూ.806 కోట్లు.
- సాలార్‌జంగ్‌తో సహా దేశంలోని వివిధ మ్యూజియాలకు రూ.293 కోట్లు కేటాయించారు.

## విభజన హామీల ప్రస్తావన లేని బడ్జెట్


ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం రాష్ట్రాలకు రావాల్సిన ప్రాజెక్టులు, నిధుల విషయంలో కేంద్రం స్పష్టత ఇవ్వలేదు. ఆర్థిక సంఘం సిఫారసు మేరకు కేంద్ర పన్నుల్లో వాటాను తగ్గించిన కేంద్ర ప్రభుత్వం అదే ఆర్థిక సంఘం రాష్ట్రానికి సిఫారసు చేసిన స్పెషల్ గ్రాంటును విస్మరించింది. రూ. 730 కోట్ల స్పెషల్ గ్రాంటుతోపాటు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి 2019 నుంచి ఇవ్వాల్సిన రూ.900 కోట్లు, నీతి ఆయోగ్ మిషన్ భగీరథకు సిఫారసు చేసిన వేల కోట్ల రూపాయల గురించి ప్రస్తావించలేదు.

- విభజన హామీలైన బయ్యారం ఉక్కు పరిశ్రమ వంటి వాటి ప్రస్తావన లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు అందే పన్నుల వాటాను 50 శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంఘాన్ని కోరినా 42 శాతానికే అది పరిమితమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2020-21)లో కేంద్రం నుంచి పన్నుల వాటాగా రూ.16,726 కోట్లు వస్తుందని గత బడ్జెట్‌లో పేర్కొనగా అది రూ.11,731 కోట్లకే పరిమితమైంది. కేంద్ర పన్నుల వాటాలో సుమారు ఐదు వేల కోట్ల రూపాయలు తగ్గడం రాష్ట్రంపై భారాన్ని పెంచింది. అందుకే కొత్త బడ్జెట్‌లో ఆర్థికశాఖ రూ.13,990 కోట్లే ప్రతిపాదించింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి వచ్చే పన్ను వాటాల్లో రాష్ట్రానికి అత్యధికంగా జీఎస్‌టీ కింద రూ.4,520.30 కోట్లు, ఆదాయపన్ను కింద రూ.4,136.29 కోట్లు, కార్పొరేట్ ట్యాక్స్ కింద రూ.4,070 కోట్లు, కస్టమ్స్ కింద రూ.845.34 కోట్లు, ఎక్సైజ్‌డ్యూటీ కింద రూ.409.37 కోట్లు, సేవా పన్ను కింద రూ.8.62 కోట్లు దక్కనున్నాయి.



https://ourstudycircle.in/upscpdf/

# రూ.1.10 లక్షల కోట్లతో 2021-22 రైల్వే బడ్జెట్



2021-22 ఆర్థిక సంవత్సరానికిగాను రైల్వేలకు రూ.1,10,055 కోట్ల బడ్జెట్‌ను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. ఇందులో రూ.1,07,100 కోట్లు మూలధన వ్యయంగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే బడ్జెట్‌లో భవిష్యత్తు అవసరాలపై ఎక్కువగా దృష్టి పెట్టింది. 'జాతీయ రైల్వే ప్రణాళిక - 2030'ను దృష్టిలో పెట్టుకుని ఈ కేటాయింపులు జరిపినట్లు ఆర్థికమంత్రి తెలిపారు. 2030 కల్లా భవిష్యత్ అవసరాలకు తగిన (ఫ్యూచర్ రెడీ) రైల్వే వ్యవస్థను సృష్టించడం ప్రధాన లక్ష్యంగా భారత జాతీయ రైల్వే ప్రణాళిక 2030కి రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా.. భారత్‌లో తయారీ(మేక్ ఇన్ ఇండియా) వ్యూహానికి ప్రోత్సాహం ఇచ్చేలా పరిశ్రమల రవాణా వ్యయాన్ని తగ్గించేందుకు వీలుగా.. 2022 జూన్ కల్లా తూర్పు, పశ్చిమ ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు (డీఎఫ్‌సీ) ప్రారంభించాలని నిర్ణయించారు.

### రైల్వే బడ్జెట్ ముఖ్యాంశాలు

- రైల్వేకు మొత్తం కేటాయింపు రూ. 1,10,055 కోట్లు.
- మూలధన వ్యయం రూ. 1,07,100 కోట్లు.
- 2022 జూన్‌కల్లా తూర్పు, పశ్చిమ ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు
- భవిష్యత్తులో ఖరగ్‌పూర్ - విజయవాడ ఈస్ట్ కోస్ట్ కారిడార్, ఇటార్సీ - విజయవాడ నార్త్ సౌత్ కారిడార్, భూసావాల్-ఖరగ్‌పూర్-దాంకుని ఈస్ట్ వెస్ట్ కారిడార్‌లు నిర్మించనున్నారు.
- 2020 అక్టోబర్ 1 నాటికి 41,548 రూట్ కిలోమీటర్లు (ఆర్‌కేఎం)గా ఉన్న బ్రాడ్ గేజ్ రూట్ విద్యుద్దీకరణ 2021 చివరినాటికి 46,000 రూట్ కిలోమీటర్లకు (72 శాతం) చేరుకుంటుంది. 2023 కల్లా 100 శాతం విద్యుద్దీకరణ పూర్తవుతుంది.
- మానవ తప్పిదాల కారణంగా రైళ్లు ఢీకొనడం వంటి ప్రమాదాలు నివారించేందుకు దేశీయంగా డిజైన్ చేసిన ఆటోమేటిక్ వ్యవస్థ ప్రవేశపెట్టనున్నారు.
- 2020-21 బడ్జెట్‌లో బెంగళూరుకు సబర్బన్ రవాణా రైల్వే ప్రాజెక్టుకు రూ. 18,600 కోట్లు ప్రతిపాదించారు. 2021-22 బడ్జెట్‌లో బెంగళూరు మెట్రో ప్రాజెక్టు విస్తరణకు రూ. 14,778 కోట్లు కేటాయించారు. చెన్నై మెట్రో ప్రాజెక్టు రెండో దశకు రూ. 63,246 కోట్లు, కొచ్చి మెట్రో రెండో దశకు రూ. 1,957 కోట్లు కేటాయించారు. నాగ్‌పూర్ మెట్రోకు రూ. 5,976 కోట్లు, నాసిక్ మెట్రోకు రూ. 2,092 కోట్లు కేటాయించారు.
- 'నూతన భారతం-నూతన రైల్వే' అన్న విధానం కింద ఈ రంగంలో ప్రైవేటు సంస్థలకు ఆమోదం తెలిపారు. 150 ఆధునిక రైళ్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు చేపట్టిన టెండర్ల ప్రక్రియ రానున్న 2021 మే నాటికి పూర్తి కానుంది.
- గత బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా కిసాన్ రైళ్లు ప్రారంభమయ్యాయి. 2021 జనవరి 8వ తేదీ నాటికి 120 ట్రిప్పులు తిరిగి 34వేల టన్నుల సరకులు రవాణా చేశాయి.
- కరోనా కారణంగా రైళ్ల సేవలను నిలిపివేయడంతో టైమ్ టేబుల్ ఆధారంగా నడిచే ప్రత్యేక పార్శిల్ సేవల రైళ్లను నడిపింది. ఇలాంటి ప్రయోగం చేయడం ఇదే ప్రథమం. దీనివల్ల కొరియర్, ఈ-బిజినెస్ సంస్థలు లబ్ధి పొందాయి.
- గూడ్సు రైళ్ల కోసం ప్రత్యేకంగా నిర్మిస్తున్న లైన్లు (డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు-డీఎఫ్‌సీ) పూర్తయితే వాటి వేగం గంటకు 76 కి.మీ.వరకు ఉంటుంది.
- పశ్చిమ బెంగాల్‌లోని సోన్‌నగర్-దాంకుని సెక్షన్‌లో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రత్యేకంగా గూడ్సు లైను నిర్మాణం జరుగుతోంది.
- విద్యుదీకరణ ప్రస్తుతం 66 శాతం పూర్తి కాగా, 2023 నాటికి 100 శాతం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

### 2021 చివరి నాటికి బ్రాడ్‌గేజ్ రూట్ విద్యుదీకరణ

2020 అక్టోబర్ 1 నాటికి 41,548 రూట్ కిలోమీటర్లు (ఆర్‌కేఎం)గా ఉన్న బ్రాడ్ గేజ్ రూట్ విద్యుద్దీకరణ 2021 చివరి నాటికి 46,000 రూట్ కిలోమీటర్లకు (72%)చేరుకుంటుంది. 2023 కల్లా 100% విద్యుద్దీకరణ పూర్తవుతుంది. పర్యాటక రూట్లలో మెరుగైన, సౌకర్యవంతమైన ప్రయాణాలకు వీలుగా ఆకర్షణీయంగా డిజైన్ చేసిన విస్టా డోమ్ ఎల్‌హెచ్‌బీ రైల్వే కోచ్‌లను ప్రవేశపెట్టనున్నారు. మరోవైపు భద్రత వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. మానవ తప్పిదాల కారణంగా రైళ్లు ఢీకొనడం వంటి ప్రమాదాలు నివారించేందుకు దేశీయంగా డిజైన్ చేసిన ఆటోమేటిక్ వ్యవస్థను అన్ని ప్రధానమైన రూట్లలో ప్రవేశపెడతాం..అని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

### మెట్రో రైల్వే ఫేజ్ కోసం నిధులు

మెట్రో రైళ్ల విస్తరణలో భాగంగా చెన్నై మెట్రో రైల్వే ఫేజ్-2 కోసం రూ. 63,246 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులు కేటాయించారు. బెంగళూరు మెట్రో రైల్వే ఫేజ్ 2ఏ, 2బీ కోసం రూ. 14,788 కోట్లు, కొచ్చి మెట్రో రైల్వే ఫేజ్-2 కోసం 1,957.05 కోట్లు, నాగ్‌పూర్ మెట్రో రైల్వే ఫేజ్-2 కోసం రూ. 5,976 కోట్లు, నాసిక్ మెట్రో కోసం రూ. 2,092 కోట్లు ప్రకటించారు.

### ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థికమంత్రి తెలిపారు. గత కొన్నేళ్లుగా ప్రయాణికుల భద్రత కోసం చేపట్టిన రక్షణ చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. దీనిని మరింత ముందుకు తీసుకువెళ్లేలా రద్దీ ఎక్కువగా ఉండే మార్గాల్లో ఆటోమేటిక్‌గా గుర్తించే ఆధునిక సాంకేతిక వ్యవస్థను ప్రవేశపెడతాం. దీనివల్ల మానవ తప్పిదాల కారణంగా రైళ్లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనే ప్రమాదాలు తప్పుతాయి అని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పర్యాటక ప్రాంతాల్లో విస్టాడోమ్ కోచ్‌లను ప్రవేశపెడతామని తెలిపారు

# 15వ ఆర్థికసంఘం నివేదిక



2021-26 మధ్య ఐదేళ్ల కాలానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు అందాల్సిన పన్నుల వాటా, గ్రాంట్లను నిర్దేశిస్తూ 15వ ఆర్థిక సంఘం(ఫైనాన్స్ కమిషన్) చేసిన సిఫారసు నివేదికను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న 2021-22 బడ్జెట్ ప్రసంగం అనంతరం పార్లమెంటులో ప్రవేశపెట్టారు. 'కోవిడ్ కాలంలోని ఫైనాన్స్ కమిషన్' అన్న ప్రధాన శీర్షికతో రూపొందిన 15వ ఆర్థిక సంఘం నివేదిక 2021 ఏప్రిల్ 1 నుండి అమలుకానుంది. రాజ్యసభ మాజీ సభ్యుడు ఎన్.కె.సింగ్ నేతృత్వంలో 2017 నవంబర్‌లో ఏర్పాటైన 15వ ఆర్థిక సంఘంలో అజయ్ నారాయణ్ ఝా, ప్రొఫెసర్ అనూప్ సింగ్, డాక్టర్ అశోక్ లాహిరి, డాక్టర్ రమేశ్‌చంద్‌లు సభ్యులుగా ఉన్నారు.

15వ ఆర్థిక సంఘం 2020-21 ఆర్థిక సంవత్సరానికి మధ్యంతర నివేదిక ఇస్తూ 41 శాతం వాటాను సిఫారసు చేసింది. తాజాగా రానున్న ఐదేళ్లకు కూడా 41 శాతం వాటాను సిఫారసు చేసింది. దీని ప్రకారం కేంద్ర ప్రభుత్వం రూ.42.2 లక్షల కోట్లను రాష్ట్రాలకు పంచనుంది. ఇక మొత్తం 17 రాష్ట్రాలకు రూ.2,94,514 కోట్లను రెవెన్యూ లోటు గ్రాంటుగా సిఫారసు చేసింది.

### అప్పు మరియు ద్రవ్యలోటు

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థపై కోవిడ్-19 తీవ్రమైన ప్రభావం చూపిన నేపథ్యంలో ఆ ప్రభావం భారత ఆర్థికవ్యవస్థపై ఉందనేది వాస్తవం. అంచనావేసిన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పెరుగుదల 7 శాతం ఉంటుందని 15వ ఆర్థికసంఘం అంచనావేసింది. ప్రస్తుత సూక్ష్మ ఆర్థిక అంచనా ప్రకారం జీడీపీలో ద్రవ్యలోటు 2021-22లో 6 శాతం, 2022-23లో 5.5 శాతం. 2023-24లో 5 శాతం, 2024-25లో 4.5 శాతం మరియు 2025-26 సంవత్సరంలో 4 శాతం ఉండనుంది. ఒకవేళ అంచనావేసిన దానికంటే ఆర్థిక పునరుద్ధరణ నెమ్మదిగా జరిగితే ద్రవ్యలోటు 2021-22లో 6.5 శాతం, 2022-23లో 6 శాతం 2023-24లో 5.5 శాతం, 2024-25లో 5 శాతం మరియు 2025-26 సంవత్సరంలో 4.5 శాతం ఉంటుంది. ఒకవేళ అంచనా వేసిన దానికంటే దేశ ఆర్థిక పునరుద్ధరణ వేగంగా జరిగితే ద్రవ్యలోటు జీడీపీలో 2021-22లో 6 శాతం, 2022-23లో 5.5 శాతం, 2023-24లో 5 శాతం 2024-25లో 4 శాతం మరియు 2025-26 సంవత్సరంలో 3.5 శాతం ఉండనుంది.

### కోశలోటు (Fiscal Deficit)

15వ ఆర్థిక సంఘం ముఖ్యంగా రెవెన్యూలోటు, కోశలోటు మరియు ప్రాథమిక లోటు గురించి విశ్లేషించింది. సాధారణంగా ప్రభుత్వం మొత్తం రాబడి కంటే మొత్తం వ్యయం ఎక్కువగా ఉంటే దానిని బడ్జెట్‌లోటుగా పేర్కొంటారు. ఈ బడ్జెట్ లోటుకు ప్రభుత్వ రుణాలు మరియు ఇతర అప్పులను కలిపితే కోశలోటు వస్తుంది. అయితే కోశలోటు నుండి వడ్డీ చెల్లింపులను తీసివేస్తే ప్రాథమికలోటు వస్తుంది. ప్రభుత్వ రెవెన్యూ వ్యయం ఎక్కువైతే దానిని రెవెన్యూ లోటుగా పేర్కొంటారు. 15వ ఆర్థికసంఘం విశ్లేషణల ప్రకారం ఆయా లోట్లు క్రింది విధంగా ఉన్నాయి. 2011-12లో కోశలోటు జీడీపీలో 5.9 శాతం ఉండగా 2018-19 లో 3.4 శాతం కలదు. బడ్జెటరీ అంచనా ప్రకారం 2020-21 సంవత్సరంలో 3.5 శాతం ఉండగా 2018-19లో 2.4 శాతం మరియు 2020-21 సంవత్సరంలో 2.7 శాతం ఉంది. అంటే రెవెన్యూలోటు క్రమంగా తగ్గుతున్న విధాన్ని చూడవచ్చు. అదేవిధంగా ప్రాథమికలోటును చూస్తే 2011-12లో 2.8 శాతం, 2018-19లో 0.4 శాతం మరియు 2020-21 సంవత్సరంలో పన్నుల ఆదాయాను పరిశీలిస్తే 2011-12లో ప్రత్యక్ష పన్నుల వాటా జీడీపీలో 5.7 శాతం కాగా 2018-19లో 6 శాతం మరియు 2020-21 బడ్జెటరీ అంచనా ప్రకారం 5.9 శాతం ఉంది. పరోక్ష పన్నుల వాటాను చూస్తే 2011-12లో 4.5 శాతం, 2015-16లో 5.2 శాతం, 2018-19లో 5 శాతం మరియు 2020-21 సంవత్సరంలో 4.9 శాతం వాటా కలిగి ఉన్నాయి.

- ఇన్‌కంటాక్స్ రిటర్న్స్ ఫైలింగ్ చేసేవారు మరియు పన్ను చెల్లింపుదారులను పరిశీలిస్తే 2013-14లో రిటర్న్స్ ఫైలింగ్ చేసేవారు 3.31 కోట్ల మంది ఉండగా పన్ను చెల్లింపుదార్లు 5.72 కోట్ల మంది ఉన్నారు. 2016-17 లో ఫైలింగ్ చేసిన వారు 4.47 కోట్లమంది ఉంటే టాక్స్ పేయర్స్ 7.42 కోట్ల మంది ఉన్నారు. 2017-18 సంవత్సరంలో వరుసగా టాక్స్ రిటర్న్స్ ఫైలింగ్ చేసినవారు 5.45 కోట్ల మంది ఉండగా పన్ను చెల్లింపుదారులు 8.45 కోట్లమంది ఉన్నారు.
- రాష్ట్రాలకు పన్నుల విభజన చూస్తే 2015-20 మధ్య 42 శాతం ఉండగా 2020-21 సంవత్సరానికి 41 శాతానికి తగ్గించారు. మిగతా 1 శాతాన్ని కొత్తగా ఏర్పాటు చేసిన కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకాశ్మీర్ మరియు లధక్‌కు కేటాయించారు. 15వ ఆర్థిక సంఘం కేంద్ర పన్నుల(డివిజిబుల్ పూల్)లో రాష్ట్రాల భాగస్వామ్యానికి సంబంధించి క్షితిజ సమాంతర పంపిణీ (Horizontal Devolution) కోసం కేటాయించిన ప్రమాణాలు మరియు భారాలు క్రిందివిధంగా ఉన్నాయి.

| ప్రమాణం | భారం |
|---|---|
| జనాభా | 15.0 |
| భౌగోళిక ప్రాంతం | 15.0 |
| అడవులు, డిస్టెన్స్ | 10.0 |
| ఇన్‌కమ్ డిస్టెన్స్ | 45.0 |
| డెమోగ్రాఫిక్ పెర్ఫార్మెన్స్ | 12.5 |
| ట్యాక్స్ ఎఫర్ట్ | 2.5 |
| మొత్తం | 100.0 |



https://ourstudycircle.in/upscpdf/

- ఇన్‌కమ్ డిస్టెన్స్‌లో భాగంగా అధిక ఆదాయాన్ని ఆర్జిస్తున్న రాష్ట్రాల ప్రాతిపదికన విభజించారు. ఇందులో భాగంగా 2015-16, 2016-17 మరియు 2017-18 మూడు సంవత్సరాల స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)ని లెక్కించారు.
- డెమోగ్రాఫిక్ పర్ఫార్మెన్స్‌లో భాగంగా 2011 జనాభా ఆధారంగా కేటాయింపులు చేశారు. అంటే ప్రధానంగా జనాభా నియంత్రణకు పూనుకున్న రాష్ట్రాలకు కేటాయింపులు చేశారు. ఇందులో భాగంగా మొత్తం పునరుత్పత్తి నిష్పత్తి (టోటల్ ఫెర్టిలిటీ రేషియో-టిఎఫ్ఆర్)ని 1971 జనాభా ఆధారంగా లెక్కించారు. తక్కువ టిఎఫ్ఆర్ ఉన్న రాష్ట్రాలకు అధిక కేటాయింపులు చేశారు.
- ఫారెస్ట్ అండ్ ఎకాలజీలో భాగంగా అధికంగా అటవీ విస్తరణ గల రాష్ట్రాలను, సరాసరి అడవులు గల రాష్ట్రాల ఆధారంగా కేటాయింపులు చేశారు. టాక్స్ ఎఫర్ట్‌లో భాగంగా అధిక పన్నుల వసూలు ప్రదర్శన అధికంగా గల రాష్ట్రాలకు 15వ ఆర్థిక సంఘం ప్రోత్సాహకాలు కల్పించింది. ఇందులో భాగంగా 2014-15 నుండి 2016-17 వరకు మూడు సంవత్సరాల సరాసరి తలసరి ఆదాయం, సరాసరి స్వంత పన్నులు, రాబడులు మరియు సరాసరి రాష్ట్ర దేశీయోత్పత్తిని లెక్కించారు.

15వ ఆర్థిక సంఘం అనుసరించిన వెయిటేజీ విధానంతో నాలుగు దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర పన్నుల్లో తమ వాటాను నష్టపోయాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటకల మొత్తం వాటా 13.955% నుంచి 11.721%కి తగ్గిపోయింది. అంటే ఈ రాష్ట్రాలు మొత్తంగా 2.234% వాటాను కోల్పోయినట్లయింది. వచ్చే అయిదేళ్లలో దేశంలోని అన్ని రాష్ట్రాలకూ కలిపి రూ.42,24,760 కోట్ల పన్నులను కేంద్రం పంచనున్నట్లు అంచనా. ఈ లెక్క ప్రకారం తెలుగు రాష్ట్రాలు, కేరళ, కర్ణాటకలకు మొత్తంగా రూ.94,381.13 కోట్ల నష్టం వాటిల్లనుంది. ఈ రాష్ట్రాలతోపాటు ఒడిశా, అసోం, ఉత్తర్ ప్రదేశ్ కూడా వెయిటేజీని కోల్పోయాయి. మొత్తంగా అయిదేళ్లలో ఈ ఏడు రాష్ట్రాలు కలిపి రూ.లక్ష కోట్లకుపైగా నష్టపోనున్నాయి. దక్షిణాదిలో తమిళనాడు వెయిటేజీ 4.023% నుంచి 4.079%కి పెరగడం గమనార్హం.

14వ ఆర్థికసంఘంతో పోలిస్తే 15వ ఆర్థికసంఘం కాలంలో రాష్ట్రాలకు వచ్చే పన్నులు, గ్రాంట్ల వాటా తగ్గింది. క్రితంసారి అన్ని రాష్ట్రాలకు కలిపి పన్నులు, గ్రాంట్ల రూపంలో రూ.59,63,484 కోట్లు రాగా, ఈసారి రూ.52,41,422 కోట్లకు పరిమితమైంది. అయితే ఇదివరకు జమ్మూకశ్మీర్ రాష్ట్రాల జాబితాలో ఉండేది కాబట్టి 29 రాష్ట్రాలు ఉండేవి. అది ఈ జాబితాలో లేకపోవడంతో ఈసారి రాష్ట్రాల సంఖ్య 28కి తగ్గింది. ఇదివరకు కేంద్రపన్నుల్లో రాష్ట్రాల వాటా కింద రూ.39,48,187 కోట్లను సిఫార్సు చేయగా, ఇప్పుడది రూ.42,24,760 కోట్లకు చేరింది. క్రితంసారి రెవెన్యూలోటు కింద రూ.1,94,821 కోట్లు ఇవ్వాలని చెప్పగా, ఇప్పుడది రూ.2,94,514 కోట్లకు పెరిగింది. 14వ ఆర్థికసంఘం తొలి ఏడాది రెవెన్యూలోటు రాష్ట్రాలు 10 ఉండగా, చివరి ఏడాదికి ఆ సంఖ్య 7కి తగ్గింది. కానీ ఇప్పుడు ఆ రాష్ట్రాల సంఖ్య 17కి చేరింది. అందువల్లే రెవెన్యూలోటు కింద అత్యధిక మొత్తం ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఇందులో అత్యధికంగా పశ్చిమబెంగాల్ (రూ.40,115 కోట్లు), కేరళ (రూ.37,814 కోట్లు), హిమాచల్‌ప్రదేశ్ (రూ.37,199 కోట్లు), ఆంధ్రప్రదేశ్ (రూ.30,497 కోట్లు)కు వెళ్తోంది. క్రితంసారి రాష్ట్రాలకు గ్రాంట్ల రూపంలో రూ.18,20,476 కోట్లు రాగా, ఈసారి అది రూ.7,22,148 కోట్లకే పరిమితమైంది.

### వెయిటేజ్ తగ్గిన రాష్ట్రాలు

| రాష్ట్రం | వెయిటేజీ (శాతాల్లో) | |
|---|---|---|
| | 14వ ఆర్థిక సంఘం | 15వ ఆర్థిక సంఘం |
| ఆంధ్రప్రదేశ్ | 4.305 | 4.047 |
| కర్ణాటక | 4.713 | 3.647 |
| కేరళ | 2.500 | 1.925 |
| తెలంగాణ | 2.437 | 2.102 |
| అసోం | 3.331 | 3.128 |
| ఒడిశా | 4.642 | 4.528 |
| ఉత్తర ప్రదేశ్ | 17.959 | 17.939 |

### వెయిటేజ్ పెరిగిన రాష్ట్రాలు

| రాష్ట్రం | వెయిటేజీ (శాతాల్లో) | |
|---|---|---|
| | 14వ ఆర్థిక సంఘం | 15వ ఆర్థిక సంఘం |
| అరుణాచల్ ప్రదేశ్ | 1.370 | 1.757 |
| బీహార్ | 9.665 | 10.058 |
| ఛత్తీస్‌గఢ్ | 3.080 | 3.407 |
| గోవా | 0.378 | 0.386 |
| గుజరాత్ | 3.084 | 3.478 |
| హరియాణా | 1.084 | 1.093 |
| హిమాచల్ ప్రదేశ్ | 0.713 | 0.830 |
| ఝార్ఖండ్ | 3.139 | 3.307 |
| మధ్యప్రదేశ్ | 7.548 | 7.850 |
| మహారాష్ట్ర | 5.521 | 6.317 |
| మణిపూర్ | 0.617 | 0.716 |
| మేఘాలయ | 0.642 | 0.767 |
| మిజోరాం | 0.460 | 0.500 |
| నాగాలాండ్ | 0.498 | 0.569 |
| పంజాబ్ | 1.577 | 1.807 |
| రాజస్థాన్ | 5.495 | 6.026 |
| సిక్కిం | 0.367 | 0.388 |
| తమిళనాడు | 4.023 | 4.079 |
| త్రిపుర | 0.642 | 0.708 |
| ఉత్తరాఖండ్ | 1.052 | 1.118 |
| పశ్చిమ బెంగాల్ | 7.324 | 7.523 |

**గ్రాంట్స్ ఇన్ ఎయిడ్**

- 2020-21 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రాలకు క్రింద తెలిపిన గ్రాంట్స్‌ఇన్ ఎయిడ్ కల్పించారు. అవి 1) రెవెన్యూలోటు గ్రాంటులు 2) స్థానిక సంస్థల గ్రాంటులు 3) విపత్తు నిర్వహణ గ్రాంటులు. వీటితోపాటు ప్రత్యేక మరియు పర్ఫార్మెన్స్ గ్రాంటులను సైతం 15వ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు కల్పించింది.

**రెవెన్యూ లోటు గ్రాంటులు :**

- 2020-21 ఆర్థిక సంవత్సరానికి 14 రాష్ట్రాలకు రెవెన్యూలోటు గ్రాంటుల కింద రూ.74340 కోట్లను కేటాయించారు. ఇందులో భాగంగా


https://ourstudycircle.in/upscpdf/

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.5897 కోట్లను కేటాయించారు. అత్యధికంగా కేరళ రాష్ట్రానికి రెవెన్యూ లోటు క్రింద రూ.15323 కోట్లు గ్రాంటులు కేటాయించారు.

**ప్రత్యేక గ్రాంటులు :**

- మూడు రాష్ట్రాలు కర్నాటక, మిజోరాం మరియు తెలంగాణలకు 2019-20 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2020-21 ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ లోటు గ్రాంటులను తగ్గించారు. అయితే 15వ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు ప్రత్యేక గ్రాంటుల కింద రూ.6764 కోట్లను కేటాయించింది.

**రంగాల వారీగా ప్రత్యేక గ్రాంటులు :**

- 15వ ఆర్థిక సంఘం 2020-21 ఆర్థిక సంవత్సరానికి పోషకాహారం కోసం రూ.7375 కోట్లు ప్రత్యేక గ్రాంటులను సిఫార్సు చేసింది. రంగాల వారీగా క్రింద తెలిపిన ప్రత్యేక గ్రాంటులను కల్పించింది అవి.

1) పోషకాహారం 2) ఆరోగ్యం 3) పూర్వ ప్రాథమిక-విద్య
4) న్యాయవ్యవస్థ 5) గ్రామీణ అనుసంధానం 6) రైల్వేలు
7) పోలీసు శిక్షణ 8) గృహనిర్మాణం

**పర్ఫార్మెన్స్ బేస్డ్ గ్రాంటులు :**

- వీటికోసం క్రింది సూచనలు చేసింది. 1) వ్యవసాయ సంస్కరణల అమలు 2) ఆశావహ జిల్లాలు, బ్లాక్‌ల అభివృద్ధి 3) విద్యుత్ సంస్కరణలు 4) ఎగుమతులతో పాటు వర్తకం అభివృద్ధి 5) విద్యకు ప్రోత్సాహకాలు 6) దేశీయ మరియు అంతర్జాతీయ పర్యాటకం ప్రోత్సాహం చేసిన వాటికోసం ఈ గ్రాంటులను సూచించింది.

**స్థానిక సంస్థలకు గ్రాంటులు :**

- 2020-21 ఆర్థిక సంవత్సరానికి స్థానిక సంస్థల గ్రాంటుల కింద మొత్తం రూ.90000 కోట్లను కేటాయించింది. ఇందులో రూ.60750 కోట్లు (67.5 శాతం) గ్రామీణ స్థానిక సంస్థలకు కాగా రూ.29250 కోట్లు (32.5 శాతం) పట్టణ స్థానిక సంస్థలకు కేటాయించారు. ఈ గ్రాంటులను రాష్ట్రాల జనాభా మరియు విస్తీర్ణం ఆధారంగా 90:10 నిష్పత్తిలో కేటాయించారు. గ్రామీణ స్థానిక సంస్థల గ్రాంటుల కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.2625 కోట్లు, తెలంగాణకు 1847 కోట్లు కేటాయించారు. పట్టణ స్థానిక సంస్థలకు ఆంధ్రప్రదేశ్‌కు రూ.1264 కోట్లు, తెలంగాణకు 889 కోట్లు కల్పించారు.

**డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్ :**

- 15వ ఆర్థిక సంఘం స్థానికస్థాయిలో విపత్తు తీవ్రత తగ్గింపుకోసం జాతీయ మరియు రాష్ట్రాల్లో విపత్తు నిర్వహణ నిధులను ఏర్పాటు చేయాలని సూచించింది. వీటికి గానూ అయ్యే నిధులను కేంద్ర, రాష్ట్రాల మధ్య 75:25 నిష్పత్తిలో భరించాలని, ఈశాన్య రాష్ట్రాలు మరియు హిమాలయ రాష్ట్రాల్లో అయితే ఈ నిష్పత్తి 90:10గా ఉండాలని సూచించింది. 2020-21 సంవత్సరానికి స్టేట్ డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్‌కు రూ.28983 కోట్లను కేటాయించింది. ఇందులో కేంద్రం వాటా రూ.22184 కోట్లు. జాతీయ విపత్తుల తీవ్రత తగ్గింపు నిర్వహణ నిధుల కింద రూ.12390 కోట్లను కేటాయించింది.

**డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్ కోసం గ్రాంటులు :**


- జాతీయస్థాయిలో డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్‌లో నిధులను ఉపశమనం (మిటిగేషన్) కోసం 20 శాతం (2478 కోట్లు), విపత్తు ప్రతిస్పందన .. కోసం రూ.9912 కోట్లు కేటాయించింది. (Response) ప్రతిస్పందన నిధులను రెస్పాన్స్ మరియు రిలీఫ్ కోసం 40 శాతం (4956 కోట్లు) రికవరీ మరియు రీకన్‌స్ట్రక్షన్ కోసం 30 శాతం (రూ.3717 కోట్లు). కెపాసిటీ బిల్డింగ్ కోసం 10 శాతం (రూ.1239 కోట్లు) గా కేటాయించింది. వీటన్నింటి మొత్తం రూ.12390 కోట్లు, రాష్ట్రాలకు కేటాయించిన నిధులను ఇదే శాతాల్లో విభజించింది.

**15వ ఆర్థిక సంఘం - వివిధ గ్రాంట్లు**

| గ్రాంట్ భాగాలు | 2021-26 (కోట్లలో) |
|---|---|
| 1. రెవెన్యూ లోటు గ్రాంట్లు | 294514 |
| 2. స్థానిక ప్రభుత్వాలు గ్రాంట్లు | 436361 |
| 3. విపత్తు నిర్వహణ గ్రాంట్లు | 122601 |
| 4. సెక్టార్-నిర్దిష్ట గ్రాంట్లు | 129987 |
| i. ఆరోగ్య రంగానికి గ్రాంట్లు | 31755 |
| ii. పాఠశాల విద్య | 4800 |
| iii. ఉన్నత విద్య | 6143 |
| iv. వ్యవసాయ సంస్కరణల అమలు | 45000 |
| v. పిఎమ్‌జిఎస్‌వై రోడ్ల నిర్వహణ | 27539 |
| vi. న్యాయవ్యవస్థ | 10425 |
| vii. గణాంకాలు | 1175 |
| viii. ఆకాంక్ష జిల్లాలు మరియు బ్లాక్స్ | 3150 |
| 5. రాష్ట్ర-నిర్దిష్ట | 49599 |
| **మొత్తం** | **1033062** |

## తెలుగు రాష్ట్రాలకు 15వ ఆర్థిక సంఘం సిఫార్సులు

### ఆంధ్రప్రదేశ్



ఆంధ్రప్రదేశ్ వినతి మేరకు 15వ ఆర్థిక సంఘం కేంద్ర ప్రభుత్వానికి పలు సిఫార్సులు చేసింది. ఈ మేరకు నిధులు విడుదల కానున్నాయి. సిఫార్సుల్లో భాగంగా రాష్ట్రంలో విద్య, వైద్యం వంటి ప్రాధాన్య రంగాల్లో పరిస్థితిని ఆర్థిక సంఘం కేంద్రానికి తెలియజేసింది.

'ఏపీలో జనాభాపరంగా చూస్తే ఆసుపత్రుల్లో పడకల సంఖ్య తక్కువ ఉంది. రాష్ట్రంలో వైద్యరంగంపై తలసరి రూ.1,441 ఖర్చు పెడుతున్నారు. ప్రభుత్వ వ్యయంలో వైద్యరంగంపై చేసే ఖర్చు 8 శాతంగా ఉండాలి. కానీ 4.92% మాత్రమే ఉంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య రంగంలో 22,139 మంది మానవ వనరుల కొరత ఉంది. ప్రస్తుతం ఉన్న ఆసుపత్రుల్లో 7,596 మంది సిబ్బంది కొరత ఉండగా, జనాభా ప్రాతిపదికన కొత్త వ్యవస్థలు నెలకొల్పితే మరో 14,543 మంది కావాల్సి వస్తుంది. రాష్ట్రంలో ఉన్న 6,825 వైద్య ఉప కేంద్రాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా మార్చడానికి ఒక్కోదానికి రూ.9.7లక్షల చొప్పున రూ.661.66 కోట్లు కావాలి' అని సిఫార్సు చేసింది. భవనాలు లేని సబ్‌సెంటర్లు, ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు భవన నిర్మాణం కోసం రూ.6.22 కోట్లు, పట్టణ ఆరోగ్య- సంరక్షణ కేంద్రాలకు అయిదేళ్లకు కలిపి రూ.546.63 కోట్ల గ్రాంటు విడుదల చేయనున్నారు.



https://ourstudycircle.in/upscpdf/

వైద్యరంగానికి ఇచ్చిన గ్రాంట్లలో రూ. 424 కోట్లు క్రిటికల్‌కేర్ ఆసుపత్రుల ఏర్పాటుకు ఇచ్చారు. దీని ద్వారా ఎనిమిది 100 పడకల ఆసుపత్రులు నెలకొల్పాల్సి ఉంటుంది. జిల్లాకు ఒకటి చొప్పున రాష్ట్రంలో 13 సమీకృత, ప్రజారోగ్య ప్రయోగశాలల ఏర్పాటుకు రూ. 10 కోట్లు విడుదలవుతుంది. వైద్య సహాయ సిబ్బంది శిక్షణ కోసం 26 కేంద్రాలు నెలకొల్పాలి. ఇందుకోసం అయిదేళ్లలో రూ. 338 కోట్ల గ్రాంటు విడుదలవుతుంది. డీఎన్‌బీ కోర్సుల నిర్వహణ కోసం రూ. 105 కోట్ల గ్రాంటు వస్తుంది. ప్రతి మండలంలో ప్రజారోగ్య కేంద్రం ఏర్పాటుకు రూ. 713.79 కోట్లు అవసరం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగనిర్ధారణ పరీక్షల నిర్వహణకు మౌలిక వసతుల కోసం రూ. 306.18 కోట్లు మంజూరు, రాష్ట్రానికి మంజూరైన మొత్తం ఆరోగ్య గ్రాంట్లు రూ. 2,601 కోట్లలో తొలి రెండేళ్లు రూ. 490 కోట్ల చొప్పున, ఆ తర్వాత మూడేళ్లు రూ. 514, రూ. 540, రూ. 567 కోట్ల చొప్పున వస్తుంది.

రాష్ట్ర స్థానిక సంస్థలకు కేటాయించిన గ్రాంట్లలో గ్రామీణ స్థానిక సంస్థలకు రూ. 10,231 కోట్లు ఇవ్వనున్నారు. 10 లక్షల్లోపు జనాభా ఉన్న పట్టణ స్థానిక సంస్థలకు రూ. 1,116 కోట్లు, పది లక్షలకుపైన ఉన్నవాటికి రూ. 4,115 కోట్లు దక్కుతాయి. విజయవాడకు రూ. 514 కోట్లు, విశాఖపట్నానికి రూ. 602 కోట్లు వస్తాయి. న్యాయవ్యవస్థకు ఇచ్చిన రూ. 295 కోట్ల గ్రాంట్లు ఏటా రూ. 59 కోట్ల చొప్పున వస్తాయి. పీఎంజీఎస్‌వై కింద ఇచ్చిన రూ. 344 కోట్ల గ్రాంట్లు వరుసగా రూ. 58, రూ. 77, రూ. 75, రూ. 60, రూ. 74 కోట్ల చొప్పున విడుదలవుతాయి. వ్యవసాయం కింద దేశం మొత్తానికి విడుదల చేసిన రూ. 45 వేల కోట్ల గ్రాంట్లలో ఏపీకి 9.35% వాటా కింద రూ. 4,209 కోట్లు దక్కింది. ఉన్నత విద్యారంగానికి కేటాయించిన రూ. 250 కోట్ల గ్రాంట్లలో యేటా వరుసగా రూ. 46, రూ. 48, రూ. 51, రూ. 53, రూ. 52కోట్లు విడుదలవుతాయి. రాష్ట్రానికి కేటాయించిన రూ. 8,239 కోట్ల ప్రకృతి వైపరీత్య నిర్వహణ గ్రాంటులో కేంద్ర వాటా కింద రూ. 6,183 కోట్లు, రాష్ట్ర వాటా కింద రూ. 2,056 కోట్లు సమకూర్చాలి. ఏపీ డిస్కంలు 2019 మార్చి 31 వరకు రూ. 18,023 కోట్ల రుణాలు చేశాయి. 2018-19 నాటికి ఏపీ ఉదయ్ లక్ష్యాలను అందుకోలేదు. రహదారులు, వంతెనలు, భవనాల నిర్మాణం కోసం అన్ని రాష్ట్రాలు సగటున తలసరి రూ. 365 ఖర్చుపెడితే ఏపీ రూ. 240 మాత్రమే వెచ్చించింది. అడవులు, పర్యావరణ, వాతావరణం కోసం అన్ని రాష్ట్రాలు సగటున రూ. 114 ఖర్చుపెడితే ఏపీ చేసిన వ్యయం రూ. 53 మాత్రమే. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యంపై రాష్ట్రాలు సగటున రూ. 276 ఖర్చు చేస్తే ఏపీ తలసరి వ్యయం రూ. 223 మాత్రమే.

**పన్నులు, గ్రాంట్ల కింద వచ్చే అయిదేళ్లలో రాష్ట్రానికి రూ.2.34 లక్షల కోట్లు**

14వ ఆర్థిక సంఘంతో పోల్చితే 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం ఆంధ్రప్రదేశ్.. కేంద్ర పన్నుల్లో అయిదేళ్లలో రూ. 10,900 కోట్లు నష్టపోనుంది. గత ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం రాష్ట్రానికి 4.305 శాతం వాటా దక్కగా ఈసారి అది 4.047కి పడిపోయింది. 0.258 మేర వెయిటేజీ కోల్పోవడంతో అయిదేళ్ల కాలంలో కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి రావాల్సిన వాటాలో రూ. 10,900 కోట్లు కోతపడనుంది. ఎన్.కె.సింగ్ నేతృత్వంలోని 15వ ఆర్థిక సంఘం 2020-21 సంవత్సరానికి సమర్పించిన తాత్కాలిక నివేదికలో రాష్ట్రానికి 4.111 వెయిటేజీ ఇచ్చింది. కానీ పూర్తి స్థాయి నివేదికలో 4.047కి తగ్గించింది. ఈ రకంగా చూసినా అయిదేళ్ల కాలంలో కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి రావాల్సిన వాటాలో రూ. 2,704 కోట్లు కోతపడనుంది. తాత్కాలిక నివేదిక తరహాలోనే తుది నివేదికలోనూ ఆర్థికసంఘం జనాభాకు 15%, ప్రాంతానికి 15%, అడవులు, పర్యావరణానికి 10%, ఆదాయవ్యత్యాసాలకు 45%, డెమోగ్రఫిక్ పర్ఫార్మెన్స్‌కి 12.5%, పన్నులు, ఆదాయకల్పన ప్రయత్నాలకు 2.5% వెయిటేజీ ఇచ్చింది. అయినప్పటికీ రాష్ట్ర వెయిటేజీలో తేడా వచ్చింది.

వచ్చే అయిదేళ్లలో అన్ని రాష్ట్రాలకు కలిపి పన్నుల్లో వాటా కింద రూ. 42,24,760 కోట్లు పంచాల్సి వస్తుందని 15వ ఆర్థిక సంఘం అంచనా వేసింది. దీనిలో రాష్ట్రానికి రూ. 2,34,013 కోట్లు రానుంది. ఇందులో 73% పన్నుల వాటాయే. రెవెన్యూలోటు కింద అయిదేళ్ల కాలానికి రూ. 30,497 కోట్లను ఆర్థికసంఘం సిఫార్సు చేసింది. గత ఆర్థికసంఘం కాలం కంటే ఇది రూ. 8,384 కోట్లు అధికం. క్రితంసారి కేంద్ర పన్నుల్లో వాటా, రెవెన్యూ లోటు కలిపి రాష్ట్రానికి రూ. 1,92,798 కోట్లు రాగా ఈసారి అది రూ. 2,01,473 కోట్లకు చేరనుంది.

## తెలంగాణ

రాష్ట్రానికి 15వ ఆర్థిక సంఘం ఐదేళ్ల కాలానికి రూ. 1,09,786 కోట్లను సిఫార్సు చేసింది. స్థానిక సంస్థలకు రూ. 13,111 కోట్లు ప్రతిపాదించింది. ఎన్నో ప్రాజెక్టులకు సాయం అర్థించినా మిషన్ భగీరథ నిర్వహణకు మాత్రం రూ. 2,350 కోట్లను సిఫార్సు చేసింది. ఇంటింటికి రక్షిత మంచినీటిని అందించే కార్యక్రమం నేపథ్యంలో నిర్వహణకు ఈ నిధులను ప్రతిపాదించినట్లు పేర్కొంది. ఈ సారి విద్య, వ్యవసాయం, ఆరోగ్యానికి ప్రత్యేకంగా నిధులను సిఫార్సు చేసింది. వివిధ అంశాల పనితీరు ప్రాతిపదికగా వ్యవసాయానికి సిఫార్సు చేసిన నిధులను అందించనుంది. రాజధాని హైదరాబాద్‌కు ఘనవ్యర్థాల నిర్వహణ, వాయు కాలుష్యం నిర్వహణ నేపథ్యంలో ఐదేళ్లకు రూ. 1,939 కోట్లను సిఫార్సు చేసింది.

**'ఎస్‌డీజీ-2019'లో రాష్ట్రానికి ఐదో ర్యాంకు**



సమీకృత అభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డీజీ) సాధనలో తెలంగాణ పనితీరు బాగుందని 15వ ఆర్థిక సంఘం ప్రశంసించింది. 2019లో ఎస్‌డీజీ ర్యాంకుల్లో తెలంగాణ ఐదో స్థానంలో నిలిచిందని పేర్కొంది. పార్లమెంటులో ప్రవేశపెట్టిన 15వ ఆర్థిక సంఘం నివేదిక రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను వెల్లడించింది. 2015-19 మధ్యకాలంలో తెలంగాణ మెరుగైన వృద్ధి రేటుతో ముందుకు సాగిందని వివరించింది. రాష్ట్రంలో వెనుకబడిన 20 శాతం మండలాల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలని సూచించింది. దేశంలోని 35 జిల్లాల అభివృద్ధిపై వామపక్ష తీవ్రవాద ప్రభావం ఉండగా ఇందులో ఒక జిల్లా తెలంగాణలో ఉందని చెప్పింది.

**'కాళేశ్వరం' విద్యుత్తు బిల్లులను వినియోగ ఛార్జీల ద్వారా పొందాలి:**

కాళేశ్వరం ఎత్తిపోతలకు భారీ విద్యుత్తు బిల్లు వస్తుందని, నిర్వహణకు అవసరమయ్యే మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం వినియోగ ఛార్జీల ద్వారా పొందాలని 15వ ఆర్థిక సంఘం సూచించింది. కచ్చితమైన ఆదాయ వనరు లేకుంటే ప్రాజెక్టు ఆర్థిక స్థిరత్వం ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం 18 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించడానికి రూ. 80 వేల కోట్ల అంచనా వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందని పేర్కొంది.



https://ourstudycircle.in/upscpdf/

తాగు, సాగు నీటి పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం రుణాలు తీసుకుందని, రికవరీకి అవకాశం లేకుండా ఈ రుణాలకు అవసరమైన వడ్డీలను బడ్జెట్ నుంచే చెల్లించాల్సి వస్తుందని, ఇది ద్రవ్యలోటుకు దారి తీసే అవకాశముందని తెలిపింది. ఈ పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలంది. 2016-17లో ఆడిట్ పరిశీలనలోకి వచ్చిన అంశాలను ఉదాహరణగా పేర్కొంది. ఆ సంవత్సరం రెవెన్యూ మిగులును రూ. 1,386 కోట్లుగా పేర్కొన్నారని, అయితే అకౌంటింగ్ సక్రమంగా చేయకుండా రెవెన్యూ మిగులును రూ. 6,778 కోట్లు ఎక్కువగా చూపించారని వివరించింది.

తెలంగాణలోని రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల వాటానే రాష్ట్ర స్థూల అభివృద్ధిలో 52 శాతం. జిల్లాల అభివృద్ధిలో అసమానతలు ఉన్నాయి.. అన్ని జిల్లాల్లో సమాన అభివృద్ధి సాధించేందుకు ఇతర పట్టణాలపైనా దృష్టి సారించాలి. 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు కలిగిన వారిలో నిరుద్యోగం అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణది ఐదో స్థానం. 2016-17లో అన్ని రకాల విద్యపై పెట్టిన ఖర్చు జీఎస్‌డీపీలో 1.8 శాతం మాత్రమే. సాధారణంగా 2.6 శాతం ఉండాలి. ద్రవ్యభారం నుంచి తప్పించుకోడానికి ఉదయ్ పథకం కింద లక్ష్యాల సాధనకు ప్రణాళిక రూపొందించుకోవాలి. అర్హులకు విద్యుత్తు సబ్సిడీ అందేలా చూడాలి. 2019 మార్చి 31 నాటికి డిస్కంలు చేసిన అప్పులు రూ. 17121 కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రుణం రూ. 11 కోట్లు. ఆరోగ్య సూచీలు, సులభతర వాణిజ్యం అమలు, భూ రికార్డుల నవీకరణలో తెలంగాణ ముందుంది. జీఎస్‌డీపీ వృద్ధిరేటు 2020-21లో గతం కంటే 2% తగ్గనుంది. 2021-22లో అది 14.5% ఉంటుంది అని 15వ ఆర్థిక సంఘం పేర్కొంది.

## భారత ఆర్థిక సంఘం గురించి

భారత ఆర్థిక సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ, అర్ధ న్యాయ సంస్థ (Quasi-federal). ఇది ఒక సలహా సంస్థ. భారతదేశంలో సమాఖ్య వ్యవస్థ ఉంది. కాబట్టి సమాఖ్యలో ఆర్థిక వనరులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజ్యాంగబద్ధంగా పంపిణీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఆదాయ వనరుల విషయంలో కేంద్రం - రాష్ట్రాల మధ్య (Verticle), రాష్ట్రాలు - రాష్ట్రాల మధ్య (Horizontal) అనేక వ్యత్యాసాలు ఉన్నాయి. కాబట్టి వీటిని దృష్టిలో ఉంచుకుని వనరులను పునఃపంపిణీ చేయడానికి రాజ్యాంగ నిర్మాతలు ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేశారు. ప్రపంచంలో ఏ సమాఖ్య వ్యవస్థలోనూ ఇలాంటి అధికారాలతో ఏర్పడిన సంస్థ మరొకటి లేదు.

ఆర్థిక సంఘం సిఫారసులను ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలని రాజ్యాంగంలో ఎక్కడా పేర్కొనలేదు. కేంద్ర ప్రభుత్వ విచక్షణాధికారం మేరకు నిర్ణయం తీసుకోవచ్చు. అయితే సాధారణంగా ఆర్థిక సంఘం సిఫారసులను అమలు చేస్తారు. ఆర్థిక సంఘం సిఫారసులు అమలు చేయాలని న్యాయస్థానాలను ఆశ్రయించే అధికారం రాష్ట్రాలతోపాటు మరెవరికీ లేదు.

**ఆర్థిక సంఘం నిర్మాణం:** ఆర్థిక సంఘం బహుళ సభ్య సంఘం. ఇందులో ఒక ఛైర్మన్, నలుగురు సభ్యులు ఉంటారు. వీరి నియామకానికి కావాల్సిన అర్హతలు, ఎంపిక చేసే విధానాన్ని పార్లమెంట్ నిర్ణయిస్తుంది. పార్లమెంట్ 'ఆర్థిక సంఘ చట్టం' (ఇతర నిబంధనలు) 1951 (Finance Commission (Miscellaneous Provisions) Act 1951) ని రూపొందించింది. ఇందులో ఆర్థిక సంఘం అధ్యక్షుడు, సభ్యుల నియామకం, అర్హతలు, అనర్హతలు, పదవీ కాలం, అధికారాలు లాంటి అంశాలను పేర్కొన్నారు.

**రాజ్యాంగ హోదా:** రాజ్యాంగంలోని XIIవ భాగంలో 280 నుంచి 281 వరకు ఉన్న నిబంధనలు ఆర్థిక సంఘం నియామకం, నిర్మాణం, విధులు, సిఫారసులను సమర్పించడం లాంటి అంశాలను వివరిస్తాయి.

**నియామకం అర్హతలు:** ఆర్థిక సంఘం ఛైర్మన్, సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారు. 280(1) నిబంధన ప్రకారం రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి లేదా అవసరమని భావించినప్పుడు రాష్ట్రపతి ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేస్తారు. కాబట్టి ఇది ఒక తాత్కాలిక సంస్థ. ఆర్థిక సంఘానికి ఛైర్మన్‌గా ప్రజా వ్యవహారాల్లో అనుభవం ఉన్నవారిని నియమిస్తారు.

**పదవీ కాలం:** ఆర్థిక సంఘం శాశ్వత సంస్థ కాదు. కాబట్టి దీనికి నిర్దీత పదవీ కాలం ఉండదు. ఆర్థిక సంఘం అధ్యక్షుడు, సభ్యులు నియామక పత్రంలో రాష్ట్రపతి ప్రత్యేకంగా పేర్కొన్న కాలం వరకు విధులు నిర్వహిస్తారు. నిర్దేశించిన కాలపరిమితి లోపల నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. ఒకసారి ఆర్థిక సంఘంలో సభ్యుడిగా పనిచేసిన వ్యక్తిని తిరిగి ఆ పదవిలో నియమించవచ్చు. ఆర్థిక సంఘం సభ్యులు రాజీనామా చేయాలంటే తమ రాజీనామా పత్రాన్ని రాష్ట్రపతి పేరుమీద రాసి, రాష్ట్రపతికి సమర్పించాలి. ఆర్థిక సంఘంలోని సభ్యులు పూర్తికాలం లేదా పాక్షిక కాలం రాష్ట్రపతి కోరిన విధంగా విధులను నిర్వహిస్తారు. ఆర్థిక సంఘం ఛైర్మన్, సభ్యుల జీతభత్యాలను కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది.

**ప్రత్యేక అధికారాలు:** భారత ఆర్థిక సంఘం అర్ధ న్యాయ సంస్థ కాబట్టి విధి నిర్వహణలో సివిల్ కోర్టుకు ఉన్న అధికారాలు ఈ సంఘానికి ఉంటాయి. భారతదేశంలోని ఏ ప్రాంతానికి చెందిన వ్యక్తి లేదా సంస్థనైనా సాక్ష్యంగా తన ఎదుట హాజరు కావాలని ఆదేశాలు జారీ చేయగలదు. తనకు కావాల్సిన సాక్ష్యాధార పత్రాలను (Documents) సమర్పించాలని ఆదేశించగలదు. ప్రభుత్వ రికార్డులు ఇవ్వాలని ఏ కోర్టును లేదా ప్రభుత్వ కార్యాలయాన్నైనా కోరవచ్చు.

### విధులు

రాజ్యాంగంలోని నిబంధన 280(3) ప్రకారం కింది అంశాలకు సంబంధించి తగిన సూచనలు చేయాలి:

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ అయ్యే లేదా పంపిణీ చేయాల్సిన పన్నుల (Divisible pool)నికర రాబడులను, కేంద్రం - రాష్ట్రాల మధ్య కేటాయించడానికి అనుసరించాల్సిన మార్గదర్శక సూత్రాలను సిఫారసు చేయడం.
- భారత సంఘటిత నిధి నుంచి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వాల్సిన సహాయక గ్రాంటులను ఇవ్వడానికి తగిన నియమాలను సూచించడం (275వ రాజ్యాంగ నిబంధన).
- రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాల్లోని పంచాయతీల ఆర్థిక వనరులను పెంచేందుకు తగిన సిఫారసులు చేయడం (73వ రాజ్యాంగ సవరణ చట్టం).
- రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రాల్లోని మున్సిపాలిటీలకు మరిన్ని ఆర్థిక వనరులను అందజేయడానికి రాష్ట్ర సంఘటిత నిధిని పెంచడానికి అవసరమైన చర్యలను సూచించడం (74వ రాజ్యాంగ సవరణ చట్టం).
- భారతదేశ ఆర్థిక స్థిరత్వ సాధన కోసం రాష్ట్రపతి కోరిన అంశంపై తగిన సలహాలు, సూచనలు, మార్గదర్శకాలను రూపొందించడం.



https://ourstudycircle.in/upscpdf/

# వ్యవసాయ చట్టాల వ్యతిరేక ఉద్యమంలో వివాదాలు



మూడు వ్యవసాయ చట్టాలను రద్దుచేయాలన్న డిమాండ్‌తో దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో రెండు నెలల నుంచి శాంతియుతంగా జరుగుతున్న రైతు ఉద్యమం 2021 జనవరి 26న 72వ గణతంత్ర దినోత్సవం నాడు అనూహ్య మలుపు తిరిగింది. కొత్త వ్యవసాయ చట్టాల రద్దు ఉద్యమంలో భాగంగా రైతు సంఘాలు ఢిల్లీలో చేపట్టిన ట్రాక్టర్ల గణతంత్ర కవాతు జనవరి 26న తీవ్ర ఉద్రిక్తతలకు వేదికగా మారింది.

మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రెండు నెలలుగా పోరాడుతున్నా వినిపించుకోని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు గణతంత్ర దినోత్సవం నాడు కిసాన్ కవాతు నిర్వహించాలని నిర్ణయించిన రైతులు దానికి పోలీసుల నుంచి అనుమతులు తీసుకున్నారు. రైతు సంఘాల నేతలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున రైతులు నిర్ణీత సమయం కంటే రెండు గంటల ముందుగా.. ట్రాక్టర్లతో, ఇతర వాహనాలతో, గుర్రాలతో చేరుకున్నారు. చాలామంది కాలినడకన వచ్చేశారు. ర్యాలీ ప్రారంభించిన తర్వాత వారు తమకు కేటాయించిన మార్గం నుంచి తప్పుకొని ఎర్రకోటకు వచ్చి అక్కడ ఆందోళన మొదలుపెట్టారు. రాజ్‌పథ్‌లో రిపబ్లిక్‌డే కవాతు పూర్తయిన తర్వాతే రైతుల ర్యాలీ జరగాల్సి ఉండగా వారు మాత్రం ముందుగానే టిక్రీ, సింఘు, ఘాజీపూర్ సరిహద్దుల ద్వారా దేశ రాజధానిలోకి ప్రవేశించే ప్రయత్నం మొదలుపెట్టారు. ఈ క్రమంలో టిక్రీ, సింఘు సరిహద్దుల వద్ద ఉన్న బ్యారికేడ్లను ధ్వంసం చేశారు. పోలీసులతో ఘర్షణకు దిగారు. పోలీసులు నిర్దేశించిన ఆంక్షలు, వారు పెట్టిన అడ్డుగోడలను బద్దలు కొట్టుకుంటూ రైతులు ట్రాక్టర్లతో అటు ఎర్రకోట, ఇటు ఇండియాగేట్ వైపు దూసుకువచ్చారు. కొందరు యువకులు ఎర్రకోట బురుజులపైకి ఎక్కి సంప్రదాయంగా జెండా వందనం చేసే చోట త్రివర్ణ పతాకంతో పాటు సిక్కుల మత జెండాను, రైతు సంఘాల జెండాలను ఎగరేసి సంచలనం సృష్టించారు. ఎర్ర కోటపై రైతు ఆందోళన కారులు ఎగరేసిన కాషాయ జెండా సాధారణంగా అన్ని గురుద్వారాల్లో కనిపించే 'నిషాన్ సాహిబ్'అనే మత పతాకం. త్రికోణాకారంలో ఉండే ఈ జెండాను అత్యంత పవిత్రమైనదిగా సిక్కులు భావిస్తారు. దీనిపై రెండు వైపులా పదునున్న ఖడ్గం(ఖండా), చక్రం, రెండు కృపాణాలు ముద్రించి ఉంటాయి. ఎర్రకోటపై ఒక రైతు సంఘానికి చెందిన మరో జెండాను కూడా ఎగరేశారు. ఎర్రకోట నుంచి ఖాళీ చేయించడానికి పోలీసులు జరిపిన లాఠీఛార్జీలో పలువురు ఆందోళనకారులు గాయపడ్డారు. ట్రాక్టర్ పరేడ్ సందర్భంగా చెలరేగిన అల్లర్లకు సంబంధించి సుమారు 200 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ అల్లర్లకు ముఖ్యసూత్రధారిగా భావిస్తున్న దీప్ సిధుని పోలీసులు కొద్దిరోజుల తర్వాత అరెస్ట్ చేశారు.

### ఉద్యమంలో కేంద్ర బిందువుగా మారిన కర్షక నేత రాకేశ్ టికాయిత్



రైతుల ఉద్యమం మొత్తానికి కేంద్ర బిందువు రాకేశ్ టికాయిత్. రెండు నెలలకు పైగా ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న ఉద్యమంలో ఆయన పేరు ప్రముఖంగా వినవస్తోంది. పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన టికాయిత్ స్వస్థలం యూపీలోని ముజఫర్‌నగర్ జిల్లాలోని సిసౌలీ. ఆయన తండ్రి సుప్రసిద్ధ రైతునేత మహేంద్రసింగ్ టికాయిత్.. భారతీయ రైతుల యూనియన్‌కు మాజీ అధ్యక్షుడు. 1987లో ఆయన భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ)ను స్థాపించారు. ఆయన తనయుడు రాకేశ్ టికాయిత్ ఎల్‌ఎల్‌బీ చదువుకున్నారు. తొలుత ఢిల్లీలో పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేశారు. తర్వాత రాజకీయాలపై ఆసక్తితో 2007లో యూపీ అసెంబ్లీకి, 2014లో లోక్‌సభకు పోటీ చేసినా రెండుసార్లూ ఓడిపోయారు. 2011లో తండ్రి మరణానంతరం బీకేయూలో కీలక బాధ్యతలు చేపట్టి, రైతు సమస్యలపై ఉద్యమిస్తూ వస్తున్నారు. రుణమాఫీ, కనీస మద్దతు ధర, విద్యుత్తు రుసుములు, భూసేకరణ వంటి అంశాలపై ఉద్యమాలు నడిపారు.

### టూల్‌కిట్ వివాదం




కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన వ్యవసాయ చట్టాలకు అమెరికాకు చెందిన పాప్ సింగర్ రిహాన్నా, స్వీడన్‌కు చెందిన ప్రముఖ పర్యావరణవేత్త గ్రేటా థన్‌బర్గ్ తదితరులు మద్దతు ప్రకటిస్తూ ట్వీట్ చేశారు. గ్రేటా థన్‌బర్గ్.. ఢిల్లీలో నిరసనలు చేస్తున్న రైతులకు మద్దతుగా 'టూల్ కిట్' అనే డాక్యుమెంట్‌ను ట్విటర్‌లో విడుదల చేశారు. టూల్ కిట్ ఓ సోషల్ మీడియా డాక్యుమెంట్. ఇది ఓ సమస్యతోపాటు దానికోసం చేయాల్సిన ఆచరణ ప్రణాళికను వివరిస్తుంది.

గ్రెటా థెన్‌బర్గ్ విడుదల చేసిన టూల్‌కిట్‌లో... జనవరి 26న ఢిల్లీలో జరిగిన పరిణామాలను వివరించింది. రైతులపై దాడిని నిరసిస్తూ విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాల ఎదుట, మీడియా కార్యాలయాల ఎదుట, ప్రభుత్వ కార్యాలయాల ఎదుట, అంబానీ, అదానీల కార్యాలయాల ఎదుట ఎలా, ఎప్పుడు ఆందోళన చేపట్టాలో సూచిస్తూ ఓ ప్రణాళిక(టూల్‌కిట్)ను ట్విటర్‌లో పోస్టు చేసింది. ఇది వివాదాస్పదంగా మారింది. రైతు ఉద్యమం వెనక ఉన్న భారత వ్యతిరేక శక్తులు ఈ టూల్‌కిట్ రూపొందించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ టూల్‌కిట్ రూపకల్పనలో పాలుపంచుకున్నారనే ఆరోపణలపై బెంగళూరుకు చెందిన దిశ రవి అనే యువ పర్యావరణ పరిరక్షకురాలిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. కర్ణాటకకు చెందిన 22 ఏళ్ల దిశ రవి గ్రెటా థన్‌బర్గ్ ప్రారంభించిన పర్యావరణ కార్యకర్తల గ్రూపులో సభ్యురాలు. 2019లో ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ ఇండియా విభాగాన్ని ఆమె ప్రారంభించింది. పర్యావరణ మార్పులపై పలు ప్రచారాలను ఆమె చేపట్టింది.



https://ourstudycircle.in/upscpdf/

# మయన్మార్‌లో మరోసారి సైనిక పాలన




మయన్మార్ పాలన మరోసారి సైనిక జుంటా(మిలటరీ సమూహం) చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రజాస్వామ్యబద్ధంగా మూడు నెలల క్రితం భారీ మెజారిటీతో ఎన్నికైన ఆంగ్‌సాన్ సూకీ మార్గదర్శకత్వంలో పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఒకే ఒక్క కారణంతో ఆ దేశ సైన్యం ఫిబ్రవరి 1న కూల్చి అధికారాన్ని స్వాధీనం చేసుకుంది. దేశంలో అత్యవసర పరిస్థితి(ఎమర్జెన్సీ) విధిస్తున్నట్టు ప్రకటించింది. అధికార నేషనల్ లీగ్ ఫర్ డెమొక్రసీ(ఎన్ఎల్‌డీ) కీలక నేత, కౌన్సిలర్ హోదాలో ఉన్న ఆంగ్‌సాన్ సూకీ , అధ్యక్షుడు విన్ మింట్ సహా ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులందరినీ సైన్యం గృహనిర్బంధంలో ఉంచింది. ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని రద్దుచేసిన ఏడాది పాటు పాలన తమ నియంత్రణలోనే ఉంటుందని సైన్యం ప్రకటించింది. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహిస్తామని సైన్యం తెలిపింది. ఎన్ఎల్‌డీ ప్రభుత్వాన్ని కూలదోసిన సైన్యం.. ఉపాధ్యక్షుడు మైంట్ స్వెని తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రకటించింది. ఆ వెంటనే మయింట్ సర్వాధికారాలను సైన్యాధిపతి మిన్ ఆంగ్ లయాంగ్‌కు బదలాయించారు. ఆపై లయాంగ్ 11 మందితో నూతన కేబినెట్‌ను ఏర్పాటుచేశారు. అందులోని సభ్యులంతా మాజీ సైనికాధికారులే.





## సైనిక పాలనను వ్యతిరేకిస్తూ ఆందోళనలు

మయన్మార్‌లో పాలనను సైన్యం హస్తగతం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు ఆందోళనలు చేపట్టారు. దేశంలోనే అతిపెద్ద నగరాల్లో ఒకటైన యాంగూన్ సహా దేశంలోని ఇతర ప్రాంతాల్లో వేల సంఖ్యలో ప్రజలు ఆందోళన చేపట్టారు. ఆంగ్‌సాన్ సూకీకి మద్దతుగా, సైనిక నియంతృత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. దేశంలో ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమం తీవ్రమవుతుండడంతో సైనిక ప్రభుత్వం అణచివేత చర్యలను ప్రారంభించింది. రాజధాని నేపిడా సహా దేశంలోని వివిధ నగరాల్లో మొబైల్, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. ఫేస్‌బుక్‌పై ఆంక్షలు పెట్టడంతోపాటు ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లపై నిషేధం విధించింది. టెలివిజన్ ప్రసారాలపై ఆంక్షలు విధించింది. విమానాశ్రయాలను మూసివేసింది.

## మయన్మార్ గతమంతా సైనిక పాలనే..

1948, జనవరి 4న బ్రిటన్ వలస పాలన నుంచి మయన్మార్(బర్మా)కు స్వాతంత్ర్యం లభించింది. ఇంచుమించు భారతదేశంతోపాటే బ్రిటిష్ వలసపాలకులపై పోరాడి మయన్మార్ స్వాతంత్ర్యాన్ని సాధించుకోగా స్వల్పకాలంలోనే అది సైనిక నియంత్రణలోకి వెళ్లిపోయింది. 1962లో మిలటరీ నేత నీ విన్ ప్రభుత్వంపై సైన్యం తిరుగుబాటు చేసి పాలనా పగ్గాలు చేపట్టింది. ఐదు దశాబ్దాలకు పైగా ఆ నియంతృత్వ పాలన కొనసాగింది. 1962 నుంచి అప్పుడప్పుడు సైనిక నియంతలు ఎన్నికలు నిర్వహిస్తూనే వున్నారు. 1988లో దేశంలో జుంటా(మిలటరీ సమూహం)పాలనకు వ్యతిరేకంగా ఆందోళనలు పెరగడంతో ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న ఆంగ్‌సాన్ సూకీ విదేశీ ప్రవాసం నుంచి స్వదేశానికి వచ్చారు. 1989 జూలైలో జుంటాపై తీవ్ర విమర్శలు చేస్తున్న ఆంగ్ సాన్ సూకీని హౌస్ అరెస్టు చేశారు. 1990, మే 27న జరిగిన ఎన్నికల్లో ఆంగ్ సాన్ సూకీ నేతృత్వంలోని నేషనల్ లీగ్ ఫర్ డెమొక్రసీ (ఎన్ఎల్‌డీ) పార్టీ భారీ విజయం సాధించింది. నేషనల్ లీగ్ ఫర్ డెమొక్రసీ (ఎన్ఎల్‌డీ) 80 శాతం స్థానాలు గెలుచుకుంది. కానీ సైన్యం ఆ ఎన్నికలను రద్దు చేసింది. దాంతో యథాప్రకారం మరికొన్నాళ్లు సైనిక పాలన కొనసాగింది. అంతర్జాతీయంగా ఒత్తిళ్లు పెరగటంతో 2010లో మరోసారి తప్పనిసరై ఎన్నికలు నిర్వహించారు. 2010, నవంబర్ 7న జరిపిన ఎన్నికల్లో జుంటా అనుకూల పార్టీకి అత్యధిక సీట్లు దక్కాయి. 2010 నవంబర్ 13న దశాబ్దాల గృహనిర్బంధం (హౌస్ అరెస్టు) అనంతరం సూకీ విడుదలయ్యారు. 2012లో జరిగిన పార్లమెంట్ బైఎలక్షన్‌లో సూకీ విజయం సాధించారు. 2015, నవంబర్ 8న జరిగిన ఎన్నికల్లో సూకీ పార్టీ ఎన్ఎల్‌డీ ఘన విజయం సాధించింది. చాన్నాళ్ల తర్వాత తొలిసారి అంతర్జాతీయ పర్యవేక్షణలో ఆ ఎన్నికలు జరగటం, అందులో ఎన్ఎల్‌డీ ఘన విజయం సాధించటంతో ఇష్టం లేకున్నా సైనిక పాలకులు ఆ పార్టీకి అధికారం అప్పగించారు. అయినా ఆమెకు అధ్యక్ష పదవిచ్చేందుకు సైన్యం నిరాకరించింది. కీలక పదవులను జుంటా తన చేతిలో ఉంచుకొని సూకీకి స్టేట్ కౌన్సిలర్ పదవి అప్పగించారు.

మయన్మార్‌లో 2020 నవంబర్ 8న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఆంగ్‌సాన్ సూకీ నాయకత్వంలోని నేషనల్ లీగ్ ఫర్ డెమొక్రసీ (ఎన్ఎల్‌డీ) భారీ మెజారిటీతో ఘన విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో సూకీ పార్టీ 476 స్థానాలకు గానూ.. 396 స్థానాలు కైవసం చేసుకుని మరోసారి అధికారంలోకి వచ్చింది. ఎన్నికల్లో సైన్యం మద్దతు ఉన్న ప్రతిపక్ష యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ(యూఎస్‌డీపీ) 33 స్థానాలు మాత్రమే సాధించి ఓటమి పాలయింది. సైన్యానికి మద్దతుగా ఉండే మరికొన్ని చిన్న పార్టీలు అంతకన్నా చాలా తక్కువ స్థానాలకు పరిమితమయ్యాయి. పార్లమెంటులో సైన్యం ముందుజాగ్రత్త చర్యగా తనకు తాను కేటాయించుకున్న 166 సీట్ల(25శాతం) కోటా వుంది. ఇంతచేసినా పార్లమెంటులో సైన్యం కోసం మద్దతుగా నిలిచేవారు 32 శాతం మించిలేరు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం సూకీ బృందం రాజ్యాంగ సవరణలకు సమాయత్తమయింది. ఈ చర్యలను సైన్యం వ్యతిరేకించింది. కొత్త పార్లమెంటు సమావేశమై నిర్ణయాలు తీసుకోకుండా తిరుగుబాటు ద్వారా సూకీకి, రాజ్యాంగ సవరణలకు కళ్లెం వేయాలని సైన్యం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 2021 ఫిబ్రవరి 1న అకస్మాత్తుగా సైన్యం తిరుగుబాటు ప్రకటించింది. దీంతో మయన్మార్ పాలన మరోసారి సైనిక జుంటా(మిలటరీ సమూహం) చేతుల్లోకి వెళ్లిపోయింది.



https://ourstudycircle.in/upscpdf/

# ఉత్తరాఖండ్‌లోని ధౌలీగంగ నదిలో ఆకస్మిక వరదలు




'దేవభూమి'గా పేరొందిన ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లా జోషిమఠ్ సమీపంలో నందాదేవి పర్వతం నుంచి ఫిబ్రవరి 7న హఠాత్తుగా మంచు చరియలు విరిగి పడ్డాయి. దీంతో గంగానది ఉపనదులైన అలకనంద, రిషి గంగ, ధౌలీ గంగ నదులకు వరద పోటెత్తింది. భారీ వరదల ధాటికి అలకనంద, ధౌలీ గంగ, రిషి గంగ నదులపై పలు ప్రదేశాల్లో ఉన్న వంతెనలు, ఆనకట్టలు, రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. జల విలయంతో తపోవన్-రేణిలో ఎన్‌టీపీసీ నిర్మిస్తున్న 13.2 మెగావాట్ల రిషిగంగ విద్యుత్ ప్రాజెక్టు పూర్తిగా ధ్వంసమైంది. 480 మెగావాట్ సామర్థ్యమున్న తపోవన్-విష్ణుగఢ్ ప్రాజెక్టు కూడా దెబ్బతింది. ప్రాజెక్టుల వద్ద పనిచేస్తున్న కార్మికులు వరదల్లో, ప్రాజెక్టుల సొరంగ మార్గాల్లో చిక్కుకుపోయారు. ఈ ఘటనలో 58మందికిపైగా ప్రజలు మరణించారు. తపోవన్-విష్ణుగఢ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు ధౌలీగంగ నది(చమోలీ జిల్లా)పై ఉంది. రిషిగంగ హైడల్ ప్రాజెక్టు అలకనంద నదికి ఉపనది అయిన రిషి గంగ నదిపై(చమోలీ జిల్లా)పై ఉంది.

### బలహీనపడ్డ రాతి ప్రాంతం కూలడం వల్లే ఆకస్మిక వరదలు

ఏళ్ల తరబడి మంచు ఏర్పడటం.. తర్వాత అది కరగడం వల్ల బలహీన పడిన రాతి ప్రాంతం కారణంగా ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో మంచుచరియలు విరిగిపడి ఉండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. ఫలితంగానే ఆకస్మిక వరదలు విరుచుకుపడి ఉంటాయని పేర్కొంటున్నారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలోని వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ (డబ్ల్యూఐహెచ్‌జీ)కి చెందిన శాస్త్రవేత్తల ప్రాథమిక పరిశీలనలో ఈ మేరకు వెల్లడైంది.

### మంచు చరియలు విరిగిపడడానికి కారణాలు

హిమాలయాల్లో మంచుచరియలు విరిగిపడడానికి ఎన్నో కారణాలుంటాయి. మంచు కొండలు కోతకు గురి కావడం, అడుగు భాగంలో ఉన్న నీటి ఒత్తిడి పెరగడం, హిమనీ నదాల కింద భూమి కంపించడం వంటి వాటి కారణాలతో ఒక్కసారిగా మంచు చరియలు విరిగిపడతాయి. మంచు పర్వతాల్లో నీటి ప్రవాహం భారీ స్థాయిలో అటు ఇటూ మళ్లినప్పుడు కూడా మంచు చరియలు విరిగిపడుతూ ఉంటాయి.

### కరుగుతున్న మంచు పర్వతాలు , మంచు ఫలకాలు

హిమాలయాలు.. పర్యావరణపరంగా చాలా సున్నితమైనవి. వాతావరణ మార్పులు, మానవ చర్యలు, పెరుగుతున్న భూతాపం వల్ల అక్కడ అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. 20వ శతాబ్దం ప్రారంభం నుంచి ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు దాదాపు 2 డిగ్రీల ఫారెన్‌హీట్ మేర పెరిగాయని ఒక అధ్యయనంలో తేలింది. మిగతా ప్రాంతాలతో పోలిస్తే భూతాపం ప్రభావం ఇక్కడే ఎక్కువగా ఉంది. ఫలితంగా హిమానీనదాలు వేగంగా తరిగిపోతున్నాయి. మంచు కరుగుతోంది.

వాతావరణ మార్పుల వల్ల మంచు, వర్షపు పోకడల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఎత్తయిన పర్వతాల్లో హిమపాతంలో అధికశాతం.. రుతుపవనాలు తాకినప్పుడు సంభవిస్తుంటుంది. వాతావరణ మార్పుల వల్ల కొన్ని దశాబ్దాలుగా రుతుపవనాలు బలహీనమయ్యాయి. దీంతో హిమానీనదాలపై మంచు పేరుకుపోవడం తగ్గిపోతోంది.

- 2000 నుంచి హిమాలయ ప్రాంతంలోని మంచు పర్వతాలు 20-47 శాతం మేర తగ్గిపోయాయి. పరిస్థితి ఇదేరీతిలో కొనసాగితే ఈ శతాబ్దం చివరినాటికి 50 శాతం మేర హిమానీనదాలు తరిగిపోతాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.
- మంచు పర్వతాలు , మంచు ఫలకాలు నీటిని నిల్వ చేసే ట్యాంకుల్లాంటివి. సీజన్లవారీగా అవి మెల్లగా కరుగుతూ నీటిని నదుల్లోకి క్రమంగా వదులుతాయి. వాతావరణ మార్పులతో ఈ కరుగుదల వేగంగా సాగడం వల్ల సరస్సుల్లో, నదుల్లో నీరు ఎక్కువగా చేరుతోంది.
- మంచు అధికంగా కరగడం వల్ల మంచు పర్వతాలపై సరస్సులు ఎక్కువగా ఏర్పడతాయి. 1977 నుంచి నేపాల్ హిమాలయ ప్రాంతంలో గ్లేషియల్ సరస్సులు రెట్టింపు కావడం ఇందుకు నిదర్శనం.
- మంచు కరుగుదల విపరీతంగా ఉన్నప్పుడు ఈ సరస్సుల్లో నీటి మట్టం చాలా వేగంగా పెరిగిపోతుంటుంది. గట్టులా పనిచేసే పర్వతాకృతి వద్ద కూడా మంచు కరిగి, ఆ ప్రాంతం వదులుగా మారుతుంది. దీంతో ఆ గట్టులోని రాతిపెళ్లలను బద్దలుకొట్టుకుంటూ నీరు.. దిగువ ప్రాంతాలకు ప్రవహిస్తుంది. తాజాగా ఉత్తరాఖండ్‌లో జరిగింది ఇదే.

**నష్టాలు :**

- హిందుకుష్ హిమాలయ ప్రాంతంలోని మంచు పర్వతాలు 200 కోట్ల మందికి ప్రాణాధారం. తాగునీరు, సాగునీరు, విద్యుత్ అవసరాలను ఇవి తీరుస్తున్నాయి. మంచు పర్వతాల కరుగుదల వల్ల వీటికి ప్రమాదం ఏర్పడుతుంది.
- నీటి లభ్యత కూడా తగ్గిపోతుంటుంది. ఈ కొరత 20-70 శాతం మేర ఉందని హిమాలయ ప్రాంతంలోని 8 పట్టణాల్లో జరిగిన సర్వేలో వెల్లడైంది. 2050 నాటికి ఇది రెట్టింపు కావొచ్చని అంచనా.



https://ourstudycircle.in/upscpdf/

# 51వ డబ్ల్యూఈఎఫ్ వార్షిక సదస్సు - 2021




51వ 'ప్రపంచ ఆర్థిక వేదిక(వరల్డ్ ఎకనామిక్ ఫోరం - WEF)' వార్షిక సదస్సు 2021 జనవరి 25 నుంచి 29వ తేదీ వరకు జరిగింది. ప్రతియేటా స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వత శ్రేణుల్లోని దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సును నిర్వహించడం ఆనవాయితీ. అయితే, కరోనా కారణంగా ప్రస్తుతం దీనిని వర్చువల్ విధానంలో నిర్వహించారు.

- 'The Great Reset' అనే ఇతివృత్తం(థీమ్)తో నిర్వహించిన ఈ సదస్సులో 70 దేశాలకు చెందిన నేతలు, 1500 మందికి పైగా వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. ఈ సదస్సును 'దావోస్ ఎజెండా'గా వ్యవహరించారు.
- ప్రభుత్వ-ప్రైవేటు పెట్టుబడులు, కొవిడ్ టీకా, ఉద్యోగాల సృష్టి, పర్యావరణ మార్పు తదితర అంశాలు సదస్సులో ప్రముఖంగా చర్చకు వచ్చాయి.

**51వ డబ్ల్యూఈఎఫ్ సదస్సు సందర్భంగా ఆక్స్‌ఫామ్ నివేదిక విడుదల**

ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక సమస్యల్లో ఆర్థిక అసమానతలు ఒకటి. కరోనా మహమ్మారి ఈ సమస్యను మరింత తీవ్రం చేసినట్లు జనవరి 25న 'ద ఇనీక్వాలిటీ వైరస్' (వైరస్ ప్రభావంలో అసమానతలు) పేరుతో ఆక్స్‌ఫామ్ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది.


**నివేదికలోని ముఖ్యాంశాలు :**

- కొవిడ్-19.. గత వందేళ్లలో ప్రజల ఆరోగ్యానికి ముప్పు తెచ్చిన అత్యంత దుర్భర పరిణామం. 1930లో వచ్చిన మహామాంద్యం స్థాయిలో ఆర్థిక వ్యవస్థలను సంక్షోభాల్లోకి నెట్టింది. దేశంలో ధనిక, పేదల మధ్య ఆదాయ వ్యత్యాసాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.
- ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంపద 2020 మార్చి 18 నుంచి డిసెంబరు 31 మధ్య 3.9 ట్రిలియన్ డాలర్లు పెరిగింది.
- తొలి 10 మంది బిలియనీర్లు కరోనా సంక్షోభం ప్రారంభమైన నాటి నుంచి 540 బిలియన్ డాలర్ల సంపదను ఆర్జించారు. ఇదే సమయంలో పేదల సంఖ్య 200-500 మిలియన్లు పెరిగింది.
- ప్రపంచవ్యాప్తంగా అత్యధిక జనాభా రోజుకి 2 డాలర్ల నుంచి 10 డాలర్లతో జీవనాన్ని నెట్టుకొస్తుంటే.. బిలియనీర్లు మాత్రం కరోనా సంక్షోభంతో విమాన ప్రయాణాలపై ఆంక్షలు ఉండడంతో ఏకంగా ప్రైవేట్ జెట్లను కొనుగోలు చేశారు.
- బడ్జెట్‌లో ఆరోగ్య సంరక్షణకు అత్యంత తక్కువ కేటాయింపులు జరిపే దేశాల్లో భారత్‌ది నాలుగో స్థానం. కొవిడ్ సంక్షోభ సమయంలో దేశంలోని 11 మంది దిగ్గజ శ్రీమంతులు ఆర్జించిన ఆదాయాలపై 1 శాతం పన్ను విధిస్తే జన్‌ఔషధి పథకానికి 110 రెట్లు అధికంగా కేటాయింపులు చేయొచ్చు. వీరు పెంచుకున్న సంపదతో గ్రామీణ ప్రాంత ఉపాధి హామీ పథకాన్ని 10 ఏళ్ల పాటు నడిపించవచ్చు.
- లాక్‌డౌన్ ప్రభావం నుంచి శ్రీమంతులు తప్పించుకున్నారు. ఇంటి వద్ద నుంచే పని చేస్తూ స్థిరవేతన ఉద్యోగులు కూడా బయటపడగలిగారు. కానీ 12.2 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇందులో 75 శాతం మంది అంటే 9.2 కోట్ల మంది అసంఘటిత రంగానికి చెందిన వాళ్లే.
- బొగ్గు, చమురు, టెలికాం, ఔషధాలు, విద్య, రిటైల్ విభాగాల్లో వ్యాపార కార్యకలాపాలున్న గౌతమ్ అదానీ, శివ్ నాడార్, సైరస్ పూనావాలా, ఉదయ్ కోటక్, అజీమ్ ప్రేమ్‌జీ, సునీల్ మిత్తల్, రాధాకిషన్ దమానీ, కుమార్ మంగళం బిర్లా, లక్ష్మీ మిత్తల్ ఆదాయాలు 2020 మార్చి నుంచి గణనీయంగా పెరిగాయి.
- 2020 ఏప్రిల్‌లో గంటకు 1,70,000 మంది తమ ఉద్యోగాలు కోల్పోయారు. ఆ నెలలో 1.7 కోట్ల మంది మహిళలు ఉద్యోగాలను కోల్పోయారు. మహిళల నిరుద్యోగిత 15 శాతం మేర పెరిగింది.
- కరోనా కాలంలో అంబానీ ఆర్జించిన డబ్బుతో కనీసం 40 కోట్ల మంది సాధారణ కార్మికులు పేదరికంలోకి జారుకోకుండా, కనీసం ఐదు నెలల పాటు కాపాడవచ్చు.
- లాక్‌డౌన్ సమయంలో భారత శ్రీమంతుల సంపద 35 శాతం పెరిగింది. 2009 నుంచి ఇప్పటికి వీరి సంపద 90 శాతం హెచ్చి 422.9 బిలియన్ డాలర్లకు చేరింది. శ్రీమంతుల సంపద వృద్ధిలో అమెరికా, చైనా, జర్మనీ, రష్యా, ఫ్రాన్స్ తర్వాత భారత్ ఆరో స్థానంలో నిలిచింది.
- లాక్‌డౌన్ కారణంగా ఆత్మహత్యలు, సరైన సమయంలో చికిత్స అందకపోవడం, ఆకలి బాధలతో 300 మందికి పైగా అసంఘటిత కార్మికులు చనిపోయారు.
- పాఠశాలలను సుదీర్ఘకాలం పాటు మూసివేయడం వల్ల బడి మానేసే పిల్లల సంఖ్య పెరగొచ్చు.
- గ్రామీణ ప్రాంతాల్లో 4 శాతం కుటుంబాల్లోనే కంప్యూటర్లుంటే, 15 శాతం కంటే తక్కువ కుటుంబాలకే ఇంటర్నెట్ సదుపాయం ఉంది.
- ఫోర్బ్స్- 2020 బిలియనీర్ల జాబితాను పరిశీలించిన ఆక్స్‌ఫామ్.. జెఫ్ బెజోస్, ఎలాన్ మస్క్, బిల్ గేట్స్, మార్క్ జుకర్‌బర్గ్, వారెన్ బఫెట్ సహా తొలి పది మంది బిలియనీర్ల సంపద కరోనా సంక్షోభం ప్రారంభమైన తర్వాత దాదాపు 500 బిలియన్ డాలర్లు పెరిగినట్లు తెలిపింది. మరోవైపు ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం.. పేదల సంఖ్య 2030 నాటికి 3.4 బిలియన్లకు చేరుకునే అవకాశం ఉందని తెలిపింది. కరోనా ప్రారంభానికి ముందు కంటే ఇది అధికం కావడం గమనార్హం. మహిళలు, సాంస్కృతికంగా వెనుకబడిన జాతులు.. పేదరికం, ఆకలి, ఆరోగ్యం విషయంలో మరింత ఘోరమైన పరిస్థితుల్ని చవిచూడాల్సి రావొచ్చని అంచనా వేసింది.



https://ourstudycircle.in/upscpdf/

# విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం



విశాఖపట్నం స్టీలు ప్లాంటును 100 శాతం ప్రైవేటీకరిస్తున్నట్లు కేంద్రం ఫిబ్రవరి 3న వెల్లడించింది. ప్రైవేటీకరణ ద్వారా యాజమాన్య హక్కులతో పాటు, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)లో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న 100% షేర్‌హోల్డింగ్‌ను ఉపసంహరించుకోవడానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ జనవరి 27న ఆమోదముద్ర వేసింది.

'విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు' అన్న నినాదంతో ఉద్ధృత పోరాటం ఫలితంగా 1971లో శంకుస్థాపన చేసుకున్న ఈ ప్రాజెక్ట్ 1992లో పూర్తయి అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు చేతులమీదుగా ప్రారంభమైంది. ఈ నవరత్న సంస్థలో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వానికే 100% వాటాలున్నాయి. సముద్రతీరంలో ఏర్పాటైన తొలి సమీకృత ఉక్కు కర్మాగారం ఇదే. ఒకప్పుడు భారీ నష్టాల్లో కూరుకుపోయిన సంస్థ.. తర్వాతి కాలంలో తేరుకొని రూ. 21,851 కోట్ల టర్నోవరు సాధించే స్థాయికి చేరింది. నాలుగేళ్లలో 203.6% వృద్ధి సాధించింది. 2010 నవంబరు 17న దీనికి నవరత్న హోదా కల్పించారు. దేశంలో అతిపెద్ద సింగిల్ సైట్ ప్లాంటు ఇదే.

ఇంతటి ఘనచరిత్ర ఉన్న ఈ సంస్థ.. 2015 నుంచి వరుస నష్టాల్లో కూరుకుపోయింది. ఇప్పుడు ఆ నష్టాల కారణంగానే కేంద్రప్రభుత్వం దీన్ని పూర్తిగా ప్రైవేటుకు అప్పగించడానికి సిద్ధమైంది. 2015-16లో రూ.1,420.64 కోట్లు, 2016-17లో రూ.1,263.16 కోట్లు, 2017-18లో రూ.1,369.01 కోట్ల నష్టం చవిచూసింది. 2018-19లో రూ.96.71 కోట్ల లాభం సంపాదించింది. విస్తరించిన యూనిట్ల నుంచి ఉత్పత్తిని పెంచి, మార్కెట్‌ను మెరుగుపరుచుకొంది. కానీ 2019-20 తొలి త్రైమాసికం నాటికి మళ్లీ రూ.636.78 కోట్ల నష్టాలు చవిచూసింది. నష్టాలకు ప్రధాన కారణం సొంత గనులు లేకపోవడమేనని పార్లమెంటు స్థాయీసంఘం గుర్తించింది. సొంత గనులు లేక ముడిసరకునంతా బయటినుంచి కొనాల్సి వస్తోంది. కొన్నేళ్లుగా బహిరంగమార్కెట్‌లో ఇనుప ఖనిజం, బొగ్గు ధరలు పెరగడంతో రూ.4వేల కోట్ల భారాన్ని మోయాల్సి వచ్చింది. ఆధునికీరణ, విస్తరణ చేపట్టడంతో పెద్దఎత్తున ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంది. 2018తో పోలిస్తే 2019 జూన్‌నాటికి ఉక్కు ఉత్పత్తి ఖర్చులు దాదాపు 7% పెరిగాయి. సంస్థను లాభాలబాటలో నడపడానికి మెకెన్సీ సంస్థను కన్సల్టెంటుగా పెట్టుకొన్నారు. ఇంతలోనే కేంద్ర ప్రభుత్వం 100% ప్రైవేటీకరణకు సిద్ధమైంది.

# బెంగళూరులో 13వ ఏరో ఇండియా వైమానిక ప్రదర్శన-2021




13వ ఏరో ఇండియా-2021 వైమానిక ప్రదర్శన(ఏరో ఇండియా-2021 ఎయిర్ షో) ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు కర్ణాటక రాజధాని బెంగళూరులోని యలహంక వైమానిక స్థావరంలో జరిగింది. ఈ అంతర్జాతీయ వైమానిక ప్రదర్శనను ఫిబ్రవరి 3న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు.

- ప్రత్యక్షంగానూ, వర్చువల్ మాధ్యమం లోనూ జరిగిన ఈ 'ఏరో ఇండియా-2021' ద్వైవార్షిక ప్రదర్శన.. ప్రపంచంలోనే తొలి హైబ్రిడ్ ఎయిర్ షోగా భావిస్తున్నారు. 523 భారతీయ, 78 విదేశీ కంపెనీలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి.
- అంతర్జాతీయ వైమానిక ప్రదర్శనలో భాగంగా స్వదేశీ నిర్మిత తేజస్, భారత వాయుసేనకు చెందిన సుఖోయ్, రఫేల్ యుద్ధ విమానాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అలాగే రాఫెల్, సుఖోయ్, హాక్, అమెరికాకు చెందిన బీ-1బీ లాన్సర్ హెవీ బాంబర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నాలుగేళ్ల కిందట భారతీయ వైమానిక విభాగంలో చేరిన ఎల్‌సీఏ తేజస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సారంగ్, సూర్యకిరణ్ విమానాలు, సుఖోయ్ 30-ఎంకే1 వైవిధ్య విన్యాసాలతో ఆకట్టుకున్నాయి.
- ఈ ఎయిర్ షోలో ప్రపంచ దేశాల్లోని 601 సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. కరోనా నేపథ్యంలో సాధారణ ప్రేక్షకులకు డిజిటల్ వేదికల ద్వారా ఈ ప్రదర్శనను వీక్షించే వీలు కల్పించారు.
- ఈ ఎయిర్‌షోలో భారత్‌కు చెందిన ఫస్ట్ జనరేషన్ యాంటీ రేడియేషన్ మిస్సైల్ రుద్రం-1ను ప్రదర్శించారు. భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానాలు ఈ క్షిపణులను మోసుకువెళ్తాయి. గగనతలంలో సుమారు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రు రేడార్లను ఈ మిస్సైల్ ధ్వంసం చేయగలదు
- 13వ అంతర్జాతీయ వైమానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... వైమానిక ప్రదర్శన సందర్భంగా సుమారు 200 విదేశీ సంస్థలతో కుదిరిన ఒప్పందాలు, 28 భారతీయ సముద్ర వలయ దేశాల రక్షణాధికారులతో చర్చలు భారతీయ రక్షణ రంగం బలోపేతానికి ఉపకరించగలదని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు.
- **బీడీఎల్ కొత్త ఆయుధాలు గరుడాస్త్ర, దిషాని విడుదల :** ఈ ప్రదర్శనలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) రెండు కొత్త ఆయుధాలను విడుదల చేసింది. గరుడాస్త్ర, దిషాని అనే ఈ రెండూ నీటి అడుగులో దూసుకెళ్లేవే.



https://ourstudycircle.in/upscpdf/



# అంతర్జాతీయం

## ఇస్లామిజం కట్టడి బిల్లుకు ఫ్రాన్స్ ఆమోదం




ఫ్రాన్స్‌లో గణనీయంగా పెరుగుతున్న ఇస్లామిజం కట్టడి లక్ష్యంగా ఒక బిల్లును ఆ దేశ జాతీయ అసెంబ్లీ ఆమోదించింది. ఇది దేశ ఐక్యతకు ముప్పని అందులో పేర్కొంది. అయితే ఆ బిల్లులో ఏ మతం గురించి అన్నది ప్రస్తావించలేదు. బలవంతపు వివాహాలు, కన్యత్వ పరీక్షలపై నియంత్రణ, పిల్లలకు వేరుగా విద్యా బోధనపై ఆంక్షలు, హింసకు తావిచ్చే ఆన్‌లైన్ క్షమాపణలపై కఠిన చర్యలు, మత సంఘాలపై పటిష్ఠ నిఘా వంటివి ఈ బిల్లులో పేర్కొన్నారు. ఫ్రాన్స్‌లో ముస్లింల జనాభా సుమారు 50 లక్షలని అంచనా. మెజార్టీ కుటుంబాలు అల్జీరియా మూలాలకు చెందినవే. మరోవైపు ఇస్లామిక్ మిలిటెంట్ దాడులతో ఆ దేశం సతమతమవుతున్నది. మత తీవ్రవాదం, దేశ భద్రత, ఫ్రెంచ్ గుర్తింపు వంటి సమస్యలు కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో దేశం నుంచి మతాన్ని వేరు చేసే ఈ బిల్లును అధికార పార్టీకి చెందిన మెజారిటీ సభ్యులున్న దిగువ సభ 347కు 151 ఓట్లతో ఫిబ్రవరి 16న ఆమోదించింది. మహ్మద్ ప్రవక్తపై కార్టూన్లు ప్రదర్శించిన స్కూల్ టీచర్ శామ్యూల్ పాటీని గత ఏడాది(2020) అక్టోబర్ 16న శిరచ్ఛేదనంపై ఈ సందర్భంగా పెద్ద చర్చ జరిగింది. అయితే కొద్ది మంది ఇస్లాంవాదుల స్వేచ్ఛను సవరించే ప్రయత్నంలో భాగంగా అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ప్రభుత్వం ప్రతి ఒక్కరి స్వేచ్ఛను పరిమితం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని ప్రతిపక్షాలు ఆరోపించాయి. దిగువ సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు ప్రతిపక్షాల ఆధిక్యమున్న సెనేట్‌కు చేరుతుంది.

### పండ్లు కూరగాయల ఏడాదిగా 2021



2021ని 'అంతర్జాతీయ పండ్లు, కూరగాయల ఏడాదిగా ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ప్రకటిస్తూ ఫిబ్రవరి 1న తీర్మానం చేసింది. తాజా పండ్లు, కూరగాయలు తింటే కలిగే ప్రయోజనాలపై ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఐక్యరాజ్య సమితి నిర్ణయించింది.

### అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై సెనేట్‌లో వీగిపోయిన అభిశంసన తీర్మానం



అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏడాది వ్యవధిలో రెండోసారి అభిశంసన నుంచి బయటపడ్డారు. తీర్మానాన్ని ఆమోదించడానికి అవసరమైన సంఖ్యాబలాన్ని కూడగట్టడంలో డెమోక్రాట్లు మరోసారి విఫలమయ్యారు. దీంతో అమెరికా సెనేట్ ఆయనకు విముక్తి కల్పించింది. అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ విజయాన్ని ధ్రువీకరించడానికి 2021 జనవరి 6న సెనేట్ సమావేశమైనప్పుడు కేపిటల్ భవనంపై తన మద్దతుదారులు దాడికి పాల్పడేలా ట్రంప్ ప్రేరేపించారంటూ అభిశంసన తీర్మానాన్ని పెట్టిన విషయం తెలిసిందే. దీనిపై ఫిబ్రవరి 13న సెనేట్‌లో ఓటింగ్ జరిగినప్పుడు అనుకూలంగా 57, ప్రతికూలంగా 43 ఓట్లు వచ్చాయి. ఒకవేళ ట్రంప్ అభిశంసనకు గురైతే ఆ తర్వాత ఆయనను భవిష్యత్ ఎన్నికల్లో ఎప్పుడూ పోటీ చేయడానికి వీల్లేకుండా తీర్మానం ఆమోదించాలని సెనేట్‌లో డెమోక్రాట్లు భావించారు. కానీ రిపబ్లికన్ పార్టీ వారికి సహకరించలేదు. అధ్యక్ష పదవి నుంచి ట్రంప్ దిగిపోయాక ఆయనపై అభిశంసన మోపడమే సరికాదని వాదించింది. కాగా అమెరికా చరిత్రలో రెండుసార్లు అభిశంసన విచారణ ఎదుర్కొన్న తొలి అధ్యక్షుడిగా ట్రంప్ రికార్డుల కెక్కారు. పదవీకాలం అయిపోయాక అభిశంసన ఎదుర్కొన్న మొదటి వ్యక్తి కూడా ఆయనే. అధికార దుర్వినియోగం, కాంగ్రెస్‌ను అడ్డుకోవడం వంటి అభియోగాలపై 2020 ఫిబ్రవరి 5న మొదటిసారి అభిశంసనను ఆయన ఎదుర్కొని బయటపడ్డారు.

### బీబీసీ వరల్డ్ న్యూస్ ప్రసారాలను నిలిపివేసిన చైనా




తమ దేశంలో ప్రముఖ మీడియా సంస్థ బీబీసీ వరల్డ్ న్యూస్ ప్రసారాలను నిలిపి వేసినట్లు చైనా ప్రభుత్వం ఫిబ్రవరి 12న ప్రకటించింది. తమ దేశంలో కవరేజీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహ రిస్తున్నందుకే బీబీసీపై నిషేధం విధిస్తున్నట్లుగా "ది నేషనల్ రేడియో అండ్ టెలివిజన్ అడ్మినిస్ట్రేషన్" (ఎన్ఆర్‌టీఏ) ప్రకటించింది. చైనాలో ఉయిఘర్ ముస్లింలు, కరోనా మహమ్మారికి సంబంధించిన కథనాలను బీబీసీ పక్షపాత ధోరణితో ప్రసారం చేస్తోందని తెలిపింది. యూకేలో చైనా గ్లోబల్ టెలివిజన్ నెట్‌వర్క్ (సీజీటీఎన్) ప్రసారాల లైసెన్స్‌ను బ్రిటన్‌కు చెందిన మీడియా నియంత్రణ సంస్థ ఆఫ్‌కామ్ రద్దు చేసిన వారం రోజుల్లోనే చైనా ప్రతీకారం తీర్చుకుంది. ఇటీవల హాంకాంగ్‌లో బీజింగ్ వివాదాస్పద భద్రతా చట్టాలను ప్రవేశపెట్టిన నేపథ్యంలో చైనా, యూకే మధ్య సంబంధాలు దిగజారాయి. 2021 జనవరిలో 5.4 మిలియన్ల హాంకాంగ్ వాసులకు యూకేలో జీవించే హక్కు కల్పించే దిశగా బ్రిటన్ ప్రభుత్వం ఓ వీసా విధానాన్ని తీసుకురావడం చైనాకు ఆగ్రహం తెప్పించింది.



https://ourstudycircle.in/upscpdf/

## వూహాన్ మార్కెట్‌ను సందర్శించిన డబ్ల్యూహెచ్‌ఓ బృందం




కరోనా వైరస్ ఎక్కడ పుట్టిందన్న విషయాన్ని నిర్ధారించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఏర్పాటు చేసిన 14 మంది సభ్యుల నిపుణుల బృందం జనవరి 31న చైనాలోని వూహాన్‌లో ఉన్న హునన్ సీఫుడ్ మార్కెట్‌ను సందర్శించింది. 2019లో కరోనా వైరస్ ఇక్కడే తొలిసారిగా జంతువుల నుంచి మనుషులకు సంక్రమించిందన్న విమర్శలు ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఈ మార్కెట్‌లో సముద్ర ఉత్పత్తులతో పాటు రకరకాల జంతువుల మాంసాన్ని విక్రయిస్తుంటారు. ఇక్కడ విక్రయించే గబ్బిలాలు/పాంగోలిన్స్ నుంచే కరోనా వైరస్ పుట్టిందన్న వాదన ఉంది. అయితే, దీన్ని చైనా ప్రభుత్వం అంగీకరించడం లేదు. 2019 డిసెంబర్‌లో వూహాన్‌లో కరోనా కేసులు బయటపడిన తర్వాత ఈ మార్కెట్‌ను మూసివేసి, శుభ్రం చేశారు.

## మెర్సీ కిల్లింగ్ బిల్లుకు పోర్చుగల్ పార్లమెంట్ ఆమోదం

మెర్సీ కిల్లింగ్‌కు చట్టపరమైన గుర్తింపు ఇచ్చే బిల్లును పోర్చుగల్ పార్లమెంటు ఆమోదించింది. ఈ బిల్లుకు 136 మంది ఓట్లు అనుకూలంగా, 78 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఇప్పుడు ఈ బిల్లు ఆమోదం కోసం అధ్యక్షుడి వద్దకు పంపారు. అధ్యక్షుడు సంతకం చేసిన తర్వాత ఇది చట్టంగా మారుతుంది. ఆ దేశాధ్యక్షుడు బిల్లుపై సంతకం చేసిన పక్షంలో ఈ రకం చట్టం తీసుకొచ్చిన ఐరోపాలో నాల్గవ దేశంగా.. ప్రపంచంలో 7వ దేశంగా అవతరించనున్నది. కాథలిక్కులను విశ్వసించే వారు ఈ బిల్లును వ్యతిరేకించారు. కాథలిసిజం పోర్చుగల్‌లో అతిపెద్ద మతం. ఈ బిల్లు ప్రకారం ....మెర్సీ కిల్లింగ్ కోరుకునే వ్యక్తి వయస్సు 18 సంవత్సరాలు పైబడి ఉండాలి. అతనికి తీవ్రమైన గాయం లేదా ఏదైనా ప్రాణాంతక వ్యాధి ఉండి నయం చేయలేని పరిస్థితులు ఉండాలి. అతను భరించలేని నొప్పితో బాధపడుతూ.. పూర్తిగా స్పృహలో ఉండాలి. ఇటువంటి పరిస్థితుల్లోనే వైద్యుల సలహా మేరకు మాత్రమే మెర్సీ కిల్లింగ్‌కు అనుమతి ఇవ్వబడుతుంది. వైద్యులు, నర్సులు ఈ రకం మరణాలను తిరస్కరించవచ్చని బిల్లులో పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితిలో వారు రాష్ట్రపతి నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. కేసును కోర్టుకు సూచించడానికి లేదా నేరుగా కొట్టివేయడానికి రాష్ట్రపతి వీటోను ఉపయోగించుకునే అధికారం ఉన్నది.

- నెదర్లాండ్స్, బెల్జియం, కొలంబియా, లక్సెంబర్గ్, వెస్ట్రన్ ఆస్ట్రేలియా, కెనడా దేశాల్లో మెర్సీ కిల్లింగ్ చట్టబద్ధంగా ఉన్నది. బ్రిటన్‌తో పాటు యూరప్‌లోని చాలా పెద్ద దేశాలు దీనికి వ్యతిరేకంగా ఉన్నాయి.

## కరోనా కారణంగా పేదరికంలోకి 12 కోట్ల మంది ప్రజలు



కరోనా మహమ్మారి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా మరో 11.9 కోట్ల నుంచి 12.4 కోట్ల మంది నిరు పేదరికంలోకి వెళ్లనున్నారని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. గతేడాది (2020) అక్టోబర్‌లో 8.8 కోట్ల నుంచి 11.5 కోట్లుగా ఉన్న ఈ అంచనా.. తాజాగా జనవరి లెక్కల ప్రకారం మరింత పెరిగినట్లు ప్రపంచ బ్యాంక్ 2021 జనవరి 24న వెల్లడించింది. 2020లో ప్రపంచ పేదరికం అసాధారణ స్థాయిలో పెరిగిపోయిందని స్పష్టం చేసింది. గత 20 ఏళ్లుగా పేదరిక నిర్మూలన కోసం చేసిన కృషి, దాని ఫలితాలపై కరోనా గట్టిదెబ్బ కొట్టిందని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది. గడిచిన రెండు దశాబ్దాలలో తొలిసారి మళ్లీ ఇప్పుడే పేదరికం పెరిగిపోయిందని చెప్పింది. 1999 నుంచి ఇప్పటి వరకూ ప్రపంచ వ్యాప్తంగా 100 కోట్ల మంది నిరు పేదరికం నుంచి బయటపడ్డారని, ఇప్పుడు మరోసారి కరోనా కారణంగా పేదరికం పెరిగిపోతోందని వరల్డ్ బ్యాంక్ స్పష్టం చేసింది.

## జపాన్‌లో 'మినిస్ట్రీ ఆఫ్ లోన్లీనెస్' పేరుతో మంత్రిత్వశాఖ



జపాన్‌లో ఒంటరితనంతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకునేవారు ఎక్కువ. అందుకే ప్రజల్లో ఒంటరితనాన్ని పోగొట్టి.. వారిలో ఆత్మవిశ్వాసం నింపడం కోసం ఆ దేశ ప్రభుత్వం 'మినిస్ట్రీ ఆఫ్ లోన్లీనెస్' పేరుతో మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. ఆ దేశ ప్రధానమంత్రి యోషిహిదే సుగా ఈ మంత్రిత్వ శాఖను రీజినల్ రీవైటలేజన్ మంత్రికి కేటాయించారు. ఈ శాఖ ద్వారా యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపే విధంగా కార్యక్రమాలు రూపొందించనున్నారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే జపాన్‌లో ఆత్మహత్య రేటు అధికంగా ఉంటోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2020లో 20,919 మంది ఆత్మహత్య చేసుకున్నారట. 2019 లెక్కలతో పోలిస్తే ఇది 3.7 శాతం అధికం. 2020లో కరోనా మహమ్మారి కారణంగా ప్రపంచమంతా నష్టపోయినట్లే జపాన్ కూడా తీవ్రంగా నష్టపోయింది. 2018లోనూ యూకే 'మినిస్ట్రీ ఆఫ్ లోన్లీనెస్' శాఖను ఏర్పాటు చేసింది. కాకపోతే.. ఆ దేశంలో ఒంటరితనం అనుభవిస్తున్న వృద్ధుల సంక్షేమం కోసం దీన్ని ఏర్పాటు చేశారు.

## బ్రిటన్‌లో ప్రమాదకరమైన కొత్తరకం కరోనా వైరస్

బ్రిటన్‌లో వెలుగుచూసిన కొత్తరకం కరోనా వైరస్ ప్రమాదకరమైందేనని అక్కడి ప్రభుత్వ నివేదిక వెల్లడించింది. ఇతర వైరస్‌లతో పోలిస్తే దాదాపు 70 శాతం ఎక్కువ ముప్పు ఉందని, ఇందుకు వైరస్‌లో చోటుచేసుకుంటున్న మార్పులే

## పాకిస్తాన్‌లో ఇరాన్ సర్జికల్ స్ట్రయిక్

పాకిస్తాన్‌లోని బలూచిస్థాన్‌లో ఫిబ్రవరి 4న ఇరాన్ మెరుపు దాడులు (సర్జికల్ స్ట్రైక్) చేసి జైష్-ఉల్-అదల్ అనే ఉగ్రవాద సంస్థ చెరలో ఉన్న తమ ఇద్దరు బోర్డర్ గార్డులను విజయవంతంగా విడిపించింది. ఇరాన్ సైన్యంలోని రివల్యూషనరీ గార్డ్స్ దళం (ఐఆర్‌జీసీ) వీటిని చేపట్టింది. బలూచిస్థాన్‌లోని జైష్-ఉల్-అదల్ అనే ఉగ్రవాద ముఠా 2018 అక్టోబర్ 16న 12 మంది ఇరాన్ సైనికులను అపహరించింది. పాకిస్తాన్-ఇరాన్ సరిహద్దుల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. వారిని రెండు దేశాల సరిహద్దుల్లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో మెర్కావా నగరానికి తరలించింది. వారిని సురక్షితంగా విడిపించేందుకు ఇరు దేశాల మిలటరీ అధికారులు ఒక జాయింట్ కమిటీని ఏర్పాటు చేశారు. మిలటరీ ఆపరేషన్లు నిర్వహించి, ఇప్పటి వరకు దాదాపు 10 మందిని ఐఆర్‌జీసీ గార్డులను విడిపించగలిగారు. తాజాగా సర్జికల్ స్ట్రైక్స్‌తో ఇరాన్ సైన్యం మిగిలిన ఇద్దరిని కూడా రక్షించింది. ఉగ్రవాద సంస్థ జైష్-ఉల్-అదల్ ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం సాగిస్తోంది. ఇరాన్‌లోని బలూచ్ సున్నీల హక్కులను కాపాడడానికి తాము పోరాడుతున్నామని చెబుతోంది.



https://ourstudycircle.in/upscpdf/

(మ్యుటేషన్‌లు) కారణమవుతున్నాయని స్పష్టం చేసింది. కొత్తరకం వైరస్ తీవ్రతను అంచనా వేసేందుకు ఏర్పాటు చేసిన సలహా బృందం ఇచ్చిన తాజా నివేదికను అక్కడి ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. బ్రిటన్‌లో కెంట్ నగరంలో వెలుగు చూసిన కొత్తరకం వైరస్ అత్యంత వేగంగా వ్యాప్తి చెందడంతో పాటు ప్రమాద తీవ్రత పెరిగినట్లు నిపుణులు ఇప్పటికే అంచనా వేశారు. వీటికి సంబంధించిన ప్రాథమిక పరిశోధనా నివేదికను జనవరి 21వ తేదీన నిపుణుల బృందం విడుదల చేసింది. వీటిని నిర్ధారించేందుకు దజన్ల సంఖ్యలో వైరస్ సోకిన వారి సమాచారాన్ని నిపుణులు విశ్లేషించారు. వైరస్ సోకి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వివరాలు, మరణాల రేటును సరిపోల్చి చూశారు. దీంతో ఇతర వైరస్‌ల కంటే ఈ 'కెంట్ రకం' వైరస్ వల్ల 30 నుంచి 70శాతం అధిక ముప్పు ఉన్నట్లు వెల్లడైంది. ఇక బ్రిటన్ రకం వైరస్‌తో పాటు దక్షిణాఫ్రికా రకం వైరస్ ప్రభావంతో ప్రపంచ దేశాలన్నీ అప్రమత్తమైన విషయం తెలిసిందే. దీంతో విదేశీ ప్రయాణికులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయి. ఇందులో భాగంగా భారత్‌లోనూ ఈ తరహా కేసులు బయటపడినప్పటికీ, ఇప్పటి వరకు ఎటువంటి ప్రమాదకర పరిస్థితి తలెత్తలేదు. కొత్తరకం వైరస్ ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 80 దేశాలకు వ్యాపించినట్లు ఈ మధ్యే ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది.

### మంగోలియా ప్రధాని ఖురేసుఖ్ ఉఖ్నా రాజీనామా



కొవిడ్ మహమ్మారి కట్టడిలో విఫలమవడంతో మంగోలియా ప్రధాని ఖురేసుఖ్ ఉఖ్నా జనవరి 21న పార్లమెంట్‌కు తన రాజీనామా పత్రాన్ని సమర్పించినట్లు ఆ దేశ మీడియా సంస్థ వెల్లడించింది. కొవిడ్ రోగి, ఆమె నవజాత శిశువుకు పునరావాసం కల్పించడంలో మంగోలియా ప్రభుత్వం సరిగా వ్యవహరించలేదని విమర్శలు వచ్చాయి. దాంతో తప్పని పరిస్థితుల్లో ప్రధాని రాజీనామాను సమర్పించాల్సి వచ్చిందని పేర్కొంది.

### పాకిస్థాన్ బాస్మతికి భౌగోళిక గుర్తింపు



పాకిస్థాన్‌లో పండే బాస్మతి బియ్యానికి యూరోపియన్ యూనియన్ (ఈయూ) భౌగోళిక గుర్తింపు (జీఐ) లభించింది. బాస్మతి బియ్యం మూలాలు భారత్‌లోనే ఉన్నాయంటూ ఈయూలో ఇండియా దరఖాస్తు నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకొన్నది. అంతర్జాతీయ మార్కెట్లో బాస్మతి బియ్యానికి ధరలు పెరగడంతో ఈయూ దేశాలకు పాక్ బాస్మతి బియ్యం ఎగుమతి చేయకుండా అడ్డుకోవడానికి భౌగోళిక గుర్తింపు కోసం దరఖాస్తు చేసింది.

### నేపాల్ ప్రధాని ఓలి ఎన్‌సీపీ ప్రాథమిక సభ్యత్వం రద్దు



నేపాల్ కమ్యూనిస్టు పార్టీ(ఎన్‌సీపీ)లో ప్రధాని కేపీ శర్మ ఓలి ప్రాథమిక సభ్యత్వాన్ని ఆ పార్టీలోని ప్రచండ వర్గం రద్దు చేసింది. జనవరి 24న సమావేశమైన పార్టీ కేంద్ర కమిటీ.. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా పార్టీ కేపీ శర్మ ఓలి సభ్యత్వాన్ని తొలగిస్తున్నటు తెలిపింది. గతేడాది (2020) డిసెంబరులో పార్లమెంట్‌ను రద్దు చేస్తున్నట్లు నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి ప్రకటించిన వెంటనే అధికార పార్టీలో చీలిక మొదలైన విషయం తెలిసిందే. ఓలి నిర్ణయాన్ని వ్యతిరేకించిన ప్రచండ(పుష్ప కమల్ దహాల్) నేతృత్వంలోని మరో వర్గం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది. అధికార పార్టీ రెండుగా చీలిపోగా.. మెజార్టీ వర్గం ప్రచండ నాయకత్వాన్ని బలపరుస్తోంది. ఇప్పటికే పార్టీ ఛైర్మన్‌గా ఓలిని తప్పించిన ప్రచండ వర్గం, తాజాగా ప్రాథమిక సభ్యత్వాన్ని సైతం రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. పార్టీ వ్యతిరేక చర్యలకు ఓలి పాల్పడ్డారని, దీనిపై పార్టీ నాయకత్వానికి ఎలాంటి వివరణ ఇవ్వకపోవడంతో ఈ చర్య తీసుకున్నట్టు తెలిపింది.

### డొనాల్డ్ ట్రంప్ వలస నిబంధనలు ఉపసంహరణ



దేశ వలస విధానంలో సమూల మార్పులకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించి మూడు కార్యనిర్వాహక ఉత్తర్వులపై బైడెన్ సంతకాలు చేశారు. మాజీ అధ్యక్షుడు ట్రంప్ వలసదారులపై అమలు చేసిన అత్యంత కఠిన నిబంధనల్ని వెనక్కి తీసుకున్నారు. పిల్లలను తల్లిదండ్రులకు దూరం చేసినటువంటి నిబంధనలు సహా ట్రంప్ కఠిన వలస విధానాలు రద్దవుతాయని బైడెన్ తెలిపారు. అమెరికా పౌరసత్వం కోసం ఎదురుచూస్తున్న భారతీయులకు బైడెన్ నిర్ణయం లబ్ధి చేకూర్చనున్నది.

**బైడెన్ సంతకాలు చేసిన మూడు ఉత్తర్వుల వివరాలు :-**

**1.** మెక్సికో సరిహద్దును దాటి అమెరికాలోకి ప్రవేశించిన పలువురి వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో.. వారి నుంచి చిన్నారులను డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం వేరుచేసింది. వారిని వేర్వేరు ప్రాంతాల్లో ఉంచింది. దాదాపు 5,500 కుటుంబాలు ఇలా విడిపోవాల్సి వచ్చిందని అంచనా. వారందర్నీ గుర్తించి, చిన్నారులను తల్లిదండ్రులతో కలిపేందుకు హోంల్యాండ్ సెక్యూరిటీ మంత్రి ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక కార్యదళాన్ని ఏర్పాటుచేయడం తాజాగా బైడెన్ సంతకం చేసిన తొలి కార్యనిర్వాహక ఉత్తర్వు ఉద్దేశం. విడిపోయిన తల్లిదండ్రుల్ని, పిల్లల్ని కలిపే కార్యక్రమాన్ని ఈ కమిటీ నిర్వహిస్తుంది. అమెరికా, మెక్సికో సరిహద్దుల్లో అక్రమ వలసల నివారణకు ట్రంప్ ప్రభుత్వం అనుసరించి, జీరో టాలరన్స్ విధానం వల్ల 5,500 కుటుంబాలు విడిపోయాయి. ఇప్పటికీ 600కిపైగా పిల్లల తల్లిదండ్రుల్ని గుర్తించలేకపోయారు.

**2.** వలసలకు మూలకారణాలను సమగ్రంగా అధ్యయనం చేయడంతో పాటు మానవతా దృక్పథంతో కూడిన శరణార్థ వ్యవస్థను రూపొందించడమే లక్ష్యంగా రెండో ఉత్తర్వును జారీ చేశారు. ఉత్తర మెక్సికోలో మానవీయ సంక్షోభానికి దారి తీసిన మైగ్రెంట్ ప్రొటెక్షన్ ప్రోటోకాల్ కార్యక్రమాన్ని రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఈ ఉత్తర్వుల్లో హోంల్యాండ్ సెక్యూరిటీని ఆదేశించారు.

**3.** ఇక మూడో కార్యనిర్వాహక ఉత్తర్వు స్వేచ్ఛాయుత చట్టబద్ధమైన వలస విధానానికి సంబంధించింది. ఇటీవల కాలంలో వలస విధానానికి సంబంధించిన నియంత్రణల్ని, విధానాలను ప్రభుత్వం సమూలంగా సమీక్షించడం కోసం మూడో ఉత్తర్వుపై సంతకం చేశారు.

### ఆన్‌లైన్‌లో బ్లాగులు రాసేవారిపై చైనా ఆంక్షలు

సామాజిక మాధ్యమాల్లో, ఆన్‌లైన్‌లో బ్లాగులు రాసేవారిపై చైనా ఆంక్షలు విధించింది. బ్లాగర్లు ఇక నుంచి తాము రాసిన వ్యాసాలకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొన్న తర్వాతే ఆన్‌లైన్‌లో పోస్టు చేయాలని ఆదేశించింది. చైనాలో రాజకీయ, సైనిక, ప్రభుత్వ అంశాల ప్రచురణకు 2017 నుంచీ అనుమతి తప్పనిసరి. కాగా, ఇప్పుడు ఈ జాబితాలోకి ఆరోగ్య, ఆర్థిక, విద్యా, న్యాయ పరమైన అంశాలను కూడా చేర్చారు.



https://ourstudycircle.in/upscpdf/



## భారత మిత్ర దేశాలకు 'వ్యాక్సిన్ మైత్రి' కార్యక్రమం



భారతదేశంలో తయారు చేసిన కరోనా వ్యాక్సిన్‌ను పొరుగు, మిత్రదేశాలకు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన 'వ్యాక్సిన్ మైత్రి' కార్యక్రమాన్ని 2021 జనవరి 20న భారత ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా భారత్ నుంచి స్నేహపూర్వక వ్యాక్సిన్ బహుమతిని దక్కించుకున్న తొలి దేశంగా భూటాన్ నిలిచింది. భూటాన్‌కు జనవరి 20న 1,50,000 కోవిషీల్డ్ వ్యాక్సిన్ డోసులను భారతదేశం అందించింది. అలాగే మాల్దీవులు, నేపాల్, బంగ్లాదేశ్, సీషెల్స్, మారిషస్, మొరాకో, బ్రెజిల్ సహా పలు దేశాలకు వ్యాక్సిన్ డోసులను అందించింది. కరోనా వైరస్‌తో అతలాకుతలమైన బ్రెజిల్‌కు భారత్ 20లక్షల డోసుల కరోనా వ్యాక్సిన్‌ను అందించింది. దీనిపై హర్షం వ్యక్తం చేసిన బ్రెజిల్ అధ్యక్షుడు బోల్సోనారో భారత్ పంపిన కరోనా వ్యాక్సిన్‌ను హనుమంతుడు మోసుకొచ్చిన సంజీవిని పర్వతంతో పోల్చారు. భారత ప్రధాని మోడీకి ట్విట్టర్ ద్వారా కృతజ్ఞతలు తెలిపిన బోల్సోనారో సంజీవిని పర్వతం స్థానంలో వ్యాక్సిన్ పర్వతాన్ని హనుమంతుడు మోసుకొస్తున్నట్లుగా ఒక చిత్రాన్ని ట్వీట్ చేశారు. భారత్ మిత్ర దేశాలకు వ్యాక్సిన్ అందించడమే కాకుండా Partnerships for Accelerating Clinical Trials (PACT)లో భాగంగా ఆయా దేశాలకు వ్యాక్సినేషన్‌పై ట్రైనింగ్ కూడా ఇచ్చింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ తీసుకొచ్చిన Ind CEPI Missionతో పాటు నేషనల్ బయో ఫార్మా మిషన్ కింద పనిచేసే Bio-technology Industry Research Assistance Council (BIRAC), Clinical Development Service Agency (CDSA) కలిసి 'వ్యాక్సిన్ మైత్రి' కార్యక్రమం నిర్వహిస్తున్నాయి.

## శతూత్ ఆనకట్ట కోసం భారత్-ఆఫ్ఘనిస్తాన్ మధ్య ఒప్పందం



ఆఫ్ఘనిస్తాన్‌లోని కాబూల్ నగరానికి నీటిని సరఫరా చేయడానికి ఉద్దేశించిన లాలందర్ (శతూత్) ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అవగాహన ఒప్పంద పత్రం (ఎమ్ఓయూ) భారత్, ఆఫ్ఘనిస్థాన్‌ల మధ్య 2021 ఫిబ్రవరి 9న కుదిరింది. వర్చువల్‌గా జరిగిన కార్యక్రమంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆఫ్ఘనిస్తాన్ అధ్యక్షుడు మొహమ్మద్ అష్రఫ్‌ఘనీల సమక్షంలో ఎమ్ఓయూపై ఒప్పందం జరిగింది. ఆఫ్ఘనిస్తాన్‌లోని కాబూల్ నదికి ఉపనది అయిన మైదాన్ నదికి అడ్డంగా ఈ శతూత్ ఆనకట్టను నిర్మిస్తున్నారు. కాబూల్ నగరానికి సురక్షిత తాగునీటి అవసరాలను తీర్చడానికి, చుట్టుపక్కల ప్రాంతాలకు సేద్యపు నీటిని అందించడానికి, ఇప్పటికే అమలవుతున్న సాగునీటి, మురికినీటి నెట్‌వర్క్‌లను నిలబెట్టడానికి, వరద సహాయ చర్యలకు తోడ్పడడమే కాకుండా ఆ ప్రాంతంలో విద్యుత్తు సరఫరాకు కూడా శతూత్ ఆనకట్ట దోహదపడనుంది. భారతదేశం, ఆఫ్ఘనిస్తాన్ మైత్రి వారధి (సల్మా డ్యామ్) తరువాత ఆఫ్ఘనిస్తాన్‌లో భారతదేశం నిర్మిస్తున్న రెండో ప్రధానమైన ఆనకట్ట ఈ ప్రాజెక్టే. సల్మా డ్యామ్‌ను 2016వ సంవత్సరం జూన్‌లో ప్రారంభించారు.

## రైతుల ఆందోళనపై బ్రిటన్‌లో చర్చకు పరిశీలన

భారత్‌లో రైతుల ఆందోళన, పత్రికా స్వేచ్ఛపై బ్రిటన్ హౌస్ ఆఫ్ కామన్స్ కాంప్లెక్స్‌లోని వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో చర్చ విషయాన్ని పార్లమెంట్ పిటీషన్ల కమిటీ పరిశీలించనుంది. ఈమేరకు 1,10,000 సంతకాలతో కూడిన ఆన్‌లైన్ పిటీషన్ అందింది. ఇందులో బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ పేరు (లండన్ కన్జర్వేటివ్ పార్టీ పార్లమెంటు సభ్యుడిగా) ఉన్నప్పటికీ ఆయన సంతకం చేయలేదని బ్రిటన్ ప్రధానమంత్రి కార్యాలయం స్పష్టం చేసింది.

## భారత్ - ఫ్రాన్స్ సంయుక్త సైనిక విన్యాసాలు



భారత్, ఫ్రాన్స్ వాయుసేన, అంతరిక్ష దళాలు 'డెసర్ట్ నైట్-21' పేరిట జనవరి 21 నుంచి 24 వరకు రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహించాయి. ఈ విన్యాసాల్లో ముఖ్యంగా రఫేల్ ఆపరేషన్, ఇరు దేశాల దళాల మధ్య సమన్వయంపై దృష్టి సారించారు. ఈ విన్యాసాల్లో.. రఫేల్, ఎయిర్‌బస్ ఏ-330 మల్టీ రోల్ ట్యాంకర్ ట్రాన్స్‌పోర్ట్, ఏ-400ఎం టాక్టికల్ ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ సహా మొత్తం 175 మంది సైనికుల్ని ఫ్రాన్స్ రంగంలోకి దింపగా.. భారత్ రఫేల్, మిరాజ్, సుఖోయ్‌లతో విన్యాసాల్లో పాల్గొన్నాయి. సంయుక్త విన్యాసాల్లో భాగంగా భారత్, ఫ్రాన్స్ వైమానిక దళాలకు చెందిన రఫేల్ యుద్ధవిమానాలు సంక్లిష్ట యుద్ధ విన్యాసాలు నిర్వహించాయి. పోరాట సన్నద్ధత, సమన్వయాన్ని మరింత మెరుగుపరచుకోవడంలో భాగంగా వీటిని చేపట్టాయి. ఈ విన్యాసాల్లో భారత త్రిదళాధిపతి అయిన సిడియస్ బిపిన్ రావత్ కూడా పాల్గొన్నారు. ఫ్రాన్స్ వైమానిక దళానికి చెందిన ఫీనిక్స్ ఎయిర్‌బస్ ఎ330 బహుళ ప్రయోజన ట్యాంకర్ విమానంలో ఆయన గగనవిహారం చేశారు. ఈ విన్యాసాల్లో భారత్ తరపున రఫేల్‌తో పాటు సుఖోయ్, మిరాజ్-2000 యుద్ధవిమానాలు, గాల్లో ఇంధనాన్ని నింపే ఐఎల్-78 విమానం, గగనతల ముందస్తు హెచ్చరిక వ్యవస్థ (అవాక్స్) పాల్గొన్నాయి.




https://ourstudycircle.in/upscpdf/

## పాంగాంగ్ నుంచి బలగాల ఉపసంహరణకు భారత్ - చైనా అంగీకారం







తూర్పు లద్దాఖ్‌లోని సరిహద్దుల్లో భారత్, చైనాల మధ్య ఉద్రిక్తతల తొలగింపు లక్ష్యంగా ఇరుదేశాల మధ్య కీలకమైన ఒప్పందం కుదిరింది. ఒప్పందం మేరకు ఉద్రిక్తతలకు ప్రధాన కారణమైన పాంగాంగ్ సో సరస్సు ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో మోహరించిన ఫ్రంట్‌లైన్ సైనికులు దశలవారీగా, సమన్వయంతో, నిర్ధారించుకోదగిన విధానంలో వెనక్కు వెళ్తారు. తాజా ఒప్పందంతో గత సంవత్సరం మే 5 నాటి కన్నా ముందున్న స్థితికి సరిహద్దుల్లో పరిస్థితులు చేరుకుంటాయి. పాంగాంగ్ సో సరస్సునకు ఇరువైపులా 2020లో ఏప్రిల్ తరువాత నిర్మించిన అన్ని నిర్మాణాలను తొలగించేందుకు అంగీకారం కుదిరింది. భారత్–చైనా మధ్య గతంలో కుదిరిన సరిహద్దు ఒప్పందం ప్రకారం.. పాంగాంగ్ సో సరస్సుకు ఉత్తరంగా ఫింగర్ 8 ప్రాంతం వరకు మాత్రమే చైనా బలగాలు ప్రవేశించ డానికి అనుమతి ఉన్నది. అలాగే ఫింగర్ 3 ప్రాంతం వరకు మాత్రమే భారత బలగాలు వెళ్లాలి. వీటి మధ్య ఉన్న ఫింగర్ 4, 5, 6, 7 ప్రాంతాల్లోకి ఇరు దేశాల బలగాలు ప్రవేశించ కూడదు. అయితే, ఆ ప్రాంతంలో గస్తీ మాత్రం నిర్వహించుకోవచ్చు. దీంతో చైనా బలగాలు ఫింగర్ 4 ప్రాంతం నుంచి ఫింగర్ 8 ప్రాంతా నికి వెనక్కి వెళ్లాలి. అలాగే భారత జవాన్లు కూడా ఫింగర్ 4 ప్రాంతం నుంచి ఫింగర్ 3 ప్రాంతానికి సమీపంలోని ధాన్ సింగ్ థపా సైనిక పోస్టుకు చేరుకోవాలి. ఈ ఒప్పందం ఫిబ్రవరి 10 నుంచి అమల్లోకి రావడం ప్రారంభమైంది. ఒప్పందానికి సంబంధించిన వివరాలను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఫిబ్రవరి 11న పార్లమెంటులో వెల్లడించారు.

### చైనా యాప్‌లపై నిషేధం పొడిగింపు




టిక్‌టాక్ సహా వివిధ చైనా యాప్‌ల వినియోగంపై దేశీయంగా విధించిన నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం పొడి గించింది. ఈ మేరకు యాప్ యాజ మాన్య సంస్థలకు కేంద్ర ఎలక్ట్రానిక్, ఐటీ మంత్రిత్వ శాఖ నోటీసులు జారీ చేసింది. నిషేధం పొడిగింపుపై స్పందించిన టిక్‌టాక్.. భారత చట్టాలు, నిబంధనలను పాటించేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. దేశ సమగ్రత, సార్వభౌమాధికారం, రక్షణ, భద్రత, ప్రయోజనాల దృష్ట్యా గతేడాది(2020) జూన్‌లో టిక్‌టాక్ సహా చైనాకు చెందిన 59 యాప్‌లను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సెప్టెంబర్‌లో పబ్జీతో పాటు మరో 118 యాప్‌లను సైతం నిషేధిత జాబితాలో చేర్చింది.

### నైపుణ్య కార్మికుల వలసపై భారత్ - జపాన్ మధ్య ఒప్పందం

భారత్‌కు చెందిన నైపుణ్య కార్మికులు జపాన్‌కు వలస వెళ్లేందుకు ప్రోత్సహించే ఒక ఒప్పందంపై రెండు దేశాలు జనవరి 18న సంతకాలు చేశాయి. దీనివల్ల భవన నిర్మాణం, నౌకా నిర్మాణం, నౌకా సంబంధ పరిశ్రమలు, ఆటోమొబైల్ నిర్వహణ, నర్సింగ్, విమానయానం, వ్యవసాయం, మత్స్య, ఆహార సేవలు సహా 14 రంగాల్లోని కార్మికుల వలసలకు వీలు కలుగుతుంది. ఈ ఒప్పందంపై భారత విదేశాంగ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ శ్రింగ్లా, జపాన్ రాయబారి సుజుకీ సంతోషిలు సంతకాలు చేశారు. ఈ రంగాల్లోని కార్మికులు నైపుణ్య, జపనీస్ భాషా పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. వీరు కాంట్రాక్టు ప్రాతిపదికన జపాన్‌లో ఉపాధి పొందేందుకు అర్హులు.

### అరుణాచల్‌ప్రదేశ్‌లో గ్రామాన్ని నిర్మించిన చైనా

అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా ఒక గ్రామాన్ని నిర్మించినట్లు తాజాగా వెల్లడైంది. ఈ క్రమంలో 4.5 కిలోమీటర్ల మేర భారత భూభాగంలోకి చొచ్చుకొచ్చింది. ఆ గ్రామంలో 101 ఇళ్లు ఉన్నట్లు ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ఎగువ సుభాన్‌సిరి జిల్లాలో సారి చు నది ఒడ్డున ఈ గ్రామం వెలిసింది. ఈ ప్రాంతంపై భారత్, చైనాల మధ్య వివాదం ఉంది. గతంలో ఇక్కడ యుద్ధం కూడా జరిగింది. గత ఏడాది (2020) నవంబరు 1న తీసిన ఉపగ్రహ చిత్రంలో ఈ గ్రామం కనిపించింది. 2019 ఆగస్టులో అది లేదు. ఆ ప్రాంతంలో చైనా సైనిక శిబిరానికి కొద్దిదూరంలో ఈ



గ్రామం ఉంది. ఆ శిబిరాన్ని కూడా గత దశాబ్ద కాలంలో గణనీయంగా ఆధునికీకరించారు. ప్లానెట్ ల్యాబ్స్ గతేడాది (2020) నవంబర్ 1న తీసిన ఉపగ్రహ చిత్రాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతున్నది. ఈ మేరకు ఎన్డీటీవీ ప్రత్యేక కథనాన్ని ప్రసారం చేసింది. 2019 ఆగస్టు 26వ తేదీన ఇదే సంస్థ తీసిన ఫొటోల్లో అక్కడ ఎలాంటి నిర్మాణాలు లేవు. అంటే ఒక్క ఏడాదిలోనే చైనా భారత భూభాగంలోకి చొచ్చుకు వచ్చి గ్రామాన్ని నిర్మించిందన్నమాట. సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా మ్యాప్ ప్రకారం చూసినా చైనా నిర్మించిన ఈ గ్రామం భారత భూభాగంలోనే ఉన్నదని నిపుణులు తెలిపారు.

### సంక్షిప్త సమాచారం

- 'యుధ్ అభ్యాస్' పేరుతో నిర్వహిస్తున్న భారత్–అమెరికా 16వ సంయుక్త సైనిక విన్యాసాలు రాజస్థాన్‌లో ఫిబ్రవరి 8 నుంచి 21వరకు జరిగాయి.
- కొవిడ్ మహమ్మారి ప్రపంచ ఆర్థిక స్థితిగతులపై చూపిన ప్రభావం నేపథ్యంలో 2021లో అంతర్జాతీయంగా శాంతినిర్మాణ నిధి కింద వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు 1,50,000 అమెరికన్ డాలర్లు సమకూరుస్తామని భారతదేశం ప్రకటించింది. ఈ నిధులను ఐక్య రాజ్య సమితికి అందించనున్నట్లు న్యూయార్క్‌లో జరిగిన వర్చువల్ సమావేశంలో భారత్ తెలిపింది.
- కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన వ్యవసాయ చట్టాల విషయంలో భారత ప్రభుత్వానికి అగ్రరాజ్యం అమెరికా అండగా నిలిచింది. ఈ చట్టాలతో భారత్ మార్కెట్ బలపడుతుందని అభిప్రాయపడింది. రైతుల ఆందోళనల్ని చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించింది.




https://ourstudycircle.in/upscpdf/




## పీఎల్ఐ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం



దేశంలో టెలికాం పరికరాల తయారీకి ప్రోత్సాహమిచ్చేలా ఐదేండ్లకుగాను రూ.12,195 కోట్ల ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలను (పీఎల్ఐ) కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ పీఎల్ఐ పథకానికి ఫిబ్రవరి 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ ఆమోదం తెలిపింది. త్వరలో 5జీ టెక్నాలజీ సేవలు అందుబాటులోకి రానున్న క్రమంలో టెలికాం పరికరాల తయారీకి భారత్‌ను గ్లోబల్ పవర్‌హౌజ్‌గా నిలబెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే ఈ ప్యాకేజీని తెచ్చింది. ఇక ఈ పీఎల్ఐ పథకం 2021 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది. ఈ ప్రోత్సాహకం రాబోయే ఐదేండ్లకు పైగా కాలంలో రూ.2,44,200 కోట్ల ఉత్పత్తికి దోహదపడగలదని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. రూ.1,95,360 కోట్ల ఎగుమతులు కూడా ఉంటాయని ఆశిస్తున్నది. ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్ పీసీల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి కూడా ఓ పీఎల్ఐ పథకాన్ని త్వరలో ప్రభుత్వం తీసుకురానుందని కేంద్ర టెలికాం శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. టెలికాం పరికరాల తయారీ పరిశ్రమ కోసం తెస్తున్న పీఎల్ఐ పథకానికి బేస్ ఇయర్‌గా 2019-20 నిర్ణయించామన్నారు.

**రూ.200 కోట్లలోపు ప్రాజెక్టులకు ఉప అధిపతుల ఆమోదం :** రక్షణ విభాగంలో రూ.200 కోట్ల లోపు ఖర్చయ్యే మూలధన ప్రాజెక్టులకు సాయుధ బలగాల ఉప అధిపతులే ఆమోదం తెలిపేలా అధికారాలు దాఖలు పరచాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వీటిలో రూ.100 కోట్ల లోపు ప్రాజెక్టులకు ఏ స్థాయి అధికారులు ఆమోదం తెలపవచ్చనేది కూడా మంత్రివర్గం నిర్ణయించింది.

## 'స్టార్స్' ప్రాజెక్ట్‌పై ప్రపంచ బ్యాంక్‌తో ఒప్పందం




విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాల విభాగం, ప్రపంచ బ్యాంకు కలిసి Strengthening Teaching - Learning and Results for States program (STARS) ప్రాజెక్ట్‌పై సంతకం చేశాయి. ఇందులో భాగంగా ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయం చేస్తుంది. ఇది సెంట్రల్ సెక్టార్ స్కీమ్. దేశంలోని ఆరు రాష్ట్రాల్లో విద్యా రంగాన్ని అభివృద్ధి చేయడం, ఉపాధ్యాయుల నాణ్యతా ప్రమాణాలను పెంచి పాఠశాలలు మంచి ఫలితాలు రాబట్టేలా చేయడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఇందులో కేరళ, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ మరియు ఒడిశా ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా 15 లక్షల స్కూళ్లలోని 25 కోట్ల మంది పిల్లలు లబ్ధి పొందనున్నారు. అలాగే ఈ 15 లక్షల స్కూళ్లలోని కోటి మంది టీచర్లు లాభపడనున్నారు. అందరికీ సమాన విద్య నినాదంతో తీసుకొచ్చిన జాతీయ విద్యా పాలసీ-2020 విజన్‌నే ఈ ప్రాజెక్టు అమలు చేయనుంది. ఈ ప్రాజెక్టు మొత్తం విలువ రూ. 5,718 కోట్లు. ఇందులో ప్రపంచ బ్యాంకు రూ.3,700 కోట్లు లోన్‌గా ఇవ్వనుంది. ప్రపంచ బ్యాంకుకు సంబంధించిన International Bank for Reconstruction and development (IBRD) సంస్థ ఈ రుణం అందిస్తుంది.

## మార్చి నెలాఖరు కల్లా 500 రైతు ఉత్పత్తి సంఘాలు

మూడు నూతన వ్యవసాయ చట్టాల వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను రుజువు చేయడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా కనీసం 500 రైతు ఉత్పత్తి సంఘాలను (ఎఫ్‌పీవోలు) 2021 మార్చి నెలాఖరు కల్లా ఏర్పాటు చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ నిర్ణయించింది. 2024 ప్రథమార్థం ముగిసే నాటికి దేశవ్యాప్తంగా 10,000 ఎఫ్‌పీవోలను దశలవారీగా ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఈ పథకంలో భాగంగా ప్రతి సంఘానికి మూడేళ్లలో రూ.18 లక్షలు ఇస్తారు. సంఘంలో సభ్యుడైన ప్రతి రైతుకు కేంద్ర ప్రభుత్వం రూ.2,000 చొప్పున అందజేస్తుంది. ఒక ఎఫ్‌పీవోకు గరిష్ఠంగా రూ.15 లక్షలు కేటాయిస్తారు. ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందడం కోసం ప్రతి ఎఫ్‌పీవోకు రూ.2 కోట్ల వరకు రుణ హామీ సదుపాయాన్ని కల్పిస్తారు.

## మ్యాపింగ్ పాలసీలో కీలక సడలింపులు



భారత మ్యాపింగ్ పాలసీలో నిబంధనలను సడలిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జియో స్పేషియల్ డేటా నియంత్రణా నియమావళిలో మార్పులు చేయడం ద్వారా ఈ రంగంలో పబ్లిక్, ప్రైవేట్ సంస్థలకు సమానావకాశాలు ఉండేలా చర్యలు తీసుకుంది. దీంతో ఇలాంటి సమాచార నిర్వహణపై దేశీయ ప్రైవేటు సంస్థలకు పూర్తి స్వేచ్ఛ లభించింది. ఫలితంగా ఈ రంగంలో నూతన ఆవిష్కరణలకు అవకాశాలు మెరుగు పడతాయని, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల మధ్య సమానావకాశాలకు వీలు కలుగుతుందని ప్రభుత్వం పేర్కొంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులకు మేలు కలుగుతుందని వివరించింది. ఇప్పటివరకూ మ్యాపింగ్ ప్రక్రియను ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'సర్వే ఆఫ్ ఇండియా' సంస్థ నిర్వహించేది. తాజా సరళీకరణతో దేశంలోని



https://ourstudycircle.in/upscpdf/

ఏ సంస్థ అయినా ఈ ప్రక్రియలో పాల్గొని, లబ్ధి పొందొచ్చు. నదుల అనుసంధానం, విధానాల రూపకల్పన, రోడ్ల నిర్మాణం, పథకాల అమలు.. ఇలా అనేక విషయాల్లో మ్యాపులు కీలకం. ప్రస్తుత నిబంధనలతో మ్యాపుల తయారీ ఆలస్యమవుతున్నది. అన్ని రంగాలకు ఒకే రకమైన మ్యాపులు తయారు చేయడం వల్ల సమాచారం పొందడం కష్టమవుతున్నది. తాజా మార్పులతో ఏ రంగానికి ఎలా అవసరమో అలా మ్యాపులు రూపొందించుకోవచ్చు.

### సీఆర్‌పీఎఫ్ కోబ్రా దళంలోకి తొలిసారిగా మహిళలు



దట్టమైన అడవుల్లో నక్సలైట్లను ఎదుర్కొనేందుకు కేంద్ర రిజర్వు పోలీసు దళం (సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్-CRPF)లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమెండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్(కోబ్రా) దళంలో తొలిసారిగా 34 మంది మహిళా సిబ్బంది చేరారు. గురుగ్రామ్‌లోని కదార్‌పుర్ గ్రామంలో ఫిబ్రవరి 6న ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీజీ ఏపీ మహేశ్వరి సమక్షంలో మహిళల బృందాన్ని కోబ్రా విభాగంలోకి లాంఛనంగా తీసుకున్నారు. ఈ మహిళా కమెండోలు వేర్పాటువాదం, వామపక్ష ప్రభావం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో విధులు నిర్వర్తించనున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా సీఆర్‌పీఎఫ్‌లోని మొత్తం 6 మహిళా బెటాలియన్ల నుంచి 34 మంది మహిళా సిబ్బందిని ఎంపిక చేసి వారికి కఠిన కమాండో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఈ మహిళా కోబ్రా కమెండోలను బరిలోకి దింపుతారు. దట్టమైన అటవీ ప్రాంతాల్లో విధి నిర్వహణ కోసం సీఆర్‌పీఎఫ్‌లో ద కమాండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్(కోబ్రా) పేరుతో 2009లో ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేశారు.

### వికలాంగ సంతానానికి జీవితకాల కుటుంబ పెన్షన్

ప్రభుత్వ ఉద్యోగి లేదా పెన్షనర్ మరణిస్తే వారి కుటుంబ సభ్యులకిచ్చే పెన్షన్ విధానంలో కేంద్ర ప్రభుత్వం మార్పులు చేసింది. చనిపోయిన ఉద్యోగి లేదా పెన్షనర్ పిల్లలకు మానసిక లేదా శారీరక వైకల్యాలు ఉండి దీర్ఘకాలిక వైద్యం అవసరమైతే వారికి జీవితాంతం పెన్షన్ ఇచ్చే విధానాన్ని ఫిబ్రవరి 8 నుంచే అమల్లోకి తెచ్చామని కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. మరణించిన ప్రభుత్వ ఉద్యోగి, పెన్షనర్ కుటుంబ సభ్యులకు.. వారి ప్రస్తుత వార్షికాదాయాన్ని బట్టి పెన్షన్ ఇచ్చేవారు. ఈ విధానంలోనే ఇప్పుడు మార్పులు చేశారు. సాధారణ కుటుంబ సభ్యులు, వైకల్యం ఉన్న సంతానం అనే రెండు వర్గాలుగా మార్చారు.

### పీఎం ఫసల్ బీమా యోజనకు రూ.16వేల కోట్లు కేటాయింపు


ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై) పథకానికి 2021-22 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రూ. 16,000 కోట్లు కేటాయించింది. గత ఆర్థిక సంవత్సరం (2020-21) తో పోల్చితే 2021-22 బడ్జెట్‌లో 305 కోట్లు ఎక్కువగా కేటాయించారు. ఈ పథకం ద్వారా రైతులు విత్తనాలు వేసిన దగ్గర నుంచి పంట కోతకు వచ్చే వరకు ఆ పంటకు రక్షణ లభిస్తుంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులు బీమా చేసిన పంటలకు నష్టం కలిగితే దీని ద్వారా బీమా అందిస్తారు. ప్రకృతి విపత్తు కారణంగా రైతు పంట నాశనమైతే వారికి ఈ పథకం కింద బీమా లభిస్తుంది. ఖరీఫ్ పంటలో 2 శాతం, రబీ పంటకు 1.5 శాతం, హార్టికల్చర్‌కు 5 శాతం రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఐదేళ్ల క్రితం 13 జనవరి 2016న భారత ప్రభుత్వం పీఎం ఫసల్ బీమా యోజన పథకాన్ని తీసుకొచ్చింది. కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ లెక్కల ప్రకారం ప్రపంచంలోనే అతిపెద్ద పంట బీమా పథకం ఇది. ప్రీమియం విషయంలో మూడో అతిపెద్ద బీమా పథకం. ప్రతి ఏడాది 5.5 కోట్లకు పైగా రైతులు దరఖాస్తులు చేసుకుంటారు. ఈ పథకానికి రైతులు ఎవరైనా దరఖాస్తు చేయొచ్చు. అన్ని రకాల ఆహార పంటలకు ఇది వర్తిస్తుంది. అర్హులైన రైతుల బ్యాంకు అకౌంట్‌కు బీమా డబ్బులు వస్తాయి.

### దేశ జనాభాలో కోవిడ్ ప్రభావానికి లోనైనవారు 21.5 శాతం

దేశ జనాభాలో 21.5 శాతం మంది కోవిడ్ ప్రభావానికి లోనయినట్లు మూడోసారి సర్వేలో తేలింది. ఈ మూడో సర్వేను 2020 డిసెంబర్ 17-2021 జనవరి 8వ తేదీల మధ్య చేపట్టినట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ బలరాం భార్గవ్ ఫిబ్రవరి 4న తెలిపారు. దేశంలోని 21 రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 700 గ్రామాలు/వార్డుల్లో

### చౌరీచౌరా శతాబ్ది ఉత్సవాలు ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ

దేశ స్వాతంత్ర్య సమరంలో కీలకమైన 'చౌరీ చౌరా' ఘటన జరిగి వందేళ్లు పూర్తయిన సందర్భంగా అందులో వీర మరణం పొందినవారి గుర్తుగా ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం శతాబ్ది ఉత్సవాలను గోరఖ్‌పూర్‌లో నిర్వహించింది. ఈ శతాబ్ది ఉత్సవాలను ఫిబ్రవరి 4న ప్రధాని నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా 'చౌరీ చౌరా' ఘటనకు వందేళ్లను పురస్కరించుకుని కార్యక్రమంలో ప్రత్యేక పోస్టల్ స్టాంపుని నరేంద్ర మోడీ విడుదల చేశారు.



**'చౌరీ చౌరా' ఘటన నేపథ్యం :** విదేశీ వస్త్రాలు బహిష్కరించాలని, ఇంగ్లీష్ చదువు మానేసి చర్ఖా నడుపుకోవాలని మహాత్మాగాంధీ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గాంధీజీ పిలుపు మేరకు సత్యాగ్రహం చేపట్టేందుకు 1922 ఫిబ్రవరి 4న ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లాలోని చౌరీ చౌరాలోని భోపా మార్కెట్ వద్ద పలువురు సమావేశమయ్యారు. వారు శాంతి పాదయాత్ర చేస్తుండగా.. ఈ మార్చ్ చట్ట విరుద్ధమని పోలీసులు ప్రకటించి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు ఉద్యమకారులు మృతిచెందారు. దీంతో ఆగ్రహించిన ఉద్యమకారులు చౌరీ చౌరా పోలీస్ పోస్టులకు నిప్పు పెట్టారు. ఈ సంఘటనలో పోలీస్ స్టేషన్ సహా 22 మంది పోలీసులు సజీవ దహనమయ్యారు. ఈ ఘటనతో గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నిలిపివేశారు. 1923 జనవరి 9న గోరఖ్‌పూర్ కోర్టు 418 పేజీల తీర్పు ఇచ్చింది. పోలీసులందరూ సజీవదహనం కావడంతో 19 మందిని బ్రిటన్ ప్రభుత్వం ఉరి తీసింది.



https://ourstudycircle.in/upscpdf/

## ఆక్స్‌ఫర్డ్ 'హిందీ వర్డ్ ఆఫ్ ద ఇయర్-2020'గా 'ఆత్మనిర్భరత'




2020వ సంవత్సరంలో హిందీ భాషలో అత్యంత పాపులర్ అయిన పదంగా ఆక్స్‌ఫర్డ్ హిందీ విభాగం వారు 'ఆత్మనిర్భరత' అనే పదాన్ని ఎంపిక చేశారు. 'ఆత్మనిర్భరత' పదం 2020 ఏడాదికి గానూ(వర్డ్ ఆఫ్ ద ఇయర్) ఆక్స్‌ఫర్డ్ హిందీ పదంగా నిలిచింది. కోవిడ్-19 ఉపశమన ప్యాకేజీ సమయంలో ప్రధాని నరేంద్ర మోడీ ఈ పదాన్ని ఉపయోగించిన సంగతి తెలిసిందే. కరోనా ఉపశమన ప్యాకేజీ సందర్భంగా నరేంద్ర మోడీ ఆత్మనిర్భర్ భారత్ ఆవశ్యకతను వివరించారన్న ఆక్స్‌ఫర్డ్ అప్పటి నుంచి ఆత్మనిర్భరత పదం ప్రజా క్షేత్రంలో వాడుక పదంగా మారిపోయిందని ఆక్స్‌ఫర్డ్ పేర్కొంది. నరేంద్ర మోడీ ప్రసంగం తర్వాత ఆత్మనిర్భరత అన్న పదాన్ని చాలా ఎక్కువగా ఉపయోగించినట్లు ఆక్స్‌ఫర్డ్ వెల్లడించింది. ఏడాది కాలంలో అత్యంత ప్రభావం చూపడంతో పాటు, సంస్కృతిని, సంప్రదాయాలను సూచించే పదాలను వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా ఆక్స్‌ఫర్డ్ ప్రకటిస్తుంది.


ఈ సర్వే నిర్వహించినట్లు వివరించారు. జనాభాలో అత్యధికులు ఈ మహమ్మారి బారినపడే ప్రమాదం ఇప్పటికీ ఉందని పేర్కొన్నారు. ఐసీఎంఆర్ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది.

### పల్స్ పోలియో-2021 ప్రారంభం



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జనవరి 30న రాష్ట్రపతి భవన్‌లో పల్స్ పోలియో-2021ను ప్రారంభించారు. పోలియో నేషనల్ ఇమ్యునైజేషన్ డే-2021 సందర్భంగా జనవరి 31న దేశవ్యాప్తంగా ఉన్న 5 ఏళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో నిర్మూలనలో భాగంగా 'జాతీయ పోలియో నిరోధక దినోత్సవాన్ని' (నేషనల్ పోలియో ఇమ్యునైజేషన్ డే) పాటిస్తున్నారు. 2021 పోలియో నిరోధక దినోత్సవాన్ని దేశంలో జనవరి 31న పాటిస్తున్నారు. 2021 సంవత్సరంలో సుమారు 17 కోట్ల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. భారత్‌ను పోలియోరహిత దేశంగా 2014లో మార్చి 26న ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది.

### ఫేస్‌బుక్ డేటా చోరీ కేంబ్రిడ్జ్ అనలిటికాపై సీబీఐ కేసు




దాదాపు 18 నెలల ప్రాథమిక విచారణ అనంతరం సుమారు 5.62 లక్షల మంది భారతీయ ఫేస్‌బుక్ వినియోగదారుల సమాచారాన్ని అక్రమంగా వాడుకోవడంపై ప్రముఖ అంతర్జాతీయ కంపెనీ కేంబ్రిడ్జ్ అనలిటికా(సీఏ), గ్లోబల్ సైన్స్ రీసెర్చ్ (జీఎస్ఆర్) సంస్థలపై సీబీఐ జనవరి 22న కేసు నమోదు చేసింది. ఐపీసీ, ఐటీ చట్టాల్లోని సంబంధిత సెక్షన్ల కింద బ్రిటన్‌కు చెందిన ఆ రెండు సంస్థలపై కేసు నమోదు చేశామని సీబీఐ వెల్లడించింది. ఫేస్‌బుక్ వినియోగదారుల డేటాను ఆయా సంస్థలు అక్రమంగా వినియోగించాయన్న వార్తలపై 2018 జులైలో ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సీబీఐకి ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదుపై ప్రాథమిక విచారణ జరిపి, సీబీఐ కేసు నమోదు చేసింది. పరిశోధన అవసరాల కోసం కొన్ని వర్గాల వినియోగదారుల సమాచారం ఇవ్వాలని కోరుతూ గ్లోబల్ సైన్స్ రీసెర్చ్ సంస్థ తరపున అలెగ్జాండర్ కోగన్ ఫేస్‌బుక్‌ను అభ్యర్థించారు. ఆ అనుమతితో 'దిస్ ఈజ్ యువర్ డిజిటల్ లైఫ్' పేరుతో ఒక యాప్‌ను రూపొందించి, ఫేస్‌బుక్ అనుమతించిన 335 మంది వినియోగదారులతో పాటు అక్రమంగా, వారి స్నేహితుల జాబితాలోని వ్యక్తుల సమాచారం కూడా సేకరించారు. ఆ సమాచారాన్ని 'కేంబ్రిడ్జ్ అనలిటికా'కు అమ్మేశారు. భారత్‌లో జరగనున్న ఎన్నికలపై ప్రభావం చూపేలా ఆ సమాచారాన్ని కేంబ్రిడ్జ్ అనలిటికా ప్రొఫైలింగ్ చేసిందని ఎఫ్ఐఆర్‌లో సీబీఐ పేర్కొంది. 2018లో కేంబ్రిడ్జ్ అనలిటికా ఉదంతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అమెరికాతో పాటు అనేక దేశాల ఎన్నికల్లో ఇది కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు వచ్చాయి. 2016 అమెరికా ఎన్నికల్లో రాజకీయ సహాయ సంస్థ కేంబ్రిడ్జ్ అనలిటికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌నకు అనుకూలంగా పనిచేసినట్లు ఆరోపణలు వచ్చాయి.

### రైల్‌మదద్ నంబరు 139లో రైల్వే భద్రతా హెల్ప్‌లైన్ నంబరు 182 విలీనం




రైలు ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే భద్రతా హెల్ప్‌లైన్ నంబరు 182ని రైల్‌మదద్ నంబరు 139లో విలీనం చేసినట్లు ఆ శాఖ పేర్కొంది. ఒకే నంబరు ఉండటం వల్ల ప్రయాణికులు సమాచారాన్ని తెలుసుకోవడం, సమస్యలపై ఫిర్యాదు చేయడం సులువవుతుందని రైల్వే వర్గాలు తెలిపాయి. రైల్వే స్టేషన్లు, రైళ్లలో జరిగే నేరాలకు సంబంధించిన ఫిర్యాదు, సహాయం కోసం 182 టోల్‌ఫ్రీ నంబరు, అవసరమైన సమాచారం తెలుసుకోవడం, ఇతర సమస్యలపై ఫిర్యాదులకు 139 నంబరు ఉంది. రైల్‌మదద్‌లో 139 నంబరుతో పాటు రైల్‌మదద్ వెబ్‌సైట్, యాప్ ద్వారా కూడా ఈ సేవలు పొందొచ్చు. రైల్వే ప్రయాణికులు ఇక నుంచి 139 హెల్ప్‌లైన్ నంబరుని వాడాలని ఆ శాఖ సూచించింది.

### డిజిటల్ ఓటరు కార్డుల విధానం ప్రారంభం



ఓటరు ఫోటో గుర్తింపు పత్రాలను మొబైల్ ఫోన్లలో, వ్యక్తిగత కంప్యూటర్లలో పీడీఎఫ్ నమూనాలో భద్రపరచుకునేందుకు వీలు కల్పించే డిజిటల్ కార్డులను కేంద్ర ఎన్నికల సంఘం జనవరి 25న ప్రారంభించింది. అవసరమైన వారు ఇ-ఓటరు కార్డులను ముద్రించుకుని, లామినేషన్ చేయించుకోవచ్చు. ఈ-ఓటరు గుర్తింపు కార్డు ఏ విధంగానూ ఎడిట్ చేయలేని విధంగా ఉంటుంది. అయితే డిజిటల్ లాకర్ వంటివాటిలో భద్రపరుచుకోవచ్చు. ప్రస్తుత విధానంలో ఓటరు గుర్తింపు కార్డుల తయారీ, ముద్రణకు ఎక్కువ సమయం పడుతోంది. దాంతో పాటు కార్డులను ఓటర్ల ఇళ్లకు



https://ourstudycircle.in/upscpdf/

పంపడం కూడా కష్టంగా మారుతోంది. ఈ-విధానంలో అయితే వేగంగా సులువుగా అందుబాటులోకి వస్తుందని ఈసీ ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త ఓటర్ కార్డు కోసం 2020 నవంబర్-డిసెంబర్ సమయంలో దరఖాస్తు చేసుకున్నవారు 2021 జనవరి 25 నుంచి 31 మధ్య ఈ-ఎపిక్ (ఎలక్ట్రానిక్ ఎలక్టోరల్ ఫోటో ఐడెంటిటీ కార్డ్) కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇతర సాధారణ ఓటర్లు 2021 ఫిబ్రవరి 1 నుంచి ఈ-ఎపిక్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. "ఈ-ఓటర్ హువా డిజిటల్, క్లిక్ ఫర్ ఎపిక్" అనే పేరుతో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఎన్నికల అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. పోర్టల్: http://voterportal.eci.gov.in, NVSP: https://nsvp.in ద్వారా ఎలక్ట్రానిక్ ఓటరు గుర్తింపు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది.

### రైలు టెర్మినళ్ల వద్ద వ్యాపారం కోసం 'స్మార్ట్' పథకం


రైలు టెర్మినళ్ల వద్ద వ్యాపారాన్ని ప్రారంభించేందుకు రైల్వే శాఖ "సర్వీస్ మార్కెట్ ఎట్ రైల్ టెర్మినల్స్ (స్మార్ట్-SMART)" పేరుతో కొత్త పథకాన్ని తీసుకురానుంది. రైలు టెర్మినళ్ల వద్ద గూడ్స్ షెడ్లను ఎంచుకుని సర్వీస్ మార్కెట్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రైవేటు వ్యక్తుల పెట్టుబడులను ఆహ్వానించనుంది. అంటే గూడ్స్ షెడ్ల వద్ద సరుకును నేరుగా వినియోగదారులకు అందించేందుకు సర్వీస్ ప్రొవైడర్లకు అవకాశం కల్పిస్తోంది. ఏపీలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలోని వాల్తేరు డివిజన్... ఐదు చోట్ల గూడ్స్ షెడ్ల నిర్మాణం చేపట్టనుంది. ఉత్తరాంధ్రలోని కంటకపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, బొబ్బిలి, విశాఖపట్నంలలో గూడ్స్ షెడ్ల నిర్మాణాలు జరగనున్నాయి. 2020 ఏడాది సరుకు రవాణా ద్వారా ఏపీ నుంచి రైల్వే శాఖ రూ.2,600 కోట్ల ఆదాయం పొందింది.

### ఎనిమిదేళ్లు దాటిన వాహనాలపై హరిత పన్ను




ఎనిమిదేళ్లు దాటి పోయిన వాణిజ్య వాహనాలపై హరిత పన్ను (గ్రీన్ ట్యాక్స్) వేయాలని కేంద్ర రహదారి రవాణా శాఖ ప్రతిపాదించింది. ఈ వాహనాలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు రెన్యూవల్ చేసుకొనే సమయంలో రోడ్డు ట్యాక్స్‌లో 10% నుంచి 25% మేర గ్రీన్‌ట్యాక్స్ కింద వసూలు చేయాలన్న ప్రతిపాదనకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోద ముద్ర వేశారు. పాత వాహనాలు పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయన్న ఉద్దేశంతో వాటి నుంచి పన్ను వసూలు చేసి కాలుష్య నియంత్రణకు ఉపయో గించాలని నిర్ణయించారు. ఈ ప్రతిపాదనలను ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వ అభిప్రాయాల కోసం పంపారు. అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత అధికారికంగా నోటిఫై చేయనున్నారు. వ్యక్తిగత వాహనాలకు 15 ఏళ్ల తర్వాత రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ రెన్యూవల్ చేసుకొనేటప్పుడు ఈ ట్యాక్స్ వేస్తారు. బస్సులాంటి ప్రజా రవాణా వ్యవస్థలపై తక్కువ పన్ను విధిస్తారు. అత్యధిక కాలుష్య నగరాల్లో నమోదయ్యే వాహనాలపై ఎక్కువ హరిత పన్ను (రోడ్డు ట్యాక్స్‌లో 50%) విధిస్తారు. వాహనాల రకాలు, పెట్రోల్, డీజిల్ వాహనాలపై ఈ పన్ను వేరు వేరుగా ఉంటుంది. హైబ్రిడ్, విద్యుత్తు, సీఎన్‌జీ, ఎల్‌పీజీ వాహనాలకు మినహాయింపు ఉంటుంది. వ్యవసాయం కోసం ఉపయోగించే ట్రాక్టర్లు, టిల్లర్లకూ మినహాయింపు వర్తిస్తుంది. ఇలా వసూలు చేసిన పన్నును కాలుష్య నియంత్రణ కోసమే ఉపయోగిస్తారు. పర్యావరణానికి హాని కల్గించే వాహనాల వినియోగాన్ని ప్రజలు వదిలిపెట్టేలా చేయడానికే ఈ చర్య చేపట్టారు. 15 ఏళ్లకు మించిన ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన వాహనాలను డీరిజిస్ట్రేషన్ చేసి, తుక్కుగా మార్చడానికి కేంద్ర మంత్రి ఆమోద ముద్ర వేశారు. 2022 ఏప్రిల్ 1నుంచి ఇది అమల్లోకి వస్తుంది.

### భారత్ చేరిన మూడు రఫేల్ యుద్ధ విమానాలు



భారత వైమానిక దళంలో మరో మూడు అత్యాధునిక రఫేల్ యుద్ధ విమానాలు జనవరి 28న చేరాయి. ఫ్రాన్స్ నుంచి బయలుదేరిన ఈ విమానాలు భారత్‌లో దిగాయి. ఇప్పటికే రెండు దఫాలుగా ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకున్న 8 రఫేల్ విమానాలు భారత సైన్యంలో సేవలందిస్తుండగా, మూడో బ్యాచ్‌లో మూడు రఫేల్స్ రాకతో కలిపి ఇప్పటి వరకూ 11 విమానాలు వచ్చాయి. మొత్తం 36 రఫేల్ విమానాలను తయారు చేసి ఇవ్వడానికి ఫ్రాన్స్‌తో భారత్ రూ.59 వేల కోట్ల విలువైన ఒప్పందం చేసుకుంది. ఫ్రాన్స్‌లోని ప్రముఖ యుద్ధ విమానాల తయారీ సంస్థ డసో ఏవియేషన్ వీటిని రూపొందిస్తోంది. ఒప్పందం జరిగిన నాలుగేళ్లకు గతేడాది(2020) జులై 29న తొలి దఫాలో 5 రఫేల్ విమానాలను ఫ్రాన్స్ అందించింది. 2020 నవంబరు 3న రెండో దఫాలో మరో 3 విమానాలను ఎగుమతి చేసింది.

### 295 వ్యాగన్లతో భారతీయ రైల్వే రికార్డు

భారతీయ రైల్వే 295 వ్యాగన్లతో ఐదు రైళ్లను అనుసంధానించి నడిపించి సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ రైలుకు 'వాసుకి' అని భారతీయ రైల్వే పేరు పెట్టింది. ఐదు రైళ్లను అనుసంధానించిన తరువాత ఈ రైలు పొడవు 3.5 కి.మీ. ఈ సరుకు రవాణా రైలు ఛత్తీస్‌గఢ్‌లోని భిలై నుంచి కోర్బా వరకు నడిచింది. గతంలో 177 వ్యాగన్లతో మూడు గూడ్స్ రైళ్లను అనుసంధానించి నడిపారు. దీనికి 'సూపర్ అనకొండ' అనే పేరు పెట్టారు. బిలాస్‌పూర్ నుంచి చక్రధర్ పూర్ డివిజన్ల మీదుగా ఈ అనకొండ గూడ్స్ రైలు సాగింది.

### సంక్షిప్త సమాచారం

- దేశవ్యాప్తంగా ఉన్న 62 కంటోన్మెంట్ బోర్డుల్లో నివసిస్తున్న ప్రజలకు ఆన్‌లైన్ ద్వారా పౌర సేవలు అందించేందుకు కేంద్ర రక్షణ శాఖ "ఈ-ఛావనీ పోర్టల్" అనే మొబైల్ యాప్‌ను తీసుకొచ్చింది. ఈ పోర్టల్ ద్వారా కంటోన్మెంట్ బోర్డుల్లో నివసించే ప్రజలు పలు సేవలను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చు.
- 'ఫాస్టాగ్ తప్పనిసరి' విధానం దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 15 నుంచి అమల్లోకి వచ్చింది. జాతీయ రహదారులపై ఉన్న అన్ని టోల్‌గేట్లలోని అన్ని లేన్లను ఫాస్టాగ్ లేన్లుగా మార్చారు. ఫాస్టాగ్ లేని, ఫాస్టాగ్ ఉన్నా రీచార్జ్ చేయని వాహనాలు టోల్‌గేట్లకు వస్తే రెట్టింపు టోల్ ఫీజు వసూలు చేస్తున్నారు.
- కర్ణాటకలోని మడికెరి పట్టణంలో నిర్మించిన జనరల్ కె.ఎస్. తిమ్మయ్య మ్యూజియంను ఫిబ్రవరి 6న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రారంభించారు. తిమ్మయ్య 1957 నుంచి 1961వ సంవత్సరం వరకు భారత సైన్యంలో జనరల్‌గా సేవలందించారు.




https://ourstudycircle.in/upscpdf/



# పాలిటీ & గవర్నెన్స్

## ప్రభుత్వంపై నిరసనకూ పరిధులు



ప్రభుత్వంపై నిరసన తెలిపే విషయంలో నిరసనకారులు కొన్ని పరిధులకు లోబడి ఉండాలని సుప్రీంకోర్టు ప్రకటించింది. దేశంలో ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎంతకాలమైనా నిరసన తెలుపుతామంటే కుదరదని స్పష్టం చేసింది. నిరసన తెలిపేవారు కొన్ని బాధ్యతలను కూడా నిర్వర్తించాల్సి ఉంటుందని పేర్కొంది. పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా గతేడాది ఢిల్లీలోని షహీన్‌బాగ్‌లో రహదారిని ఆక్రమించి దీర్ఘకాలం నిరసన తెలుపటం చట్టవిరుద్ధమని 2019 అక్టోబర్ 7న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ తీర్పును సవరించాలని కోరుతూ షహీన్‌బాగ్ ప్రాంతానికి చెందిన కనిజ్ ఫాతిమా అనే వ్యక్తి రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. దానిపై 2021 ఫిబ్రవరి 13న విచారణ జరిపిన ధర్మాసనం ఆ విజ్ఞప్తిని తిరస్కరించింది. ప్రభుత్వ పథకాలు, విధానాలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టేవారు ఇతర ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వ్యవహరించాల్సి ఉంటుందని ధర్మాసనం విచారణ సందర్భంగా పేర్కొంది.

### యూఏపీఏ కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పు



అత్యంత కఠినమైన 'చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)-1967' కింద అభియోగాలు నమోదైన నిందితులకు కూడా కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో బెయిల్ ఇవ్వవచ్చని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. నిందితుడి ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతున్నదని భావించిన సందర్భంలో వారికి హైకోర్టులు, సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయవచ్చని జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ అనిరుద్ధ బోస్‌లతో కూడిన ధర్మాసనం ఫిబ్రవరి 1న స్పష్టం చేసింది. కేరళలో కాలేజీ ప్రొఫెసర్ టీజే జోసెఫ్ అరచేయిని నరికి వేసిన కేసులో ఐదేండ్లుగా జైల్లో ఉన్న కేఏ నజీబ్ అనే వ్యక్తికి కేరళ హైకోర్టు 2019 జులైలో బెయిల్ మంజూరు చేసింది. ఆ తీర్పును సవాలుచేస్తూ ఎన్ఐఏ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. బెయిల్ పొందటానికి కేసు విచారణ వేగంగా నిర్వహించాలని కోరటం నిందితుడి హక్కు అని పేర్కొంది.

### జంతువులను హింసిస్తే ఐదేండ్లు జైలు శిక్ష



జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించే 60 సంవత్సరాల నాటి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించనున్నది. సంబంధిత ముసాయిదాలో జంతువులపై నేరాలను మూడు వర్గాలుగా ప్రతిపాదించింది. చిన్నగాయం, శాశ్వత వైకల్యానికి దారితీసే పెద్ద గాయం, క్రూరత్వం కారణంగా జంతువు మరణం కేటగిరీలుగా విభజించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ముసాయిదాలో ఈ నేరాలకు వివిధ జరిమానాలు పేర్కొన్నారు. రూ.750 నుండి రూ.75,000 వరకు జరిమానాతో పాటు ఐదేండ్ల వరకు జైలు శిక్ష విధించనున్నారు. ప్రస్తుతం జంతువులపై క్రూరత్వానికి సంబంధించిన కేసుల్లో వంద రూపాయల జరిమానా, మూడు నెలల జైలు లేదా ఆ రెండింటిని కలిపి విధించే అవకాశమున్నది.

### మేజర్ పోర్ట్స్ అథారిటీ బిల్లు-2020కు పార్లమెంట్ ఆమోదం

దేశంలోని 12 ప్రధాన ఓడరేవులకు స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు ఉద్దేశించిన "మేజర్ పోర్ట్స్ అథారిటీ బిల్లు-2020"కు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఈ బిల్లుకు 2021 ఫిబ్రవరి 10న రాజ్యసభ ఆమోద ముద్ర వేసింది. రాజ్యసభలో జరిగిన బ్యాలెట్ ఓటింగ్‌లో బిల్లుకి అనుకూలంగా 84 ఓట్లు వస్తే, వ్యతిరేకిస్తూ 44 మంది ఓటు వేశారు. ఈ బిల్లుని లోక్‌సభ 2020 సెప్టెంబర్‌లోనే ఆమోదించింది. 1963 నాటి చట్టం స్థానంలో ఈ బిల్లుని ప్రవేశపెట్టారు.

### భూ కబ్జాదారులకు క్రమబద్ధీకరణ హక్కుపై సుప్రీంకోర్టు తీర్పు

ప్రభుత్వ/పంచాయతీ భూమిని ఆక్రమించుకున్న వ్యక్తులు ఆయా స్థలాలను తమ పేరుతో క్రమబద్ధీకరణ చేయించుకోవడాన్ని ఓ హక్కుగా పొందలేరని సుప్రీంకోర్టు పేర్కొంది. ప్రభుత్వం తీసుకునే విధానపరమైన నిర్ణయం, అందులో నిర్దేశించిన నిబంధనలకు లోబడి మాత్రమే క్రమబద్ధీకరణ ఉంటుందని జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ ఎం.ఆర్.షాతో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది. హర్యానాలోని సోనెపత్ జిల్లా సర్సద్ గ్రామంలో పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న నివాసితులు దాఖలు చేసుకున్న రిట్ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. పంచాయతీల పరిధిలోని వ్యవసాయేతర ఖాళీ స్థలాలను వాటిలో అక్రమంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి విక్రయించేందుకు 2008లో హర్యానా ప్రభుత్వం అనుమతించింది. అయితే, 2000 సంవత్సరం మార్చి 31కి ముందు అక్కడ ఇళ్లు నిర్మించుకున్న వారినే కొన్ని పరిమితులతో అర్హులుగా పేర్కొంది. పిటిషనర్లు... ప్రభుత్వం అనుమతించిన స్థల విస్తీర్ణం కన్నా 200 చదరపు గజాలు అదనంగా ఆక్రమించి ఉన్నారని పేర్కొంటూ.. క్రమబద్ధీకరణ దరఖాస్తులను సోనెపత్ డిప్యూటీ కమిషనర్ తిరస్కరించారు. ఈ నిర్ణయాన్ని పంజాబ్, హర్యానా హైకోర్టులో సవాల్ చేసినా పిటిషనర్లకు వ్యతిరేకంగానే తీర్పు వచ్చింది. తాజాగా సుప్రీంకోర్టు కూడా డిప్యూటీ కమిషనర్ వాదనను, హైకోర్టు తీర్పును సమర్థించింది.



https://ourstudycircle.in/upscpdf/




# పర్యావరణం & జీవవైవిధ్యం

## వాయు కాలుష్యంలో మొదటి స్థానంలో మహబూబ్‌నగర్



2020లో తెలంగాణ రాష్ట్రంలో వాయు కాలుష్యం విషయంలో మహబూబ్‌నగర్, కరీంనగర్, రామగుండం, మెదక్, హైదరాబాద్‌ను దాటేశాయి. ఆయా ప్రాంతాల్లో స్వచ్ఛమైన గాలిని కలుషితం చేసే సూక్ష్మ ధూళి కణాల తీవ్రత (పీఎం 10) అత్యధికంగా నమోదైనట్లు తాజాగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) లెక్క తేల్చింది. నల్గొండలో మినహా మిగిలిన పదిచోట్ల పీఎం10 కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నిర్దేశిత పరిమితుల్ని దాటినట్లు గుర్తించారు. హైదరాబాద్ సహా వివిధ నగరాలు, పట్టణాల్లో టీఎస్‌పీసీబీ వాయు కాలుష్య నమోదు కేంద్రాలను నిర్వహిస్తోంది. వాటిలో నమోదైన గణాంకాల ఆధారంగా 2020లో పీఎం 10 తీవ్రతను లెక్కించారు. ఒక్క నల్గొండలో మాత్రమే నిర్దేశిత పరిమితుల కంటే 7 ఎంజీలు తక్కువగా నమోదైంది. ఏటా హైదరాబాద్‌లోనే అత్యధికంగా కాలుష్యం నమోదవుతుంటుంది. ఈసారి మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. మహబూబ్‌నగర్‌లో అత్యధికంగా 102 ఎంజీలు, ఆ తర్వాత కరీంనగర్‌లో 100 ఎంజీలు నమోదవడం గమనార్హం. సీపీసీబీ నిర్దేశిత పరిమితుల ప్రకారం ఘనపు మీటరు గాలిలో పీఎం 10 వార్షిక సగటు 60 ఎంజీలు దాటరాదు. అది దాటితే ప్రమాదకర జోన్‌లో ఉన్నట్లుగా పరిగణిస్తారు. వాహనాల సంఖ్య పెరగడం, అధ్వానపు రహదారులు, బహిరంగంగా వ్యర్థాల దహనం, గడువు తీరిన వాహనాలు తదితరాలు కాలుష్యం పెరగడానికి కారణాలై ఉంటాయని ప్రాథమిక అంచనా. కొన్ని జిల్లాల్లో కాలుష్యం పెరగడానికి హైదరాబాద్‌లో తగ్గడానికి కారణాలను అధికారులు పూర్తిస్థాయిలో విశ్లేషిస్తున్నారు.

### తమిళనాడు, కేరళలో అరుదైన జాతి చీమలు



తమిళనాడు, కేరళలో అరుదైన జాతికి చెందిన రెండు కొత్త రకం చీమలను శాస్త్రవేత్తలు గుర్తించారు. పంజాబ్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ హిమేందర్ భారతి ఈ బృందానికి నేతృత్వం వహించారు. ఈ చీమలు ఊసెరియా జాతికి చెందినవి. వీటిల్లో ఒక రకం చీమలను కేరళలోని పెరియార్ టైగర్ రిజర్వ్‌లో గుర్తించారు. ప్రముఖ జీవ శాస్త్రవేత్త అమితాబ్ జోషి పేరిట ఈ రకానికి ఊసెరియా జోషి అని పేరు పెట్టారు. రెండో రకానికి ఊసెరియా డెకామెరా అని పేరు పెట్టారు. జూకీస్ జర్నల్‌లో ఈ వివరాలు ప్రచురితమయ్యాయి.

### వాతావరణం నుంచి కర్బనాన్ని తొలగించే శాస్త్రవేత్తలకు 10 కోట్ల డాలర్లు

ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలను వాతావరణం నుంచి తొలగించేందుకు మెరుగైన పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని శాస్త్రవేత్తలను వ్యాపార దిగ్గజం ఎలాన్ మస్క్ కోరారు. ఈ దిశగా అత్యుత్తమ సాంకేతికతను సాకారం చేసేవారికి 10 కోట్ల డాలర్ల బహుమతిని ప్రకటించారు. నానాటికీ పెరుగుతున్న భూతాపం ప్రపంచ దేశాలను కలవరపాటుకు గురిచేస్తోంది.

### కరోనా ఆవిర్భావం వెనుక భూతాప ప్రభావం

ప్రస్తుత కరోనా వైరస్, 2002-03లో వచ్చిన సార్స్ మహమ్మారుల విజృంభణకు వాతావరణ మార్పులే కారణమని తాజా అధ్యయనం పేర్కొంది. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాల వల్ల గబ్బిలం జాతుల విస్తృతిలో మార్పులు వచ్చి ఉండొచ్చని తెలిపింది. గబ్బిలాల ద్వారానే ఈ వైరస్ వ్యాప్తి చెందుతున్న సంగతి తెలిసిందే. బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. వాతావరణ మార్పుల వల్ల చైనాలోని యునాన్ ప్రావిన్స్‌తో పాటు పొరుగునున్న మయన్మార్, లావోస్‌లో గబ్బిలాల విస్తృతి బాగా పెరిగిందని వారు పేర్కొన్నారు. ఈ ప్రాంతాలు ఆ జీవులకు హాట్‌స్పాట్‌గా మారాయని తెలిపారు. అందువల్ల రెండు మహమ్మారులకు కారణమైన సార్స్-కోవ్-1, సార్స్-కోవ్-2 వైరస్‌ల పూర్వ రూపాలు అక్కడున్న గబ్బిలాల నుంచే ఉత్పన్నమయ్యాయని తెలిపారు.

### గత 50 ఏళ్లలో 71 శాతం తగ్గిన షార్క్‌ల సంఖ్య




సముద్రాల్లో షార్క్‌ల ఉనికి ప్రమాదంలో పడిందని తాజా అధ్యయనం వెల్లడించింది. వాటి సంఖ్య గత 50 ఏళ్లలో ఆందోళనకర స్థాయిలో తగ్గిందని, 1970 నుంచి ఇప్పటి వరకూ ఏకంగా 71 శాతం తగ్గి పోయిందని జర్నల్ నేచర్ పత్రికలో ప్రచురితమైన ఆ అధ్యయనం పేర్కొంది. 31 షార్క్ జాతుల్లో 24 అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా చేపల వేట పెరగడం ఇందుకు ఒక కారణమని పేర్కొంది. చేపలను పట్టడానికి వేసే ఎరల వల్ల తరచుగా షార్క్‌లు బలి అవుతున్నాయని తెలిపింది.

### ఇటలీలో పర్యావరణ హిత టెక్లా ఇళ్లు

ఇటలీలో త్రీడీ ముద్రిత యంత్రాలను రూపొందించే వాస్ప్ సంస్థ రవేనా నగరంలో పర్యావరణ హిత టెక్లా ఇళ్లు నిర్మించింది. పూర్తిగా స్థానికంగా దొరికే మట్టి నుంచి తయారుచేసిన మన్నికైన, పునర్వినియోగ పదార్థాలతో రూపుదిద్దుకోవడం వీటి ప్రత్యేకత. సాంకేతిక పరిజ్ఞానం, మట్టి (టెక్నాలజీ+క్లే) కలిపి వచ్చేలా ఈ ఇళ్లకు టెక్లా అని నామకరణం చేశారు.



https://ourstudycircle.in/upscpdf/




## నాబార్డ్ రుణాలు రూ.1.35 లక్షల కోట్లు

తెలంగాణ రాష్ట్రానికి 2021-22 ఆర్థిక సంవత్సరానికి రూ. 1.35 లక్షల కోట్లతో రుణ ప్రణాళికను నాబార్డ్ విడుదల చేసింది. వ్యవసాయంతో పాటు ప్రాధాన్య రంగాలకు గత ఏడాది కంటే 10.6 శాతం ఎక్కువ రుణాలు అవసరమవుతాయని స్పష్టం చేసింది. ప్రధానంగా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో రానున్న ఆర్థిక సంవత్సరంలో 13 శాతం రుణాలను పెంచాల్సి ఉందని వివరించింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ. 83,368 కోట్లు, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు రూ.39,361 కోట్లు అవసరమవుతాయని పేర్కొంది. రానున్న 2021-22 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి జాతీయ బ్యాంకు (నాబార్డ్) రూపొందించిన రుణ ప్రణాళికను ఆర్థికమంత్రి హరీశ్‌రావు హైదరాబాద్‌లో జనవరి 29న విడుదల చేశారు.

NABARD

### నల్గొండ జిల్లాలో 12 ఎత్తిపోతల పథకాలకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన

నల్గొండ జిల్లాలోని నెల్లికల్ వద్ద కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాలకు చెందిన 12 ఎత్తిపోతల పథకాలకు ఫిబ్రవరి 10న ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. వాటిలో నెల్లికల్, పెద్దవూర మండలంలోని పుల్యా తండా వద్ద లోలెవల్ కెనాల్ టు హైలెవల్ కెనాల్, బాల్నేపల్లి - చాప్లా అడవిదేవులపల్లి, బొత్తలపాలెం - వాడపల్లి, కేశవాపురం - కొండ్రపోల్, జాన్‌పహడ్ కెనాల్ లైనింగ్, ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లైనింగ్, ఏకేబీఆర్ అంగడిపేట, పీఏ పల్లి మండలంలోని పెద్దగట్టు, అమ్మ భవాని, కంబాలపల్లి, పొగిళ్ల ఎత్తిపోతలున్నాయి.

### తెలంగాణలో 8,536 మందికి ఒక ప్రభుత్వ డాక్టర్



ఎంతమంది జనాభాకు ఒక ప్రభుత్వ డాక్టర్ అందుబాటులో ఉన్నారనే నిష్పత్తిలో తెలంగాణ దేశంలోనే 15వ స్థానంలో నిలిచింది. ఈ మేరకు తాజా జాతీయ ఆరోగ్య గణాంకాల నివేదిక-2019 వెల్లడించింది. అన్ని రాష్ట్రాల్లో అక్కడి జనాభాలో డాక్టర్లు ఎందరున్నారో విశ్లేషించింది. తెలంగాణలో ప్రభుత్వ అలోపతిక్ డాక్టర్ల సంఖ్య 4,123 మంది ఉన్నారు. అంటే 8,536 మంది జనాభాకు ఒక ప్రభుత్వ అలోపతిక్ డాక్టర్ ఉన్నారు. ఏపీలో 9,657 మందికి ఓ ప్రభుత్వ డాక్టర్ ఉన్నారు. తెలంగాణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 1,066 మంది డాక్టర్లు పనిచేస్తున్నారు. అంటే 33,015 మంది జనాభాకు ఒక పీహెచ్‌సీ డాక్టర్ ఉన్నట్లు పేర్కొంది. ఇక రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఆయుష్ డాక్టర్లు 20,926 మంది ఉండటం విశేషం. అంటే ప్రతీ 1,682 మందికి తెలంగాణలో ఒక ఆయుష్ డాక్టర్ ఉన్నారు. ఆయుష్ డాక్టర్లలో దేశంలో తెలంగాణ 10వ స్థానంలో నిలిచింది. అలాగే రాష్ట్రంలో మొత్తం 12,159 మంది నర్సులు ఉన్నారు. రాష్ట్ర జనాభాలో ప్రతీ 2,894 మందికి ఒక నర్సు ఉన్నారు. ఈ విషయంలో దేశంలో తెలంగాణ 19వ స్థానంలో నిలిచింది. ఇక రాష్ట్రంలో ఫార్మసిస్టుల సంఖ్య ఏకంగా 64,881 మంది ఉండటం విశేషం. ప్రతీ 542 మంది జనాభాకు ఒక ఫార్మసిస్టు ఉన్నారని కేంద్రం తెలిపింది. ఫార్మసిస్టుల సంఖ్యలో తెలంగాణ దేశంలో ఆరో స్థానంలో నిలిచింది. ఇదిలా వుండగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్క ప్రకారం ప్రతీ వెయ్యి మందికి ఒక ప్రభుత్వ వైద్యుడు ఉండాలి. ఆ మేరకు రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యుల సంఖ్య పెరగాల్సి ఉందని వైద్య నిపుణులు అంటున్నారు.

### కంప్యూటర్ ల్యాబ్‌ల అంశంలో తెలంగాణకు 16వ స్థానం




కంప్యూటర్ ప్రయోగశాలలున్న పాఠశాలల సంఖ్యలో తెలంగాణ వెనకబడింది. దేశంలో 17 పెద్ద రాష్ట్రాలుండగా ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ) ల్యాబులున్న బడుల్లో రాష్ట్రానిది చివరి నుంచి రెండో స్థానం కావడం గమనార్హం. బిహార్ 10.70 స్కోర్‌తో చివరి ర్యాంకులో నిలవగా 14.05 స్కోర్‌తో తెలంగాణ 16వ స్థానంలో నిలిచింది. ఇండియా ఇన్నోవేషన్ ఇండెక్స్-2020 పేరిట ఆవిష్కరణల్లో రాష్ట్రాల ర్యాంకులను నీతి అయోగ్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అందుకు పలు రకాల కొలమానాలను పరిగణనలోకి తీసుకొని సూచికలు ఇచ్చింది. మొత్తంమీద రాష్ట్రం నాలుగో స్థానంలో నిలిచింది. మానవ వనరులకు సంబంధించి పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు అనేది ఒక కొలమానం. ఈ అంశంలో మాత్రం తెలంగాణ వెనకబడింది. 2019 ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో రాష్ట్రం 16.32 స్కోర్ సాధించగా 2020లో అది 14.05కి పడిపోవడం గమనార్హం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన 2017-18 విద్యా సంవత్సరం గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 16,123 పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబులున్నాయి. అందులో 5,462 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలున్నాయి. 2018-19లో ఆ సంఖ్య 13,862కు తగ్గిపోవడం గమనార్హం. అందులో ప్రభుత్వ, స్థానిక సంస్థల బడుల సంఖ్య యథాతథంగా ఉండగా...మిగిలిన వాటిల్లో తగ్గిపోయాయి. ముఖ్యంగా ప్రైవేట్ బడుల్లో ల్యాబులు తగ్గిపోయాయి. దీంతో ఈ అంశంలో 100కి 14.05 స్కోర్ మాత్రమే దక్కింది. కేంద్ర ప్రభుత్వం 2008, 2011లో ప్రాథమికోన్నత, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్లు అందజేసింది. అయిదేళ్ల వరకు నిధులిచ్చింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వాటిపై దృష్టి సారించలేదు.



https://ourstudycircle.in/upscpdf/

## 'స్వదేశీ దర్శన్' పథకం కింద గోండు రాజుల కోట పునరుద్ధరణ



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వదేశీ దర్శన్' పథకం కింద ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో ఉన్న గోండు రాజుల కోటను పునరుద్ధరించనున్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఈ కోట పునరుద్ధరణ కోసం రూ. 3.92 కోట్లతో పనులు చేపట్టనున్నారు. కేంద్రం నుంచి ఈ నిధులు ఐటీడీఏ ద్వారా మంజూరవుతుండగా, రాష్ట్ర టూరిజం శాఖ పనులను చేపడుతోంది. గోండు రాజుల చరిత్ర, ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా శాశ్వత ఫొటో గ్యాలరీని ఏర్పాటు చేయనున్నారు. అలాగే శిల్ప, హస్త కళాకారులు తయారు చేసిన వాటిని ప్రదర్శనగా ఉంచనున్నారు. భారతదేశంలోని ఆదివాసుల్లో గోండులకు ప్రత్యేక స్థానమూ, ప్రాధాన్యతా ఉన్నాయి. గోండులలో ప్రధానంగా... మరియా గోండ్లు, కొండ మరియలు, భిషోహోర్ మరియలు అనే మూడు రకాలున్నాయి. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బస్తర్ ప్రాంతమే ఈ మూడు రకాల గోండులకు పుట్టినిల్లు. తెలంగాణలో ఉన్న గోండులను ప్రధానంగా రాజగోండులు అని అంటారు.

## తెలంగాణకు మూలధన వ్యయం కింద రూ.358 కోట్లు

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన పౌరకేంద్రీకృత సంస్కరణలు పూర్తిచేసినందుకుగానూ కేంద్ర ఆర్థికశాఖ తెలంగాణ రాష్ట్రానికి మూలధన వ్యయం కింద రూ. 358 కోట్లు కేటాయించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఒకే దేశం ఒకే రేషన్‌కార్డు, సులభతర వాణిజ్యం, పట్టణ స్థానిక సంస్థల్లో సంస్కరణలు చేపట్టినందుకు ఈ ప్రోత్సాహకం ప్రకటించింది. మధ్యప్రదేశ్ తర్వాత ఈ పద్దు కింద అదనపు నిధులు పొందిన రెండో రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కొవిడ్ కారణంగా రాష్ట్రాల ఆర్థిక వనరులు కుచించుకుపోయిన నేపథ్యంలో రాష్ట్రాలు ఆస్తులు సమకూర్చుకోవడానికి అనువుగా కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ ప్యాకేజీ కింద "మూలధన వ్యయం కోసం రాష్ట్రాలకు అదనపు సాయాన్ని" ప్రకటించింది. ఇప్పటి వరకూ 27 రాష్ట్రాలకు చెందిన రూ. 10,835.50 కోట్ల విలువైన కేపిటల్ ఎక్స్‌పెండిచర్ ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థికశాఖ ఆమోద ముద్ర వేసింది. అందులో మొదటి విడత కింద రూ. 5,417.70 కోట్లు ఇప్పటికే విడుదల చేసింది. ఇందులో భాగంగా తెలంగాణకు రూ. 358 కోట్లు కేటాయించగా వాటిలో తొలి విడతగా రూ. 179 కోట్లకు ఆమోదం తెలిపి, రూ. 89.50 కోట్లు విడుదల చేసింది.

## ఆర్థికంగా వెనకబడిన వారికి తెలంగాణలో 10 శాతం రిజర్వేషన్లు

తెలంగాణలో ఆర్థికంగా వెనకబడిన వర్గాల (ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్-ఈడబ్ల్యూఎస్)కు విద్య, ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సాధారణ పరిపాలన శాఖ ద్వారా ఫిబ్రవరి 8న ఉత్తర్వులు జారీ చేసింది. 2019లో చేసిన 103వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఉన్నత (ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, మైనారిటీయేతర) విద్యాసంస్థలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆర్టికల్ 30లో పేర్కొన్న ప్రత్యేక సంస్థల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు 10% రిజర్వేషన్లు కల్పించాలని ఈ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలలో ఇకపై జరిగే ఉద్యోగ నియామకాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10% రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్ట సవరణలోని నిబంధనల ప్రకారం ఈ రిజర్వేషన్లు అమలుచేస్తున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుకు ముఖ్యమంత్రి కేసీఆర్ 2021 జనవరిలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకున్న 50 శాతం రిజర్వేషన్లను యథాతథంగా కొనసాగిస్తూనే ఈడబ్ల్యూఎస్‌లకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని సీఎం తెలిపారు. దానికి అనుగుణంగా తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

- కేంద్ర ప్రభుత్వం 103వ రాజ్యాంగ సవరణ ద్వారా తమ పరిధిలోని శాఖలు, సంస్థల్లోని విద్యా ఉద్యోగాల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను 2019 ఫిబ్రవరి నుంచి అమల్లోకి తెచ్చింది. ఎస్సీలు, ఎస్టీలు సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన తరగతులకు చెందని వారికి వీటిని వర్తింపజేసింది. రాష్ట్రాల పరిధిలో ఈ రిజర్వేషన్ల అమలు అధికారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చింది. దేశంలోని 19 రాష్ట్రాలు 7 కేంద్రపాలిత ప్రాంతాలు ఈ చట్టాన్ని ఇప్పటికే అమలు చేస్తున్నాయి. ఇకపై తెలంగాణలోనూ ఇవి అమలు కానున్నాయి.
- తెలంగాణాలో ప్రస్తుతం అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఇకపై మరో పది శాతం అదనంగా ఈడబ్ల్యూఎస్‌లకు అమలు చేస్తారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతుల్లోనూ రిజర్వేషన్లు ఉన్నాయి. బీసీలకు ఇవి లేవు. ఈడబ్ల్యూఎస్ వారికి కూడా పదోన్నతుల్లో రిజర్వేషన్లు వర్తించవు.
- **ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు ఎవరు అర్హులు :** కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పొందాలంటే సదరు అభ్యర్థి కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ. 8 లక్షలు దాటకూడదు. 5 ఎకరాల కన్నా ఎక్కువ వ్యవసాయ భూమి ఉన్నవారు అనర్హులు. నివాస ప్రాంతం 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ ఉన్నవారు అర్హులు కాదు. పురపాలక, నగరపాలక సంస్థ పరిధిలో నివాసస్థలం 100 చదరపు గజాల్లో, ఇతర ప్రాంతాల్లో నివాస స్థలం 200 చదరపు గజాల కంటే ఎక్కువ ఉన్న వారికి ఈడబ్ల్యూఎస్ కోటా వర్తించదు. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను పరిశీలించి, రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. ఈడబ్ల్యూఎస్‌లంటే ఎవరు, ఏయే సామాజికవర్గాలకు రిజర్వేషన్లు వర్తిస్తాయనే స్పష్టత ఇవ్వాలి.
- ఈడబ్ల్యూఎస్ కోసం విద్యా కోర్సుల్లో 10 శాతం సీట్లను పెంచాల్సి ఉంటుంది. 110 సీట్లలో 50 ఎస్సీ, ఎస్టీ, బీసీలతో, మిగతా 50 సీట్లను ఓపెన్ కాంపిటీషన్‌తో, 10 సీట్లను ఈడబ్ల్యూఎస్‌తో భర్తీ చేస్తారు.


**తెలంగాణాలో ఇకపై రిజర్వేషన్లు (శాతాల్లో)**

- బీసీలకు 29 (గ్రూపు ఎ- 07%, బి-10%, సి- 01%, డి -07%, ఇ (ముస్లిమ్‌లు)- 04%)
- ఎస్సీలకు 15 శాతం,
- ఎస్టీలకు 6 శాతం,
- ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం.



https://ourstudycircle.in/upscpdf/

## దేశంలోనే తొలి జాతీయ సంకలిత తయారీ కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటు



దేశంలోనే తొలి జాతీయ సంకలిత తయారీ కేంద్రం (నేషనల్ సెంటర్ ఫర్ అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్-ఎన్‌కామ్) హైదరాబాద్‌లో నెలకొల్పేందుకు తెలంగాణ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కృత్రిమమేధ, రోబోటిక్, యంత్ర పరిజ్ఞానం వంటి నవీన సాంకేతికతలతో త్రీడీ ప్రింటింగ్, కంప్యూటర్ ఆధారిత ఆకృతి(క్యాడ్), సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సాయంతో పరిశ్రమలకు అవసరమైన ప్రాజెక్టులు, పరికరాలు, విడిభాగాల నమూనాలను రూపొందించి అందించడం వంటి కార్యకలాపాలను ఇందులో నిర్వహించనున్నారు. వాటిపై పరిశోధనలు, అభివృద్ధి, ఆకృతుల తయారీలో నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా యువతకు, నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. 'జాతీయ సంకలిత తయారీ సంఘాన్ని' ఇందులో భాగస్వామిగా చేర్చాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం , కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కోరుతూ ఇప్పటికే ప్రతిపాదనలు సమర్పించింది. ప్రపంచ వ్యాప్తంగా ఎన్‌కామ్ కేంద్రాలకు విశేష ఆదరణ లభిస్తోంది. ఇవి త్రీడీ తదితర నూతన సాంకేతిక పరిజ్ఞానంతో భారీ పరిశ్రమలతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామికవేత్తల అవసరాలకు అనుగుణంగా యంత్ర పరికరాల నమూనాలు, పరికరాలు రూపొందించి ఇస్తున్నాయి.

### పరిశుభ్రతలో మొదటి స్థానంలో వరంగల్ గ్రామీణ జిల్లా



రాష్ట్రంలోని పంచాయతీల పరిశుభ్రత స్కోరులో వరంగల్ గ్రామీణ జిల్లా వరుసగా రెండో నెల మొదటి స్థానంలో నిలిచింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డిసెంబరులో జిల్లాలోని 70 పంచాయతీల్లో పరిశుభ్రతను పరిశీలించి సగటు స్కోరు ఇచ్చింది. 40 పాయింట్ల స్కేల్‌కు గాను 37.9 పాయింట్లతో ఈ జిల్లా తొలి స్థానంలో ఉంది. నవంబరులోనూ 38 పాయింట్లతో అగ్రస్థానం దక్కించుకుంది. డిసెంబరులో 35.4 పాయింట్లతో రంగారెడ్డి జిల్లా రెండో స్థానం, 34.8 పాయింట్లతో నిజామాబాద్ మూడో స్థానంలో నిలిచాయి. 25.8 పాయింట్లతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా చివరి స్థానానికి పరిమితమైంది.

### వంద శాతం ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చిన రాష్ట్రాలుగా గోవా, తెలంగాణ



ప్రతి ఇంటికి నీరు (హర్ ఘర్ జల్)లో భాగంగా వంద శాతం ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చిన రాష్ట్రాలుగా గోవా, తెలంగాణ దేశంలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచాయి. మనిషికి కనీస అవసరమైన తాగునీటిని నల్లాద్వారా ఇంటింటికీ అందిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. రాష్ట్రంలోని 54,06,070 ఇండ్లకు వంద శాతం సురక్షిత నీటిని నల్లా ద్వారా అందిస్తూ సరికొత్త చరిత్రను సృష్టించింది. ఈ విషయాన్ని జనవరి 21న కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ట్విట్టర్‌లో వెల్లడించారు. 2024 నాటికి ప్రతి ఇంటికి నల్లా నీరు లక్ష్యంగా పెట్టుకున్న ఆంధ్రప్రదేశ్‌లో 95,66,332 ఇళ్లకు గాను 36,38,289 ఇళ్లకు నీరు సరఫరా అవుతోంది. ఇది 32.24 శాతం మాత్రమే. ఇంటింటికి నల్లా కనెక్షన్ల విషయంలో ఆంధ్రప్రదేశ్ 14వ స్థానంలో ఉంది.


### ప్రాజెక్ట్ ఇండి వికీతో తెలంగాణ ఐటీ శాఖ ఒప్పందం

ఆన్‌లైన్ విజ్ఞాన సర్వస్వంగా పేర్కొనే 'వికీపీడియా'లో ఇంగ్లీషులో అందుబాటులో ఉన్న సమాచారాన్ని భారతీయ భాషల్లో అందుబాటులోకి తెచ్చేందుకు ట్రిపుల్ ఐటీల భాగస్వామ్యంతో కేంద్ర ఐటీ శాఖ 'ఇండిక్ వికీ ప్రాజెక్టు' చేపట్టింది. ఈ ప్రాజెక్టులో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ కూడా భాగస్వామిగా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం... వివిధ భాషల్లో సమాచారాన్ని, తెలంగాణ రాష్ట్ర సమాచారాన్ని తెలుగు వికీపీడియాలో అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ఐటీ శాఖ, తెలంగాణ ఐటీ శాఖ కలిసి పనిచేయనున్నాయి. మరోవైపు వివిధ ప్రభుత్వ శాఖల సమాచారాన్నీ వికీ వ్యాసాల్లో పొందుపరిచేందుకు ప్రభుత్వం అంగీకరించింది. రాష్ట్ర అవతరణ తర్వాత భాషా, సాంస్కృతిక శాఖ ప్రచురించిన పుస్తకాల్లోని సమాచారాన్నీ తెలుగులో అందుబాటులోకి తెస్తారు. వికీపీడియాలో లక్షల కొద్ది పేజీల సమాచారం అందుబాటులో ఉండగా, హిందీలో 1.34 లక్షల పేజీలు, తెలుగులో సుమారు 70 వేల పేజీల సమాచారం మాత్రమే ఉంది.

### రాష్ట్రంలో ప్రతి నలుగురిలో ఒకరికి కరోనా యాంటీబాడీస్

తెలంగాణ రాష్ట్రంలో ప్రతి నలుగురిలో ఒకరికి కరోనా యాంటీబాడీస్ (ప్రతి దేహకాలు) అభివృద్ధి చెందాయి. ఈ మేరకు భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్)లు ఫిబ్రవరి 9న వివరాలు వెల్లడించాయి. కోవిడ్‌పై పోరాడే యాంటీబాడీస్ రాష్ట్రవ్యాప్తంగా 24.1 శాతం మందిలో ఉన్నట్లు తెలిపాయి. హైదరాబాద్ మినహా రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరిస్థితి ఉందని పేర్కొన్నాయి. 2020 మేలో మొదటి సీరో సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 0.33 శాతం మాత్రమే కరోనా యాంటీబాడీస్ అభివృద్ధి చెందాయి. ఆ తర్వాత 2020 ఆగస్టులో రెండో సీరో సర్వేలో 12.5 శాతం జనాభాలో యాంటీబాడీస్ వృద్ధి చెందినట్లు తేలింది. 2020 డిసెంబర్‌లో జరిపిన మూడో సీరో సర్వేలో 24.1 శాతం మందిలో యాంటీబాడీస్ అభివృద్ధి చెందాయని తేలింది.

### హైదరాబాద్‌లో బోయింగ్-737 విడిభాగాల తయారీ



బోయింగ్-737 విమానాల తయారీలో వినియోగించే కీలకమైన 'వర్టికల్ ఫిన్ స్ట్రక్చర్లు' హైదరాబాద్‌లో తయారు కాబోతున్నాయి. బోయింగ్ విమానాల 'వర్టికల్ ఫిన్ స్ట్రక్చర్ల' తయారీకి హైదరాబాద్ ఆదిభట్లలో బోయింగ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టాటా గ్రూపు సంస్థ) సంయుక్త కంపెనీ అయిన టాటా బోయింగ్ ఏరోస్పేస్ (టీబీఏఎల్) యూనిట్లో ఒక కొత్త 'ప్రొడక్షన్ లైన్' ఏర్పాటు చేయనున్నట్లు బోయింగ్ ఫిబ్రవరి 5న ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే ఇక్కడ బోయింగ్ ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్ ఏరో-స్ట్రక్చర్లు, సెకండరీ స్ట్రక్చర్లు, ఫ్యూస్‌లేజెస్, వర్టికల్ స్పర్ బాక్సులు, ఇతర ముఖ్య విడిభాగాలు తయారు చేస్తున్నారు.



https://ourstudycircle.in/upscpdf/





## ఇంటి వద్దకే రేషన్ బియ్యం సరఫరా చేసే మొబైల్ వాహనాలు ప్రారంభం




దేశంలోనే తొలిసారిగా ప్రజా పంపిణీ వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇంటి వద్దకే రేషన్ బియ్యం సరఫరా చేసే మొబైల్ వాహనాలను ప్రారంభించింది. తొలుత గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించిన 2,503 వాహనాలను... కృష్ణా జిల్లా విజయవాడ బెంజిసర్కిల్‌లో జనవరి 21న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 9,260 వాహనాలు ప్రారంభ మయ్యాయి. రేషన్ సరుకుల కోసం కార్డుదారులు ముఖ్యంగా రోజువారీ కూలీలు, వృద్ధులు, రోగులు ఎదుర్కొంటున్న అవస్థలను తొలిగించేందుకు ఈ వాహనాలను ప్రారంభించారు. ప్రతి నెలా నాణ్యమైన బియ్యం తీసుకునేందుకు వీలుగా, తిరిగి వినియోగించుకునేలా ఒకసారి ప్రభుత్వం ఉచితంగా ఇవ్వనున్న 10, 15 కిలోల నార సంచులను కూడా ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. 2021 ఫిబ్రవరి 1వ తేదీ నుంచి నాణ్యమైన రేషన్ బియ్యం డోర్ డెలివరీ కోసం ఈ వాహనాలు సిద్ధమయ్యాయి. నాణ్యమైన బియ్యం పంపిణీ చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతి ఏటా రూ.830 కోట్లు అదనపు భారం పడనుంది. 9,260 రేషన్ సరుకుల సరఫరా వాహనాల కోసం రూ.539 కోట్ల వ్యయం చేశారు. నిరుద్యోగ యువతకు జీవనోపాధి కల్పించేందుకు ఈ వాహనాలను వివిధ కార్పొరేషన్ల ద్వారా 60 శాతం సబ్సిడీతో ప్రభుత్వం సమకూర్చింది. ఒక్కో వాహనం విలువ రూ.5,81,000. ఈ వాహనాలకు పౌరసరఫరాల సంస్థ ప్రతి నెలా అద్దె చెల్లిస్తూ ఆరేళ్ల పాటు వినియోగించుకోనుంది. మొబైల్ వాహనంలో తూకం వేసే యంత్రం (వేయింగ్ స్కేల్), కొలతల పరికరాలు ఉంటాయి. ఎల్ఈడీ ల్యాంప్స్, ఈ-పాస్ యంత్రాల ఛార్జింగ్ పాయింట్లు, మినీ ఫ్యాన్, చిన్న మైక్ ఉంటుంది. ప్రథమ చికిత్స బాక్సు, నగదు పెట్టె, అగ్ని మాపక యంత్రం, నోటీసు బోర్డు ఏర్పాటు చేశారు. మొబైల్ వాహనం ద్వారా రోజుకు 90 కార్డులకు తగ్గకుండా 18 రోజుల పాటు కార్డుదారులకు పంపిణీ చేయాలి. అందులో ఉండే ఎలక్ట్రానిక్ తూకం(వేయింగ్ స్కేల్) ద్వారా కచ్చితత్వంతో సరకులు ఇవ్వాలి. ప్రతి బియ్యం సంచికి యూనిక్ కోడ్, సీలు వేయడంతో పాటు ఆన్‌లైన్ ట్రాకింగ్, జీపీఎస్ అమర్చుతారు. వీటి ద్వారా పంపిణీ వివరాలు రియల్ టైమ్‌లో తెలుసుకోవచ్చు.

### విద్యుత్తు సంస్కరణలను అమల్లోకి తెచ్చిన రెండో రాష్ట్రంగా ఏపీ



కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన విద్యుత్తు సంస్కరణల్లో ఒకదాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయవంతంగా అమల్లోకి తెచ్చినట్లు కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది. రైతులకు వ్యవసాయ సబ్సిడీలో భాగంగా గత ఏడాది (2020) సెప్టెంబరు నుంచి నేరుగా నగదు బదిలీ ప్రారంభించినట్లు తెలిపింది. కేంద్ర ఆర్థికశాఖ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్ నిర్వహించిన విద్యుత్తు సంస్కరణలను అమల్లోకి తెచ్చిన రెండో రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచినట్లు, ఈ విషయంలో మధ్యప్రదేశ్ ముందున్నట్లు తెలిపింది. నిర్దేశిత మూడు సంస్కరణల్లో ఒకదాన్ని విజయవంతంగా అమల్లోకి తేవడం వల్ల జీఎస్‌డీపీలో 0.15% మేర అదనపు రుణాలు తీసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ అర్హత సాధించినట్లు పేర్కొంది. ఇందులో భాగంగా ఆర్థికశాఖ వ్యయ విభాగం రూ.1,515 కోట్ల మేర అదనపు రుణాలు తీసుకోవడానికి అనుమతిచ్చినట్లు తెలిపింది. రైతులకు ఇబ్బందుల్లేని సబ్సిడీ విధానాన్ని ప్రవేశపెట్టడంతో పాటు, లీకేజీలను అరికట్టడానికి పారదర్శక విధానాన్ని తీసుకురావాలన్న ఉద్దేశంతో ఈ సంస్కరణలను ప్రతిపాదించినట్లు ఆర్థికశాఖ పేర్కొంది.

### గిరిజనుల ఆస్తుల రక్షణ కోసం 'గిరిజన వికాసం' వెబ్‌సైట్



గిరిజనుల ఆస్తులకు రక్షణ కల్పించే చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. త్వరలో 'గిరిజన వికాసం' పేరుతో వెబ్‌సైట్‌ను ప్రారంభించనుంది. గిరిజన సంక్షేమ శాఖ రూపొందించిన ఈ వెబ్‌సైట్‌లో గిరిజన కుటుంబాలకు చెందిన అన్ని వివరాలు పొందుపరచనున్నారు. రాష్ట్రంలో గిరిజన కుటుంబాలకు సంబంధించి నిర్వహించిన సమగ్ర సర్వేలో సేకరించిన సమాచారం పూర్తిగా ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకున్నారు. గిరిజన కుటుంబ యజమాని లేదా కుటుంబ సభ్యుని ఆధార్ నంబర్ వెబ్‌సైట్లో నమోదు చేయగానే ఆ కుటుంబానికి సంబంధించిన సమగ్ర సమాచారం కనిపిస్తుంది. ఒక వేళ సమాచారంలో లోపం ఉంటే సంబంధిత ఐటీడీఏలో వివరాలు తెలిపి మార్పులు చేయించుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ పథకాలు గిరిజన కుటుంబాలకు అందాయా? లేదా? అనే విషయం తెలుసుకునేందుకు కూడా ఇది ఉపయోగపడుతుంది. గిరిజన కుటుంబంలో సభ్యుల పూర్తి వివరాలు, స్థిర, చరాస్తుల వివరాలు , గిరిజన రైతుల పేరిట ఉన్న భూముల సమగ్ర వివరాల నమోదు, వెబ్‌ల్యాండ్, ఆర్‌వోఎఫ్ఆర్ హక్కు పత్రాల వివరాలు, పట్టాదారు పేరు, ఊరిపేరు, సర్వే



https://ourstudycircle.in/upscpdf/

నంబరు, ఇతర వివరాలు , రైతు భరోసా కింద ప్రభుత్వం చేసిన ఆర్థిక సాయం వివరాలు, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి వివిధ పథకాల ద్వారా ఎంత మొత్తం సాయం అందిందనే వివరాలు, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా భూమిలో గిరిజన రైతుతో జియో ట్యాగింగ్ వంటి వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

### పట్టణ పేదల సంక్షేమంలో ఏపీకి అగ్రస్థానం



పట్టణ పేదల సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే టాప్ వన్‌గా నిలిచింది. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్ 2019-20కు గాను రూపొందించిన సిస్టమాటిక్ ప్రోగ్రెసివ్ అండ్ రియల్ టైం (స్పార్క్) ర్యాంకుల్లో ఏపీ మొదటి స్థానంలో నిలిచి అవార్డు దక్కించుకుంది. రాష్ట్రంలోని పట్టణాల్లో 24 లక్షల మంది పేద మహిళలను సంఘటితం చేసిన రాష్ట్ర పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ 2.4 లక్షల పొదుపు సంఘాలను ఏర్పాటు చేసింది. ఉపాధి కల్పన పథకాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రశంసించింది. మొదటి స్థానంలో నిలిచినందుకు మెప్మాకు రూ.12 కోట్లు ప్రోత్సాహకాన్ని కూడా ప్రకటించింది.

### ఆంధ్రప్రదేశ్‌కు రూ.280 కోట్ల వరద సాయం

కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు రూ.280.78 కోట్ల వరద సాయాన్ని ప్రకటించింది. గత ఏడాది(2020) నైరుతి రుతుపవనాల సమయంలో రాష్ట్రంలో సంభవించిన వరదలను దృష్టిలో ఉంచుకొని బాధితుల సాయం కోసం ఈ మొత్తాన్ని ఇవ్వనుంది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా నేతృత్వంలో జరిగిన ఉన్నతస్థాయి కమిటీ (హెచ్ఎల్‌సీ) సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ఆ శాఖ ఫిబ్రవరి 13న ఒక ప్రకటనలో తెలిపింది. ఏపీతో పాటు తుఫాన్లు, చీడపీడల దాడిలాంటి ప్రకృతి వైపరీత్యాలకు లోనైన బిహార్, తమిళనాడు, పుదుచ్చేరి, మధ్యప్రదేశ్‌లకు కలిపి జాతీయ ప్రకృతి వైపరీత్య ముప్పు నిర్వహణ నిధి(ఎన్‌డీఆర్ఎఫ్) నుంచి రూ.3,113.05 కోట్ల అదనపు కేంద్ర సాయాన్ని ఇవ్వాలని ఉన్నత స్థాయి కమిటీ నిర్ణయించింది. ఇందులో అత్యధికంగా మధ్యప్రదేశ్‌కు రూ.1,280.18 కోట్లు, బిహార్‌కు రూ.1,255.27 కోట్లు ప్రకటించారు. నివర్, బురేవి తుఫాన్ల ప్రభావానికి గురైన తమిళనాడుకు రూ.286.91 కోట్లు, పుదుచ్చేరికి రూ.9.91 కోట్లు దక్కాయి.

### ఎంఎస్‌టీసీకి బైరైటీస్ ఖనిజం బాధ్యతలు



వైఎస్సార్ కడప జిల్లా మంగంపేట గనుల నుంచి 22 లక్షల మెట్రిక్ టన్నుల బైరైటీస్ ఖనిజాన్ని 2021-22 ఆర్థిక సంవత్సరంలో విక్రయించాలని ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) నిర్ణయించింది. ఈ మేరకు ఇ-టెండర్ కమ్ ఇ-వేలం బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టీసీకి అప్పగించింది. ఏడాదిలో 10 లక్షల టన్నుల ఎ-గ్రేడ్, 2 లక్షల టన్నుల బి-గ్రేడ్, 10 లక్షల టన్నుల సీ, డీ, డబ్ల్యు గ్రేడ్ల బైరైటీస్ ఖనిజాన్ని విక్రయించనున్నట్లు ఫిబ్రవరి 7న ఏపీఎండీసీ తెలిపింది. 1992 నాటికి 5,08,000 టన్నుల బైరైటీస్ ఉత్పత్తి అయింది. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా ఉత్పత్తి అవుతోంది. ఎక్కువగా ఎగుమతి చేస్తున్న రాష్ట్రం కూడా ఇదే. రంగులు, కాగితం, వస్త్రాలు, తోళ్ల పరిశ్రమల్లో దీన్ని ఉపయోగిస్తారు. బైరైటీస్ ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోని కడప, అనంతపురం, కర్నూలు, కృష్ణా జిల్లాలు, రాజస్థాన్‌లోని ఆల్వార్ ప్రాంతాల్లో లభిస్తోంది.

### పండ్ల ఉత్పత్తిలో ఏపీకి అగ్రస్థానం

పండ్ల ఉత్పత్తిలో దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ ముందు నిలిచింది. 2019-20 మూడో ముందస్తు అంచనాల ప్రకారం రాష్ట్ర పండ్ల దిగుబడి 1.75 కోట్ల మెట్రిక్ టన్నులకు చేరిందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. 1.15 కోట్ల మెట్రిక్ టన్నుల దిగుబడితో మహారాష్ట్ర రెండోస్థానంలో నిలిచింది.




- పూల దిగుబడిలోనూ ఏపీది అగ్రస్థానమే. 2019-20 మూడో ముందస్తు అంచనాల ప్రకారం రాష్ట్రంలో పూల దిగుబడి 5.37 లక్షల మెట్రిక్ టన్నులకు చేరనుంది. ఏపీలో పూలు సాగుచేసే భూ విస్తీర్ణం కేరళ, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల కంటే తక్కువ ఉన్నప్పటికీ దిగుబడి ఎక్కువని నరేంద్రసింగ్ తోమర్ లోక్‌సభలో ఓ లిఖితపూర్వక ప్రశ్నకు ఇచ్చిన సమాధానం వెల్లడించింది. కూరగాయల ఉత్పత్తిలో పశ్చిమబెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరాఖండ్, తమిళనాడు, ఒడిశాల కంటే ఏపీ వెనుకబడి ఉంది.
- సూక్ష్మసేద్యంలో ఏపీది దేశంలోనే రెండోస్థానం. దేశవ్యాప్తంగా 1.29 కోట్ల హెక్టార్ల భూమి ప్రస్తుతం సూక్ష్మసేద్యం కింద ఉండగా అందులో 14.77% భూభాగం ఏపీదే. రాష్ట్రంలో బిందు సేద్యం కింద 13.88 లక్షల హెక్టార్లు, తుంపర్ల సేద్యం కింద 5.19 లక్షల హెక్టార్లు మొత్తం 19.07 లక్షల హెక్టార్లు సాగవుతోంది. రాజస్థాన్ (19.87 లక్షల హెక్టార్లు) తర్వాత అత్యధిక భూమి సూక్ష్మసేద్యం కింద ఏపీలోనే ఉంది.
- 2019-20లో పాల దిగుబడిలో ఏపీ నాలుగో స్థానంలో నిలిచింది. ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్ మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఆ ఏడాది ఏపీ నుంచి 1.52 కోట్ల టన్నుల పాల దిగుబడి వచ్చినట్లు కేంద్ర పశుసంవర్ధక శాఖ సహాయమంత్రి సంజీవ్‌బాల్యాన్ తెలిపారు. 2015-16తో పోలిస్తే 2019-20 నాటికి రాష్ట్రంలో పాల దిగుబడి 41.10% మేర పెరిగింది. ఇది జాతీయ సగటు పెరుగుదల 27.59% కంటే అధికం.



https://ourstudycircle.in/upscpdf/


## సాగునీటి ప్రాజెక్టులకు కార్పొరేషన్లు ఏర్పాటు

పల్నాడు ప్రాంతంలో నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 కోట్ల మూలధనంతో 'ఏపీ పల్నాడు ప్రాంత కరవు నివారణ ప్రాజెక్టుల సంస్థ'ను ఏర్పాటు చేసింది. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదయ్యే 9.61 లక్షల ఎకరాల్లోని ఆయకట్టుకు సాగునీరు, 54 మండలాల్లోని ప్రజలకు తాగునీటిని అందించేందుకు ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నట్లు జల వనరుల శాఖ కార్యదర్శి జె. శ్యామలరావు ఉత్తర్వులు జారీచేశారు. ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి కార్పొరేషన్‌ను ఏర్పాటు



చేస్తూ ప్రభుత్వం మరో ఉత్తర్వు జారీచేసింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో వంశధార, నాగావళి, చంపావతి, తాండవ, వరాహ నదులపై ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.5 కోట్ల మూలధనంతో దీన్ని ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో పాటు తాండవ ఎత్తిపోతల ద్వారా 8 లక్షల ఎకరాలకు సాగునీరు, 1,037 గ్రామాల్లోని 30 లక్షల జనాభాకు తాగునీరు అందుతుందని, ఇందుకు మొత్తం రూ. 8,400 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు.

### పోలవరం ప్రాజెక్టులో ప్రపంచంలోనే అతిపెద్ద హైడ్రాలిక్ సిలిండర్ల ఏర్పాటు



ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే క్రస్ట్ గేట్ల నిర్వహణలో అత్యంత కీలకమైన 96 'హైడ్రాలిక్ హాయిస్ట్' సిలిండర్లను జర్మనీలోని మాంట్ హైడ్రాలిక్ సంస్థ నుంచి రాష్ట్ర ప్రభుత్వం దిగుమతి చేసుకుంటోంది. ఇప్పటికే 70 సిలిండర్లను జర్మనీ నుంచి పోలవరం ప్రాజెక్టు వద్దకు చేర్చారు. ప్రపంచంలో హైడ్రాలిక్ హాయిస్ట్ సిలిండర్లతో అతిపెద్ద గేట్లను అమర్చుతున్న ప్రాజెక్టు పోలవరమే. 2022 ఖరీఫ్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం సమీపంలో పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తున్నారు.

### ఏపీకి రూ.3,137 కోట్ల స్థానిక సంస్థల గ్రాంట్లు

దేశంలోని గ్రామీణ స్థానిక సంస్థలకు బేసిక్ గ్రాంట్ల కింద జనవరి 28న కేంద్ర ప్రభుత్వం రూ.12,315.5 కోట్లను విడుదల చేసింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు రూ.3,137.03 కోట్లు, తెలంగాణకు రూ.1,385.25 కోట్లు వచ్చాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో రెండో వాయిదా కింద ఈ గ్రాంట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ తెలిపింది. తొలి విడత వినియోగ ధ్రువపత్రాలు సమర్పించిన 18 రాష్ట్రాలకే రెండో విడత గ్రాంట్లు విడుదల చేసినట్లు పేర్కొంది. ఈ నిధులు గ్రామ, మండల, జిల్లా పరిషత్తు స్థాయి మూడంచెల పంచాయతీ వ్యవస్థలకూ దక్కుతాయి.

### మదనపల్లెలో భారత్ యోగా విద్యాకేంద్రాన్ని ప్రారంభించిన రాష్ట్రపతి

సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, పద్మభూషణ్ ముంతాజ్ అలీ ఆహ్వానం మేరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఫిబ్రవరి 7న చిత్తూరు జిల్లా మదనపల్లె వచ్చారు. మదనపల్లెలోని సత్సంగ్ ఫౌండేషన్‌లో "భారత్ యోగా విద్యాకేంద్రం"ను ప్రారంభించి ఆవరణలో మొక్కలు నాటారు. 38 పడకల స్వస్థ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

### తిరుపతిలో 29వ దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి మండలి సమావేశం

తిరుపతి కేంద్రంగా 29వ దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి మండలి సమావేశం 2021 మార్చి 4న జరగనుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దీనికి అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశంలో ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు పాల్గొంటారు. కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, లక్షదీవ్‌ల లెఫ్టినెంట్ గవర్నర్లు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతారు.

### ఏపీఎంఈఆర్‌సీ బోర్డు ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కార్పొరేషన్ (ఏపీఎంఈఆర్‌సీ)కి కొత్త బోర్డును ఏర్పాటు చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఫిబ్రవరి 2న ఉత్తర్వులిచ్చింది. ఈ బోర్డుకు వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఛైర్మన్‌గానూ, డైరెక్టర్, మెంబర్ కన్వీనర్‌గా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ వ్యవహరిస్తారు. ఇతర శాఖలకు చెందిన మరో ఆరుగురికి బోర్డులో స్థానం కల్పించారు. బోధనాసుపత్రులు, నర్సింగ్ కళాశాలలు, ఇతర నిర్మాణాలకు నిధుల సమీకరణ కోసం ఏపీఎంఈఆర్‌సీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

### పీఎంజీఎస్‌వైలో రూ.766.54 కోట్లతో రహదారులు

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద రూ.766.54 కోట్లతో రహదారుల అభివృద్ధి, కొత్త వంతెనల పనులు చేపట్టేందుకు పరిపాలన అనుమతులిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఫిబ్రవరి 15న ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చ నున్నాయి.

### 'కొల్లేరు' చౌడు నివారణ ప్రాజెక్టుకు ప్రత్యేక వాహక సంస్థ

కృష్ణా-పశ్చిమ గోదావరి జిల్లాల్లో విస్తరించిన కొల్లేరు ప్రాంత భూములు చౌడు బారకుండా ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక వాహక సంస్థను ఏర్పాటు చేస్తూ ఆదేశాలిచ్చింది. ఆంధ్రప్రదేశ్ కృష్ణా-కొల్లేరు సాలినిటీ మిటిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ పేరిట కంపెనీల రిజిస్ట్రార్ వద్ద ఎస్పీవీని నమోదు చేశారు.

### రాష్ట్రంలో కొత్తగా ఆర్టీసీ బస్టాండ్లలో ఆప్కో స్టాల్స్

రాష్ట్రవ్యాప్తంగా ఆప్కో వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆప్కో స్టాల్స్‌ను రాష్ట్రవ్యాప్తంగా 15 బస్టాండ్లలో ఏర్పాటు చేయనున్నారు. కార్పొరేషన్లు, ప్రధాన పట్టణాల్లో ఏర్పాటు ద్వారా చేనేత ఉత్పత్తుల విక్రయాలు పెంచాలన్నదే ప్రధాన లక్ష్యం. ముందుగా శ్రీకాకుళం, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, మచిలీపట్నం, ఏలూరు, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం బస్టాండ్లలో ఆప్కోస్టాల్స్ ఏర్పాటు చేస్తారు. బస్టాండ్లలో ఆప్కో స్టాళ్లు కెటాయిస్తే వ్యాపారం పెరుగుతుందని ఆప్కో భావిస్తుంది.



https://ourstudycircle.in/upscpdf/

# ఇతర రాష్ట్రాల సమాచారం

## పుదుచ్చేరిలో రాజకీయ సంక్షోభం




కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో రాజకీయ సంక్షోభం తలెత్తింది. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు పదవులకు రాజీనామాలు చేయడంతో సభలో బలం తగ్గింది. పుదుచ్చేరి శాసనసభలో 30 స్థానాలుండగా గతంలో కాంగ్రెస్ కూటమి 18 మంది సభ్యుల బలంతో నారాయణస్వామి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇటీవల మంత్రి నమశివాయం, ఎమ్మెల్యే తీపాయన్‌దాన్ రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఎమ్మెల్యేలు మల్లాడి కృష్ణారావు ఫిబ్రవరి 15న, జాన్‌కుమార్ ఫిబ్రవరి 16న రాజీనామాలు చేయగా సభాపతి శివకొళుందు వాటిని ఆమోదించారు. దీంతో స్పీకర్‌ను కలుపుకుని అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 10కి పడింది. మూడు డీఎంకే, ఒక స్వతంత్ర అభ్యర్థులను కలుపుకున్నా 14కి పరిమితం కాగలదు. ప్రతిపక్షంలో ఎన్ఆర్ కాంగ్రెస్ 7, అన్నాడీఎంకే 4, నామినేటెడ్ (బీజేపీ) ఎమ్మెల్యేలు 3తో కలుపుకుని మొత్తం 14 సభ్యుల బలం ఉంటుంది. అధికార, ప్రతిపక్షాలకు సమబలం ఏర్పడడంతో ప్రభుత్వం మైనార్టీలో పడింది.

**పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ తొలగింపు :** పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీని కేంద్ర ప్రభుత్వం పదవి నుంచి తొలగించింది. ఈ మేరకు ఫిబ్రవరి 17న రాష్ట్రపతి భవన్ నుంచి ఒక ప్రకటన వెలువడింది. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు పుదుచ్చేరి అదనపు బాధ్యతలను అప్పగించారు. మరొకరిని నియమించే వరకు ఆ బాధ్యతలు తమిళిసై నిర్వర్తిస్తారు. సీఎం నారాయణ స్వామి ప్రభుత్వం మైనారిటీలో పడిపోయిన కొద్ది గంటల్లోనే ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. మాజీ ఐపీఎస్ అధికారి కిరణ్‌బేడీ 2016 మేలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులయ్యారు. అప్పటి నుంచి నారాయణ స్వామి ప్రభుత్వంతో విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆమె పనితీరు అప్రజాస్వామికంగా ఉందంటూ నారాయణ స్వామి ఆరోపించారు.

### జమ్మూకశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ(సవరణ) బిల్లు -2021కు లోక్‌సభ ఆమోదం

జమ్మూకశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ(సవరణ) బిల్లు–2021కు ఫిబ్రవరి 13న లోక్‌సభ ఆమోదం తెలిపింది. జమ్మూకశ్మీర్‌కు తగిన సమయం చూసి తిరిగి రాష్ట్ర హోదా కల్పిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో హామీ ఇచ్చారు. జమ్మూకశ్మీర్ రీఆర్గనైజేషన్ (సవరణ) 2021 బిల్లుపై జరిగిన చర్చకు అమిత్ షా ఫిబ్రవరి 13న లోక్‌సభలో సమాధానమిచ్చారు. అఖిల భారత సర్వీసు ఆఫీసర్స్ జమ్మూకశ్మీర్ కేడర్‌ని అరుణాచల్ ప్రదేశ్, గోవా, మిజోరాం యూనియన్ టెర్రిటరీలతో కలపడమే ఈ బిల్లు ఉద్దేశమని స్పష్టం చేశారు. ఆ తర్వాత మూజువాణి ఓటుతో బిల్లుని లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లుకు 2021 ఫిబ్రవరి 7న రాజ్యసభ ఆమోదం తెలిపింది. జమ్మూకశ్మీర్ సివిల్ సర్వీసెస్ ఆఫీసర్ క్యాడర్‌ను అరుణాచల్ ప్రదేశ్, గోవా, మిజోరాం యూనియన్ టెరిటరీ(ఏజీఎంయూటీ) క్యాడర్‌లో విలీనం చేస్తూ 2021 జనవరి 8న తీసుకొచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి ఈ బిల్లును ఫిబ్రవరి 7న రాజ్యసభలో ప్రవేశపెట్టారు.

### 'రామసేతు' ప్రాజెక్టుపై సీఎస్ఐఆర్-ఎన్ఐఓ పరిశోధన



రామసేతు ఎలా ఏర్పడింది? వయసెంత? తదితర విషయాలు తెలుసుకొనేందుకు సీఎస్ఐఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ–గోవా (ఎన్ఐఓ) పరిశోధన చేయనున్నాయి. ఈ ప్రతిపాదనలకు ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) ఇటీవల ఆమోదం తెలిపింది. రామసేతు నిర్మాణం మనుషులు చేపట్టిందా? లేక ప్రకృతి సిద్ధంగా ఏర్పడిందా? దాని వయసెంత? తదితర విషయాలను ఈ ప్రాజెక్టులో భాగంగా అధ్యయనం చేయనున్నట్లు ఎన్ఐఓ ప్రొఫెసర్ సునీల్ కుమార్ సింగ్ తెలిపారు. 2021 మార్చి నుంచి చేపట్టబోయే ఈ ప్రాజెక్టును మూడేండ్లలో పూర్తి చేస్తామన్నారు. తమిళనాడులోని రామేశ్వరం నుంచి శ్రీలంక మన్నార్ వరకు సుమారు 48 కిలోమీటర్ల పొడువుతో 'రామసేతు' విస్తరించి ఉన్నది.

## సంక్షిప్త సమాచారం

- పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో తెలుగును అధికార భాషగా గుర్తిస్తూ, తెలుగు వారికి అల్పసంఖ్యాక హోదా కల్పిస్తూ ఆ రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. ఫిబ్రవరి 6న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు.
- అస్సాంలో రూ. 8,210 కోట్లతో రహదారులను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన 'అస్సాం మాలా' పథకాన్ని ఫిబ్రవరి 7న సోనిత్‌పూర్ జిల్లాలోని దెకియాజూలిలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు.
- కేరళలో తొలి తల్లి పాల బ్యాంకు ఎర్నాకులం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటైంది. 'రోటరీ క్లబ్ ఆఫ్ కొచ్చి గ్లోబల్' సహకారంతో నెలకొల్పిన ఈ బ్యాంకును ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి శైలజ ఫిబ్రవరి 8న ప్రారంభించారు.
- తమిళనాడు రాష్ట్రంలోని ఉల్లందూర్‌పేట్‌లో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి 2020 ఫిబ్రవరి 22న భూమి పూజచేశారు. ఈ ఆలయ నిర్మాణం కోసం 3 ఎకరాల 98 సెంట్లభూమి తితిదేకి తమిళనాడు ప్రభుత్వం విరాళంగా అందించింది. మరియు కోవె ఏర్పాటుకు రూ. 3.16 కోట్లు ఇచ్చారు.



https://ourstudycircle.in/upscpdf/

# ఆర్థికాంశాలు

## రెపో సహా ఆర్‌బీఐ కీలక రేట్లు యథాతథం

రిజర్వు బ్యాంక్ ద్రవ్య పరపతి విధాన సమీక్ష కమిటీ (ఎంపీసీ) సమావేశం ఫిబ్రవరి 5న జరిగింది. ఇందులో కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని ఆరుగురు సభ్యులతో కూడిన ఎంపీసీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. దీంతో ప్రస్తుతం 4 శాతంగా ఉన్న రెపో రేటు, 3.35 శాతంగా ఉన్న రివర్స్ రెపో రేటు అలాగే కొనసాగనున్నాయి. దేశ ఆర్థిక వృద్ధి రేటుకు వెన్నుదన్నుగా నిలవడంతో పాటు ఆర్థిక వ్యవస్థపై కొవిడ్-19 సంక్షోభ ప్రభావాన్ని తగ్గించాలన్న లక్ష్యంతోనే కీలక వడ్డీ రేట్లను మరోసారి యథాతథంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది(2020) ఫిబ్రవరి తర్వాత రెపో రేటును 115 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) తగ్గించిన ఆర్‌బీఐ, గడిచిన (ఆగస్టు, అక్టోబర్, డిసెంబర్ నెలల్లో) మూడు ద్వైమాసిక సమావేశాల్లో యథాతథ రేటును కొనసాగిస్తోంది.

- నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని దశలవారీగా 4 శాతానికి పెంచాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2021-22)లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 10.5 శాతానికి పుంజుకుంటుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. 2020-21 ఆర్థిక సర్వేలో కేంద్ర ప్రభుత్వం వేసిన అంచనా (11 శాతం) కంటే ఇది 0.5 శాతం తక్కువ.
- అత్యవసర పరిస్థితుల్లో బ్యాంకింగ్ ఆర్‌బీఐ నుంచి నిధులు పొందడానికి సంబంధించిన మార్జినల్ స్టాండింగ్ సౌలభ్యత (ఎంఎస్ఎఫ్)ను ఆర్‌బీఐ మరో ఆరు నెలలు పొడిగించింది. దీనివల్ల రూ.1.53 లక్షల కోట్లు బ్యాంకింగ్‌కు అందుబాటులో ఉంటాయి. గత ఏడాది(2020) మార్చి నుంచి ఈ పొడిగింపులను ఆర్‌బీఐ కొనసాగిస్తోంది.
- ప్రభుత్వ బాండ్ మార్కెట్‌లోకి రిటైల్ ఇన్వెస్టర్లు ప్రత్యక్షంగా పాల్గొనడానికి అనుమతినిస్తూ, ఇందుకు సంబంధించి కీలక సంస్కరణాత్మక చర్యకు ఆర్‌బీఐ శ్రీకారం చుట్టింది.. తద్వారా ఇలాంటి సౌలభ్యం కల్పిస్తున్న నిర్దిష్ట దేశాల జాబితాలో భారత్ కూడా చేరినట్లయ్యింది. ప్రస్తుతం రిటైల్ ఇన్వెస్టర్లు ప్రైమరీ ఆక్షన్లు, స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నాన్-కాంపిటేటివ్ బిడ్డింగ్ ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలుచేసే అవకాశం ఉంది. ఆర్‌బీఐ నిర్ణయం ప్రకారం ఇకపై ప్రత్యక్షంగా ఆన్‌లైన్ ద్వారా ఆర్‌బీఐ నుంచే ప్రభుత్వ బాండ్లను రిటైల్ ఇన్వెస్టర్ కొనుగోలు చేయగలుగుతాడు. దీనిని రిటైల్ డైరెక్ట్ అని వ్యవహరిస్తారు. ఆర్‌బీఐతో ప్రత్యక్షంగా నిర్వహించే గిల్ట్ అకౌంట్ల ప్రారంభం ద్వారా ఈ ఇన్‌స్ట్రుమెంట్ లావాదేవీలు సాధ్యమవుతాయి. ఈ విధమైన చర్య తీసుకున్న మొదటి ఆసియా దేశం భారత్ కావడం గమనార్హం. అసలు, వడ్డీ చెల్లింపులకు సంబంధించి ప్రభుత్వ సెక్యూరిటీలు అత్యంత సురక్షితమైన సాధనాలు. కరోనా కష్టకాలాన్ని ఎదుర్కోవడంలో భాగంగా ప్రభుత్వం మార్కెట్ రుణ సమీకరణలను బడ్జెట్ భారీగా పెంచిన నేపథ్యంలో ఆర్‌బీఐ తాజా నిర్ణయం తీసుకుంది. 2021-22లో ఈ మొత్తాలను స్థూలంగా రూ.12.05 లక్షల కోట్లుగా నిర్దేశించింది. అయితే 2020-21లో 64% పెంచి రూ.12.8 లక్షల కోట్లకు తాజా బడ్జెట్ సవరించిన సంగతి తెలిసిందే.
- ప్రస్తుతం బ్యాంకింగ్, బ్యాంకింగేతర ఆర్థిక కంపెనీలు, డిజిటల్ లావాదేవీల్లో వినియోగదారుల సమస్యలు పరిష్కరించడానికి విడివిడిగా అంబుడ్స్‌మన్ పథకాలున్నాయి. వాటన్నింటినీ ఏకీకృతం చేసి 'ఒకే దేశం.. ఒకే అంబుడ్స్‌మన్' కిందకు మార్చుతున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. ఈ ఏడాది జూన్ కల్లా 'ఈ ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ స్కీమ్' తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.
- టార్గెటెడ్ లాంగ్ టర్మ్ రెపో ఆపరేషన్స్(టీఎల్‌టీఆర్ఓ) పథకంలోకి ఎన్‌బీఎఫ్‌సీలను చేర్చుతున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. ఈ పథకం కింద కొత్త ఎమ్ఎస్ఎమ్ఈ రుణ స్వీకర్తలకు రుణాలివ్వడానికి బ్యాంకులకు ప్రోత్సాహకాలిస్తారు. తక్కువ సీఆర్ఆర్ ద్వారా మూలధన పరిరక్షణ నిల్వల(సీసీబీ) వాయిదాల ద్వారా వీటిని అందిస్తారు.

## 2020లో భారత్‌కు వచ్చిన ఎఫ్‌డీఐలలో 13 శాతం వృద్ధి నమోదు



కరోనా సంక్షోభం మూలంగా ప్రపంచవ్యాప్తంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) భారీగా తగ్గుముఖం పట్టినప్పటికీ.. భారత్, చైనా మాత్రం అందుకు మినహాయింపని ఓ నివేదిక వెల్లడించింది. 2020లో భారత్‌కు వచ్చిన ఎఫ్‌డీఐలలో 13 శాతం వృద్ధి నమోదైనట్లు 'యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్(యూఎన్‌సీటీఏడీ)' నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా డిజిటల్ సెక్టార్, ఇన్ఫర్మేషన్ కన్సల్టింగ్, ఈ-కామర్స్, డేటా ప్రాసెసింగ్, డిజిటల్ పేమెంట్స్ రంగాల్లోకి పెట్టుబడులు భారీగా వచ్చినట్లు తెలిపింది. అలాగే భారత్‌లోకి సీమాంతర కొనుగోళ్లు - విలీనం (ఎంఅండ్ఏ) ద్వారా వచ్చిన పెట్టుబడులు 83 శాతం పెరిగినట్లు పేర్కొంది. రిలయన్స్ జియో ప్లాట్ ఫామ్స్‌లో ఫేస్‌బుక్ 9.9 శాతం వాటాల కొనుగోలు సహా ఇంధన రంగంలోని మరికొన్ని కంపెనీలతో కుదిరిన ఒప్పందాలతో ఎంఅండ్ఏ ఆదాయం గణనీయంగా పెరిగినట్లు పేర్కొంది. ఇక 2019తో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా ఎఫ్‌డీఐలు 42 శాతం తగ్గినట్లు తెలిపింది. 2019లో 1.5 ట్రిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు తరలివెళ్లగా.. 2020లో అవి 859 బిలియన్ డాలర్లకు పడిపోయినట్లు పేర్కొంది. 1990 తర్వాత ఇంత కనిష్ఠ స్థాయి ఎఫ్‌డీఐలు నమోదు కావడం ఇదే తొలిసారని తెలిపింది. ప్రధానంగా యూకే, ఇటలీ, రష్యా, జర్మనీ, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లోకి ఎఫ్‌డీఐలు 69శాతం తగ్గినట్లు నివేదిక పేర్కొంది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కరోనా



https://ourstudycircle.in/upscpdf/

నుంచి కోలుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నప్పటికీ.. 2021లో కూడా ఎఫ్‌డీఐల వృద్ధి ఆశాజనకంగా ఉండే అవకాశాలు లేవని అంచనా వేసింది.

### నాలుగు బ్యాంకుల ప్రైవేటీకరణ

ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) ప్రైవేటీకరణ ప్రక్రియను వేగవంతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందుకోసం నాలుగు మధ్య స్థాయి బ్యాంకులను ఎంపిక చేసింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ), సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వీటిలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఏప్రిల్‌తో మొదలయ్యే 2021-2022 ఆర్థిక సంవత్సరంలో ఈ బ్యాంకుల్లో రెండింటిని ప్రైవేటీకరించే అవకాశం ఉందని పేర్కొన్నాయి.

### అత్యంత విలువైన ఐటీ బ్రాండ్ల జాబితాలో 'టీసీఎస్'కు మూడో స్థానం

ప్రపంచంలో అత్యంత విలువైన ఐటీ సర్వీసెస్ బ్రాండ్ల జాబితాలో భారత్ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మూడో స్థానంలో నిలిచిందని బ్రాండ్ ఫైనాన్స్ నివేదిక తెలిపింది. ప్రపంచ ఐటీ దిగ్గజాలు యాక్సెంచర్, ఐబీఎంలు తొలి రెండు స్థానాలను కైవసం చేసుకున్నాయని బ్రాండ్ ఫైనాన్స్ జనవరి 28న విడుదల చేసిన 'గ్లోబల్ 500-2021' నివేదిక తెలిపింది. ప్రపంచ టాప్-10 ఐటీ బ్రాండ్ల జాబితాలో టీసీఎస్‌తోపాటు భారత్‌కు చెందిన ఇన్ఫోసిస్ (4వ ర్యాంక్), కాగ్నిజెంట్ (5వ ర్యాంక్) హెచ్‌సీఎల్ (7వ ర్యాంక్), విప్రో (9వ ర్యాంక్) కూడా చోటు దక్కించుకున్నాయి. నివేదిక ప్రకారం.. 11 శాతం వృద్ధితో టీసీఎస్ బ్రాండ్ విలువ 1500 కోట్ల డాలర్ల (సుమారు రూ. 1,12,500 కోట్ల)కు చేరింది. ఐటీ కంపెనీలన్నింటి మొత్తం బ్రాండ్ విలువ 3 శాతం తగ్గితే.. టీసీఎస్ సుమారు 11 శాతం వృద్ధి సాధించడం ఇక్కడ గమనార్హం. ప్రపంచంలో అత్యంత విలువైన, బలమైన ఐటీ సర్వీసెస్ బ్రాండ్‌గా యాక్సెంచర్ తన స్థానాన్ని కొనసాగిస్తోంది. ఈ సంస్థ బ్రాండ్ వాల్యూ 26 బిలియన్ డాలర్లుగా ఉంది. రెండవ స్థానాన్ని పదిలపర్చుకున్న ఐబీఎం బ్రాండ్ విలువ 16.1 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

### డబ్ల్యూసీఎం-2020 ర్యాంకులు జీడీపీ విభాగంలో ఇఫ్కోకు అగ్రస్థానం

ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అలయన్స్ (ఐసీఏ)... 9వ వార్షిక వరల్డ్ కోఆపరేటివ్ మానిటర్ (డబ్ల్యూసీఎం) రిపోర్ట్-2020 ఎడిషన్ ర్యాంక్‌లను ప్రకటించింది. ఐసీఏ, యూరోపియన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆన్ కోఆపరేటివ్ అండ్ సోషల్ ఎంటర్‌ప్రైజెస్ (యూరిస్) సంయుక్తంగా కలిసి జనవరి 21న ఒక వెబినార్‌లో ఈ ర్యాంకుల నివేదికను విడుదల చేశాయి. టర్నోవర్, తలసరి జీడీపీ రెండు విభాగాల్లో ప్రపంచవ్యాప్తంగా 300 సహకార సంస్థలతో ర్యాంక్‌లను ప్రకటించారు. తలసరి స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) విభాగంలో... ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కోఆపరేటివ్ (ఐఎఫ్ఎఫ్‌సీఓ-

## 2021లో భారత్ వృద్ధి అంచనాలు

### ఐక్యరాజ్యసమితి అంచనా



ఈ ఏడాది (2021) భారత ఆర్థిక వ్యవస్థ 7.3 వృద్ధిరేటు సాధిస్తుందని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. అయితే కొవిడ్ పరిణామాల వల్ల 2020లో జీడీపీ 9.6 శాతం క్షీణత నమోదు చేస్తుందని సంస్థ అంచనా వేసింది. కరోనా వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఈ శతాబ్దంలో ఎన్నడూ లేనంతగా నష్టపోయిందని తెలిపింది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, అవకాశాలపై ఐక్య రాజ్యసమితి ఆర్థిక, సామాజిక వ్యవహారాల విభాగం తయారు చేసిన నివేదిక ఈ మేరకు స్పష్టం చేసింది.

- 2020లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 4.3% క్షీణత నమోదు చేస్తుందని, 2009 సంక్షోభం కంటే ఇది రెండున్నర రెట్లు అధికమని వివరించింది. 2021లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా 4.7 శాతం వృద్ధిని సాధిస్తుందని పేర్కొంది.

### ఫిక్కీ సర్వే అంచనా

భారత ఆర్థిక వ్యవస్థ 2021-22లో బలంగా పుంజుకుంటుందని ఫిక్కీ తాజాగా నిర్వహించిన ఎకనామిక్ అవుట్‌లుక్ సర్వేలో అంచనా వేసింది. జీడీపీ వృద్ధి 9.6 శాతానికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. గరిష్ఠంగా 12.5 శాతం, కనిష్ఠంగా 7.5 శాతం వృద్ధి రేటు నమోదు కావొచ్చని అంచనా వేసింది. పరిశ్రమలు, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల్లోని ప్రముఖ ఆర్థిక వేత్తలు అభిప్రాయాలు 2021 జనవరి నెలలోనే సమీకరించి, వాటి ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్లు ఫిక్కీ తెలిపింది. కొవిడ్ వ్యాక్సిన్ సాధ్యమైనంత ఎక్కువమందికి ఇవ్వడం, కొత్త కేసుల సంఖ్య తగ్గడం ఇందుకు దోహదం చేయొచ్చని పేర్కొంది. 2020-21లో జీడీపీ 8% క్షీణించే అవకాశం ఉందని వెల్లడించింది. వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాల వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరంలో 3.5% నమోదు కావచ్చని తెలిపింది. పరిశ్రమలు, సేవల రంగాలు మహమ్మారి దెబ్బకు ఘోరంగా ప్రభావితమై వరుసగా 10%, 9.2% క్షీణతను నమోదు చేయవచ్చని అంచనా వేసింది.

- పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 2020-21లో సగటున 10.7% క్షీణత నమోదు చేయవచ్చని పేర్కొంది.
- టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణ రేటు యథాతథ స్థాయిలో ఉంటుందని, వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం సరాసరిన 6.5 శాతం, గరిష్ఠంగా 6.6 శాతం, కనిష్ఠంగా 5.8 శాతం మధ్య ఉండొచ్చని పేర్కొంది.

### ఐఎంఎఫ్ అంచనా

2021లో భారత్ 11.5 శాతం వృద్ధి రేటు నమోదు చేయొచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనా వేసింది. కొవిడ్ వ్యాక్సిన్ రావడం, ఆర్థిక కార్యకలాపాలు జోరందుకోవడంతో ఈ ఏడాది రెండంకెల వృద్ధి రేటు నమోదు చేయనున్న ఏకైక దేశంగా భారత్ నిలవనుంది. ఐఎంఎఫ్ తాజాగా విడుదల చేసిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అంచనాలో భారత వృద్ధి అంచనాలను సవరించింది. కరోనా పరిస్థితుల వల్ల 2020లో భారత ఆర్థిక వ్యవస్థ క్షీణత 8 శాతంగా నమోదవుతుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఈ ఏడాదిలో భారత్ బలంగా పుంజుకుంటుందని అభిప్రాయపడింది.

- 2021లో చైనా 8.1 శాతం వృద్ధితో రెండో స్థానంలో నిలుస్తుందని, స్పెయిన్ (5.9 శాతం), ఫ్రాన్స్ (5.5 శాతం) తర్వాతి స్థానాల్లో ఉంటాయని ఐఎంఎఫ్ తెలిపింది.



https://ourstudycircle.in/upscpdf/

## తెలుగు రాష్ట్రాల్లో తక్కువ బ్యాంకులు



దేశంలోని పెద్ద రాష్ట్రాలతో పోలిస్తే తెలుగు రాష్ట్రాల్లో బ్యాంకులు తక్కువగానే ఉన్నాయి. దక్షిణాదిలోని రాష్ట్రాలతో పోల్చి చూసినా వీటి వాటా కనిష్ఠంగానే ఉన్నట్లు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) జనవరి 21న విడుదల చేసిన నెలవారీ బులిటెన్‌లో వెల్లడైంది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, చిన్నతరహా బ్యాంకులు కలిపి 1,27,014 ఉన్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ వాటా 4.62%, తెలంగాణ వాటా 3.42% మాత్రమే ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సూక్ష్మ ఆర్థిక బ్యాంకులు (స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు) అతి తక్కువగా ఉన్నాయి. ప్రస్తుత లెక్కలను బట్టి చూస్తే ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి 27.74 చదరపు కిలోమీటర్లకు, తెలంగాణలో 25.73 చదరపు కిలోమీటర్లకు ఒక బ్యాంకు శాఖ ఉన్నాయి. ప్రస్తుతం జాతీయస్థాయిలో 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి 9,533 మందికి ఒక బ్యాంకు శాఖ ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 8,407 మంది, తెలంగాణలో 8,081 మందికి ఒక శాఖ ఉన్నాయి. ఇదే సమయంలో కేరళలో 3,063 మందికి, తమిళనాడులో 6,617 మంది, 6,995 మందికి ఒక బ్యాంకు శాఖ చొప్పున ఉండటం గమనార్హం.

ఇఫ్కో) అగ్రస్థానంలో నిలిచింది. టర్నోవర్ పరంగా 65వ స్థానంలో నిలిచింది. న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా ఎరువుల తయారీ, విక్రయాల్లో ఇఫ్కో ఉంది. దేశవ్యాప్తంగా రైతులను భాగస్వామ్యం చేయడం, భారత సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో ఇఫ్కో కృషి చేస్తోంది. 36 వేల మంది కో-ఆపరేటివ్ సభ్యులున్న ఇఫ్కో టర్నోవర్ దాదాపు 7 బిలియన్ డాలర్లుగా ఉంది. ప్రస్తుతం ఇఫ్కో ఎండీగా యూఎస్ అవస్థీ ఉన్నారు.

### నావిగేషన్, మ్యాప్స్‌కు సంబంధించి

### ఇస్రో, మ్యాప్ మై ఇండియా మధ్య ఎంఓయూ



గూగుల్ మ్యాప్స్‌కు ప్రత్యామ్నాయంగా, పూర్తి స్వదేశీ సాంకేతికతతో భారతీయులకు నావిగేషన్, మ్యాప్స్ సేవలను అందించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), మ్యాప్ మై ఇండియా జతకట్టాయి. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ (డీవోఎస్), మ్యాప్ మై ఇండియా మాతృ సంస్థ సీఈ ఇన్ఫో సిస్టమ్స్‌తో ఫిబ్రవరి 12న ఒప్పందం కుదిరినట్లు ఇస్రో వెల్లడించింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం మ్యాప్ మై ఇండియాలో ఉన్న డిజిటల్ మ్యాపులను, ఇస్రో ఉపగ్రహ చిత్రాలతో సమన్వయం చేసి మ్యాపులను, నావిగేషన్ సేవలను ప్రత్యేక పోర్టల్ ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కలయికతో మ్యాప్ మై ఇండియా యూజర్లు ఇస్రో ఉపగ్రహాల సమాచారంతో మరింత స్పష్టంగా మ్యాపులను పొందవచ్చు. నావిగేషన్ ఉపగ్రహం ఐఆర్ఎన్ఎస్ఎస్ ద్వారా నావిగేషన్ సేవలు లభిస్తాయి.

### 2020-21లో ఐటీ వృద్ధి 2.3 శాతం




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2020-21) దేశీ ఐటీ పరిశ్రమ ఆదాయాలు 2.3 శాతం వృద్ధి చెంది 194 బి.డాలర్లకు చేరనున్నాయి. అలాగే ఎగుమతులు 1.9 శాతం పెరిగి 150 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉంది. దేశీ ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్ ఈ మేరకు అంచనాలు వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ పరమైన ప్రతికూల పరిణామాలు ఉన్నప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం కూడా ఐటీ సంస్థలు నికరంగా నియామకాలు చేపట్టాయని తెలిపింది. కొత్తగా 1.38 లక్షల ఉద్యోగాలు కల్పించడంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 44.7 లక్షలకు చేరిందని పేర్కొంది.

### బ్రిటన్‌లో అతిపెద్ద మాంద్యం

బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థ 300 ఏళ్లలో ఎదురవ్వని అతిపెద్ద మందగమనాన్ని ప్రస్తుతం ఎదుర్కొంటోంది. 2020లో ఆర్థిక వ్యవస్థ 9.9 శాతం క్షీణించినట్లు బ్రిటన్ అధికార వర్గాలు చెబుతున్నాయి. 1709 తర్వాత ఇవే అత్యంత అధ్వాన గణాంకాలని తెలుస్తోంది. కొవిడ్ కారణంగా దెబ్బతిన్న వ్యవస్థకు ప్రోత్సహం ఇచ్చేందుకు మార్చి నెల బడ్జెట్‌లో మరిన్ని మద్దతు చర్యలు తీసుకుంటామని యూకే ఆర్థిక మంత్రి రిషి సూనక్ చెబుతున్నారు.

### శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు 'వాయిస్ ఆఫ్ కస్టమర్' గుర్తింపు



హైదరాబాద్ నగర సమీపంలోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (శంషాబాద్ ఎయిర్ పోర్టు) కు అంతర్జాతీయ విమానాశ్రయ మండలి (ఎయిర్‌పోర్టు కౌన్సిల్ ఇంటర్నేషనల్) నుంచి 'వాయిస్ ఆఫ్ కస్టమర్' గుర్తింపు లభించింది. 2020 ఏడాదిలో ప్రయాణికుల అభిప్రాయాలకు అనుగుణంగా సేవలు అందించినందుకుగాను ఈ గుర్తింపు దక్కిందని ఎయిర్‌పోర్టు వర్గాలు ఫిబ్రవరి 9న వెల్లడించాయి. కోవిడ్-19 పరిస్థితుల్లో కాంటాక్ట్‌లెస్ వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు దేశంలోనే ఈ-బోర్డింగ్ సదుపాయం కల్పించిన తొలి విమానాశ్రయంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఘనత సాధించింది.

### కంపెనీల చట్టం నిబంధనల్లో సవరణలు

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమం విషయంలో కంపెనీలకు మరింత వెసులుబాటు కల్పిస్తూ కంపెనీల చట్టంలోని నిబంధనలకు కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసింది. సీఎస్ఆర్ కింద ఒకటికి మించి ఎక్కువ సంవత్సరాల పాటు పట్టే ప్రాజెక్టులను చేపట్టేందుకు అనుమతించింది. అదే విధంగా నిబంధనలకు మించి చేసిన అదనపు ఖర్చును తదుపరి మూడు ఆర్థిక సంవత్సరాల్లో చూపించుకుని సర్దుబాటు చేసుకునే అవకాశం ఇచ్చింది. అదే విధంగా సీఎస్ఆర్ కింద లబ్ధిదారులు లేదా ప్రభుత్వం పేరిట మూలధన ఆస్తుల (క్యాపిటల్) కొనుగోలుకూ అనుమతించింది. కంపెనీల తరఫున సీఎస్ఆర్ కార్యక్రమాల అమలును చూసే ఏజెన్సీలకు 2021 ఏప్రిల్ 1 నుంచి రిజిస్ట్రేషన్ (నమోదును)ను తప్పనిసరి చేసింది. సీఎస్ఆర్ నిబంధనలను పాటించకపోవడాన్ని నేరపూరితం కాని చర్యగా మారుస్తూ.. దీని స్థానంలో పెనాల్టీని ప్రవేశపెట్టింది. కంపెనీల చట్టం 2013 కింద కార్పొరేట్ వ్యవహారాల శాఖ సీఎస్ఆర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. లాభదాయక కంపెనీలు గడిచిన మూడేళ్ల కాల సగటు లాభంలో కనీసం 2% సీఎస్ఆర్ కోసం కేటాయించాలి.



https://ourstudycircle.in/upscpdf/

# కమిటీలు-నివేదికలు

## ఈఐయూ ప్రజాస్వామ్య సూచీలో 53వ స్థానంలో భారత్

ది ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్(ఈఐయూ) రూపొందించిన ప్రజాస్వామ్య సూచీ-2020 ప్రపంచ ర్యాంకుల్లో భారత్ 53వ స్థానంలో నిలిచింది. గత ఏడాదితో పోలిస్తే రెండు స్థానాలు దిగజారింది. 2019లో భారత్ మొత్తంగా 6.9 స్కోర్ సాధించగా 2020లో 6.61 స్కోర్ సాధించింది. అధికారుల్లో ప్రజాస్వామ్యంపై గౌరవం తగ్గడం, పౌర స్వేచ్ఛను అణచి వేయడం వంటి కారణాల వల్ల దేశ ర్యాంకింగ్ పడి పోయిందని ఈఐయూ పేర్కొంది. మొత్తం 167 దేశాలకు సంబంధించి ది ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ ప్రజాస్వామ్య సూచీలకు సంబంధించి ర్యాంకులు ఇస్తుంది. మొదటి ర్యాంకు నార్వే (9.81స్కోర్), దీని తర్వాత స్థానాల్లో వరుసగా ఐస్‌లాండ్, స్వీడన్, న్యూజిలాండ్, చివరి ర్యాంకు ఉత్తర కొరియా (1.8 స్కోర్). మన పక్క దేశం శ్రీలంక 58, పాకిస్థాన్ 105వ ప్లేస్‌లలో ఉన్నాయి.

### అవినీతి సూచీ-2020 (సీపీఐ)లో భారత్‌కు 86వ ర్యాంకు

ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ (టీఐ) విడుదల చేసిన అవినీతి సూచీ-2020 (సీపీఐ)లో భారత్ 40స్కోర్‌తో 86వ స్థానంలో నిలిచింది. గతేడాదితో పోలిస్తే ఆరు స్థానాలు దిగజారింది. 180 దేశాలకు కేటాయించిన ప్రస్తుత ర్యాంకుల్లో న్యూజిలాండ్, డెన్మార్క్ దేశాలు 88 స్కోరుతో అతి తక్కువ అవినీతిగల దేశాలుగా ప్రథమ స్థానంలో నిలిచాయి. 12 స్కోర్‌తో సొమాలియా, దక్షిణ సూడాన్ దేశాలు 179వ ర్యాంకుతో అత్యంత అవినీతిమయ దేశాలుగా నిలిచాయి.

### 45 ఏళ్లు దాటిన వారిలో చుట్టుముడుతున్న వ్యాధులు

నేషనల్ ప్రోగ్రాం ఫర్ హెల్త్ కేర్ ఆఫ్ ఎల్డర్లీ, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్(ముంబయి), కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలు సంయుక్తంగా మధ్యవయస్కులపై నిర్వహించిన అధ్యయనంలో ఇలాంటి పలు అంశాలు వెల్లడయ్యాయి. నడివయసు వారిని అధిక రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు మొదలుకొని సమస్యలు కూడా వేధిస్తున్నాయి.



**నివేదిక ముఖ్యాంశాలు :** జీవనశైలి వ్యాధుల ముప్పు - 73.4%

- ఎత్తుకు తగ్గ బరువులో అసమానతల కారణంగా పొట్ట వద్ద కొవ్వు పేరుకుపోయి, జీవనశైలి వ్యాధుల ముప్పు పొంచి ఉన్నవారు 73.4 శాతం
- కంటిచూపు లోపంతో బాధపడుతున్న వారు 33.9 శాతం
- బీపీతో బాధపడుతున్న వారు 31.6 శాతం మంది. తమకు బీపీ ఉందని తెలియకుండా ఉన్నవారు 18.3శాతం. ఉందని తెలిసినా చికిత్సకు నోచుకోని వారు 5.5 శాతం. సరైన చికిత్స పొందని వారు 36.6 శాతం
- అధిక బరువుతో బాధపడుతున్న వారు 24.4 శాతం. బరువు తక్కువగా ఉన్నవారు 16.3 శాతం. స్థూలకాయులు 9.6 శాతం
- 45 ఏళ్లు పైబడిన వారిలో సర్వే చేయడానికి కనీసం ఏడాదికి ముందు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందినవారు 8.1 శాతం మంది ఉన్నారు. వీరిలో ప్రైవేటులో చికిత్స పొందినవారు 73.6 శాతం మంది.
- చికిత్సకు సర్కారు ఆసుపత్రిలో చేరి ఉచిత సేవలు పొందినప్పటికీ రూ.4,132 ఖర్చుపెట్టాల్సి రాగా, ప్రైవేటులో రూ.35,108 వ్యయమైంది.
- నెలకు తలసరి ఖర్చు గ్రామీణంలో రూ.2,901, పట్టణాల్లో రూ.4,142 కాగా.. మొత్తంగా సగటున రూ.3,379.
- తలసరి ఖర్చులో ఆహారానికి పల్లెల్లో అయ్యే ఖర్చు 52.1 శాతం, పట్టణాల్లో 44.6 శాతం.
- మొత్తం తలసరి ఖర్చులో వైద్యం కోసం పెట్టే ఖర్చు గ్రామీణంలో 17.5 శాతం, పట్టణాల్లో 10.8.
- ఏదో ఒక రకమైన వైద్య బీమా ఉన్నవారు పల్లెల్లో 56.6 శాతం, పట్టణాల్లో 43.3 శాతం.

### 2030 నాటికి ఇంధన వినియోగంలో మూడో స్థానానికి భారత్

భారత్‌లో ఇంధన వినియోగం భారీగా పెరుగుతోందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ-ఐఈఏ) తెలిపింది. ఈ మేరకు ఫిబ్రవరి 9న 'ఐఈఏ ఇండియా ఎనర్జీ అవుట్‌లుక్-2021" నివేదికను విడుదల చేసింది. నివేదిక ప్రకారం ప్రస్తుతం ఇంధన వినియోగంలో భారత్ నాలుగో స్థానంలో ఉండగా చైనా, అమెరికా, ఐరోపా కూటమి(యూరోపియన్ యూనియన్ -ఈయూ)లు తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. 2030 నాటికి ఈయూని వెనక్కి నెట్టి భారత్ మూడో స్థానాన్ని కైవసం చేసుకుంటుందని ఐఈఏ తెలిపింది. 2019 - 40 మధ్య ప్రపంచ ఇంధన గిరాకీ వృద్ధిలో భారత్‌దే పావు వంతు వాటా ఉంటుందని తెలిపింది. ఈ విషయంలో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉంటుందని పేర్కొంది. పునరుత్పాదక ఇంధన వృద్ధిలో చైనాది మొదటి స్థానం కాగా.. భారత్‌ది రెండో స్థానమని తెలిపింది. ఐఈఏ నివేదిక ప్రకారం...2040 కల్లా భారత్ విద్యుత్ వ్యవస్థ ఐరోపా కూటమి కంటే పెద్దదిగా అవతరిస్తుంది. విద్యుదుత్పత్తిలో ప్రపంచంలో మూడో స్థానాన్ని చేరుకుంటుంది. అమెరికా కంటే 30 శాతం అధికంగా పునరుత్పాదక సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. భారత్‌లో సహజ వాయువు డిమాండు 2040 కల్లా మూడు రెట్లకు పైగా పెరుగుతుంది. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సహజవాయువు మార్కెటుగా కూడా భారత్ నిలుస్తుంది. భారత్‌లో నిరంతరాయంగా పారిశ్రామికీకరణ విస్తరిస్తుండటంతో ప్రపంచ ఇంధన ఆర్థిక వ్యవస్థలో కీలకంగా మారింది. ఇండస్ట్రియల్ వ్యాల్యూయాడెడ్‌కు సంబంధించి ప్రపంచ వృద్ధిలో భారత్ వాటా 10 శాతానికి చేరింది. 2040 కల్లా ఈ వాటాను 20 శాతానికి పెంచుకుంటుంది. ప్రపంచ పారిశ్రామిక ఇంధన గిరాకీ వృద్ధిలోనూ మూడింట ఒక వంతు వాటా భారత్‌దే ఉండనుంది.



https://ourstudycircle.in/upscpdf/

2040 కల్లా భారత్‌లో చమురు గిరాకీ 74 శాతం మేర పెరిగి రోజుకు 8.7 మిలియన్ బ్యారెళ్లకు చేరొచ్చు. సహజవాయువు అవసరాలు కూడా మూడింతలై 201 బిలియన్ క్యూబిక్ మీటర్లకు చేరొచ్చు. బొగ్గు గిరాకీ ప్రస్తుతమున్న 590 మిలియన్ టన్నుల నుంచి 772 మిలియన్ టన్నులకు చేరుతుంది. ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి భారత్ దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడాల్సి రావొచ్చని పేర్కొంది. 2040 కల్లా భారత్ చమురు దిగుమతులపై ఆధారపడటం 90 శాతానికి పైగా పెరగొచ్చని.. ప్రస్తుతం ఇది 75 శాతంగా ఉంది. దేశీయంగా ఉత్పత్తి కంటే వినియోగం పెరుగుతుండటమే ఇందుకు కారణమని నివేదిక తెలిపింది. సహజవాయువు అవసరాల్లో దేశ దిగుమతులు 2010లో 20 శాతంగా ఉండగా.. 2019లో 50 శాతానికి చేరింది. 2040 నాటికి ఇది మరింతగా పెరిగి 60 శాతానికి చేరే అవకాశం ఉంది.

### 2020లో ప్రపంచ దేశాలకు వలస వెళ్లిన 1.8 కోట్ల మంది భారతీయులు



2020లో 1.8 కోట్ల మంది భారతీయులు విదేశాలకు వలస వెళ్లినట్లు ఐక్యరాజ్యసమితి పాపులేషన్ డివిజన్, తాజాగా విడుదల చేసిన 'ఇంటర్నేషనల్ మైగ్రేషన్ 2020 హైలైట్స్' నివేదిక వెల్లడించింది. 2000-2020 మధ్య కాలంలో ప్రపంచంలోని అన్ని దేశాలకు, ప్రాంతాలకు భారత్ నుంచి వలస వెళ్లిన వారి సంఖ్య విస్తృతంగా పెరిగింది. అయితే బలవంతపు వలసలు అతి తక్కువ అని, మొత్తం వలస వెళ్లిన ప్రజల్లో సొంత దేశాన్ని వీడి బలవంతంగా ఇతర దేశాలకు వలస వెళ్లిన వారు 10 శాతం మాత్రమేనని తెలుస్తోంది. భారత్ నుంచి వలస వెళుతున్న వారు ప్రధానంగా శ్రామికులు. విద్యార్థులు, డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు సైతం ఈ లిస్టులో ఉన్నారు. అంతర్జాతీయంగా అత్యధిక మంది వలసలకు ఆశ్రయం ఇస్తోన్న దేశం అమెరికా. 2020లో 5.1 కోట్ల మంది వివిధ దేశాలకు చెందిన ప్రజలు అమెరికాకి వలస వెళ్లారు. ఇది ప్రపంచంలోని మొత్తం జనాభాలో 18 శాతానికి సమానం. 2000-2020 మధ్య కాలంలో 179 దేశాల్లోని వలసల సంఖ్య పెరిగింది. ఈ సమయంలో జర్మనీ, స్పెయిన్, సౌదీ అరేబియా, యూఏఈ, అమెరికాల్లో అత్యధిక సంఖ్యలో వలసలు పెరిగాయి. అయితే అందుకు పూర్తి భిన్నంగా 2000, 2020 మధ్య కాలంలో 53 దేశాలు, లేదా ప్రాంతాల్లోని అంతర్జాతీయ వలసలు తగ్గుముఖం పట్టాయి. అమెరికా, ఇండియా, పాకిస్తాన్, ఉక్రెయిన్, దేశాల్లో 2000-2020 మధ్య కాలంలో అంతర్జాతీయ వలసల సంఖ్య భారీగా పడిపోయింది. అనేక దేశాల్లో సేవారంగం, హోటళ్ళలోనూ పనిచేసే వేలాది మంది ఉద్యోగాలు కోల్పోవడంతో ఇళ్లకు వచ్చారు. కోవిడ్ కారణంగా మధ్య ఆదాయ దేశాలకు వలసల ద్వారా వచ్చే ఆదాయం 14 శాతం తగ్గింది. ఈ దేశాలకు వలసల ద్వారా వచ్చే ఆదాయం 2019లో 548 బిలియన్ డాలర్లు ఉండగా, 2021కి ఇది 470 బిలియన్ డాలర్లకు క్షీణించింది. కోవిడ్ మహమ్మారి అంతర్జాతీయంగా వలస వెళ్ళే వారిని 20 లక్షల మేర తగ్గించిందని, 2019 మధ్య కాలం నుంచి ఆశించిన వృద్ధి కంటే వలస వెళ్ళిన వారు 27 శాతం తక్కువ అని ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయి. రెండు దశాబ్దాలుగా అంతర్జాతీయంగా వలసల సంఖ్య బాగా పెరుగుతూ వచ్చింది. 2020 నాటికి ప్రపంచ వ్యాప్తంగా సొంత దేశాల్లో నివసిస్తున్న వారి సంఖ్య 28.1 కోట్లకు చేరింది. 2000 సంవత్సరంలో 17.3 కోట్ల మంది, 2010లో 22.1 కోట్ల మందికి వలసవెళుతున్న వారి సంఖ్య పెరిగింది. ప్రస్తుతం అంతర్జాతీయ మైగ్రెంట్స్ సంఖ్య యావత్ ప్రపంచం జనాభాలో 3.6 శాతంగా ఉంది.

### ప్రజా న్యాయంలో తెలంగాణకు 3వ స్థానం, ఏపీకి 12వ స్థానం

సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, కామన్‌కాజ్, కామన్‌వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనిషియేటివ్ (సీహెచ్ఆర్ఐ), దక్ష్, టిస్-ప్రయాస్, విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీ అండ్ హౌఇండియా లివ్స్ సంస్థల సహకారంతో టాటా ట్రస్ట్ జనవరి 28న '2వ ఇండియా జస్టిస్ రిపోర్టు (ఐజేఆర్)'ను వెలువరించింది. పోలీసు, న్యాయవ్యవస్థ, జైళ్లు, లీగల్ ఎయిడ్‌లపై గణాంకాల ఆధారంగా ర్యాంకులు ప్రకటించారు. దీని ప్రకారం ..కోటికి పైగా జనాభా ఉండి ప్రజలకు న్యాయం అందించే విషయంలో 18 రాష్ట్రాల్లో మొదటి మూడు స్థానాల్లో మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ ఉన్నవి. ఆంధ్రప్రదేశ్ 12వ స్థానాన్ని సాధించింది.

- న్యాయవ్యవస్థలో మహిళలకు స్థానం కల్పించడంలో దక్షిణాది రాష్ట్రాలు ముందున్నాయి.
- దేశంలో కింది కోర్టుల్లోని న్యాయమూర్తుల్లో 29 శాతం మహిళలుండగా.. హైకోర్టుల్లో 11.4 శాతం మాత్రమే ఉన్నారు.
- కింది కోర్టు మహిళా న్యాయమూర్తుల సంఖ్యలో తెలంగాణ 46.2 శాతంతో దేశంలో అగ్రగామిగా ఉంది.

### డిజిటల్ వినియోగంలో లింగ వివక్ష

భారత్‌లో ఆడపిల్లలు మొబైల్ ఫోన్ వాడకంపై అంతర్లీనంగా నిషేధం కొనసాగుతోందని సెంటర్ ఫర్ క్యాటలైజింగ్ ఛేంజ్(సీ3) అనే స్వచ్ఛంద సంస్థ డిజిటల్ ఎంపవర్‌మెంట్ ఫౌండేషన్‌తో కలిసి నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. దేశంలోని బాలికలకు ఉన్న డిజిటల్ యాక్సెస్‌ని అంచనా వేసేందుకు 10 రాష్ట్రాల్లోని 29 జిల్లాల్లో 4,100 మందిని ఈ అధ్యయనంలో భాగస్వాములను చేశారు. జనవరి 23న సర్వేను విడుదల చేశారు. సర్వేలో వివరాల ప్రకారం... దేశంలో 42 శాతం మంది కిశోర బాలికలకు కేవలం రోజుకి గంటకన్నా తక్కువ సమయం మొబైల్ ఫోన్‌ని వాడే అవకాశం ఇస్తున్నారు.

### వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణలో 10వ స్థానంలో భారత్

ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్(ఈఐయూ) జనవరి 28న విడుదల చేసిన 'ఆసియా-పసిఫిక్ పర్సనలైజ్డ్ హెల్త్ ఇండెక్స్ (వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ సూచీ)' లో 11 ఆసియా పసిఫిక్ దేశాల్లో భారత్ 10వ స్థానంలో నిలిచింది. ఈ ఇండెక్స్‌లో సింగపూర్ తొలి స్థానంలో నిలిచింది. సింగపూర్ తర్వాత తైవాన్ రెండో స్థానంలో, జపాన్ మూడో స్థానంలో, ఆస్ట్రేలియా నాలుగో స్థానంలో ఉన్నాయి. ఆస్ట్రేలియా, చైనా, జపాన్, ఇండియా, ఇండోనేషియా, మలేషియా,




సింగపూర్, సౌత్ కొరియా, తైవాన్, థాయ్‌లాండ్, న్యూజిలాండ్ దేశాలలో వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణలో సరైన వ్యక్తికి సరైన సమయంలో సరైన ఆరోగ్య రక్షణ కల్పిస్తున్నాయా? అనే విషయంపై అధ్యయనం చేసి 'ఆసియా-పసిఫిక్ పర్సనలైజ్డ్ హెల్త్ ఇండెక్స్'ను రూపొందించారు. 27 విభిన్న ప్రమాణాల ఆధారంగా నాలుగు కేటగిరీల్లో వ్యక్తిగత ఆరోగ్య సూచీని కొలుస్తున్నారు. ఆరోగ్య సమాచారం విషయంలో భారత్ 41వ స్కోరుతో పదో స్థానం పొందింది.



https://ourstudycircle.in/upscpdf/

## ఐరాస 'ప్రపంచ ఆర్థిక పరిస్థితి, అవకాశాలు-2021' నివేదిక





'ప్రపంచ ఆర్థిక పరిస్థితి, అవకాశాలు-2021 పేరిట రూపొందించిన నివేదికను ఐక్యరాజ్యసమితి (ఐరాస) ఆర్థిక, సామాజిక వ్యవహారాల శాఖ జనవరి 28న విడుదల చేసింది. నివేదిక ప్రకారం గత కొన్నేండ్లుగా ఆసియా దేశాల్లో ఆర్థిక వృద్ధి వేగం పుంజుకుంటున్నది. ఇదే సమయంలో కరోనా వైరస్ మహమ్మారి దాడి చేయడంతో ఈ దేశాల ఆర్థిక వ్యవస్థ పై తీవ్ర ప్రభావాన్ని చూపింది. 2020లో ఆసియా దేశాల ఆర్థిక వ్యవస్థలు చాలా పేలవమైన పనితీరును కనబర్చడానికి ఇదే కారణంగా చెప్పుకోవచ్చు. దశాబ్దాలుగా ఉద్యోగాలు, ఆదాయాల్లో వచ్చిన వృద్ధి కొవిడ్-19 కారణంగా నిలిచిపోతున్నదని ఈ నివేదిక హెచ్చరించింది. ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా పేదరికం పెరుగుతుందని కూడా హెచ్చరికలు జారీ చేసింది. 2020లో అంటువ్యాధి కారణంగా అధిక నిరుద్యోగ పరిస్థితి 2021లో కొనసాగుతుందని నివేదిక పేర్కొన్నది. కొవిడ్-19 కారణంగా ప్రపంచవ్యాప్తంగా 270 మిలియన్ల ఉద్యోగాలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితమయ్యాయని నివేదిక తెలిపింది. నివేదికలోని వివరాల ప్రకారం .. భారత్‌లో మాదిరి అసంఘటిత రంగంలోని కార్మికులకు ఆదాయ మార్గాలను చూపేందుకు కార్మిక మార్కెట్, ఆదాయ వ్యవస్థను పెంచడానికి ఎక్కువ ప్రయత్నాలు చేయాల్సి ఉంటుంది. ఇది కాకుండా, సామాజిక భద్రత ప్రయోజనాలు, విద్య, పేదరికం, సామాజిక సమానత్వం దిశగా కూడా చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

- ఐక్యరాజ్యసమితి నివేదిక.. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) నివేదికను కూడా ఉదహరించింది. కొవిడ్-19 వల్ల పని గంటలు తగ్గనున్నాయని, ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా ఆదాయం కూడా తగ్గుతుందని ఐఎల్ఓ తన నివేదికలో పేర్కొన్నది. అదే సమయంలో, ఈ దిశలో సమర్థ వంతమైన చర్యలు తీసుకోవాలని అన్ని దేశాలను కోరారు. 2021లో దక్షిణాసియా దేశాలు 4.9 శాతం పని గంటలను కోల్పోతాయని, ఇది మిలియన్ల ఉద్యోగాలను ప్రభావితం చేస్తుందని నివేదిక పేర్కొన్నది.
- కరోనా వైరస్ మహమ్మారి కారణంగా 2020లో 25.5 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారని ఐఎల్ఓ అంచనా వేసింది. ఇందులో దక్షిణాసియా దేశాల నుంచి 80 మిలియన్ల మంది ఉన్నారు. ఈ సంక్షోభం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కార్మిక మార్కెట్లపై వినాశనం కలిగించింది. 2020 మధ్యలో నిరుద్యోగిత రేటు ఎక్కువగా ఉంది. నిరుద్యోగిత రేటు నైజీరియాలో 27 శాతం, భారతదేశంలో 23 శాతం, కొలంబియాలో 21 శాతం, ఫిలిప్పీన్స్‌లో 17 శాతంగా ఉన్నది. అర్జెంటీనా, బ్రెజిల్, చిలీ, సౌదీ అరేబియా, టర్కీలో నిరుద్యోగిత రేటు 13 శాతానికి పైగా ఉన్నదని ఐఎల్ఓ తన నివేదికలో వెల్లడించింది.

అత్యధిక మంది తల్లిదండ్రులు ఆడపిల్లల మొబైల్ వాడకాన్ని సురక్షితం కాదని భావిస్తున్నారు. ప్రధానంగా హర్యానా రాష్ట్రంలో బాలురకి మొబైల్ వాడకంలో ఉన్నంత వెసులుబాటు ఆడపిల్లలకి లేదు. కర్నాటకలో బాలికలకు మిగిలిన రాష్ట్రాల కంటే కొంత ఎక్కువగా మొబైల్ వాడే అవకాశం లభిస్తోంది. 71 శాతం మంది బాలికలకు అసలు మొబైల్ ఫోన్ అందుబాటులో లేదు. అందుకు ఆర్థిక స్థోమత లేకపోవడమే కారణం.

### ఏజింగ్ వాటర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్: ఎన్ ఎమర్జింగ్ గ్లోబల్ రిస్క్ నివేదిక



ఐక్యరాజ్యసమితికి చెందిన యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ వాటర్, ఎన్విరాన్‌మెంట్ అండ్ హెల్త్ (UNU-INWEH) అనే సంస్థ 'ఏజింగ్ వాటర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్: ఎన్ ఎమర్జింగ్ గ్లోబల్ రిస్క్' పేరిట నివేదికను రూపొందించింది.

- నివేదిక ప్రకారం ...ప్రపంచవ్యాప్తంగా 1930 నుంచి 1970 మధ్య నిర్మించిన 58,700 భారీ ఆనకట్టల జీవిత కాలాన్ని 50 నుంచి 100 ఏళ్లకే రూపకల్పన చేశారు. 50 ఏళ్ల తరువాత నుంచి ఇటువంటి భారీ ఆనకట్టల సామర్థ్యం క్షీణిస్తూ వస్తుంది.
- కాలం తీరిన భారీ ఆనకట్టలతో రాబోయే మూడు దశాబ్దాల్లో ప్రజలు పెనుముప్పును ఎదుర్కోబోతున్నారు. 2050 నాటికి.. ఇటువంటి పురాతన ఆనకట్టలకు దిగువనే అత్యధిక మంది జీవిస్తూ ఉండే పరిస్థితి ఉంటుంది.
- నాలుగు ఆసియా దేశాల్లోనే అత్యధికంగా భారీ డ్యాంలున్నాయి. చైనా, భారత్, జపాన్, దక్షిణ కొరియాల్లో మొత్తం 32,716 పెద్ద ఆనకట్టలు (ప్రపంచంలోనే 55 శాతం) ఉన్నాయి.
- ఒక్క చైనాలోనే 23,841 భారీ ఆనకట్టలు(ప్రపంచంలోని మొత్తం డ్యాంలలో 40 శాతం) ఉన్నాయి.
- భారతదేశంలో దాదాపు 1,115 భారీ ఆనకట్టలు నిర్మాణం జరిగి 2025 నాటికి 50 ఏళ్లు పూర్తికా నుంది. దేశంలోని దాదాపు 4,250కి పైగా ఆనకట్టలకు 2050 నాటికి 50 ఏళ్లు నిండుతాయి. అలాగే 2050 సంవత్సరానికల్లా దేశంలోని 64 ఆనకట్టలకు 150 ఏళ్ల పూర్తవుతాయి. 100 ఏళ్ల క్రితం నిర్మించిన కేరళలోని ముల్లపెరియార్ డ్యాం బద్దలైతే దాదాపు 35 లక్షల మంది ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది.

### ఎఫ్‌టీ 'ప్రపంచ ఎంబీఏ ర్యాంకింగ్స్- 2021'లో ఐఎస్‌బీకు అగ్రస్థానం

'ది ఫైనాన్షియల్ టైమ్స్ (ఎఫ్‌టీ)' పత్రిక రూపొందించిన ప్రపంచ ఎంబీఏ ర్యాంకింగ్స్- 2021లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) దేశంలో మొదటి స్థానంలో నిలిచింది. ప్రపంచంలో 23వ స్థానం, ఆసియాలో ఐదో స్థానాన్ని దక్కించుకుంది. ఈ జాబితాలోని ప్రపంచ టాప్-25 విద్యా సంస్థల్లో భారత్ నుంచి కేవలం ఐఎస్‌బీకి మాత్రమే చోటు లభించడం గమనార్హం. పీజీ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీపీ)లో ఈ ర్యాంకులు సాధించింది. 2020 ఏడాది ర్యాంకుల్లో 28వ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. 'కెరీర్ ప్రోగ్రెస్ ర్యాంక్' ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థల్లో ఐఎస్‌బీ 21వ ర్యాంకులో ఉంది. ఫైనాన్షియల్ టైమ్స్ (ఎఫ్‌టీ) గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్స్- 2021 జాబితాలో మొదటి స్థానంలో ఫ్రాన్స్, సింగపూర్‌లో ప్రాంగణాలు కలిగిన 'ఇన్‌సీడ్' విద్యా సంస్థ నిలిచింది. టాప్-10 జాబితాలో అత్యధికంగా అమెరికాలోని మేనేజ్‌మెంట్ విద్యా సంస్థలు ఉండటం ప్రత్యేకత.



https://ourstudycircle.in/upscpdf/

# సైన్స్ & టెక్నాలజీ

## సైన్యానికి 'అర్జున్ యుద్ధ ట్యాంకు'ను అప్పగించిన ప్రధాని నరేంద్ర మోడీ



రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తమిళనాడులో రూపొందించిన అత్యాధునిక 'అర్జున్ యుద్ధ ట్యాంకు మార్క్-1ఏ'(MK-1A)ను ప్రధాని నరేంద్ర మోడీ భారతీయ సైన్యానికి అప్పగించారు. ఫిబ్రవరి 14న తమిళనాడు రాజధాని చెన్నైలోని అడయార్‌లోని ఐఎన్ఎస్ కోస్ట్‌గార్డ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అర్జున్ యుద్ధట్యాంకు నమూనాను సైన్యాధిపతి ఎంఎం నరవణేకు ప్రధాని నరేంద్ర మోడీ అందజేశారు.

**'అర్జున్' యుద్ధ ట్యాంకు ప్రత్యేకతలు :**


- తేజస్ తర్వాత 'ఆత్మనిర్భర్ భారత్' కింద భారత దళాలకు అందిన మరో అతిపెద్ద ఆయుధం 'అర్జున్ మార్క్ 1ఏ' యుద్ధ ట్యాంకు.
- వాస్తవానికి ఇప్పటికే సైన్యంలో అర్జున్ (మెయిన్ బ్యాటిల్ ట్యాంక్-ఎంబీటీ) యుద్ధ ట్యాంకులు సేవలు అందిస్తున్నాయి. కానీ, దాదాపు 71 చిన్న, పెద్ద మార్పులతో అర్జున్ మార్క్ 1ఏ రూపంలో అధునాతన ట్యాంకును రూపొందించారు. దీంతో ఇది ప్రపంచ స్థాయి ఆయుధాలతో పోటీపడేలా సిద్ధమైంది.
- భవిష్యత్తు యుద్ధ తంత్రానికి చెందిన వ్యవస్థలు దీనిలో ఉన్నాయి. వీటిని 'హంటర్ కిల్లర్స్' అని కూడా పిలుస్తారు. అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో ఇది స్థిరంగా పనిచేయగలదు. రాత్రిపూట యుద్ధంలో కూడా అర్జున్ ఎంకే-1ఏ సమర్థంగా పోరాడగలదు.
- దాదాపు 68 టన్నుల బరువు ఉండి, 120 ఎంఎం రౌండ్స్ వినియోగించే గన్‌ను దీనికి అమర్చారు.
- లక్ష్యాన్ని ఆటోమేటిక్‌గా ట్రాక్ చేసే ప్రత్యేక వ్యవస్థను ఈ ట్యాంక్ గన్‌లో అమర్చారు. వేగంగా కదులుతున్న లక్ష్యాలను కూడా ఈ ట్యాంక్ సులభంగా పేల్చి వేయగలదు. దీనిలో ప్రయోగించే తూటాలు (మందుగుండు)కూడా ప్రత్యేకమైనవే. దీని తూటా లక్ష్యాన్ని చేరుకోగానే అక్కడి ఆక్సిజన్‌ను పూర్తిగా వినియోగించుకొని పేలుతుంది. దీంతో పాటు చొచ్చుకుపోయిన తర్వాత విస్ఫోటం చెందేలా వీటిని తయారు చేశారు. కంప్యూటర్‌లోని ఇంటిగ్రేటెడ్ ఫైర్ కంట్రోల్ వ్యవస్థ ట్యాంక్ గన్‌ను నియంత్రిస్తుంది. రాత్రి, పగలు తేడా లేకుండా లక్ష్యాలను సులభంగా గుర్తించగలిగే వ్యవస్థ దీనిలో ఉంది.
- ఈ ట్యాంక్‌ను రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) చెన్నై విభాగంలోని కంబాట్ వెహికల్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీవీఆర్డీఈ) అభివృద్ధి చేసింది. ఈ ట్యాంక్‌లో 14 వరకు ప్రధాన మార్పులు ఉన్నాయి. వీటిల్లో పేటెంట్ పొందిన టెక్నాలజీనే అత్యధికంగా వినియోగించారు.
- 118 యుద్ధట్యాంకుల సరఫరాకు సైన్యం ఇప్పటికే సీవీఆర్డీఈకి రూ.8,500 కోట్ల విలువైన ఆర్డర్ ఇచ్చింది. వీటిని దేశ ఉత్తర సరిహద్దుల్లో మోహరించనున్నారు.

## ఆర్‌సీఐ 'స్మార్ట్ యాంటీ ఎయిర్‌ఫీల్డ్ వెపన్' పరీక్ష విజయవంతం




కేంద్ర రక్షణ శాఖకు చెందిన రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ) అభివృద్ధి చేసిన అత్యాధునిక ఆయుధం... స్మార్ట్ యాంటీ ఎయిర్‌ఫీల్డ్ వెపన్(ఎస్ఏఏడబ్ల్యూ)ను హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు చెందిన యుద్ధ విమానం హాక్-ఐ నుంచి విజయవంతంగా పరీక్షించారు. 125 కిలోల బరువున్న ఎస్ఏఏడబ్ల్యూతో శత్రు సైన్యాల బలగాలను వంద కిలోమీటర్ల దూరం నుంచే లక్ష్యంగా చేసుకోవచ్చు. రాడార్లు, బంకర్లు, ట్యాక్సీ ట్రాక్‌లు, రన్‌వేలను ఇది సులువుగా నాశనం చేస్తుంది. ఈ పరీక్ష విజయవంతం కావడంతో హాక్-ఐ యుద్ధ విమానాలను మరింత ఆధునీకరించవచ్చు. ఇండియన్ హాక్ ఎంకే 132 విమానం నుంచి పరీక్షించిన తొలి స్మార్ట్ ఆయుధం ఇదే. ఎస్ఏఏడబ్ల్యూను బంకర్లు, ట్యాంకర్లను ధ్వంసం చేయడానికి ఫైర్ చేస్తారు. దీని రేంజ్ 100 కిలోమీటర్లు. గతంలో ఈ ఆయుధాన్ని జాగ్వార్ విమానం నుంచి విజయవంతంగా ప్రయోగించారు.

## ఫ్లూరోఫోర్స్ తయారీలో ఐఐసీటీ విజయం




జీవకణాల్లోని మైటోకాండ్రియాకు అతుక్కుపోయి వెలుగులు విరజిమ్మే ప్రత్యేక ఫ్లూరోఫోర్స్ తయారీలో హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) విజయం సాధించింది. వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో కీలకమైన ఈ ఫ్లూరోఫోర్స్ తయారీ హక్కులను టోక్యో కెమికల్ ఇండస్ట్రీ (టీసీఐ) కంపెనీకి అందించినట్లు ఐఐసీటీ ఫిబ్రవరి 5న ఓ ప్రకటనలో తెలిపింది. డాక్టర్ సూర్యప్రకాశ్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం ఈ ఫ్లూరోఫోర్స్‌ను అభివృద్ధి చేసింది. మైటోకాండ్రియా పరిస్థితిని తెలుసుకునేందుకు ఇప్పటివరకు విద్యుదావేశమున్న ఫ్లూరోఫోర్స్‌ను ఉపయోగించేవారు. వీటిని ప్రత్యేక పరిస్థితుల్లోనే నిల్వచేయాలి. పైగా వీటిని వాడితే కణస్థాయిలో విషప్రభావం కనిపిస్తుంది. ఐఐసీటీ సిద్ధం చేసిన ఫ్లూరోఫోర్స్‌లో ఇలాంటి సమస్యలేవీ ఉండవు. గది ఉష్ణోగ్రతల్లో స్థిరంగా ఉండటమే కాకుండా.. సురక్షితమైన పదార్థంతో తయారు చేయడం వల్ల విషప్రభావాలూ ఉండవు. పైగా విద్యుదావేశం అవసరం లేకుండానే మైటో కాండ్రియాలకు అతుక్కుపోగలవు.




https://ourstudycircle.in/upscpdf/

### నౌకాదళానికి ఆధునిక క్షిపణులు



రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) అభివృద్ధి చేసిన దీర్ఘ శ్రేణి ఉపరితలం నుంచి గగనతల క్షిపణి (లాంగ్ రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్-ఎల్ఆర్‌సామ్) తుది బ్యాచ్ ఉత్పత్తి రవాణాను ఫిబ్రవరి 14న ప్రారంభించారు. హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని అబ్దుల్ కలాం క్షిపణి సముదాయంలో డీఆర్‌డీవో ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి కార్యక్రమానికి పచ్చజెండా ఊపారు. బీడీఎల్‌తో పాటు వేర్వేరు పరిశ్రమల భాగస్వామ్యంతో ఈ క్షిపణులను ఉత్పత్తి చేశారు. భారత నౌకాదళం తాజా అవసరాలకు తగ్గట్టుగా ఇజ్రాయెల్‌తో కలిసి డీఆర్‌డీవో ఎల్ఆర్‌సామ్‌ను అభివృద్ధి చేసింది.

### సీఆర్‌పీఎఫ్ కోసం బైక్ అంబులెన్సులు రూపొందించిన డీఆర్‌డీవో




మావోయిస్టు ప్రభావిత మారుమూల ప్రాంతాల్లో క్షతగాత్రులను తరలించడం కోసం రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) 21 ప్రత్యేక బైక్ అంబులెన్సులను రూపొందించింది. జనవరి 18న ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో వీటిని సీఆర్‌పీఎఫ్ (సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్) చేతికి అందించారు. 'రక్షిత' అనే ఈ వాహనాలను 350 సీసీ రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ బైకులపై తీర్చిదిద్దారు. డీఆర్‌డీవోకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ మెడిసిన్ అండ్ అలైడ్ సైన్సెస్ (ఇన్మాస్) సంస్థ వీటిని అభివృద్ధి చేసింది. వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాలు, ఉగ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రోగులను, గాయపడిన బలగాలను తరలించడానికి ఈ ద్విచక్ర వాహనాలను ఉపయోగిస్తామని సీఆర్‌పీఎఫ్ అధిపతి ఎ.పి.మహేశ్వరి తెలిపారు. ఈ బైక్‌లో డ్రైవర్ కాకుండా ఒక క్షతగాత్రుడు కూర్చోవచ్చు. తీవ్రంగా గాయపడిన, అనారోగ్యంపాలైన వ్యక్తి సౌకర్యవంతంగా కూర్చునేలా వెనుక సీటును తీర్చిదిద్దారు. రెక్లైన్ సౌకర్యం కల్పించారు. క్షతగాత్రుడు కదలకుండా పట్టి ఉంచే హ్యాండ్ ఇమ్మొబిలైజర్, హార్నెస్ జాకెట్ వంటివి ఇందులో ఉన్నాయి. అతడి శరీర పరామితులను కొలిచే సాధనాలు, పర్యవేక్షణ వ్యవస్థలు, ఆటో హెచ్చరిక వ్యవస్థలనూ ఏర్పాటు చేశారు. డాష్‌బోర్డుపై ఉండే ఎల్‌సీడీ తెర ద్వారా క్షతగాత్రుడి కీలక పరామితులను డ్రైవర్ వీక్షించొచ్చు. ఈ ప్రాజెక్టు కోసం తొలుత రూ. 35.49 లక్షలను సీఆర్‌పీఎఫ్ మంజూరు చేసింది.

### కోవిడ్-19 కోసం సీరం ఇన్‌స్టిట్యూట్ రెండో టీకా 'కోవోవ్యాక్స్'




కోవిడ్-19ను నిలువరించేందుకు 'కోవోవ్యాక్స్' అనే మరో టీకాను 2021 జూన్ నాటికి అందుబాటులోకి తెస్తామని పుణెలోని సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎస్ఐఐ) జనవరి 30న ప్రకటించింది. నోవావ్యాక్స్ సంస్థతో కలిసి అభివృద్ధి చేస్తున్న ఈ టీకా పనితీరు అద్భుతంగా ఉందని తెలిపింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ- ఆస్ట్రా జెనెకా ఉమ్మడిగా అభివృద్ధి చేసిన కోవిషీల్డ్ టీకాను ఎస్ఐఐ ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసిందే. భారత్‌లో ప్రారంభమైన వ్యాక్సినేషన్ కార్యక్రమంలో కోవిషీల్డ్‌తోపాటు కోవాగ్జిన్ టీకాలను ఇస్తున్నారు. కోవాగ్జిన్‌ను భారత్ బయోటెక్ సంస్థ అభివృద్ధి చేసింది.

### కొత్త తరం ఆకాశ్ క్షిపణి పరీక్ష విజయవంతం

స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన కొత్త తరం ఆకాశ్ (ఆకాశ్-ఎన్‌జీ) క్షిపణిని భారత్ జనవరి 25న విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని సమీకృత

## 2022 నాటికి తూర్పు నౌకాదళంలోకి తొలి విమానవాహక యుద్ధనౌక 'ఐఎన్ఎస్ విక్రాంత్'



పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన తొలి విమానవాహక యుద్ధనౌక 'ఐఎన్ఎస్ విక్రాంత్' భారత నౌకాదళంలో సేవలందించేందుకు సిద్ధమవుతోంది. సీ ట్రయల్(సముద్ర పరీక్షలు) రన్‌కు సిద్ధమవుతున్న ఐఎన్ఎస్ విక్రాంత్.. 2022 నాటికి విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళం కేంద్రంగా సేవలందించనుంది. 40 వేల టన్నుల బరువైన ఈ విక్రాంత్ నౌక నిర్మాణంతో భారత్ విమానవాహక యుద్ధనౌకలు తయారు చేసిన ఐదో దేశంగా అమెరికా, రష్యా, ఇంగ్లండ్, ఫ్రాన్స్ సరసన నిలిచింది. ఐఎన్ఎస్ విక్రాంత్‌లో రెండు టేకాఫ్ రన్‌వేలు, ఒక ల్యాండింగ్ స్ట్రిప్ ఏర్పాటు చేశారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో విక్రాంత్ క్లాస్ యుద్ధ నౌక సిద్ధమైంది. భారత నౌకాదళంలో యుద్ధ విమానాల కోసం రూపొందించిన మొట్టమొదటి విక్రాంత్ క్లాస్ నౌక ఇది. వాస్తవానికి 1997లో విక్రాంత్ సేవల నుంచి నిష్క్రమించింది. ఇప్పుడు అదే పేరుతో స్వదేశీ పరిజ్ఞానంతో విక్రాంత్ యుద్ధ విమాన వాహక నౌక సిద్ధమవుతోంది.

- విక్రాంత్ నిర్మాణం పదేళ్ల కిందటే ప్రారంభమైంది. 1999లో ఇండియన్ నేవీకి చెందిన డైరెక్టర్ ఆఫ్ నేవల్ డిజైన్ సంస్థ నౌకా డిజైన్ మొదలు పెట్టగా.. 2009లో కీలక భాగాల్ని పూర్తి చేశారు. 2011లో డ్రైడాక్ నుంచి విక్రాంత్‌ని బయటికి తీసుకొచ్చారు. 2015 జూన్ 10న కొచ్చిలో జల ప్రవేశం చేసింది. వివిధ సాంకేతిక పనుల అనంతరం ఇటీవలే బేసిన్ ట్రయల్స్ పూర్తి చేశారు. కొచ్చి షిప్‌యార్డులో తుది మెరుగులు దిద్దుకుంటున్న విక్రాంత్ జయమ్ సమ్ యుద్ధి స్పర్ధః అనే రుగ్వేద శ్లోకం స్ఫూర్తిగా రూపుదిద్దుకుంటోంది. దీనికి 'నాతో యుద్ధమంటే నాదే గెలుపు' అని అర్థం.
- పూర్తిస్థాయి భారతీయ పరిజ్ఞానంతో నిర్మిస్తున్న ఈ యుద్ధ నౌకలో అత్యంత ఆధునిక సదుపాయాలు ఉన్నాయి. ఎల్ఎం 2500 గ్యాస్ టర్బైన్లు 4, ప్రధాన గేర్ బాక్సులు, షాఫ్టింగ్, పిచ్ ప్రొపెల్లర్ కంట్రోలర్స్, ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ సిస్టమ్, స్టీరింగ్ గేర్, ఎయిర్ కండిషనింగ్ ప్లాంట్లు, కంప్రెసర్లు, సెంట్రిఫ్యూజన్, 60 క్రిటికల్ పంప్స్, విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలు, అగ్నిమాపక వ్యవస్థ, డెక్ మెషినరీతో పాటు అంతర్గత కమ్యూనికేషన్ పరికరాల్ని ఈ ట్రయల్‌రన్‌లో పరిశీలించారు. 2021 మధ్యలో సీ ట్రయల్స్ పూర్తి చేసిన తర్వాత... 2022 చివరిలో భారత నౌకాదళంలో సేవలు ప్రారంభించనుంది. ఈ ఐఎన్ఎస్ విక్రాంత్.. ఇండియన్ నేవీలో కీలకమైన తూర్పు నౌకాదళం కేంద్రంగా సేవలందించనుంది.



https://ourstudycircle.in/upscpdf/

## లేజర్ కిరణాలతో ప్లాస్టిక్ వ్యర్థాల విభజన





ప్లాస్టిక్ వ్యర్థాలను విభజించడం వీలు కావడం లేదు. ఈ ఇబ్బందిని అధిగమిస్తూ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ పరిశోధక బృందం ప్రత్యేక సాంకేతికతను అభివృద్ధి చేసింది. వర్సిటీలోని భౌతికశాస్త్రం అసోసియేట్ ఆచార్యుడు జి.మనోజ్‌కుమార్, పరిశోధక విద్యార్థి జుంజూరి రాజేందర్ ఆధ్వర్యంలో 'తక్కువ ఖర్చుతో ప్లాస్టిక్ వ్యర్థాల విభజన'పై చేపట్టిన పరిశోధనలు విజయవంతమయ్యాయి. ఈ పరిశోధన ఫలితాన్ని ఆప్టికల్ సొసైటీ ఆఫ్ అమెరికా ప్రచురించే ప్రతిష్ఠాత్మక ఆప్టిక్స్ అండ్ ఫొటోనిక్స్ న్యూస్(ఓపీఎన్) వార్షిక సమీక్ష-2020లో ప్రస్తావించడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా 115 పరిశోధన పత్రాలు రాగా కేవలం 30 పరిశోధనలకే ఈ జర్నల్‌లో చోటు దక్కింది. అందులో హెచ్‌సీయూ బృందం పరిశోధన కూడా ఉంది. 'లేజర్ ఇండ్యూస్డ్ బ్రేక్‌డౌన్ స్పెక్ట్రోస్కోపీ' పేరిట లేజర్ కిరణాలను ప్లాస్టిక్‌పై వినియోగిస్తారు. అలా వచ్చిన సమాచారాన్ని మెషిన్ లెర్నింగ్ సాయంతో విశ్లేషించడం ద్వారా ఏయే రకాలు ఉన్నాయో తెలిసిపోతుంది.

పరీక్ష వేదిక నుంచి ఈ ప్రయోగం జరిగింది. ఈ క్షిపణి ఉపరితలం నుంచి ఆకాశంలోని లక్ష్యాలను ఛేదించగలదు. అస్థిరంగా కదిలే చిన్నస్థాయి డ్రోన్ల వంటి వాటిని నేలకూల్చగలదు. తాజా పరీక్షలో అత్యంత కచ్చితత్వంతో ఇది లక్ష్యాన్ని ఛేదించింది అని అధికారిక ప్రకటన పేర్కొంది. ఆకాశ్-ఎన్‌జీ వ్యవస్థను చాలా మెరుగ్గా మోహరించడానికి వీలుగా రూపొందించారు. తాజా ప్రయోగాన్ని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో), బీడీఎల్, బీఈఎల్ సంస్థల సిబ్బంది చేపట్టారు.

### పిడుగుపాటుపై పరిశోధనకు దేశంలో తొలిసారిగా ప్రయోగవేదిక

ఉరుములు, పిడుగులతో ఆకస్మిక వర్షాలు అపార నష్టం కలిగిస్తుంటాయి. ఈ విపత్తుపై పరిశోధన కోసం దేశంలో తొలిసారిగా ఒడిశాలోని బాలేశ్వర్‌లో ఒక ప్రయోగ వేదికను ఏర్పాటు చేయబోతున్నట్లు భారత వాతావరణ విభాగం(ఐఎండీ) తెలిపింది. దీన్ని భూవిజ్ఞాన శాస్త్రాల మంత్రిత్వశాఖ, రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో), భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తామని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర ఫిబ్రవరి 5న వెల్లడించారు. ఇందులో అనేక పరిశీలన నెట్‌వర్క్‌లు, పూర్తిస్థాయి అబ్జర్వేటరీ, రాడార్, ఆటో స్టేషన్, మైక్రోవేవ్ రేడియోమీటర్, విండ్ ప్రొఫైలర్ వంటి సౌకర్యాలు ఉంటాయన్నారు.

### ఇంధనం అయిపోని జలాంతర్గామిని అభివృద్ధి చేస్తున్న దర్ప




విద్యుత్, ఇంధన సరఫరాతో సంబంధం లేకుండా, పదేపదే ఇంధనాన్ని నింపుకొనే అవసరం లేకుండా నడిచే జలాంతర్గామిని అమెరికా డిఫెన్స్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ఏజెన్సీ (దర్ప) అభివృద్ధి చేస్తున్నది. ఈ మానవరహిత జలాంతర్గామి (సబ్‌మెరైన్)కి ఓ చేప పేరుమీదుగా 'మంతా రే' అని నామకరణం చేసింది. అదే చేప ఆకృతిలో జలాంతర్గామిని నిర్మించనున్నారు. కృత్రిమ మేధ సహాయంతో ఈ జలాంతర్గామి లక్ష్యాలను గుర్తిస్తుంది. ఈ జలాంతర్గామికి నిరంతరాయంగా నెలలు, ఏండ్ల తరబడి విద్యుత్ సరఫరా వ్యవస్థను తయారు చేసే కాంట్రాక్ట్‌ను మెట్రోన్ అనే సంస్థకు అమెరికా డిఫెన్స్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ఏజెన్సీ అప్పగించింది. థర్మల్ ఇంజిన్, థెర్మో ఎలక్ట్రానిక్ మోడ్స్ వంటి పద్ధతులతో తయారయ్యే విద్యుత్‌ను ఈ జలాంతర్గామి ఉపయోగించుకుంటుంది.

### మితిమీరిన తాగుడుతో డీఎన్ఏలో మార్పులు

అతిగా మద్యం సేవించేవారికి ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా పురుషుల్లో డీఎన్ఏ కూడా మారిపోతుందని శాస్త్రవేత్తలు స్పష్టంచేశారు. ఈ దురలవాటును మానుకున్నా.. సదరు మార్పులు ఒక పట్టాన సర్దుకోవని తెలిపారు. కనీసం 3 నెలల పాటు కొనసాగుతాయని పేర్కొన్నారు. బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ (ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్) శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. మితిమీరిన మద్యపానం వల్ల తొలుత 'ఆల్కాహాల్ యూజ్ డిజార్డర్' (ఏయూడీ) తలెత్తుతుందని వారు పేర్కొన్నారు. 21 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య ఉన్న 52 మంది పురుషులపై నిర్వహించిన ప్రయోగాల్లో ఈ మేరకు వెల్లడైంది.

### అంగారక కక్ష్యలోకి చేరిన యూఏఈ వ్యోమనౌక 'అమాల్'



యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు చెందిన 'అమాల్' అనే అంతరిక్ష వ్యోమనౌక ఫిబ్రవరి 9న అంగారక గ్రహ కక్ష్యలోకి ప్రవేశించింది. 2020 జులై 20న ప్రయోగించిన మానవ రహిత అంతరిక్ష నౌక దాదాపు ఏడు నెలల పాటు 30 కోట్ల మైళ్లు ప్రయాణించి అంగారక గ్రహ కక్ష్యను చేరుకుంది. కాగా అమాల్ వ్యోమనౌక అంగారకుడి తొలి చిత్రాన్ని 2021 ఫిబ్రవరి 14న పంపింది. మార్స్‌పై ఉన్న భారీ అగ్ని పర్వతం ఒలింపస్ మాన్స్‌ను కెమెరాలో బంధించిందని యూఏఈ అంతరిక్ష సంస్థ తెలిపింది. ఇది అరబ్ దేశాల తొలి గ్రహాంతర ప్రయోగం. అంగారక గ్రహం మీద వాతావరణ పరిస్థితుల అధ్యయనమే లక్ష్యంగా ఈ మిషన్‌ను చేపట్టారు. రోజువారీ వాతావరణంతో పాటు వివిధ ఋతువుల్లో అక్కడి పరిస్థితులు ఎలా మార్పు చెందుతున్నాయన్న విషయంపై దీని పరిశోధన సాగనుంది. ఉపరితలంలో గూడుకట్టుకుని ఉన్న ధూళి కణాల లక్షణాలను ఇది పరిశీలించనుంది. ఈ కణాలే అక్కడి వాతావరణ, ఉష్ణోగ్రతలను ప్రభావితం చేస్తున్నాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

### ఒక్క రాకెట్‌లో 143 చిన్న ఉపగ్రహాలను ప్రయోగించిన స్పేస్‌ఎక్స్

ప్రముఖ వ్యాపారవేత్త ఎలోన్ మస్క్‌కు చెందిన సంస్థ స్పేస్‌ఎక్స్ కొత్త రికార్డు సృష్టించింది. ఒక్క రాకెట్‌లో 143 చిన్న ఉపగ్రహాలను ప్రయోగించిన ఘనత సాధించింది. ఈ మిషన్‌కు ట్రాన్స్‌పోర్టర్-1 అని పేరు పెట్టారు. ఫ్లోరిడాలోని కేప్ కెనవెరల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి జనవరి 24న రెండు దశల ఫాల్కన్-9 రాకెట్లను ఉపగ్రహ అంతరిక్షంలోకి విజయవంతంగా పంపించారు. ఒకే మిషన్‌లో పంపిన అతి ఎక్కువ ఉపగ్రహాలు ఇవే కావడం విశేషం. గతంలో భారత్‌కు చెందిన ఇస్రో పేరిట ఉన్న రికార్డును స్పేస్‌ఎక్స్ అధిగమించింది. 2017 ఫిబ్రవరి నెలలో ఇస్రో 104 ఉపగ్రహాలను ప్రయోగించింది. ఈ రికార్డును ఇప్పుడు స్పేస్‌ఎక్స్ అధిగమించింది. అంతరిక్షంలోకి తీసుకెళ్లిన ఉపగ్రహాల్లో క్యూబ్‌శాట్స్, మైక్రోశాట్స్‌తో పాటు 10 స్టార్‌లింక్ ఉపగ్రహాలు ఉన్నాయి.



https://ourstudycircle.in/upscpdf/



# వార్తల్లో వ్యక్తులు

## జీహెచ్ఎంసీ 26వ మేయర్‌గా గద్వాల విజయలక్ష్మి



హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ -జీహెచ్ఎంసీ) మేయర్‌గా తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పార్టీకి చెందిన బంజారాహిల్స్ కార్పొరేటర్ గద్వాల విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్‌గా అదే పార్టీకి చెందిన తార్నాక కార్పొరేటర్ మోతె శ్రీలతారెడ్డి ఎన్నికయ్యారు. దీంతో స్వరాష్ట్రంలో ఎన్నికైన జీహెచ్ఎంసీ తొలి మహిళా మేయర్‌గా గద్వాల విజయలక్ష్మి నిలిచారు. విజయలక్ష్మి జీహెచ్ఎంసీకు 26వ మేయర్ కాగా, ఐదో మహిళా మేయర్.

జీహెచ్ఎంసీ మేయర్ పీఠాన్ని గెలుచుకోవడం టీఆర్ఎస్‌కు వరుసగా ఇది రెండోసారి. ఫిబ్రవరి 11న హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి సర్వసభ్య సమావేశం జరిగింది. జీహెచ్ఎంసీలో ఈసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు అవకాశం లేకపోవడంతో టీఆర్ఎస్, బీజేపీలు బరిలో నిలిచాయి. అయితే మేయర్, డిప్యూటీ మేయర్ రెండు పదవులకూ ఎంఐఎం సభ్యులు టీఆర్ఎస్‌కే ఓట్లు వేశారు. దాంతో టీఆర్ఎస్ పార్టీనే రెండు పదవులు వరించాయి.

## సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ప్రవీణ్ సిన్హా



కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తాత్కాలిక డైరెక్టర్‌గా 1988 బ్యాచ్ గుజరాత్ క్యాడర్ ఐపీఎస్ అధికారి ప్రవీణ్ సిన్హా నియమితులయ్యారు. కొత్త డైరెక్టర్ నియమితులయ్యే వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం ప్రవీణ్ సిన్హా సీబీఐ అదనపు డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. గత రెండేండ్లుగా సీబీఐ డైరెక్టర్‌గా వ్యవహరించిన రిషీ కుమార్ శుక్లా పదవీకాలం ఫిబ్రవరి 3తో ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ నియామకాల కమిటీ సమావేశమై ప్రవీణ్ సిన్హా నియామకానికి ఆమోదం తెలిపింది. సీబీఐ డైరెక్టర్ పదవీ విరమణ అనంతరం తాత్కాలిక డైరెక్టర్‌ను నియమించడం 2014 నుంచి ఇది నాలుగోసారి.

## జో బైడెన్ ప్రభుత్వంలో భారత సంతతి అమెరికన్లకు ప్రాధాన్యత



- అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రభుత్వంలో భారత సంతతి అమెరికన్లకు ప్రాధాన్యం లభిస్తోంది. తాజాగా బైడెన్ పలువురు భారత సంతతి వారిని పలు పదవుల్లో నియమించారు.
- అమెరికా అంతరిక్ష సంస్థ నాసా యాక్టింగ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా శాస్త్ర సాంకేతిక రంగాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న భారత సంతతికి చెందిన మహిళ భవ్యా లాల్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఫిబ్రవరి 2న అమెరికా ప్రభుత్వం తెలిపింది. భవ్య ఇప్పటి వరకు 'అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రెసిడెన్షియల్ ట్రాన్సిషన్ ఏజెన్సీ రివ్యూ టీమ్' సభ్యురాలిగా ఉన్నారు. నాసా అంతరిక్ష సాంకేతిక రంగాభివృద్ధి, అమెరికా శాస్త్రీయ, సాంకేతిక విధానాల రూపకల్పనలో భవ్య కీలక పాత్ర పోషించారు.
- ప్రముఖ భారతీయ అమెరికన్ రాజా కృష్ణమూర్తి కాంగ్రెషనల్ ఆసియన్ పసిఫిక్ అమెరికన్ కాకస్‌కు చెందిన ఇమ్మిగ్రేషన్ కార్యదళానికి ఉమ్మడి అధ్యక్షుడిగా నియమితులయ్యారు. డ్రీమర్లు, తాత్కాలిక రక్షణ హోదా (టీపీఎస్) ఉన్నవారికి రక్షణ కల్పించడం, ఇమ్మిగ్రేషన్ విధానాల్లో సంస్కరణలకు సహకరించడం వంటి ఈ కార్యదళం లక్ష్యాలు. మరో భారతీయ అమెరికన్ చట్టసభ్యురాలు ప్రమీలా జయపాల్ ఈ కార్యదళానికి అధ్యక్షురాలు కావడం విశేషం.
- ఐక్యరాజ్యసమితిలో / అమెరికా రాయబారికి సలహాదారులుగా సోహినీ చటర్జీ, ఆదిత్య గొరూర్ అనే భారత సంతతి మహిళలు నియమితులయ్యారు.
- ఆఫ్రికా, ఆసియా ఖండాల్లో మలేరియా కట్టడికి చేపట్టిన కార్యక్రమానికి సమన్వయకర్తగా రాజ్ పంజాబీ నియమితులయ్యారు.
- అమెరికా హోం ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రధాన వైద్యాధికారిగా భారతీయ అమెరికన్ డాక్టర్ ప్రితేష్ గాంధీని బైడెన్ నియమించారు.
- వినియోగదారుల ఆర్థిక పరిరక్షణ మండలి చైర్మన్‌గా రోహిత్ చోప్రాను ఎంపిక చేశారు. ఆయన ప్రస్తుతం ఫెడరల్ ట్రేడ్ కమిషన్ అధిపతిగా పనిచేస్తున్నారు.

## అమెరికా తొలి మహిళా ఆర్థిక మంత్రిగా జానెట్ యెల్లెన్




అమెరికా ఆర్థిక మంత్రిగా జానెట్ యెల్లెన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. అమెరికా సెనేట్ ఆమె పేరుకు ఆమోదముద్ర వేసింది. 231 సంవత్సరాల అమెరికన్ చరిత్రలో ఆర్థిక మంత్రి బాధ్యతను ఒక మహిళకు అప్పగించడం ఇదే మొదటిసారి. అమెరికా తొలి మహిళా ఆర్థిక మంత్రిగా బాధ్యత స్వీకరించనున్న జానెట్ యెల్లెన్.. అమెరికా ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక వ్యవహారాలపై మంచి అవగాహన కలిగి వున్నారు. ఈమె 2014 నుంచి 2018 వరకు ఫెడరల్ రిజర్వ్ అధిపతిగా ఉన్నారు. అంతకు ముందు 1997 నుంచి 1999 వరకు వైట్‌హౌస్ ఎకనామిక్ అడ్వైజరీ కౌన్సిల్ ఛైర్మన్‌గా సేవలందించారు.



https://ourstudycircle.in/upscpdf/

## విశ్వ పౌరసత్వ రాయబారిగా రవిశంకర్



ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్టాత్మక అమెరికా యూనివర్సిటీ, "నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ స్పిరిచ్యువాలిటీ, డైలాగ్ అండ్ సర్వీస్" భారత ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్‌కు విశ్వ పౌరసత్వ రాయబారి (గ్లోబల్ సిటిజన్‌షిప్ అంబాసిడర్) గా విశేషమైన గుర్తింపు ఇచ్చింది. ప్రపంచంలో మానవతా విలువలు పెంపొందించేందుకు చేసిన కృషికిగానూ ఆయనకు ఈ గుర్తింపు దక్కింది. ప్రయోగాత్మక విద్య, పరిశోధనలలో నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ స్పిరిచ్యువాలిటీ, డైలాగ్ అండ్ సర్వీస్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయంగా ప్రముఖ స్థానంలో ఉంది. 100కు పైగా దేశాల విద్యార్థులకు ఈ విశ్వవిద్యాలయం ఆశ్రయమిస్తోంది. అమెరికాలోని టాప్ 50 యూనివర్సిటీల్లో ఈ యూనివర్సిటీ ఒకటి. అలాగే అమెరికాలోని అత్యధిక మంది విదేశీ విద్యార్థులున్న తొలి మూడు యూనివర్సిటీల్లో ఇది ఒకటి.

## సినాడ్ అండర్ సెక్రటరీగా ఎంపికైన తొలి మహిళగా నథాలీ బెకార్ట్



సినాడ్ (బిషప్పుల మహాసభ) అండర్ సెక్రటరీ పదవికి ఎంపికైన తొలి మహిళగా ఫ్రాన్సుకు చెందిన సిస్టర్ నథాలీ బెకార్ట్ రికార్డు నెలకొల్పారు. బెకార్ట్‌తో పాటు స్పెయిన్‌కు చెందిన లూయిస్ మారిన్ డీ సాన్ మార్టిన్ అనే వ్యక్తి కూడా సినాడ్ అండర్ సెక్రటరీ పదవికి ఎంపికయ్యారు. క్రైస్తవ మతంలో సిద్ధాంతపరంగా తలెత్తే ప్రధాన ప్రశ్నలపై సినాడ్ అధ్యయనం చేస్తుంది. సినాడ్‌లో బిషప్పులు, కార్డినల్స్‌తో పాటు నిపుణులు కూడా ఉంటారు. వీరిలో బిషప్పులు, కార్డినల్స్‌కు మాత్రమే ఓటింగ్ హక్కులుంటాయి. గతంలో నిపుణులుగా, పరిశీలకులుగా మాత్రమే మహిళలు సినాడ్‌లో ఉండేవారు. ఫ్రాన్సులోని జేవియర్ సిస్టర్స్ సంస్థ సభ్యురాలైన బెకార్ట్, ప్యారిస్‌లోని ప్రఖ్యాత హెచ్‌ఈసీ బిజినెస్ స్కూల్ నుంచి మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పొందారు. 2019 నుంచి సినాడ్‌కు కన్సల్టెంట్‌గా కొనసాగుతున్నారు.

## ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ డీజీగా సాగర్ హనుమాన్‌సింగ్

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) డైరెక్టర్ జనరల్‌గా 1995 ఇండియన్ పోస్టల్ సర్వీస్ బ్యాచ్ అధికారి సాగర్ హనుమాన్‌సింగ్ నియమితులయ్యారు. ప్రస్తుతం తెలంగాణ సర్కిల్ పోస్ట్‌మాస్టర్ జనరల్‌గా పనిచేస్తున్న ఈయన్ను డిప్యూటేషన్‌పై ఎన్ఐపీహెచ్ఎం డీజీగా నియమిస్తూ కేంద్ర నియామకాల కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుంది.

## టీవీ ప్రసారాలపై ఫిర్యాదుల కౌన్సిల్ ఛైర్‌పర్సన్‌గా జస్టిస్ గీతా మిత్తల్



వినోద టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యే కార్యక్రమాలను పర్యవేక్షించడానికి ఏర్పాటైన బ్రాడ్‌కాస్టింగ్ కంటెంట్ కంప్లెయింట్స్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్‌గా జమ్మూ-కశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గీతా మిత్తల్ నియమితులయ్యారు. ఈ స్వతంత్ర, స్వీయ నియంత్రణ వ్యవస్థను ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసింది.

## భారత బాక్సింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా అజయ్ సింగ్



భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) అధ్యక్షుడిగా అజయ్ సింగ్ మరోసారి ఎన్నికయ్యారు. ఫిబ్రవరి 3న అంతర్జాతీయ బాక్సింగ్ సమాఖ్య (ఏఐబీఏ) పర్యవేక్షణలో సాగిన ఎన్నికల్లో అజయ్ సింగ్ సమీప ప్రత్యర్థి ఆశీష్ షెలార్‌పై 37-27 తేడాతో నెగ్గారు. నాలుగేళ్లపాటు ఆయన అధ్యక్ష పదవిలో ఉంటారు. హేమంత కుమార్ కలీటా (అస్సాం) సమాఖ్య కొత్త జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు.

## మిస్ ఇండియా వరల్డ్‌గా తెలంగాణ యువతి మానస



తెలంగాణకు చెందిన యువ ఇంజినీరు మానస వారణాసి ఫిబ్రవరి 10న ముంబయిలో జరిగిన వీఎల్‌సీసీ ఫెమినా మిస్ ఇండియా వరల్డ్-2020 పోటీల్లో విజేతగా నిలిచారు. హర్యానా యువతి మానిక శికంద్ ఫెమినా మిస్ గ్రాండ్ ఇండియా 2020గా, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మాన్యసింగ్ ఫెమినా మిస్ ఇండియా 2020 రన్నరప్‌గా నిలిచారు.

## కంబళ పరుగులో బైందూరు విశ్వనాథ్ రికార్డు

కంబళ పరుగులో సరికొత్త రికార్డు నమోదైంది. మెరుపు వేగంతో పరుగులు తీయడంలో బైందూరు విశ్వనాథ్ పాత రికార్డులు అధిగమించారు. కర్ణాటకలోని

## అమెజాన్ నూతన సీఈవోగా ఆండీ జాస్సీ



అంతర్జాతీయ ఈ-కామర్స్ దిగ్గజం 'అమెజాన్' ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా ఆండీ జాస్సీ నియమితులయ్యారు. ఈ ఏడాది మూడో క్వార్టర్ నుంచి అమెజాన్ సీఈఓ పదవి నుంచి తాను తప్పుకోబోతున్నట్లు జెఫ్ బెజోస్ ప్రకటించారు. కేవలం ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. జెఫ్ బెజోస్ స్థానంలో అమెజాన్ వెబ్ సర్వీస్ హెడ్ ఆండీ జాస్సీ తదుపరి సీఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. 1997లో మార్కెటింగ్ మేనేజర్‌గా అమెజాన్‌లో చేరిన జాస్సీ.. 2003లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) క్లౌడ్ బృందానికి నేతృత్వం వహిస్తున్నారు. ఈ విభాగ వ్యవస్థాపకుడిగా ఈయన్నే చెబుతారు. అమెజాన్‌ను ఇ-కామర్స్ సంస్థగానే కాకుండా క్లౌడ్ కంప్యూటింగ్ కంపెనీగా ఈయన మార్చగలిగారు. అమెజాన్‌లో ఈయనకు 30 మి.డాలర్లకు పైగా షేర్లున్నాయి. 1995లో ఆన్‌లైన్ పుస్తక వ్యాపార సంస్థగా అమెజాన్‌ను స్థాపించిన బెజోస్.. ఆ తర్వాత దాన్ని రూ.1,23,96,272 కోట్ల విలువైన దిగ్గజ సంస్థగా తీర్చిదిద్దారు. చిన్న సంస్థగా మొదలైన అమెజాన్ అంచె లంచెలుగా ఎదిగి ప్రపంచంలోనే అతిపెద్ద ఈ-కామర్స్ దిగ్గజ సంస్థగా నిలిచింది. ఈ క్రమంలో బెజోస్ ప్రపంచంలోని అత్యంత సంపన్నుల్లో ఒకరుగా ఆవిర్భవించారు. అమెజాన్ నికర అమ్మకాలు 2020లో 38610 కోట్ల డాలర్ల (రూ.28.95 లక్షల కోట్ల)కు చేరాయి.



https://ourstudycircle.in/upscpdf/

## ది ఇండస్ ఎంటర్ ప్రెన్యూవర్స్ ఛైర్మన్‌గా ప్రవీణ్

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన అమెరికా బోస్టన్‌లోని 'ది ఇండస్ ఎంటర్ ప్రెన్యూవర్స్' (టై) గ్లోబల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఛైర్మన్‌గా హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్ తైలం ఎన్నికయ్యారు. ప్రపంచ అగ్రగామి అంతర్జాతీయ సంస్థల్లో ఒక్కటైన టైలో అగ్రస్థానానికి చేరుకున్న మొదటి తెలుగు వ్యక్తి, హైదరాబాదీగా



ప్రవీణ్ రికార్డు సృష్టించారు. సొంత కన్సల్టింగ్ సంస్థను నడిపి, స్టార్టప్‌లను ప్రోత్సహించడంలో విజయవంతమైన ప్రవీణ్‌ను టై బోస్టన్ ఏంజిల్స్‌కు నాయకత్వం వహించడానికి 2016లోనే టై బోస్టన్ చాప్టర్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. అనంతరం 2018లో టై గ్లోబల్ బోర్డ్‌కు వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైన ఆయన మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

మంగళూరు సమీపం ముల్కి వద్ద ఫిబ్రవరి 6న నిర్వహించిన ఐకళ కాంతాబారె బూదాబారె కంబళలో ఆయన దున్నపోతుల వెంట వంద మీటర్ల దూరాన్ని 9.15 సెకన్లలో చేరుకుని రికార్డు సృష్టించారు. ఇప్పటివరకు శ్రీనివాసగౌడ సృష్టించిన 9.55 సెకన్ల రికార్డుగా ఉండేది.

### కిశోర్ బియానీపై సెబీ నిషేధం



ఫ్యూచర్ రిటైల్ లిమిటెడ్ (ఎఫ్ఆర్ఎల్) సీఎండీ కిశోర్ బియానీతో పాటు ఆ సంస్థకు చెందిన కొందరు ప్రమోటర్లపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిషేధం విధించింది. కంపెనీ షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడినందుకు బియానీతో పాటు ఫ్యూచర్ కార్పొరేట్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎఫ్‌సీఆర్ఎల్), అనిల్ బియానీ, ఎఫ్‌సీఆర్ఎల్ ఎంప్లాయిస్ ట్రస్టును ఏడాది పాటు సెక్యూరిటీల మార్కెట్ నుంచి నిషేధించింది. కిశోర్ బియానీ, అనిల్ బియానీ, ఎఫ్‌సీఆర్ఎల్‌కు కోటి రూపాయల చొప్పున జరిమానా విధించింది. అంతేకాకుండా ఇన్‌సైడర్ ట్రేడింగ్‌తో అక్రమంగా ఆర్జించిన రూ.20.53 కోట్ల లాభాలను వాపసు ఇవ్వాలని బియానీలతో పాటు ఎఫ్‌సీఆర్ఎల్, ఎఫ్‌సీఆర్ఎల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ ట్రస్టులను ఆదేశించింది.

### రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీకి రెండున్నరేళ్ల జైలు శిక్ష



రష్యాలో ప్రతిపక్ష నాయకుడు అలెక్సీ నావల్నీకి మాస్కో కోర్టు రెండున్నరేళ్ల జైలు శిక్ష విధించింది. గతంలో రద్దు చేసిన శిక్షకు సంబంధించిన షరతులను ఉల్లంఘించిన నేపథ్యంలో ఈ శిక్ష విధిస్తున్నామని తెలిపింది. అలెక్సీ నావల్నీపై గత ఆగస్టులో స్వదేశంలోనే విష ప్రయోగం జరిగిన విషయం తెలిసిందే. జర్మనీలో దాదాపు ఐదు నెలలు చికిత్స పొందిన అనంతరం జనవరి 17న రష్యా చేరుకున్నారు. పోలీసులు ఆయన్ని విమానాశ్రయంలోనే అదుపులోకి తీసుకున్నారు. రష్యా విపక్ష నేత, అధ్యక్షుడు పుతిన్ ప్రత్యర్థి.. అలెక్సీ నావల్నీని జైలుకు పంపాలని మాస్కో కోర్టు ఫిబ్రవరి 2న ఆదేశించింది. అతన్ని విడుదల చేయాలంటూ కొన్ని రోజులుగా రష్యా అంతటా పెద్దఎత్తున నిరసనలు జరుగుతున్నాయి.

### ఫోర్బ్స్ '30 అండర్ 30' జాబితాలో కీర్తి రెడ్డి



ప్రముఖ అంతర్జాతీయ పత్రిక ఫోర్బ్స్ తాజాగా ప్రకటించిన '30 అండర్ 30' జాబితాలో తెలంగాణకు చెందిన కీర్తి రెడ్డికి చోటు దక్కింది. 30 ఏళ్లలోపు వేర్వేరు రంగాల్లో ఉన్నతంగా రాణించిన 30 మంది జాబితాను ఏటా ఫోర్బ్స్ ప్రకటిస్తోంది. ఈసారి ఆ జాబితాలో సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పోతారం ముద్దుబిడ్డ కొత్త కీర్తి రెడ్డి నిలిచారు. 24 ఏళ్ల వయసులోనే ఆమె ఈ ఘనత సాధించింది. 'స్టాట్విగ్' అనే బ్లాక్‌చైన్ సాంకేతికత ఆధారిత వ్యాక్సిన్ సరఫరా నిర్వహణ ప్లాట్‌ఫాంకు సహ వ్యవస్థాపకురాలు, సీఓఓగా కీర్తి రెడ్డి వ్యవహరిస్తున్నారు. వ్యాక్సిన్, ఆహారం ద్వారా వచ్చే వృథాను అరికట్టేందుకు అవసరమైన సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా కీర్తి పనిచేస్తున్నారు. తాజాగా ఫోర్బ్స్ పత్రిక ప్రతినిధులు హైదరాబాద్‌లోని ఆమె కంపెనీని పరిశీలించి ఈ విషయంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా 30 ఏళ్లలోపు అత్యంత ప్రతిభాశీలుర జాబితాలో చోటు కల్పించారు. ఇదే జాబితాలో మరో 12 మంది మహిళలు కూడా చోటు దక్కించుకున్నారు.

### లింకన్ స్మారక చిహ్నం వద్ద కమలా హారిస్ చిత్రపటం



అమెరికా తొలి మహిళా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు అరుదైన గౌరవం లభించింది. కమలా హారిస్ గౌరవార్థం, వివక్షపై ఆమె సాధించిన విజయాలకు సూచికగా అద్దంతో ప్రత్యేకంగా రూపొందించిన ఆమె చిత్రపటాన్ని వాషింగ్టన్‌లోని చరిత్రాత్మక లింకన్ స్మారక చిహ్నం వద్ద ఏర్పాటు చేశారు. నేషనల్ ఉమెన్స్ హిస్టరీ మ్యూజియం దీనిని బహూకరించింది. సైమన్ బెర్గర్ అనే కళాకారుడు దీనిని రూపొందించారు. అమెరికాలో తొలి మహిళా ఉపాధ్యక్షురాలు, తొలి భారతీయ అమెరికన్ ఉపాధ్యక్షురాలు, తొలి నల్లజాతి ఉపాధ్యక్షురాలు వంటి అనేక ఘనతలను సొంతం చేసుకోవడంతో హారిస్ గౌరవార్థం తాజా చిత్ర పటాన్ని ఏర్పాటు చేశారు.

### ఉత్తరాఖండ్ రాష్ట్రానికి ఒక రోజు ముఖ్యమంత్రిగా సృష్టి గోస్వామి



జాతీయ బాలికా దినోత్సవం(జనవరి 24) సందర్భంగా జనవరి 24న ఉత్తరాఖండ్ రాష్ట్రానికి ఒక రోజు ముఖ్యమంత్రిగా సృష్టి గోస్వామి వ్యవహరించారు. హరిద్వార్‌కు చెందిన 20 ఏళ్ల గోస్వామి జనవరి 24న ముఖ్యమంత్రి హోదాలో అధికారిక విధులకు హాజరయ్యారు. ప్రస్తుతం ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రిగా త్రివేంద్ర సింగ్ రావత్ ఉన్నారు. జాతీయ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి 24న నిర్వహించబడుతుంది. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై ఈ బాలికా దినోత్సవం రోజున అవగాహన కల్పిస్తారు.

### కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించిన అన్వితారెడ్డి, తరుణ్ జోషి

తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాకి చెందిన పర్వతారోహణ శిక్షకురాలు అన్విత రెడ్డి...సీనియర్ ఐపీఎస్ అధికారి(జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ స్పెషల్ బ్రాంచ్, హైదరాబాద్ సిటీ) తరుణ్ జోషితో కలిసి టాంజానియాలోని కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించారు. వీరిద్దరూ 5,895


https://ourstudycircle.in/upscpdf/

మీటర్లు(19,340 అడుగుల) ఎత్తున్న శిఖరాగ్రానికి జనవరి 21న చేరుకున్నారు. ఆఫ్రికా ఖండంలోని ఎత్తైన కిలిమంజారో పర్వత శిఖరంపై వీరు జాతీయ పతాకం ఆవిష్కరించారు.

### జస్టిస్ పుష్పా గనేడివాలా శాశ్వత జడ్జి సిఫార్సును వెనక్కి తీసుకున్న కొలీజియం



చిన్నారులపై జరిగిన లైంగిక నేరాలకు సంబంధించిన కేసుల్లో వరుసగా వివాదాస్పద తీర్పులిచ్చి సంచలనం రేపిన బాంబే హైకోర్టు నాగపూర్ బెంచ్ మహిళా న్యాయమూర్తి జస్టిస్ పుష్పా వీరేంద్ర గనేడివాలా పదోన్నతి నిర్ణయాన్ని సుప్రీంకోర్టు కొలీజియం ఉపసంహరించుకొంది. ప్రస్తుతం అదనపు న్యాయమూర్తిగా నాగపూర్ బెంచ్‌లో సేవలందిస్తున్న ఆమెకు బాంబే హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి కల్పించడానికి సిఫార్సు చేస్తూ జనవరి 20న తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు కొలీజియం జనవరి 30న వెనక్కి తీసుకుంది. ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ (పోక్సో) చట్టం కింద జస్టిస్ పుష్ప ఇటీవల ఇచ్చిన తీర్పులు వివాదాస్పదమయ్యాయి. ఆ తీర్పుల పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. అందుకే శాశ్వత జడ్జిగా నియామకం సిఫారసుల్ని వెనక్కి తీసుకోవాలని నిర్ణయించినట్టుగా సుప్రీంకోర్టు వర్గాలు వెల్లడించాయి.

### ఆర్సెలార్ సీఈవోగా ఆదిత్య మిట్టల్



ప్రపంచ ఉక్కు దిగ్గజం 'ఆర్సెలార్ మిట్టల్' కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా ఆ సంస్థ అధిపతి లక్ష్మీనివాస్ మిట్టల్ కుమారుడు ఆదిత్య మిట్టల్ నియమితులయ్యారు. లక్సెంబర్గ్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థలో ప్రస్తుతం ఆదిత్య మిట్టల్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో)గా పని చేస్తున్నారు. తండ్రి స్థానంలో ఆదిత్య మిట్టల్ సీఈవో పదవి చేపట్టనున్నట్లు ఆ కంపెనీ ఫిబ్రవరి 11న ఓ ప్రకటనలో వెల్లడించింది.

### ప్రముఖ రచయిత పోరంకి దక్షిణామూర్తి మృతి




ప్రముఖ రచయిత, బహుభాషావేత్త డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి (85) హైదరాబాద్‌లో ఫిబ్రవరి 6న మరణించారు. తెలుగు అకాడమీ ఉప సంచాలకునిగా పనిచేసి 1993లో పదవీ విరమణ పొందిన దక్షిణామూర్తి అనేక నవలలు, కథలు, కథానికలు, పరిశోధనా వ్యాసాలు రాశారు. తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ మాండలికాల్లో రచనలు చేసిన మొదటి రచయితగా ఖ్యాతి గడించారు. పరమహంస యోగానంద రాసిన 'యాన్ ఆటో బయోగ్రఫీ ఆఫ్ సెయింట్' అనే పుస్తకాన్ని దక్షిణామూర్తి 'ఒక యోగి ఆత్మకథ' పేరిట తెలుగులో అనువదించారు.

### ప్రముఖ హాలీవుడ్ నటుడు క్రిస్టోఫర్ ప్లమ్మర్ మృతి

ప్రముఖ హాలీవుడ్ నటుడు, ఆస్కార్ అవార్డు విజేత క్రిస్టోఫర్ ప్లమ్మర్ (91) ఫిబ్రవరి 6న మరణించారు. స్టేజ్ ఆర్టిస్ట్‌గా, టీవీల్లో, సినిమా నటుడిగా సుమారు 70 ఏళ్లు నటుడిగానే కొనసాగారాయన. 'సౌండ్ ఆఫ్ మ్యూజిక్' (1965) చిత్రం ద్వారా నటుడిగా పాపులారిటీ సంపాదించారు ప్లమ్మర్. ఆస్కార్ అవార్డు అందుకున్న పెద్ద వయస్కుడిగానూ ప్లమ్మర్ పేరు మీద ఓ రికార్డు ఉంది. 2012లో వచ్చిన 'బిగినర్స్' చిత్రానికి ఉత్తమ సహాయనటుడిగా ఆస్కార్ అవార్డు అందుకున్నారు.

### టాక్ షో లెజెండ్ లారీ కింగ్ మృతి



అర్ధ శతాబ్దానికి పైగా ప్రపంచ నేతలు, సినీ రంగ ప్రముఖులు మొదలుకొని సామాన్యుల దాకా ముఖాముఖిలు నిర్వహించి సరికొత్త అధ్యాయం సృష్టించిన టాక్ షో లెజెండ్ లారీ కింగ్(87) అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో జనవరి 23న మరణించారు. ఆయన నిర్వహించిన 50వేలకు పైగా కార్యక్రమాలు రేడియో, టీవీల్లో ప్రసారమయ్యాయి. 1995లో మధ్యప్రాచ్యం శాంతి చర్చలకు లారీ కింగ్ అధ్యక్షత వహించారు. ఎలిజబెత్ టేలర్, మిఖాయిల్ గోర్బచెవ్, బరాక్ ఒబామా, బిల్‌గేట్స్, లేడీ గాగా వరకు ఆయన ఎందరో ప్రముఖులతో ముఖాముఖి నిర్వహించారు.

## సంక్షిప్త సమాచారం

- మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే)గా జస్టిస్ పులిగోరు వెంకట సంజయ్ కుమార్ ఫిబ్రవరి 12న నియమితులయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుల మేరకు భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయన్ను మణిపూర్ హైకోర్టు సీజేగా నియమించారు.
- ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ (ఐడీఆర్‌బీటీ) నూతన డైరెక్టర్‌గా జనవరి 25న ప్రొఫెసర్ డి.జానకిరామ్ బాధ్యతలు చేపట్టారు. ఐడీఆర్‌బీటీ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది.
- జాతీయ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ(ఎన్‌ఐఆర్‌డీపీఆర్) డైరెక్టర్ జనరల్‌గా డాక్టర్ జి.నరేంద్రకుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఐదేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు.
- తెలంగాణ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య(మార్క్‌ఫెడ్) మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ)గా పట్టాభి యాదిరెడ్డిని నియమిస్తూ వ్యవసాయశాఖ జనవరి 22న ఉత్తర్వులు జారీ చేసింది.
- అమెరికా రక్షణ మంత్రిగా రిటైర్డ్ జనరల్ లాయిడ్ ఆస్టిన్ నియమితులయ్యారు. ఈ పదవిని చేపట్టిన తొలి నల్లజాతీయుడు ఆయనే కావడం విశేషం.
- దేశంలో అతి పిన్న వయస్కురాలైన పైలట్‌గా 25 ఏళ్ల కశ్మీర్ యువతి ఆయేషా అజీజ్ రికార్డు నెలకొల్పారు. అయేషా 15 ఏళ్లకే స్టూడెంట్ పైలట్‌గా లైసెన్స్ పొందారు.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి (ఏపీఎస్‌బీబీ) ఛైర్మన్‌గా ఏవీ జోసెఫ్ నియమితులయ్యారు.
- హిందుస్తాన్ స్టీల్ వర్క్స్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్(హెచ్‌ఎస్‌సీఎల్) మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎస్ఎన్ఎల్ చీఫ్ ఇంజినీర్(సివిల్) తాడి లక్ష్మీనారాయణ రెడ్డి నియమితులయ్యారు.



https://ourstudycircle.in/upscpdf/



# అవార్డులు

## ఏపీ సీఎం జగన్‌కు 'స్కోచ్ ఈ ఏటి ముఖ్యమంత్రి' అవార్డు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020-21 ఏడాదికి గాను 'స్కోచ్ ఈ ఏటి ముఖ్యమంత్రి (సీఎం ఆఫ్ ద ఇయర్)' అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఫిబ్రవరి 16న తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో స్కోచ్ గ్రూప్ ఛైర్మన్ సమీర్ కొచ్చర్ ముఖ్యమంత్రి జగన్‌కు అవార్డును అందజేశారు. పాలనలో ఉత్తమ ప్రతిభ విభాగంలో ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాలనలో, విప్లవాత్మక మార్పులతో పారదర్శకతకు పెద్దపీట వేసిందని స్కోచ్ గ్రూప్ దేశవ్యాప్తంగా నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. ప్రమాణ స్వీకారం చేసిన ఏడాదిన్నర కాలంలోనే స్కోచ్ నుంచి అత్యుత్తమ ముఖ్యమంత్రి అవార్డును అందుకోవడం ఇదే తొలిసారి. కరోనా వ్యాప్తి చెందుతున్న కాలంలోనూ రాష్ట్ర వ్యాప్తంగా 123 ప్రాజెక్టులను జగన్ సర్కారు అమలు చేసిందని స్కోచ్ నివేదిక కొనియాడింది.

### డాక్టర్ నాగేశ్వరరెడ్డికి ప్రతిష్ఠాత్మక ఏఎస్‌జీఈ అత్యున్నత పురస్కారం



ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఛైర్మన్, ప్రఖ్యాత జీర్ణకోశ వైద్య నిపుణులు డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డికి ప్రతిష్ఠాత్మక 'అమెరికన్ సొసైటీ ఫర్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఎండోస్కోపీ (ఏఎస్‌జీఈ)' సంస్థ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించింది. 'అమెరికన్ గ్యాస్ట్రోస్కోపిక్ క్లబ్' వ్యవస్థాపకులు డాక్టర్ రుడాల్ఫ్ వి.షిండ్లర్ పేరిట జీర్ణకోశ వ్యాధుల చికిత్సల్లో విశేష సేవలందించిన వారిని ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు.

### గణతంత్ర కవాతులో అయోధ్య రామ మందిర శకటానికి ప్రథమ పురస్కారం

ఈ ఏడాది గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో నిర్వహించిన కవాతు (పరేడ్)లో 32 శకటాలు పాల్గొనగా ఉత్తర్‌ప్రదేశ్ శకటానికి ప్రథమ పురస్కారం లభించింది. అయోధ్య రామ మందిర నమూనాతో పాటు ఆ పవిత్ర నగర సాంస్కృతిక వారసత్వాన్ని, దీపోత్సవ ప్రాముఖ్యతను, రామాయణంలోని కీలక ఘట్టాలను తెలియ జెప్పేలా రూపొందించిన ఆ శకటాన్ని ఉత్తమ శకటంగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. త్రిపుర రాష్ట్ర శకటానికి ద్వితీయ పురస్కారం లభించింది. సామాజిక, ఆర్థిక కోణాల్లో ఆత్మనిర్భర భారత్‌ను సాధించేందుకు పర్యావరణ అనుకూల సంప్రదాయాల ఆచరణను ప్రోత్సహించేలా ఈ శకటాన్ని రూపొందించారు. 'దేవతల భూమి' థీమ్‌తో రూపకల్పన చేసిన ఉత్తరాఖండ్ శకటానికి తృతీయ పురస్కారం లభించింది.



### డీఐజీ సుమతి, చంద్రకళ, మారుతమ్మకు కరోనా వారియర్స్ పురస్కారాలు

లాక్‌డౌన్ కాలంలో సేవలు అందించిన కరోనా తొలి వరుస మహిళా యోధులకు జాతీయ మహిళా కమిషన్ పురస్కారాలు ప్రదానం చేసి సన్మానించింది. జాతీయ ఉత్తమ కొవిడ్ వారియర్లుగా తెలంగాణ నుంచి ఎంపికైన డీఐజీ బీ సుమతి, అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, పారిశుద్ధ్య కార్మికురాలు మారుతమ్మ జనవరి 31న జాతీయ స్థాయిలో పురస్కారాలను అందుకొన్నారు. జాతీయ మహిళా కమిషన్ 29వ వార్షికోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర మంత్రులు ప్రకాశ్ జవదేకర్, రతన్‌లాల్ కెటారియా, జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు రేఖాశర్మ వీరికి అవార్డులు అందజేశారు. గతేడాది(2020) లాక్‌డౌన్ సందర్భంగా కొవిడ్ నియమావళిని పటిష్ఠంగా పోలీస్‌శాఖ అమలు చేసింది. ప్రజలకు నిత్యావసరాలు, మందులతో పాటు రవాణా తదితర అవసరాలకు ఎలాంటి లోటు రాకుండా చర్యలు చేపట్టింది. వీటన్నింటినీ సమర్థంగా అమలుచేయడంతో పాటు, ప్రజలకు చేసిన సేవలకు గుర్తింపుగా డీఐజీ సుమతికి జాతీయ మహిళా కమిషన్ పురస్కారాన్ని ప్రకటించింది. గతేడాది(2020) సూర్యాపేట పట్టణంలో ఒక్కసారిగా పదుల సంఖ్యలో కరోనా కేసులు వెలుగు చూశాయి. అలాంటి సమయంలోనూ 45 రోజుల పాటు ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా మారుతమ్మ విధులు నిర్వహించింది. ఈ సేవలకు గుర్తింపుగా అవార్డు దక్కింది. కొవిడ్ సమయంలో చిన్నారులకు పోషకాహారం అందించడంలో కృషి చేసినందుకు చంద్రకళకు అవార్డు లభించింది. విజయనగరం జిల్లాకు చెందిన ఎస్పీ రాజకుమారి కూడా ఈ అవార్డును అందుకున్నారు.

### జీఎంఆర్‌కు 'గ్రీన్ హైవే గోల్డ్ అవార్డు'

కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ జనవరి 18న ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో రహదారి భద్రతా మాసోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రహదారుల నిర్మాణం, నిర్వహణలో మంచి పనితీరు కనబరిచిన పలు సంస్థలు, అధికారులకు అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో హైదరాబాద్- విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే పనులను 40 కి.మీ.నుంచి 221.5 కి.మీ.వరకు చేపట్టినందుకు జీఎంఆర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 'గ్రీన్ హైవే గోల్డ్ అవార్డు' దక్కింది. ఇదే కేటగిరీలో కర్నూలు సెక్షన్‌లో నిర్మించిన కొత్తకోట బైపాస్ పనులకు గాను క్యూబ్ హైవేస్ సంస్థకు సిల్వర్ అవార్డు సొంతమైంది. ఎన్‌హెచ్ 65లో మహారాష్ట్ర-కర్ణాటక సరిహద్దు నుంచి సంగారెడ్డి వరకు టోల్ నిర్వహణ కేటగిరీలో ఎల్ అండ్ టీ డెక్కన్ టోల్ మేనేజ్‌మెంట్ సంస్థకు 'టోల్ మేనేజ్‌మెంట్ గోల్డ్ అవార్డు' లభించింది. మైదాన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణంలో ప్రతిభ కనబరిచిన జాతీయ రహదారి రవాణా శాఖకు చెందిన విజయవాడ ప్రాంతీయ కార్యాలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అభినవ్ కుమార్‌కు జాతీయస్థాయి అవార్డు సొంతమైంది.



https://ourstudycircle.in/upscpdf/



# క్రీడాంశాలు

## ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిలో భారత్‌కు 23 పతకాలు


యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని దుబాయ్‌లో జరిగిన 12వ ఫజా ఇంటర్నేషనల్ ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రి మీట్‌లో భారత్ 23 పతకాలు కైవసం చేసుకుంది. చివరి రోజు పోటీల్లో భారత్‌కు మరో రెండు స్వర్ణాలు దక్కాయి. ఫిబ్రవరి 14న జరిగిన హై జంప్‌లో భారత పారా అథ్లెట్లు ప్రవీణ్ కుమార్, నిషాద్ కుమార్ ఆసియా రికార్డులు అధిగమించి స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ టోర్నీలో భారత్ ఓవరాల్‌గా 23 పతకాలు చేజిక్కించుకుంది. 34 పతకాలతో థాయ్‌లాండ్ టాప్‌లో ఉండగా.. భారత్, టర్కీ, కెన్యా 23 మెడల్స్‌తో ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ పోటీల్లో పురుషుల జావెలిన్ త్రోలో సందీప్ (ఎఫ్ 44), అజిత్ సింగ్ (ఎఫ్ 46), నవ్‌దీప్ (ఎఫ్ 41) 200 మీటర్ల పరుగు (ఎఫ్ 64)లో ప్రశాంత్ స్వర్ణాలు సాధించారు. పతకం సాధించే క్రమంలో నవ్‌దీప్ టోక్యో పారా ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం విశేషం. పురుషుల షాట్‌పుట్ (ఎఫ్ 35/36)లో ఐదో స్థానంలో నిలిచిన అర్వింద్ కూడా విశ్వక్రీడల బెర్త్ దక్కించుకున్నాడు. నీరజ్ యాదవ్ పురుషుల డిస్కస్ త్రో ఎఫ్-55 విభాగంలో... సిమ్రన్ కౌర్ మహిళల 100 మీటర్ల టి-13 విభాగంలో స్వర్ణ పతకాలను గెల్చుకున్నారు.

## ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీ విజేత తమిళనాడు



తమిళనాడు క్రికెట్ జట్టు దేశవాళీ టీ20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని కైవసం చేసుకుంది. జనవరి 31న అహ్మదాబాద్‌లోని మొతెరా సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో దినేష్ కార్తీక్ సారథ్యంలోని తమిళనాడు జట్టు ఏడు వికెట్ల తేడాతో బరోడాపై విజయం సాధించింది. తమిళనాడు బౌలర్ మణిమరన్ సిద్ధార్థ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. టోర్నీ ఆరంభ సీజన్ (2006-07)లో విజేతగా నిలిచిన తమిళ జట్టు దాదాపు 15 ఏండ్ల విరామం తర్వాత మరోసారి ఛాంపియన్‌గా అవతరించింది. ఈ ట్రోఫీని గెలవడం తమిళనాడుకు ఇది రెండోసారి. చివరిసారి 2007లో దినేష్‌కార్తీక్ కెప్టెన్సీలోనే తమిళనాడు టైటిల్ దక్కించుకుంది.

## ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు విజేత రిషబ్ పంత్



అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్-ఐసీసీ) తొలిసారిగా ప్రవేశపెట్టిన 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డును 2021 జనవరి నెలకు గాను భారత యువ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ దక్కించుకున్నాడు. జనవరిలో రిషబ్ పంత్ టీమిండియా చారిత్రక విజయంలో కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. బ్రిస్బేన్ టెస్ట్‌లో 89 పరుగులు చేసిన పంత్.. టీమ్‌కు అద్వితీయమైన విజయాన్ని సాధించి పెట్టిన విషయం తెలిసిందే. మహిళల విభాగంలో దక్షిణాఫ్రికా బౌలర్ షబ్నిమ్ ఇస్మాయిల్ "ప్లేయర్ ఆఫ్ ద మంత్"గా ఎంపికైంది.

## ఓపెన్ రేస్ వాకింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలుచుకున్న మనీష్



8వ జాతీయ ఓపెన్ రేస్ వాకింగ్ ఛాంపియన్‌షిప్-2021లో ఒలింపియన్, ఉత్తరాఖండ్ అథ్లెట్ మనీశ్ రావత్ స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. భారత్‌లో తొలిసారి 35 కిలోమీటర్ల రేస్ వాకింగ్ ఈవెంట్ జరగగా మనీశ్ విజేతగా నిలిచాడు. జార్ఖండ్ రాజధాని రాంచీలో ఫిబ్రవరి 14న జరిగిన ఈ రేసును 29 ఏళ్ల మనీశ్ 2 గంటల 49 నిమిషాల 12 సెకన్లలో ముగించాడు. అయితే ప్రపంచ ఛాంపియన్‌షిప్ అర్హత ప్రమాణాన్ని (2గం:35:00ని) అతను అందుకోలేకపోయాడు. మరోవైపు పురుషుల 50 కిలోమీటర్ల రేస్ వాకింగ్ ఈవెంట్‌లో పంజాబ్‌కు చెందిన గురుప్రీత్ సింగ్ (3గం:59ని:42 సెకన్లు) ఛాంపియన్‌గా నిలిచాడు.

## యశ్వంత్ కుమార్, నందినికి ఉత్తమ అథ్లెట్లు అవార్డులు



36వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2021 ఫిబ్రవరి 6 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు అస్సాంలోని గువహటిలో జరిగింది. ఈ ఛాంపియన్‌షిప్‌లో మొత్తం 8 పతకాలతో తెలంగాణ 12వ స్థానంలో నిలవగా.. 5 పతకాలతో ఆంధ్రప్రదేశ్ 15వ స్థానాన్ని దక్కించుకుంది. జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2021లో తెలంగాణ అమ్మాయి అగసారా నందిని అండర్-18 బాలికల విభాగంలో... ఆంధ్రప్రదేశ్ అబ్బాయి యశ్వంత్ కుమార్ అండర్-20 బాలుర విభాగంలో 'ఉత్తమ అథ్లెట్' అవార్డులు గెల్చుకున్నారు. నందిని ఈ పోటీల్లో లాంగ్‌జంప్, 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకాలు సాధించింది. యశ్వంత్ అండర్-20 బాలుర 110 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకాన్ని గెల్చుకున్నాడు.



https://ourstudycircle.in/upscpdf/

## మహిళల 1,500 మీటర్ల పరుగులో గుడాఫ్ సెగే ప్రపంచ రికార్డు



ఇథియోపియా మహిళా అథ్లెట్ గుడాఫ్ సెగే... 1,500 మీటర్ల ఇండోర్ విభాగంలో సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పింది. నార్తర్న్ ఫ్రాన్స్‌లో జరిగిన మీట్‌లో ఆమె 1,500 మీటర్ల పరుగును 3 నిమిషాల 53.09 సెకన్లలో పూర్తి చేసింది. దీంతో గతంలో ఇథియోపియా దేశానికి చెందిన ఎంజెబీ (3ని॥55.12 సెకన్లు) దిబాబా పేరిట ఉన్న రికార్డును సవరించింది.

## షూటర్ దివ్యాన్ష్ ప్రపంచ రికార్డు



జాతీయ షూటింగ్ సెలక్షన్ ట్రయల్స్‌లో జైపూర్‌కు చెందిన ప్రపంచ నంబర్‌వన్ షూటర్, టోక్యో బెర్త్ హోల్డర్ దివ్యాన్ష్ సింగ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ఫైనల్స్ ప్రపంచ రికార్డు అధిగమించాడు. న్యూఢిల్లీలో ఫిబ్రవరి 10న జరిగిన ఈవెంట్‌లో దివ్యాన్ష్ ఫైనల్లో 253.1 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలవడంతో పాటు ప్రపంచ రికార్డును తన పేర లిఖించుకున్నాడు. 252.8 పాయింట్లతో హావోనన్ యు (చైనా) పేరిట ఉన్న రికార్డును దివ్యాన్ష్ సవరించాడు.

## ఆస్ట్రేలియా క్రికెట్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో లీసా స్థాలేకర్



ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ లీసా స్థాలేకర్ ఆస్ట్రేలియన్ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకుంది. పుణేలో జన్మించి ఆస్ట్రేలియాకు వలస వెళ్లిన ఆమె 2001-13 మధ్య కాలంలో 8 టెస్టులు, 125 వన్డేలు, 54 టీ20లు ఆడింది. నాలుగు ప్రపంచ కప్‌లు గెలిచిన ఆస్ట్రేలియా జట్లలో ఆమె సభ్యురాలిగా ఉంది.

## 2023 వరకు ఐసీసీ ఈవెంట్లకు స్పాన్సర్‌గా బైజూస్

2021 నుంచి 2023 వరకు అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) ఈవెంట్లకు భారతీయ ఎడ్యు-టెక్ కంపెనీ 'బైజూస్' స్పాన్సర్‌గా వ్యవహరిస్తుందని ప్రకటించింది. మూడేళ్ల ఒప్పందంలో భారత్‌లో టీ20 ప్రపంచకప్, న్యూజిలాండ్‌లో మహిళల ప్రపంచకప్ సహా ఐసీసీ మెగా టోర్నీలన్నింటిలో బైజూస్ భాగస్వామిగా ఉంటుంది. ఒప్పందంలో భాగంగా స్టేడియాల్లో, క్రికెట్ ప్రసారాల్లో బైజూస్‌కు విస్తృత ప్రాధాన్యం దక్కుతుంది. ఐసీసీ టోర్నీల డిజిటల్ హక్కులు కూడా బైజూస్‌కు లభిస్తాయి. 2019 ఆగస్టులో టీమ్‌ఇండియా జెర్సీ స్పాన్సర్‌గా బైజూస్ ఎంపికైంది.

## స్టీవ్ స్మిత్‌కు అలెన్ బోర్డర్ పురస్కారం



ఆస్ట్రేలియా క్రికెట్ ఫిబ్రవరి 6న ప్రకటించిన వార్షిక అవార్డుల్లో మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కు రెండు పురస్కారాలు లభించాయి. 2020-21 ఏడాదిగానూ మూడు ఫార్మాట్లలో విశేషంగా రాణించిన స్మిత్‌కు 'అలెన్ బోర్డర్ మెడల్' తోపాటు 'వన్డే ఇంటర్నేషనల్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం దక్కింది. మహిళల విభాగంలో బెత్ మూనీ 'బెలిండా క్లార్క్' అవార్డును గెల్చుకుంది.

## ఒలింపిక్స్ కమిటీ అధ్యక్షుడు యొషిరో మోరి రాజీనామా

టోక్యో ఒలింపిక్స్-2021 కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు యొషిరో మోరి తన పదవికి రాజీనామా చేశారు. జపాన్ మాజీ ప్రధానమంత్రి కూడా అయిన మోరి... ఇటీవల జరిగిన ఆర్గనైజింగ్ కమిటీ సమావేశంలో 'మహిళలు అతిగా మాట్లాడతారు. సభా సమయాన్ని వృథా చేస్తారు' అని అనుచితంగా వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు పదవీచ్యుతున్ని చేసేదాకా వెంటాడాయి.

## ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో పాల్గొనకూడదని భారత్ నిర్ణయం

చాంగ్వాన్‌లో ఏప్రిల్ 16న ఆరంభమయ్యే ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో పాల్గొనకూడదని భారత జట్టు నిర్ణయించుకుంది. దక్షిణ కొరియాలో రెండు వారాల తప్పనిసరి క్వారంటైన్ నిబంధన ఉండడమే దీనికి కారణం. కొరియాలో జరగబోయే ప్రపంచకప్‌లో రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ ఈవెంట్లను ఒకేసారి నిర్వహిస్తున్నారు. మార్చిలో భారత్ కంబైన్డ్ ప్రపంచకప్‌ను నిర్వహించనుంది.

## హైదరాబాద్ ఎఫ్‌సీ కోచ్‌గా మనోలో



ఇండియన్ సూపర్ లీగ్ ఫ్రాంచైజీ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) హెడ్ కోచ్‌గా మాన్యుయెల్ మనోలో మార్కెజ్ మరో రెండేళ్లు కొనసాగనున్నారు. ఆయన 2020 ఆగస్టులో హైదరాబాద్ జట్టు కోచ్‌గా నియమితులయ్యారు. తాజా పొడిగింపుతో ఆయన 2022-23 సీజన్ పూర్తయ్యేదాకా జట్టుకు సేవలందిస్తారు.

## బిగ్‌బాష్ టీ20 టోర్నమెంట్ విజేత సిడ్నీ సిక్సర్స్

బిగ్‌బాష్ టీ20 టోర్నమెంట్ టైటిల్‌ను సిడ్నీ సిక్సర్స్ జట్టు కైవసం చేసుకుంది. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఫిబ్రవరి 6న జరిగిన ఫైనల్‌లో ఆష్టన్ టర్నర్ సారథ్యంలోని సిడ్నీ సిక్సర్స్ జట్టు 27 పరుగుల ఆధిక్యంతో పెర్త్ స్కార్చర్స్ జట్టును ఓడించి ..వరుసగా రెండో ఏడాది బిగ్‌బాష్ టీ20 టోర్నమెంట్ టైటిల్‌ను గెలుచుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జేమ్స్ విన్స్ నిలవగా.. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును జోష్ ఫిలిప్ గెలుచుకున్నాడు.


### సంక్షిప్త సమాచారం

- భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) కార్యదర్శి జై షా.. ఆసియా క్రికెట్ మండలి(ఆసియా క్రికెట్ కౌన్సిల్ -ఏసీసీ) అధ్యక్షుడిగా జనవరి 30న ఎన్నికయ్యాడు.
- రహదారి భద్రత ప్రపంచ టీ20 సిరీస్ 2021 మార్చి 2 నుంచి 21 వరకు ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌లో ఈ టోర్నీ జరుగుతుంది. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించడం కోసం మహారాష్ట్ర రహదారి భద్రత విభాగం, సునీల్ గవాస్కర్‌కు చెందిన పీఎంజీ గ్రూప్ ఈ టోర్నీని ఏర్పాటు చేసింది.
- టీ20 ఫార్మాట్‌లో 100 విజయాలు సాధించిన తొలి క్రికెట్ జట్టుగా పాకిస్తాన్ జట్టు నిలిచింది. దక్షిణాఫ్రికాతో ఫిబ్రవరి 14న లాహోర్‌లో ముగిసిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 2-1తో గెలుచుకోవడంతో పాక్.. ఈ ఘనత సాధించింది.
- అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) కప్ పురుషుల టీమ్ టోర్నమెంట్‌లో రష్యా జట్టు తొలిసారి ఛాంపియన్‌గా అవతరించింది. ఇటలీ జట్టుతో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఫిబ్రవరి 7న జరిగిన ఫైనల్లో రష్యా 2-0తో విజయం సాధించింది.



https://ourstudycircle.in/upscpdf/

# వార్తల్లో ప్రదేశాలు




## భీమ్‌బేట్కాలో 57 కోట్ల ఏండ్ల నాటి అవశేషాలు



భూమి మీదనే అత్యంత పురాతన (ఇప్పటివరకు కనుగొన్నవాటిలో మొట్టమొదటి) జంతువు డికిన్సోనియా అవశేషాలను మధ్యప్రదేశ్‌లోని భీమ్‌బేట్కా గుహల్లో కనుగొన్నారు. భీమ్‌బేట్కాలోని గుహల సముదాయంలో ఉన్న ఆడిటోరియం కేవ్‌లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)కు చెందిన ఇద్దరు నిపుణులు అనుకోకుండా దీనిని గుర్తించారు. డికిన్సోనియా భూమ్మీద 57 కోట్ల ఏండ్ల క్రితం సంచరించినట్టు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత అరుదైన శిలాజాల్లో ఇది ఒకటి. ఈ అవశేషాలు, దక్షిణ ఆస్ట్రేలియాలో కనిపించిన శిలాజాలకు సరిపోలుతున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. డికిన్సోనియా 17 అంగుళాల పొడవు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. భీమ్‌బేట్కా గుహలను మధ్యప్రదేశ్‌లోని రైసేన్ జిల్లాలో 1958లో వాకంకర్ అనే చరిత్రకారుడు కనుగొన్నారు. ఆదిమానవుడు నివసించిన ఆనవాళ్లు కూడా ఇక్కడే కనిపించాయి.

## అమెరికాలో మహాత్మా గాంధీ విగ్రహం ధ్వంసం



అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలోని డేవిస్‌లో మహాత్మా గాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆరు అడుగుల పొడవు, 294 కిలోల బరువు ఉన్న ఈ కాంస్య విగ్రహాన్ని నాలుగేళ్ల క్రితం భారత్ బహుమతిగా ఇచ్చింది. ఆ నగరంలోని సెంట్రల్ పార్కులో ఏర్పాటు చేసిన ఈ విగ్రహం ఎప్పుడు ధ్వంసమయిందో స్పష్టంగా తెలియడం లేదు. అయితే జనవరి 27వ తేదీ ఉదయాన్నే విగ్రహం ముక్కలను చూసిన పార్కు ఉద్యోగి ఒకరు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విగ్రహం ఏర్పాటు చేస్తున్న సమయంలోనే ఆర్గనైజేషన్ ఫర్ మైనార్టీస్ ఇన్ ఇండియా (ఓఎఫ్ఎమ్ఐ) అనే సంస్థ వ్యతిరేకించి ఆందోళన చేసింది. అయితే నగర పాలక సంస్థ అనుకూలంగా తీర్మానించడంతో అడ్డంకులు తొలగాయి. ఈ సంఘటనను విద్వేషపూరిత నేరంగా పరిగణించి దర్యాప్తు చేయాలని హిందూ అమెరికన్ ఫౌండేషన్ డిమాండు చేసింది.

## బాగ్దాద్‌లో ఆత్మాహుతి బాంబు దాడులు

ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని 'బాబ్ అల్ షార్కి' మార్కెట్ ప్రాంతంలో జనవరి 21న జంట ఆత్మాహుతి బాంబు దాడులు జరగడంతో కనీసం 32 మంది మరణించారు. 110 మంది గాయపడ్డారు. ఈ పేలుళ్లకు ఇంతవరకు ఏ సంస్థ కూడా బాధ్యత తీసుకోలేదు. కానీ, అధికారులు మాత్రం ఇది ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్ర సంస్థ పనేనని ధ్రువీకరించారు. 2018లో అప్పటి ప్రధాని హైదర్ అల్ అబాదీ..ఇస్లామిక్ స్టేట్ మీద విజయం సాధించినప్పుడు కూడా సరిగ్గా ఇదే ప్రదేశంలో మానవ బాంబు పేలుడు జరిగింది. ఉనికి చాటుకోవడానికే ఇస్లామిక్ స్టేట్ సభ్యులు ఈ దారుణానికి పాల్పడ్డారని అధికారులు తెలిపారు.

## అమెరికాలో ఏడు రాష్ట్రాల్లో అత్యవసర పరిస్థితి



అమెరికాలోని దక్షిణాది రాష్ట్రాల్లో భారీగా కురుస్తున్న మంచుతో జనజీవనం అస్తవ్యస్తం అయింది. విమానాలను రద్దు చేశారు. ప్రజలు ఇళ్లలోంచి బయటకు రావడానికి వీల్లేకుండా రహదారులన్నీ మంచుతో కప్పేసి ఉన్నాయి. దాదాపుగా 15 కోట్ల మంది అమెరికన్లు మంచు ముప్పులో ఉన్నట్టుగా ది నేషనల్ వెదర్ సర్వీసెస్ హెచ్చరించింది. టెక్సాస్ చుట్టుపక్కల రాష్ట్రాల్లో 40 లక్షల మందికిపైగా అమెరికన్లు నీళ్లు, కరెంట్ లేక అల్లాడిపోతున్నారు. టెక్సాస్, అలబామా, ఒరెగాన్, ఒక్లహోమా, కాన్సస్, కెంటకీ, మిసిసిపీ రాష్ట్రాల్లో అత్యవసర పరిస్థితి విధించారు. టెక్సాస్‌లో పరిస్థితి మరీ ఘోరంగా మారిపోయింది. టెక్సాస్‌లోని కైల్, సౌత్ ఆస్టిన్ ప్రాంతాల్లో నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్టు స్థానిక వాటర్ బోర్డు ప్రకటించింది. విద్యుత్ ప్లాంట్లు సరిగా పని చేయడం లేదు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. టెక్సాస్ రాష్ట్ర గవర్నర్ నేషనల్ గార్డ్ సాయం కోరారు. కన్సాస్ రాష్ట్ర గవర్నర్ కరెంట్ పొదుపుగా వాడుకోవాలని పౌరులకు విజ్ఞప్తి చేశారు. ఇక కెంటకీలో మరింత బలంగా చలి గాలులు వీచే అవకాశం ఉండడంతో ప్రజలు ముందు జాగ్రత్త చర్యలన్నీ పాటించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ఇప్పటికీ 27 లక్షల మందికిపైగా ప్రజలు చీకట్లోనే మగ్గిపోతున్నారు. లూసియానా, డల్లాస్ రాష్ట్రాల్లోనూ మంచు బీభత్సం నెలకొంది. లూసియానాల్లోని దవాఖానల్లో చికిత్స పొందుతున్న రోగులకు మంచుగా మారిన నీటిని కాచి చలార్చి బాటిళ్లలో అందిస్తున్నారు. ఆర్కిటిక్ నుంచి వీస్తున్న బలమైన చలిగాలుల కారణంగా ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. నార్త్ కరోలినాలో టోర్నడోలకు ముగ్గురు మరణించారు.




https://ourstudycircle.in/upscpdf/

## జాతీయ ఓటర్ల దినోత్సవం (జనవరి 25)

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జనవరి 25న నిర్వహించారు. ఈ ఏడాది దినోత్సవం యొక్క థీమ్ 'Making Our Voters Empowered, Vigilant, Safe and Informed'. ఎన్నికల్లో యువత ఎక్కువగా పాల్గొనాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జనవరి 25ను జాతీయ ఓటర్ల దినోత్సవంగా ప్రకటించింది. దీన్ని 2011 నుంచి నిర్వహిస్తున్నారు.

## ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం (ఫిబ్రవరి 2)



ప్రపంచ మెట్ట భూముల దినోత్సవం/ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని ఫిబ్రవరి 2న నిర్వహించారు. ఏటా ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడి నేలల(వెట్‌ల్యాండ్స్) దినోత్సవాన్ని నిర్వహిస్తారు. 2021 ఏడాది ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం యొక్క థీమ్ – Wetlands and Water. పల్లపు తడిపొడి భూములనే 'చిత్తడి నేలలు' అంటారు. అనేక జీవజాతుల పరిరక్షణకు ఈ భూములు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రపంచంలో సుమారు 3 మిలియన్ ప్రజలు తాగు, సాగునీరు, జీవనోపాధికి ఈ భూములపైనే ఆధారపడుతున్నారు. భారతదేశంలో 18.4 శాతం మంది ప్రజలు చిత్తడి నేలలపై ఆధారపడుతున్నారని, 70 శాతం భూముల్లో వరిసాగు చేపడుతున్నట్లు అంచనా. ఇరాన్‌లోని రామ్‌సార్ నగరం సమీపంలోని కాస్పియన్ సముద్రం ఒడ్డున 1971 ఫిబ్రవరి రెండో తేదీ నాడు మేధావులు, పర్యావరణ వేత్తలు, ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు సమావేశమయ్యారు. వీరంతా తడి నేలల విస్తరణను, పర్యావరణంలో వాటి ప్రాధాన్యాన్ని అంచనా వేశారు. ఈ సమావేశంలో 150కిపైగా దేశాలు పాల్గొని చిత్తడి నేలల పరిరక్షణ ఆవశ్యకత పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెచ్చరికలు జారీ చేశాయి. భారతదేశంలో 25 సరస్సుల ప్రాంతాలను చిత్తడి నేలలుగా గుర్తించారు. వీటి పరిరక్షణ బాధ్యతను ఆయా రాష్ట్రాలకు అప్పగించారు. ప్రపంచ మెట్ట భూముల దినోత్సవాన్ని మొట్టమొదటిసారిగా ఇరాన్‌లోని రామ్‌సార్ నగరంలో 1997లో నిర్వహించారు.

## ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం (ఫిబ్రవరి 4)



ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని ఫిబ్రవరి 4న నిర్వహించారు. 2021 ఏడాది దినోత్సవం యొక్క థీమ్ - I am and I will.'యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ (యూఐసీసీ) వారు ప్రతి ఏటా ఫిబ్రవరి 4న క్యాన్సర్ దినోత్సవంగా జరిపి ప్రజలలోకి క్యాన్సర్ అవగాహనను తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారు. 2006 నుండి ఫిబ్రవరి 4న క్యాన్సర్ డే గా జరుపుతూ తగిన చర్యలు చేపట్టారు.


## ముఖ్యమైన దినోత్సవాలు - ఫిబ్రవరి

| | |
|---|---|
| ఫిబ్రవరి 1 | – కోస్ట్‌గార్డ్స్ డే |
| ఫిబ్రవరి 2 | – ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం |
| ఫిబ్రవరి 4 | – ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం |
| ఫిబ్రవరి 10 | – జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం |
| ఫిబ్రవరి 12 | – గులాబీల దినోత్సవం, భారత పర్యాటక అభివృద్ధి సంస్థ ఉత్పాదక దినోత్సవం |
| ఫిబ్రవరి 21 | – అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం |
| ఫిబ్రవరి 24 | – సెంట్రల్ ఎక్సైజ్ డే |
| ఫిబ్రవరి 28 | – టైలర్స్ డే, జాతీయ సైన్స్ డే (సీవీ రామన్ రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజు) |
| రెండో ఆదివారం | – ప్రపంచ వివాహ దినోత్సవం |

## జాతీయ మహిళా దినోత్సవం (ఫిబ్రవరి 13)

జాతీయ మహిళా దినోత్సవాన్ని ఫిబ్రవరి 13న నిర్వహించారు. భారతదేశ తొలి మహిళా గవర్నర్ సరోజిని నాయుడు జయంతి సందర్భంగా ఏటా ఫిబ్రవరి 13న జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నారు. సరోజిని నాయుడు 1879 ఫిబ్రవరి 13న హైదరాబాద్ నగరంలో జన్మించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు.

## అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం (ఫిబ్రవరి 21)




అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఫిబ్రవరి 21న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించారు. ఈ ఏడాది దినోత్సవం యొక్క థీమ్ Fostering multilingualism for inclusion in education and society". ఈ దినోత్సవాన్ని ప్రతి ఏటా యునెస్కో అధికారికంగా నిర్వహిస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో అనేక భాషలు అంతరించిపోతున్న ప్రస్తుత కాలంలో మాతృభాషల రక్షణకు ఇలాంటి దినోత్సవాలు ప్రోత్సాహాన్ని ఇస్తాయి. భారత్‌లో మాత్రం 'సెలబ్రేటింగ్ అవర్ మల్టీలింగ్వల్ హెరిటేజ్' అనే నినాదంతో ఈ ఏడాది దినోత్సవాన్ని నిర్వహించారు. యునెస్కో ప్రకారం ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 6000 భాషలు మాట్లాడుతున్నారు. వీటిలో 43 శాతం భాషలు అంతరించిపోయే దశలో ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి సాంస్కృతిక విషయాల సంస్థ యునెస్కో ఈ రోజును 17 నవంబర్ 1999న తొలిసారి ప్రకటించింది. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ కూడా ఈ విషయాన్ని ధృవీకరించి 2008ని అంతర్జాతీయ భాష సంవత్సరంగా ప్రకటించింది.



https://ourstudycircle.in/upscpdf/



# కరెంట్ అఫైర్స్ బిట్‌బ్యాంక్

1. 2021 ఫిబ్రవరి 7న ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లా జోషిమఠ్ సమీపంలో నందాదేవి పర్వతం నుంచి హఠాత్తుగా మంచు చరియలు విరిగి పడడంతో ఈ క్రింది ఏ నదులకు వరద పోటెత్తింది ?
   1. జీలం, బియాస్, చీనాబ్
   2. యమున, రిషిగంగ, గోమతీ
   3. అలకనంద, రిషిగంగ, ధౌలీగంగ
   4. అలకనంద, యమున, గండక్
2. ఇటీవల తెలుగును అధికార భాషగా గుర్తిస్తూ, తెలుగు వారికి అల్పసంఖ్యాక హోదా కల్పించిన రాష్ట్రం ఏది ?
   1. మిజోరాం 2. పశ్చిమబెంగాల్
   3. గుజరాత్ 4. ఉత్తరప్రదేశ్
3. రామసేతు ఎలా ఏర్పడింది? దాని వయసెంత? దాని నిర్మాణం ఎలా జరిగింది? తదితర విషయాలు తెలుసుకొనేందుకు చేపట్టిన ప్రాజెక్టును ఏ సంస్థ నిర్వహించనుంది?
   1. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ)
   2. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓల్డ్ సైన్సెస్
   3. ఇండియన్ గవర్నమెంట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
   4. సీఎస్ఐఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ-గోవా
4. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఇటీవల అదనపు బాధ్యతల కింద ఏ కేంద్రపాలిత ప్రాంత లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమించబడ్డారు?
   1. లడఖ్ 2. చండీఘడ్
   3. జమ్మూ & కశ్మీర్ 4. పుదుచ్చేరి
5. జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించే 60 సం॥రాల నాటి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించనున్నది అయితే దానిలో చేర్చిన కొత్త నిబంధన ఏది?
   1. రూ.1500 నుండి రూ.50,000 వరకు జరిమాన + 2 సం॥రాల జైలు శిక్ష
   2. రూ.70,000 జరిమానా, 3 ఏండ్ల జైలు శిక్ష
   3. రూ.750 నుండి రూ.75000 వరకు జరిమానా + ఏడేండ్ల వరకు జైలు శిక్ష
   4. రూ.25,000 నుండి రూ.70,000 వరకు జరిమానా + 3 సం॥రాల 6నెలల జైలు శిక్ష
6. క్రింది వానిలో సరికాని అంశం ఏది ?
   1. ఆయూష్ డాక్టర్లలో దేశంలో తెలంగాణ 10వ స్థానంలో నిలిచింది.
   2. ఎంతమంది జనాభాకు ఒక ప్రభుత్వ డాక్టర్ అందుబాటులో ఉన్నారనే నిష్పత్తిలో తెలంగాణ దేశంలో 15వ స్థానంలో నిలిచింది.
   3. జనాభాకు సరిపడా నర్సుల సంఖ్య విషయంలో దేశంలో తెలంగాణ 19వ స్థానంలో నిలిచింది.
   4. ఫార్మసిస్టుల సంఖ్యలో తెలంగాణ దేశంలో 4వ స్థానంలో నిలిచింది.
7. దేశంలో 17 పెద్ద రాష్ట్రాలలో కంప్యూటర్ ప్రయోగశాలలున్న పాఠశాలల సంఖ్యలో తెలంగాణ ఎన్నవ స్థానంలో నిలిచింది? (బిహార్ 10.70 స్కోర్‌తో చివరిదైన 17వ స్థానంలో నిలిచింది).
   1. 18.07 స్కోర్‌తో 12వ స్థానం
   2. 21.09 స్కోర్‌తో 8వ స్థానం
   3. 16.82 స్కోర్‌తో 14వ స్థానం
   4. 14.05 స్కోర్‌తో 16వ స్థానం
8. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "స్వదేశీ దర్శన్" పథకం కింద ఏ జిల్లాలో ఉన్న ప్రముఖ గోండు రాజుల కోటను రూ.3.92 కోట్లతో తెలంగాణ ప్రభుత్వం పునరుద్ధరించనున్నది?
   1. వరంగల్ జిల్లా ఎల్కతుర్తి
   2. ములుగు జిల్లా మేడారం
   3. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్
   4. ఖమ్మం జిల్లా కల్లూర్
9. తెలంగాణలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్-ఈడబ్ల్యూఎస్)కు విద్య, ఉద్యోగాలలో ఎంత శాతం రిజర్వేషన్ల అమలుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాధారణ పరిపాలన శాఖ ద్వారా ఫిబ్రవరి 8న ఉత్తర్వులు జారీ చేసింది?
   1. 15% 2. 10%
   3. 6% 4. 12%
10. దేశంలో తొలి జాతీయ సంకలిత తయారీ కేంద్రాన్ని (నేషనల్-సెంటర్ ఫర్ అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎన్‌కామ్) ఏ జిల్లాలో నెలకొల్పదానికి తెలంగాణ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది?
    1. వరంగల్ 2. కరీంనగర్
    3. హైదరాబాద్ 4. సిరిసిల్లా
11. "రాష్ట్రంలోని పంచాయతీల పరిశుభ్రత స్కోరు" అంశంలో జిల్లాల సరైన వరుసక్రమాన్ని గుర్తించండి?
    1. 1-వరంగల్ గ్రామీణం, 2-రంగారెడ్డి, 3-నిజామాబాద్
    2. 1-సిరిసిల్లా, 2-కరీంనగర్, 3-జగిత్యాల
    3. 1-జయశంకర్ భూపాలపల్లి, 2-గద్వాల్, 3-నిర్మల్
    4. 1-నల్గొండ, 2-వరంగల్ అర్బన్, 3-నిర్మల్
12. కేంద్ర ఆర్థికశాఖ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్ నిర్వహించిన విద్యుత్తు సంస్కరణలను అమల్లోకి తెచ్చిన రెండో రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచినా, మొదటి రాష్ట్రం ఏది?
    1. మధ్యప్రదేశ్ 2. రాజస్థాన్
    3. గుజరాత్ 4. తెలంగాణ



https://ourstudycircle.in/upscpdf/

13. "ఇంటి వద్దకే రేషన్ బియ్యం సరఫరా" చేసే అంశానికి సంబంధించి క్రింది వానిలో సరికాని అంశం ఏది?
   1. తొలుత గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించిన 2,503 వాహనాలను కృష్ణా జిల్లా విజయవాడ బెంజిసర్కిల్‌లో జనవరి 21న సీఎం వైయస్ జగన్ ప్రారంభించారు.
   2. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 9,260 వాహనాలు ప్రారంభమయ్యాయి. ఈ వాహనాలను 60% సబ్సిడీతో ప్రభుత్వం సమకూర్చింది.
   3. మొబైల్ వాహనం ద్వారా రోజుకు 90 కార్డులకు తగ్గకుండా 18 రోజుల పాటు కార్డుదారులకు పంపిణీ చేయాలి.
   4. ఒక్కో వాహనం విలువ రూ.6,41,000. వీటి అద్దెను ప్రభుత్వమే చెల్లిస్తూ జీవితకాలం వినియోగించనుంది.

14. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్ 2019-20కు గాను రూపొందించిన "సిస్టమాటిక్ ప్రోగ్రెసివ్ అండ్ రియల్ టైం (స్పార్క్)" ర్యాంకుల్లో మొదటి స్థానంలో నిలిచి అవార్డు దక్కించుకున్న రాష్ట్రం ఏది?
   1. ఆంధ్రప్రదేశ్ 2. తెలంగాణ
   3. తమిళనాడు 4. కేరళ

15. క్రింది అంశాలలో సరికానిది ఏది గుర్తించండి?
   1. పండ్ల ఉత్పత్తిలో ఏ.పి. అగ్రస్థానం, మహారాష్ట్ర 2వ స్థానం.
   2. పూల దిగుబడిలో ఏ.పి మొదటి స్థానం, తర్వాత కేరళ, తమిళనాడు నిలిచాయి.
   3. సూక్ష్మసేద్యంలో ఏపీది దేశంలోనే 2వ స్థానం, పాల దిగుబడిలో మాత్రం ఏపీ 4వ స్థానంలో నిలిచింది.
   4. కూరగాయల ఉత్పత్తిలో దేశంలోనే ఎ.పి.2వ స్థానంలో, వరి వంగడాల దిగుబడిలో మాత్రం ఎ.పి.3వ స్థానంలో నిలిచింది.

16. ప్రతి ఇంటికి నీరు (హర్ ఘర్ జల్)లో భాగంగా వందశాతం ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చిన రాష్ట్రాలుగా గోవా, తెలంగాణ దేశంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినా ఏ.పి. స్థానం ఎంత
   1. 10వ స్థానం 2. 14వ స్థానం
   3. 12వ స్థానం 4. 16వ స్థానం

17. స్టార్స్ (STARS) ప్రాజెక్టు గురించి క్రింది వానిలో సరికానిది ఏది?
   1. STARS - Strengthening Teaching Learning and results for state program.
   2. దేశంలోని ఆరు రాష్ట్రాల్లో విద్యా రంగాన్ని, ఉపాధ్యాయుల నాణ్యతా ప్రమాణాలను పెంచే సెంట్రల్ సెక్టార్ స్కీమ్
   3. ఒడిశా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర మరియు కేరళ అమలు చేయబడు రాష్ట్రాలు.
   4. Reserve Bank of India మరియు కేంద్ర ప్రభుత్వం కలిసి ఈ పథకానికి నిధులు అందిస్తున్నాయి.

18. దట్టమైన అడవుల్లో నక్సలైట్లను ఎదుర్కొనేందుకు CRPF లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమెండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్ (కోబ్రా) దళంలో తొలిసారిగా 34 మంది మహిళా సిబ్బంది చేరారు. అయితే ప్రస్తుత CRPF డీజీగా ఎవరున్నారు ?
   1. కుల్‌దీప్ సింగ్ 2. ఏ.పీ.మహేశ్వరి
   3. సుధాన్షు రాయ్ 4. సంజయ్ చందర్

19. స్వాతంత్రోద్యమంలో ముఖ్యమైన 'చౌరీ చౌరా' ఘటన జరిగి వందేళ్ల పూర్తయిన తరుణాన వీర మరణం పొందిన వారి జ్ఞాపకార్థం యూ.పీ ప్రభుత్వం గోరఖ్‌పూర్‌లో నిర్వహించిన శతాబ్ది ఉత్సవాలను ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల ప్రారంభించారు అయితే చౌరీ చౌరా ఘటన జరిగిన సంవత్సరం ఏది?
   1. 1920 జనవరి 28న 2. 1922 మార్చి 4న
   3. 1922 ఫిబ్రవరి 4న 4. 1920 ఫిబ్రవరి 22న

20. 2020వ సంవత్సరంలో హిందీ భాషలో అత్యంత పాపులర్ అయిన పదంగా ఆక్స్‌ఫర్డ్ హిందీ విభాగం వారు ఏ పదాన్ని ఎంపిక చేశారు?
   1. దేశ్ భరోసా 2. ఆత్మనిర్భరత
   3. నిర్భయ్ 4. సంవిధాన్

21. ప్రపంచ ఆరోగ్య సంస్థ భారత్‌ను పోలియో రహిత దేశంగా ఏ సంవత్సరంలో ప్రకటించింది? (2020 జనవరి 30న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పల్స్ పోలియో-2021 కార్యక్రమాన్ని ప్రారంభించారు.
   1. 2014 2. 2012
   3. 2016 4. 2010

22. రైలు ప్రయాణీకుల సౌకర్యార్థం రైల్వే భద్రతా హెల్ప్‌లైన్ నంబరు 182ని రైలు మదద్ నంబర్ అయిన ఎందులో విలీనం చేసినట్లు ఆ శాఖ పేర్కొంది?
   1. 1072 2. 669
   3. 139 4. 1323

23. "ఫాస్టాగ్ తప్పనిసరి" విధానం దేశ వ్యాప్తంగా ఏ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది?
   1. 2020 ఫిబ్రవరి 15 2. 2020 మార్చి 3
   3. 2020 జనవరి 26 4. 2020 ఫిబ్రవరి 1

24. రైలు టెర్మినళ్ల వద్ద వ్యాపారాన్ని ప్రారంభించేందుకు రైల్వేశాఖ ఏ పేరుతో కొత్త పథకాన్ని తీసుకు రానుంది?
   1. సర్వీస్ మార్కెట్ ఎట్ రైల్ టెర్మినల్స్
   2. ఫ్లాట్‌ఫామ్ పర్చేజింగ్
   3. రైల్ అండ్ బయ్యింగ్ ఫెయిర్
   4. రిటైల్ సర్వీస్ ఇన్ ట్రైన్ టెర్మినల్స్

25. దేశ వ్యాప్తంగా ఉన్న 62 కంటోన్మెంట్ బోర్డుల్లో నివసిస్తున్న ప్రజలకు ఆన్‌లైన్ ద్వారా పౌర సేవలు అందించేందుకు కేంద్ర రక్షణ శాఖ ఏ మొబైల్ యాప్‌ను తీసుకొచ్చింది?
   1. ఈ-పౌరసేవ్ పోర్టల్ 2. ఈ-సెంట్రల్ కంటోన్మెంట్
   3. ఈ-కంటోన్మెంట్ పరివార్ 4. ఈ-ఛావనీ పోర్టల్

26. తెలంగాణ రాష్ట్రంలో 2020లో వాయు కాలుష్యం విషయంలో వివిధ ఏరియాల వరుస క్రమాన్ని గుర్తించండి?
   1. 1-మహబూబ్‌నగర్, 2-నిర్మల్, 3-యాదాద్రి, 4-హైదరాబాద్
   2. 1-వరంగల్ అర్బన్, 2-జగిత్యాల, 3-ఖానాపూర్, 4-లక్సెట్టిపేట
   3. 1-హైదరాబాద్, 2-భువనగిరి, 3-సికింద్రాబాద్, 4-గజ్వేల్
   4. 1-మహబూబ్‌నగర్, 2-కరీంనగర్, 3-రామగుండం, 4-మెదక్



https://ourstudycircle.in/upscpdf/

27. క్రింది వాటిని జతపరుచుము?

1) జాతీయ ఓటర్ల దినోత్సవం — ఎ) ఫిబ్రవరి - 4
2) అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం — బి) ఫిబ్రవరి - 2
3) ప్రపంచ చిత్తడి నేలల దినం — సి) ఫిబ్రవరి - 21
4) ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం — డి) జనవరి - 25

1. 1-ఎ, 2-డి, 3-బి, 4-సి
2. 1-బి, 2-ఎ, 3-డి, 4-సి
3. 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
4. 1-సి, 2-బి, 3-ఎ, 4-డి

28. ఎన్నికల్లో యువత ఎక్కువగా పాల్గొనాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జాతీయ ఓటర్ల దినోత్సవం-2021ని ఏ ఇతివృత్తంతో నిర్వహించింది?

1. Electroal Literacy for stronger Democracy
2. Empowering Young and Future Voters
3. Making our voters empowered, vigilant, safe and imformed
4. No voter to be left behind

29. క్రింది వానిలో సరికానిది ఏది?

1. అంతర్జాతీయ మాతృభాషా దినం-2021 థీమ్ : Fostering Multilingualism for inclusion in education and society.
2. వరల్డ్ క్యాన్సర్ డే -2021 థీమ్ : I am and I will.
3. వరల్డ్ వెట్ల్యాండ్స్ డే -2021 థీమ్ : Wetlands and water
4. నేషనల్ సైన్స్‌డే -2021 థీమ్ : Science in Covid-19 Pandemic

30. క్రింది వానిలో ఆర్థిక సర్వే 2021 ప్రకారం సరియైన ప్రకటనను ఎంచుకోండి?

ఎ) ఎకనమిక్ సర్వే 2021 ప్రజారోగ్య వ్యయం జీడీపీలో 1% నుండి 2.5% వరకు పెరిగింది.

బి) జాతీయ ఆర్యోగమిషన్‌కు ప్రాధాన్యత ఇవ్వడం కొనసాగించాలని సర్వే పేర్కొంది.

1. ఎ మాత్రమే సరియైనది
2. బి మాత్రమే సరియైనది
3. ఎ & బి సరియైనవి
4. పై రెండు సరియైనవి కావు

31. 2021, ఎకనామిక్ సర్వే ప్రకారం కోవిడ్-19 రికవరీ మరియు దాని వలన మరణించిన వారి కేసులలో అత్యల్ప ప్రదర్శన పొందిన రాష్ట్రం ఏది?

1. ఉత్తరప్రదేశ్
2. మహారాష్ట్ర
3. మధ్యప్రదేశ్
4. బిహార్

32. సాధారణంగా పార్లమెంట్‌లో ఆర్థిక సర్వే ఎప్పుడు ప్రవేశ పెట్టబడుతుంది?

1. బడ్జెట్‌కు ముందు పనిదినం
2. బడ్జెట్‌కు వారం ముందు
3. బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత పనిదినం
4. సంవత్సరంలో ఎప్పుడైనా

33. భారతదేశంలో తయారు చేసిన కరోనా వ్యాక్సిన్‌ను పొరుగు, మిత్రదేశాలకు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన కార్యక్రమాన్ని ఏ పేరుతో 2021 జనవరి 20న భారత ప్రభుత్వం ప్రారంభించింది ?

1. వ్యాక్సిన్ అభయ్
2. వ్యాక్సిన్ రక్షక్
3. వ్యాక్సిన్ మైత్రి
4. వ్యాక్సిన్ స్వామిత్ర

34. వినోద టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యే కార్యక్రమాలను పర్యవేక్షించడానికి ఏర్పాటైన బ్రాడ్‌కాస్టింగ్ కంటెంట్ కంప్లైంట్స్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు ?

1. జస్టిస్ పుష్పాగనెడివాలా
2. జస్టిస్ గీతా మిత్తల్
3. జస్టిస్ రోహిణి
4. జస్టిస్ ఇందిరా బెనర్జీ

35. 2021 ఫిబ్రవరి 10న ముంబాయిలో జరిగిన వీఎల్‌సీసీ ఫెమినా మిస్ ఇండియా వరల్డ్-2020 పోటీల్లో ఈ క్రింది వారిలో ఎవరు విజేతగా నిలిచారు ?

1. మాన్యసింగ్ (ఉత్తరప్రదేశ్)
2. సుమన్‌రావు (ఆంధ్రప్రదేశ్)
3. మానిక శికంద్ (హర్యానా)
4. మానస వారాణాసి (తెలంగాణ)

36. భారత్, ఫ్రాన్స్ వాయుసేన అంతరిక్ష దళాలు 2021 జనవరి 21 నుంచి 24 వరకు రాజస్థాన్‌లోని జోద్‌పూర్‌లో ఏ పేరుతో సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహించాయి ?

1. జిమెక్స్-21
2. బొంగోసాగర్-21
3. దెసర్ట్‌నైట్-21
4. యుద్ధ అభ్యాస్-21

37. 2021 జనవరి 20న భారతప్రభుత్వం ప్రారంభించిన "వాక్సిన్ మైత్రి కార్యక్రమములో భాగంగా భారత్ నుంచి స్నేహపూర్వక వ్యాక్సిన్ బహుమతిని పొందినా తొలి దేశం ఏది ?

1. బంగ్లాదేశ్
2. బ్రెజిల్
3. శ్రీలంక
4. భూటాన్

38. క్రింది వాటిని జతపరచండి :

| జాబితా-1 | జాబితా-2 |
|---|---|
| 1. అమెరికా తొలి మహిళా ఆర్థిక మంత్రి | ఎ. జస్టిస్ పులిగోరు వెంకట సంజయ్ కుమార్ |
| 2. సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ | బి. అజయ్‌సింగ్ |
| 3. భారత బాక్సింగ్ సమాఖ్య అధ్యక్షుడు | సి. ప్రవీణ్ సిన్హా |
| 4. ఆర్సెలార్ సీఈవో | డి. జానెట్ యెల్లెన్ |
| 5. మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి | ఇ. ఆదిత్య మిట్టల్ |

సరియైన జవాబును ఎంపిక చేయండి ?

1. 1-ఎ, 2-బి, 3-సి, 4-డి, 5-ఎ
2. 1-డి, 2-బి, 3-ఇ 4-సి, 5-ఎ
3. 1-డి, 2-ఎ, 3-బి, 4-ఇ, 5-సి
4. 1-డి, 2-సి, 3-బి, 4-ఇ, 5-ఎ

39. కాబూల్ నగరానికి నీటిని సరఫరా చేయడానికి ఉద్దేశించిన ఏ ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అవగాహన పత్రం భారత్, ఆఫ్ఘనిస్థాన్‌ల మధ్య 2021 ఫిబ్రవరి 9న కుదిరింది ?

1. సల్మా ఆనకట్ట
2. తిపై ముఖ్దాం ఆనకట్ట
3. శతూత్ ఆనకట్ట
4. గండక్ ఆనకట్ట

40. ప్రముఖ అంతర్జాతీయ పత్రిక ఫోర్బ్స్ తాజాగా ప్రకటించిన '30 అండర్ 30' జాబితాలో తెలంగాణ నుంచి ఇటీవల ఎవరికి చోటు దక్కింది ?

1. ప్రియాంక దాస్
2. కొత్త కీర్తిరెడ్డి
3. నిహారిక రావు
4. మాళవిక మనోజ్

41. 2021 జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఉత్తరాఖండ్ రాష్ట్రానికి ఒక రోజు ముఖ్యమంత్రిగా ఈ క్రింద తెలుపబడిన వారిలో ఎవరు వ్యవహరించారు ?

1. సృష్టి సింగ్
2. మాన్య సింగ్
3. మానిక శికంద్
4. సృష్టి గోస్వామి



https://ourstudycircle.in/upscpdf/

42. పరమహంస యోగానంద రాసిన "యాన్ ఆటో బయోగ్రఫీ ఆఫ్ సెయింట్" అనే పుస్తకాన్ని తెలుగులో "ఒక యోగి ఆత్మకథ" పేరుతో ఎవరు అనువదించారు ?

1. బండి నారాయణ స్వామి   2. సన్నపునేని వెంకట రామిరెడ్డి
3. పోరంకి దక్షిణామూర్తి   4. అన్నవరం దేవేందర్

43. చిన్నారులపై జరిగిన లైంగిక నేరాలకు సంబంధించిన కేసుల్లో వరుసగా వివాదాస్పద తీర్పులిచ్చి సంచలనం రేపిన బాంబే హైకోర్టు నాగపూర్ బెంచ్ ఏ మహిళా న్యాయమూర్తి పదోన్నతి నిర్ణయాన్ని సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల ఉపసంహరించుకొంది?

1. ఇందూ మల్హోత్రా   2. పుష్ప వీరేంద్ర గనేడివాలా
3. గీతా మిత్తల్   4. కుమారి హిమా గనేడివాలా

44. కోవిడ్-19 పరిస్థితుల్లో కాంటాక్ట్‌లెస్ వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు భారతదేశంలోనే ఈ-బోర్డింగ్ సదుపాయం కల్పించిన తొలి విమానాశ్రయంగా ఇటీవల ఏ ఎయిర్ పోర్టు ఈ ఘనత సాధించింది?

1. గన్నవరం ఎయిర్‌పోర్టు (విజయవాడ)
2. కెంపెగౌడ ఎయిర్‌పోర్టు (బెంగుళూరు)
3. శంషాబాద్ ఎయిర్‌పోర్టు (హైదరాబాద్)
4. ఛత్రపతి శివాజీ మహరాజ్ ఎయిర్‌పోర్టు (ముంబయి)

45. కింది వాటిని జతపరచండి:

| లిస్ట్ -1 | లిస్ట్ -2 |
|---|---|
| 1. అమెజాన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి | ఎ) జనరల్ లాయిడ్ ఆస్టిన్ |
| 2. విశ్వ పౌరసత్వ రాయబారి | బి) గద్వాల విజయలక్ష్మి |
| 3. జీహెచ్ఎంసి 26వ మేయర్ | సి) ఆండి జాస్సీ |
| 4. అమెరికా రక్షణ మంత్రి | డి) శ్రీశ్రీ రవిశంకర్ |

సరియైన జవాబును గుర్తించండి?

1. 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
2. 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
3. 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
4. 1-ఎ, 2-డి, 3-సి, 4-బి

46. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) డైరెక్టర్ జనరల్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?

1. జి.నరేంద్రకుమార్   2. తాడిలక్ష్మి నారాయణరెడ్డి
3. సాగర్ హనుమాన్ సింగ్   4. పట్టాభి యాదిరెడ్డి

47. ప్రపంచంలో అత్యంత విలువైన ఐటీ సర్వీసెస్ బ్రాండ్ల జాబితాలో ఐబీఎం (ఇంటర్నేషనల్ బిజినెస్ మెషీన్స్) ద్వితీయ స్థానంలో, టీసీఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) తృతీయ స్థానంలో నిలవగా మొదటి స్థానంలో నిలిచిన సంస్థ ఏది?

1. విప్రో   2. యాక్సెంచర్
3. కాగ్నిజెంట్   4. ఇన్ఫోసిస్

48. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన అమెరికా బోస్టన్‌లోని "ది ఇండస్ ఎంటర్ ప్రెన్యూవర్స్" (టై) గ్లోబల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఛైర్మన్‌గా ఇటీవల ఎవరు ఎంపికయ్యారు?

1. ప్రేమ్ కుమార్ ఇస్లావత్   2. సాయికుమార్ చింతల
3. పవన్‌కుమార్ చందనా   4. ప్రవీణ్ తైలం

49. గూగుల్ మ్యాప్స్‌కు ప్రత్యామ్నాయంగా, పూర్తి స్వదేశీ సాంకేతికతతో భారతీయులకు నావిగేషన్, మ్యాప్స్ సేవలను అందించేందుకు "మ్యాప్ మై ఇండియా" ఇటీవల ఏ సంస్థతో ఏంఓయూ కుదుర్చుకుంది ?

1. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)
2. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)
3. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఇసీఐఎల్)
4. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బిహెచ్ఇఎల్)

50. ది ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) రూపొందించిన ప్రజాస్వామ్య సూచీ-2020 ప్రపంచ ర్యాంకుల్లో నార్వే మొదటి స్థానంలో, ఉత్తర కొరియా చివరి స్థానంలో నిలవగా భారతదేశం ఏ స్థానంలో నిలిచింది?

1. 52   2. 53
3. 54   4. 55

51. ఈ క్రింది వానిలో సరికానిది ఏది?

1. 2021వ సంవత్సరంలో భారతదేశం 7.3 శాతం వృద్ధిరేటును సాధిస్తుందని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది.
2. ఫిక్కి సర్వే సంస్థ 2021లో భారతదేశ వృద్ధిరేటు 9.6 శాతం ఉంటుందని పేర్కొంది.
3. 2021లో భారతదేశం 11.5 శాతం వృద్ధిరేటు నమోదు చేయొచ్చని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) అంచనా వేసింది.
4. 2021లో చైనా 8.1 శాతం వృద్ధితో ప్రపంచంలోనే రెండోస్థానంలో నిలుస్తుందని ఐఎంఎఫ్ పేర్కొంది.

52. 2021 జనవరి 21న రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా విడుదల చేసిన నెలవారీ బులిటెన్‌లో భారతదేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, చిన్న తరహా బ్యాంకులు మొత్తం ఎన్ని ఉన్నాయి?

1. 1,28,014   2. 1,26,014
3. 1,29,014   4. 1,27,014

53. యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యూఎన్‌సీటీఏడి)-2020 నివేదికలో భారతదేశానికి వచ్చిన ఎఫ్‌డీఐలలో ఎంతశాతం వృద్ధి నమోదైంది?

1. 12 శాతం   2. 13 శాతం
3. 14 శాతం   4. 15 శాతం

54. ఈ క్రింది వాటిలో సరికాని జతను గుర్తించండి?

1. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా యాక్టింగ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ – భవ్యాలాల్
2. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రధాన వైద్యాధికారి – ప్రితేష్ గాంధీ
3. ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారికి సలహాదారుడు – రాజ్ పంజాబీ
4. వినియోగదారుల ఆర్థిక పరిరక్షణ మండలి ఛైర్మన్–రోహిత్ చోప్రా

55. 2021 ఫిబ్రవరి 6న కర్ణాటకలోని మంగళూరు సమీపం ముల్కి వద్ద నిర్వహించిన కంబళ పరుగు పందెంలో బైందూరు విశ్వనాథ్ వంద మీటర్ల మార్గాన్ని ఎన్ని సెకన్లలో చేరుకున్నాడు?

1. 9.10 సెకన్లు   2. 9.15 సెకన్లు
3. 9.22 సెకన్లు   4. 9.12 సెకన్లు



https://ourstudycircle.in/upscpdf/

56. కమలా హారిస్ గౌరవార్థం వివక్షపై ఆమె సాధించిన విజయాలకు సూచికగా అద్దంతో ప్రత్యేకంగా రూపొందించిన ఆమె చిత్రపటాన్ని వాషింగ్టన్‌లోని లింకన్ స్మారక చిహ్నం వద్ద ఏర్పాటు చేశారు. అయితే దీనిని రూపొందించిన కళాకారుడి పేరు ఏమిటి?
1. సైమన్ అలెక్సీ 2. ఆంటోనీ బ్లింకెన్
3. రాజా కృష్ణమూర్తి 4. సైమన్ బెర్జర్

57. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ (టీఐ) విడుదల చేసిన అవినీతి సూచీ-2020లో భారతదేశం ఎన్నవ స్థానంలో నిలిచింది?
1. 85వ 2. 87వ
3. 86వ 4. 88వ

58. 2021 జనవరి 28న ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ విడుదల చేసిన "ఆసియా-పసిఫిక్ పర్సనలైజ్డ్ హెల్త్ ఇండెక్స్" లో మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్న దేశాలను వరుసక్రమంలో గుర్తించండి?
1. ఆస్ట్రేలియా, తైవాన్, జపాన్
2. ఆస్ట్రేలియా, తైవాన్ మలేషియా
3. సింగపూర్, తైవాన్, ఇండియా
4. సింగపూర్, తైవాన్, జపాన్

59. ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ-2021 ఫిబ్రవరి 9న విడుదల చేసిన ఇండియా ఎనర్జీ అవుట్‌లుక్-2021 నివేదికలో భారతదేశం ఇంధన వినియోగంలో నాలుగో స్థానంలో ఉండగా, తొలి రెండు స్థానాల్లో నిలిచిన దేశాలేవి?
1. చైనా, కెనడా 2. చైనా, అమెరికా
3. చైనా, జపాన్ 4. చైనా, ఫ్రాన్స్

60. 2021 జనవరి 28న టాటా ట్రస్ట్ "2వ ఇండియా జస్టిస్ రిపోర్టు జాబితాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 12వ ర్యాంకు పొందగా, తొలి మూడు స్థానాల్లో ఉన్న రాష్ట్రాలేవి?
1. మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ
2. మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ
3. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ
4. మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక

61. ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ విడుదల చేసిన వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ సూచీలో భారతదేశం 11 ఆసియా పసిఫిక్ దేశాల్లో ఎన్నవ స్థానంలో నిలిచింది?
1. 11వ 2. 9వ
3. 10వ 4. 8వ

62. కోవోవ్యాక్స్ బ్రాండ్ పేరుతో కొత్త కోవిడ్-19 వ్యాక్సిన్‌ను 2021 జూన్ నాటికి విడుదల చేయబోతున్నట్లు ఏ భారతీయ సంస్థ ఇటీవల ప్రకటించింది?
1. బయోకాన్
2. డాక్టర్ రెడ్డీస్
3. సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా
4. సన్ ఫార్మా

63. క్రింది వాటిలో సరియైన వాటిని గుర్తించండి?
1. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన అత్యాధునిక అర్జున్ యుద్ధ ట్యాంక్ మార్క్-1ఏ ను ఫిబ్రవరి 14న ప్రధాని నరేంద్రమోడీ భారతీయ సైన్యానికి అప్పగించారు.
2. ఈ ట్యాంక్‌ను డీఆర్‌డీఓ చెన్నై విభాగంలోని కంబాట్ వెహికల్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ అభివృద్ధి చేసింది.
1. 1 మాత్రమే సరియైనది 2. 2 మాత్రమే సరియైనది
3. 1 & 2 సరియైనవి 4. పైవన్నీ సరియైనవి కావు

64. జీవ కణాల్లోని మైటోకాండ్రియాకు అతుక్కుపోయి వెలుగులు విరజిమ్మే ప్రత్యేక ఫ్లూరోఫోర్స్ తయారీలో విజయం సాధించిన సంస్థ ఏది?
1. Indian Institute of Chemical Technology (Hyd)
2. National Institute of Nutrition (Hyd)
3. Centre for cellular and molecular Biology (Hyd)
4. National Geophysical Research Institute (Hyd)

65. పిడుగుపాటుపై పరిశోధనకు దేశంలో తొలిసారిగా ప్రయోగ వేదికను భారత వాతావరణ విభాగం (ఐఎండీ) డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర ఎక్కడ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు?
1. తమిళనాడులోని ధర్మపురి
2. ఉత్తరప్రదేశ్‌లోని బల్‌రాంపూర్
3. మధ్యప్రదేశ్‌లోని బాల్‌ఘాట్
4. ఒడిశాలోని బాలేశ్వర్

66. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ క్షతగాత్రులను తరలించడం కోసం 'రక్షిత' బైక్ అంబులెన్స్‌లను డీఆర్‌డీవోకు చెందిన ఏ సంస్థ అభివృద్ధి చేసింది?
1. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ మెడిసిన్ అండ్ అలైడ్ సైన్సెస్
2. కంబాట్ వెహికల్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్
3. డిఫెన్స్ రీసెర్చ్ లాబోరేటరీ
4. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబోరేటరీ

67. ఉయిఘర్ ముస్లింలు, కరోనా మహమ్మారికి సంబంధించిన కథనాలను పక్షపాత ధోరణితో ప్రసారం చేస్తోందని భావించి బీబీసీ వరల్డ్ న్యూస్ ప్రసారాలను నిలిపివేస్తున్నట్లు ఇటీవల ఏ దేశం ప్రకటించింది?
1. ఇరాక్ 2. ఉత్తరకొరియా
3. చైనా 4. ఇరాన్

68. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం 2021ని ఏ అంతర్జాతీయ సంవత్సరంగా ప్రకటిస్తూ ఫిబ్రవరి 3న తీర్మానం చేసింది?
1. ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ ఆర్టిసేనల్ ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్
2. ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ ది నర్సు మరియు మంత్రసాని
3. ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మోడరేషన్
4. ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ ఫ్రూట్స్ మరియు వెజిటేబుల్స్

69. ప్రజల్లో ఒంటరితనాన్ని పోగొట్టి వారిలో ఆత్మవిశ్వాసం నింపడం కోసం ఏ దేశ ప్రభుత్వం 'మినిస్ట్రీ ఆఫ్ లోన్లీనెస్' పేరుతో మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసింది?
1. జర్మనీ 2. జపాన్
3. ఆస్ట్రేలియా 4. దక్షిణాఫ్రికా


https://ourstudycircle.in/upscpdf/

70. ఏ దేశం ఇటీవల పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్‌లో జైష్-ఉల్-అదల్ ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్ చేపట్టింది?

1. ఇరాన్ 2. చైనా
3. అమెరికా 4. ఆఫ్ఘనిస్థాన్

71. క్రింది వానిలో సరియైన వాక్యాన్ని గుర్తించండి?

ఎ) కరోనా వైరస్ ఎక్కడ పుట్టిందన్న విషయాన్ని నిర్ధారించేందుకు ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేసిన 14 మంది సభ్యుల నిపుణుల బృందం చైనాలోని హూనన్ సీ ఫుడ్ మార్కెట్‌ను సందర్శించింది.

బి) అమెరికా చరిత్రలో రెండుసార్లు అభిశంసన విచారణ ఎదుర్కొన్న తొలి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.

1. ఎ మాత్రమే సరైనది 2. బి మాత్రమే సరైనది
3. ఎ & బి సరైనవి 4. పైవన్నీ సరియైనవి కావు

72. జనవరి 2021లో జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీని ఏ జట్టు గెలుచుకుంది?

1. బరోడా 2. హిమాచల్ ప్రదేశ్
3. తమిళనాడు 4. బెంగాల్

73. జాతీయ మహిళా కమిషన్ 29వ వార్షికోత్సవం సందర్భంగా లాక్‌డౌన్ కాలంలో సేవలు అందించిన మహిళా యోధులకు జాతీయ మహిళా కమిషన్ కరోనా వారియర్స్ పురస్కారాలను ప్రదానం చేసింది. ఈ పురస్కారాలను అందుకున్న తెలంగాణకు చెందిన మహిళలు ఎవరు?

1. రాజకుమారి, సుమతి, నందిని
2. సుమతి, చంద్రకళ, మారుతమ్మ
3. రాజకుమారి, సునీత, పద్మిని
4. విజయలక్ష్మీ, చంద్రకళ, నందిని

74. రిపబ్లిక్ డే పరేడ్ 2021లో పాల్గొన్న 32 శకటాల్లో ప్రథమ బహుమతి పొందిన రాష్ట్రం?

1. త్రిపుర 2. ఉత్తరాఖండ్
3. ఉత్తరప్రదేశ్ 4. గోవా

75. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) జనవరి 2021 నుండి తొలిసారిగా ప్రవేశపెట్టిన "ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్" అవార్డును దక్కించుకున్న మెన్స్ క్రికెటర్ ఎవరు?

1. రవిచంద్రన్ అశ్విన్ 2. జోరూట్
3. స్టీవ్ స్మిత్ 4. రిషబ్‌పంత్

76. స్కోచ్ గ్రూప్ దేశవ్యాప్తంగా నిర్వహించిన అధ్యయనం ప్రకారం "సీఎం ఆఫ్ ద ఇయర్" అవార్డుకు ఎంపికైన ముఖ్యమంత్రి?

1. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 2. మమతా బెనర్జీ
3. వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి 4. యోగి ఆదిత్యనాథ్

77. క్రింది వానిలో సరికాని వాక్యాన్ని గుర్తించండి?

1. ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) అధ్యక్షునిగా జనవరి 31న బీసీసీఐ కార్యదర్శి జైషా ఎన్నికయ్యాడు.
2. 36వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2021లో తెలుగు రాష్ట్రాలకు చెందిన యశ్వంత్ కుమార్ అగసారా నందిని ఉత్తమ అథ్లెట్ అవార్డులు గెలుచుకున్నారు.
3. ఐసీసీ తొలిసారిగా ప్రవేశపెట్టిన "ప్లేయర్ ఆఫ్ ది మంత్" అవార్డుకు మహిళ విభాగం నుంచి దక్షిణాఫ్రికా బౌలర్ షబ్నిమ్ ఇస్మాయిల్ ఎంపికైంది.
4. టీ20 ఫార్మాట్‌లో 100 విజయాలు సాధించిన తొలి క్రికెట్ జట్టుగా భారత్ జట్టు నిలిచింది.

78. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా భూమి మీదనే అత్యంత పురాతన జంతువు డికిన్సోనియా అవశేషాలను భీమ్‌బేట్కా గుహల్లో కనుగొన్నారు. అయితే భీమ్‌బేట్కా గుహాలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?

1. ఉత్తరప్రదేశ్ 2. మహారాష్ట్ర
3. మధ్యప్రదేశ్ 4. ఛత్తీస్‌ఘడ్

79. 2021-22 ఆర్థిక సంవత్సరానికి గాను రైల్వే రంగానికి ఎన్ని కోట్ల రూపాయల బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు?

1. రూ.1,10,066 కోట్లు 2. రూ.1,09,055 కోట్లు
3. రూ:1,10,055 కోట్లు 4. రూ.1,08,055 కోట్లు

80. కింది వాటిని జతపరచండి :

**1. సమగ్ర శిక్షణ అభియాన్** — **ఎ) రూ.65,000 కోట్లు**
**2. రక్షణ రంగం** — **బి) రూ.73,000 కోట్లు**
**3. పీఎం కిసాన్ పథకం** — **సి) రూ.19,500 కోట్లు**
**4. పీఎంఏవై** — **డి) రూ.4,78,000 కోట్లు**
**5. ఎంజీఎన్ఆర్ఈజీఏ** — **ఇ) రూ.31,050.16 కోట్లు**

1. 1-ఎ, 2-బి, 3-సి, 4-డి, 5-ఇ
2. 1-ఇ, 2-డి, 3-ఎ, 4-సి, 5-బి
3. 1-ఇ, 2-డి, 3-ఎ, 4-బి, 5-సి
4. 1-ఇ, 2-ఎ, 3-డి, 4-సి, 5-బి

## KEY

| | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1) 3 | 2) 2 | 3) 4 | 4) 4 | 5) 3 | 6) 4 | 7) 4 | 8) 3 | 9) 2 | 10) 3 | 11) 1 | 12) 1 | 13) 4 |
| 14) 1 | 15) 4 | 16) 2 | 17) 4 | 18) 2 | 19) 3 | 20) 2 | 21) 1 | 22) 3 | 23) 1 | 24) 1 | 25) 4 | 26) 4 |
| 27) 3 | 28) 3 | 29) 4 | 30) 3 | 31) 2 | 32) 1 | 33) 3 | 34) 2 | 35) 4 | 36) 3 | 37) 4 | 38) 4 | 39) 3 |
| 40) 2 | 41) 4 | 42) 3 | 43) 2 | 44) 3 | 45) 1 | 46) 3 | 47) 2 | 48) 4 | 49) 1 | 50) 2 | 51) 2 | 52) 4 |
| 53) 2 | 54) 3 | 55) 2 | 56) 4 | 57) 3 | 58) 4 | 59) 2 | 60) 1 | 61) 3 | 62) 3 | 63) 3 | 64) 1 | 65) 4 |
| 66) 1 | 67) 3 | 68) 4 | 69) 2 | 70) 1 | 71) 2 | 72) 3 | 73) 2 | 74) 3 | 75) 4 | 76) 3 | 77) 4 | 78) 3 |
| 79) 3 | 80) 2 | | | | | | | | | | | |

Printed, Published by SAYYAD RAJA on behalf of SAEED PUBLICATIONS, Owned by SAEED PUBLICATIONS, Printed at Sri Charan Offset Printers, # 1-178/A, Chikkadpally, Near RTC 'X' Roads, Hyderabad-20, Telangana. Published from : SAEED PUBLICATIONS, Flat No.101, D.M Estate, Street No.8, Himayathnagar, Hyderabad-500029. Editor : SAYYAD RAJA, RNI No. TELTEL/2014/57442.



https://ourstudycircle.in/upscpdf/

# GROUP-II
## Online Course

**APPSC**
Rs. 6,499/- (+ GST)

**TSPSC**
Rs. 6,499/- (+ GST)

@SHINE INDIA ACADEMY APP

# సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్
# పోలీస్ కానిస్టేబుల్
## Online Course



**Arithmetic, Reasoning Pure Maths**

తెలుగు మీడియం / ఇంగ్లీష్ మీడియం

By Vijay Prasad Sir

(Course Validity One Year)

@ 999/-

@SHINE INDIA ACADEMY APP (+ GST)

Ph : 9652503914

# షైన్ ఇండియా పోలీస్ అకాడమి



Opp. Piller No. 1548, Beside Saroornagar Police Station, Dilsukhnagar, Hyderabad.



సయీద్ సర్

**మా ప్రత్యేకతలు :**

- జనరల్ స్టడీస్, సీనియర్ మోస్ట్ ఫ్యాకల్టీలచే బోధన
- తెలుగు & ఇంగ్లీష్ మీడియం వేరు వేరు బ్యాచ్‌లు
- Intensive & జనరల్ బ్యాచెస్ కలవు
- ఇద్దరు P.E.T ల సమక్షంలో గ్రౌండ్ ప్రాక్టీస్ నిర్వహణ
- రోజు సాయంత్రం చాప్టర్‌వైజ్ పరీక్షలు
- ప్రిలిమ్స్, మెయిన్స్ తరహాలో ఆదివారము గ్రాండ్ టెస్టుల నిర్వహణ



జలీల్ సర్

అర్థమెటిక్, రీజనింగ్ & ప్యూర్‌మాథ్స్ షార్ట్‌కట్ ఎక్స్‌పర్ట్ ఫ్యాకల్టీ

OFFLINE అడ్మిషన్లు ప్రారంభం

షైన్ ఇండియా పోలీస్ అకాడమి ప్రారంభించిన తర్వాత వచ్చిన మొదటి రిక్రూట్‌మెంట్‌లోనే State 1st



పెరుమాళ్ల మహేష్
H.No. 857350113, Reg. 1046365

S.I OFFLINE న్యూ బ్యాచెస్ Mar 8th, 15th ప్రారంభం

వందలాది మంది S.I లుగా, వేలాది మంది కానిస్టేబుల్స్‌గా ఎంపికయ్యారు.

వివరాలకు : దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్, సెల్ : 9700491314


https://ourstudycircle.in/upscpdf/

(Date of Publication: 1st of every month, ...)




https://ourstudycircle.in/upscpdf/ Scanned with CamScanner